

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 8.00 సంపుటి: 18 సంచిక: 263

SUNDAY Special ఆదివారం 14-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

చిట్కాలున్నా.. చికిత్సే ముఖ్యం

11 లో

ఇటీవల కొందరు సెలబ్రిటీలు సోషల్ మీడియా వేదికగా వైద్య సంబంధ విషయాలను విరివిగా ప్రచారం చేస్తున్నారు. దీనిపై క్యాన్సర్ నిపుణులైన డాక్టర్లు ఏమంటున్నారంటే..

పొగ మంచు ప్రమాదం.. అప్రమత్తతే ప్రధానం

14 లో

శీతాకాలంలో డ్రైవింగ్ అంత ఈజీ కాదు. ఆహ్లాదకరంగా కనిపించే పొగ మంచు వెనుక ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని డ్రైవర్లు గుర్తుంచుకోవాలి. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

'సీఐసీ'గా రాజ్‌కుమార్ గోయల్

నూతన ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ)గా మాజీ ప్రభుత్వ ఉన్నతాధికారి రాజ్ కుమార్ గోయల్‌ను కేంద్రం ఎంపిక చేసింది.

వివరాలు 6లో ▸

నక్సలిజం సాధించిందేమీ లేదు..

నక్సలిజం నల్లతాచు పడగనీడలో దేశంలోని వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.

వివరాలు 6లో ▸

కేరళ రాజధానిలో కమలవికాసం

కమ్యూనిస్ట్ కోటలో బీజేపీ పాగా వేసింది. తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ సంచలన విజయం సాధించింది.

వివరాలు 6లో ▸

సన్ క్యాండిల్

ప్రకృతిలోని వింతలకు సూర్యుడే హేతువు. అలాంటి వింతల్లో ఒకటి సన్ క్యాండిల్. ఈ సూర్య కొవ్వొత్తులు నేత్రపర్వం చేస్తున్నాయి.

వివరాలు 6లో ▸

విశాఖ ఉక్కు.. ప్రై'వేటు'కే!

స్టీల్ ప్లాంట్ ఆపరేషన్స్ విభాగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు టెండర్ల పిలుపు

లేదు లేదంటూనే... ప్రైవేటీకరణ దిశగా శరవేగంగా ప్రభుత్వం అడుగులు

ప్రధాన ఉత్పత్తి విభాగం ఎస్ఎంఎస్-1లో సీసీడీ సెక్షన్ అప్పగింతకు నిర్ణయం

మొత్తం స్టీల్ ప్లాంట్ నిర్వహణలో ఈ సీసీడీ విభాగం వెన్నెముక వంటిది

అలాంటిదానిని ప్రైవేట్‌కు ఇస్తే ప్లాంట్ మొత్తం వారి చేతుల్లో పెట్టినట్లే!

మెయింటెనెన్స్ పనులకు పరిమితమైన ప్రైవేటీకరణ ఇప్పుడు ఆపరేషన్స్‌కూ వర్తింపు

2 లో

- ఎన్నికలకు ముందు.. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతాం అంటూ చంద్రబాబు హామీలు
- ఆంధ్రుల హక్కును లాభాల బాట పట్టిస్తామని బూటకపు వాగ్దానాలు
- అధికారంలోకి వచ్చాక గత 18 నెలలుగా ప్రైవేటీకరణ దిశగా ఒక్కో అడుగు
- 5,500 మంది కాంట్రాక్టు కార్మికులు నిర్దాక్షిణ్యంగా తొలగింపు
- 1,590 మంది రెగ్యులర్ ఉద్యోగులను వీఆర్ఎస్ ద్వారా ఇంటికి పంపిన వైనం
- ఉద్యోగుల జీతాలు ఆలస్యంగా చెల్లింపు.. ఉత్పత్తికి తగిన వేతనం అంటూ మెలిక
- ఉద్యోగులు ఇంట్లో పడుకుంటే జీతాలివ్వాలా? అని ఇటీవల సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు
- ప్రభుత్వ రంగంలో ఉంది కదా? అని బెదిరించలేరంటూ హూంకరింపులు
- విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు అడగకుండా ప్రైవేటులోని మిట్టల్ ప్లాంట్‌కు గనులు ఇవ్వాలంటూ కేంద్రాన్ని కోరిన టీడీపీ కూటమి ఎంపీలు
- తాజా పరిణామంపై మండిపడుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు
- ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ దీర్ఘకాలిక పోరాటం

ఇంటర్ పరీక్షల్లో భారీ మార్పులు

సిలబస్‌కు అనుగుణంగా మొదటి ఏడాదిలో మార్కుల విభజన

అన్ని పేపర్లు 100 మార్కులకు ఉండేలా కూర్పు.. సైన్స్ సబ్జెక్టులకు 85 మార్కులకు పేపర్, రెండో ఏడాదిలో 30 మార్కులకు ప్రాక్టికల్స్

బోటనీ 43, జువాలజీ 42 మార్కులకు వేర్వేరు పేపర్లు

సిలబస్ మారిన సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్

తొలిసారి ఒక్క మార్కు ప్రశ్నల విధానం

ఈసారికి ఇంటర్ రెండో ఏడాదికి పాత పరీక్షా విధానమే అమలు

ఎలక్టివ్ సబ్జెక్టు మార్కులు వేరుగా లెక్కింపు

10 లో

న్యూస్‌రీల్

వికటించిన మధ్యాహ్న భోజనం

వైఎస్సార్ జిల్లా తొండూరు మండలం యాదవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 10 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విరేచనాలు, వాంతులవ్వడంతో విద్యార్థులను పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నారు.

వివరాలు 2లో ▸

బస్ షెల్టర్‌నూ వదలని టీడీపీ నేత

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో మంత్రి సవిత అనుచరులు ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఓ టీడీపీ నేత జేసీబీతో ఏకంగా బస్ షెల్టర్ కూల్చేసి.. కబ్జా చేశాడు. ఆ స్థలంలో కాంప్లెక్సు నిర్మించేందుకు సిద్ధమయ్యాడు.

వివరాలు 2లో ▸

నాన్న ఆటోనే యమపాశం

తండ్రి ఆటో కిందనే ప్రమాదవశాత్తు పడి కుమార్తె మృతి చెందింది. టెట్ పరీక్షకు వెళ్తుండగా ఆటో బోల్తా పడడంతో.. తలకు బలమైన గాయమై మరణించింది. ఈ విషాద ఘటన అనకాపల్లిలో జరిగింది.

వివరాలు 14లో ▸

మెస్సీ షో

హైదరాబాద్‌లో స్టార్ ఫుట్‌బాలర్ సందడి

మైదానంలో అభిమానుల ఉత్సాహం

చిన్నారులకు పాఠాలు

- అతను ఒక్క కిక్ కొడితే మైదానమంతా ఉత్సాహంతో ఊగిపోయింది...అలా ఒక పాస్ అందిస్తే చాలు అభిమానులు ఈలలతో తమ ఆనందాన్ని ప్రదర్శించారు... ఇక అతని కాలినుంచి దూసుకొచ్చిన బంతి స్టాండ్స్‌లోకి వెళ్లినప్పుడైతే వారి ఆనందానికి అంతు లేకుండా పోయింది. ఫుట్‌బాల్ ఆల్‌టైమ్ గ్రేట్ లయోనల్ మెస్సీ స్టేడియంలో గడిపిన గంట సమయంలోనే తన ప్రతీ కార్యక్రమం, కదలికతో ఫ్యాన్స్‌ను అలరించాడు. ఆద్యంతం చిరునవ్వులు చిందిస్తూ స్వయంగా తానూ ఎంజాయ్ చేశాడు. చాలా రోజులుగా ఎదురు చూసిన మెస్సీ ఈవెంట్ శనివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ మైదానంలో విజయవంతంగా ముగిసింది.

12 లో

ఢిల్లీలో శనివారం పార్లమెంట్ ఆవరణలో అమరులకు నివాళి అర్పిస్తున్న ప్రధాని మోదీ

అమరులకు ఘన నివాళి

2001 పార్లమెంట్ దాడికి 24 ఏళ్లు

నివాళులర్పించిన ప్రధాని మోదీ, రాహుల్, సోనియా

దేశం మీ త్యాగాన్ని ఎప్పటికీ మరువదు: రాష్ట్రపతి ముర్ము

6 లో

15న వైఎస్సార్‌సీపీ ర్యాలీలతో దేశమంతా చర్చ జరగాలి

- ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజలు చేసిన కోటి సంతకాలను ఈనెల 15న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపిస్తూ నిర్వహించే ర్యాలీలు దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా ఉండాలని వైఎస్సార్‌సీపీ నేతలకు ఆ పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల సూచించారు.

18న గవర్నర్ వద్దకు కోటి సంతకాలు

- 'మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడంపై ప్రజాభిప్రాయ సేకరణతో కోటికి పైగా సంతకాలు సేకరించాం. వీటిని ఈ నెల 18న మాజీ సీఎం వైఎస్ జగన్ గవర్నర్‌కు అందిస్తారు' అని బొత్స చెప్పారు.

3 లో

...సంపద సృష్టిస్తానని చెప్పాను కదా తమ్ముళ్లూ!

నేటి గుడ్డు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹96	ఫారం దగ్గర లైవ్ బర్డ్	125 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	220 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	152 కిలో	స్కిన్ లెస్	251 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

నెల్లూరు మేయర్ రాజీనామా

నా రాజీనామా లేఖను కలెక్టర్‌కు అందజేస్తా

- నాకు ఇంతటి గౌరవాన్ని కల్పించిన వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటా
- గిరిజన మహిళను అధికారం నుంచి దింపేందుకు మంత్రి, ఎమ్మెల్యే నీచమైన కుట్రలు చేశారు
- మీడియా సమావేశంలో పోట్లూరి స్రవంతి ఆవేదన

గిరిజన మహిళా మేయర్‌పై బాబు సర్కార్ కుట్ర

నెల్లూరు నగరపాలక సంస్థ అత్యున్నత పీఠంపై గిరిజన మహిళ స్రవంతిని కూర్చోబెట్టిన వైఎస్ జగన్

చంద్రబాబు సర్కార్ రాగానే మేయర్ పీఠంపై కన్ను

13 లో

13లో

మా ఎమ్మెల్యేతో బేరం కుదిరాకే రండి!

శ్రీశైలం దేవస్థానంలో టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా అనుచరుల గూండాగిరి

తలనీలాల టెండర్‌లో పాల్గొనేందుకు వచ్చిన కాంట్రాక్టర్లపై దాడి

మా ఎమ్మెల్యేతో బేరం కుదుర్చుకున్నాకే రావాలని బెదిరింపులు

వేలంలో పాల్గొనకుండానే పరుగులు తీసిన కాంట్రాక్టర్లు

5 లో

బాబు కరకట్ట ప్యాలెస్ రోడ్డుకు

భారీ హంగులు

కళాత్మక విద్యుత్ దీప స్తంభాల ఏర్పాటుకు రూ.5.55 కోట్లు మంజూరు

ఆ పనులకు రూ.4.27 కోట్ల అంచనాతో టెండర్ పిలిచిన సీఆర్‌డీఏ

- ఐదు రోజుల్లోనే టెండర్ ప్రక్రియ ముగించాలని నిర్ణయం
- 2016లోనే కరకట్ట రోడ్డుపై విద్యుత్ దీప స్తంభాలు, అత్యాధునిక లైటింగ్ ఏర్పాటు.. అవి బాగున్నప్పటికీ తొలగించి కొత్తగా ఏర్పాటుకు సర్కార్ సిద్ధం
- అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి నిధులు దుబారా చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు.. ఇప్పటికే కరకట్ట ప్యాలెస్ మరమ్మతులకు రూ.4 కోట్లకు పైగా వ్యయం
- చంద్రబాబు ప్రత్యేక హెలీకాప్టర్, విమానాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.40.96 కోట్ల ఖర్చు

3 లో

క్లుప్తంగా...

పిడతల రాంభూపాల్‌రెడ్డి మృతి పట్ల వైఎస్ జగన్ విచారం

ఆయన కుమారుడు ప్రవీణ్‌కు ఫోన్‌లో పరామర్శ

గిద్దలూరు రూరల్: ప్రకాశం జిల్లా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి మృతి పట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తంచేశారు. ఆయన కుమారుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వైఎస్ జగన్ శనివారం ఫోన్ చేసి పరామర్శించారు. రాంభూపాల్ రెడ్డి మృతి తీరని లోటని.. ఆయనను కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.

21న రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో

54 లక్షల మంది పిల్లలకు వేసేందుకు ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 54.07లక్షల మంది 5 ఏళ్లలోపు పిల్లలకు 38,267 బూత్‌లలో పోలియో చుక్కలు వేసేందుకు ఇప్పటికే జిల్లాలకు 61.26 లక్షల డోస్‌లు పంపించినట్టు పేర్కొన్నారు. డిసెంబర్ 21న పోలియో డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయిలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని వివరించారు. ఆ రోజు పోలియో చుక్కలు వేసుకోలేకపోయిన పిల్లలకు ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటింటికీ వచ్చి వేస్తారని మంత్రి పేర్కొన్నారు. మురికివాడలు, సంచార జాతులు, నిర్మాణ స్థలాలు, ఇటుక బట్టీలు ఉన్న ప్రాంతాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 1,854 మొబైల్ బృందాలు పని చేస్తాయన్నారు. బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, పర్యాటక ప్రదేశాల్లో 1,140 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

హరిత హోటళ్ల టెండర్ల పరిశీలనకు కమిటీ

22 హరిత హోటళ్ల ప్రైవేటీకరణ బిడ్లను పరిశీలించనున్న కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని హరిత హోటళ్ల ప్రైవేటీకరణ కోసం దాఖలైన బిడ్లను (టెండర్లు) పరిశీలించేందుకు ప్రత్యేకంగా టెండర్ ఎవల్యూయేషన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఆరు క్లస్టర్లలోని 22 హరిత హోటళ్లను లీజు పేరిట ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు పిలిచిన టెండర్ల దాఖలుకు గడువు ఇటీవల ముగిసింది. ఈ క్రమంలో ఆర్థిక బిడ్లను ప్రత్యేక కమిటీ పరిశీలించి అర్హత కలిగినవారికి హోటళ్లను కేటాయించనుంది. ఈ ప్రత్యేక కమిటీకి చైర్మన్‌గా ఏపీటీడీసీ ఎండీ, కో–చైర్మన్‌గా ఆప్టా సీఈవో, మెంబర్ కన్వీనర్‌గా ఏపీటీడీసీ ఈడీ(ప్రాజెక్ట్స్) వ్యవహరిస్తారు. ఆర్థిక శాఖ నుంచి షాలెంరాజు(పీపీపీ ఎక్స్‌పర్ట్), ఏపీటీడీసీ జనరల్ మేనేజర్(పీపీపీ), చీఫ్ జనరల్ మేనేజర్ ప్రాజెక్ట్స్ (ఐఎన్‌సీఏపీ), ఏపీటీడీసీ ఎండీ నామినేట్ చేసిన హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్, టెక్నికల్ వర్సిటీ నుంచి నామినేట్ చేసిన ఒక ప్రతినిధి మెంబర్లుగా, ఏపీటీడీసీ ఎస్టేట్ ఆఫీసర్, చీఫ్ ఇంజనీర్ ఆహ్వానితులుగా ఉంటారు. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు

ప్రైవేటు హోటళ్లకు భూముల కేటాయింపు

ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొన్ని ప్రైవేటు హోటళ్లకు భూములు, ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శనివారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం... విశాఖలో హయత్ బ్రాండ్ పేరుతో పీవీఆర్ హాస్పిటాలిటీస్ 5 స్టార్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం యండాడ సర్వే నంబర్ 187లో మూడు ఎకరాలు కేటాయించింది. మెగ్లాన్ లీజర్స్ అండ్ ఎంటర్‌టైన్మెంట్‌కు 5 స్టార్ హోటల్‌తో కూడిన మెగా కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి విశాఖలోని మధురవాడలో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ ప్రాజెక్టులకు మొత్తం 99 ఏళ్ల పాటు లీజుకు భూమిని అప్పగిస్తోంది. ఇక ఒబెరాయ్ విల్లాలకు సంబంధించి స్వరా హోటల్స్ లిమిటెడ్ పేరిట నిర్మాణానికి తిరుపతి రూరల్‌లో 20 ఎకరాలను ఇచ్చింది. తిరుపతిలోని నాంది హోటల్‌ను 'హిల్టన్ గ్రాండ్ ఇన్' బ్రాండ్‌పై 4 స్టార్ హోటల్‌ను నిర్మించేందుకు, అలాగే బాపట్ల జిల్లాలోని పాండురంగపురంలో యాగంటి ఎస్టేట్స్ ఆధ్వర్యంలో 5 స్టార్ బీచ్ రిసార్ట్ (రాడిసన్ బ్రాండ్) ప్రాజెక్టును నిర్మించేందుకు సంబంధించి ప్రోత్సాహకాలను చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది.

విశాఖ ఉక్కు.. ప్రై‘వేటు’కే!

స్టీల్ ప్లాంట్ ఆపరేషన్స్ విభాగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు టెండర్ల పిలుపు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు శరవేగంగా ప్రైవేటు చేతుల్లోకి వెళ్లిపోతోంది..! ఆంధ్రుల హక్కు వడివడిగా చేజారిపోతోంది..! స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతాం... లాభాల బాట పట్టిస్తాం అంటూ ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారం దక్కాక ప్లేటు ఫిరాయించేస్తున్నారు..! గత ఏడాదిన్నరగా ప్లాంట్‌ను ప్రైవేటుకు కట్టబెట్టే దిశగా ఒక్కో అడుగు వేస్తున్నారు..! ఈ క్రమంలో తొలుత కాంట్రాక్టు కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. రెగ్యులర్ ఉద్యోగులను వీఆర్‌ఎస్ ద్వారా ఇంటికి పంపారు. పొమ్మనలేక పొగబెట్టినట్లు... ఉన్న ఉద్యోగులకు జీతాల చెల్లింపును ఆలస్యం చేస్తున్నారు. అదీ సరిపోక ఉత్పత్తికి తగిన వేతనం అంటూ మెలికపెట్టారు. ఇక ఇటీవల మరింత ముందుకెళ్లి ''ఉద్యోగులు ఇంట్లో పడుకుంటే జీతాలివ్వాలా? ప్రభుత్వ రంగంలో ఉంది కదా? అని బెదిరించలేరు'' అంటూ సీఎం చంద్రబాబు దారుణ వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఏకంగా స్టీల్ ప్లాంట్ ప్రధాన ఉత్పత్తి విభాగం అయిన ఆపరేషన్స్ విభాగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు వీలుగా టెండర్ నోటీసులు జారీ చేశారు.



స్టీల్‌ప్లాంట్ సీసీడీ సెక్షన్‌లోని సీసీఎం మెషీన్

ఇంతకాలం దాగుడుమూతలు

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఇంతకాలం దాగుడుమూతలు ఆడింది ప్రభుత్వం. ఇప్పుడు మాత్రం వేగంగా ప్రైవేట్‌పరం చేసేందుకు చర్యలు వేగిరం చేస్తోంది. ఇప్పటివరకు కేవలం మొత్తం నిర్వహణ (టోటల్ మెయింటినెన్స్) పనులను మాత్రమే ప్రైవేటుకు అప్పగించారు. ఇప్పటివరకు మెయింటినెన్స్ పనులకు పరిమితమైన ప్రైవేటీకరణ ఇప్పుడు ఆపరేషన్స్‌కూ వర్తింపు కాగా, ప్రైవేటుపరం చేసేందుకు వీలుగా మొదట 46 విభాగాలను ఎంపిక చేశారు. తర్వాత పలు విభాగాల నిర్వహణకు ఆగస్టులో తొలి విడతగా ఒకే రోజు 32 ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) దరఖాస్తులు ఆహ్వానించారు. ఇలా ఆర్‌ఎంహెచ్‌పీ, సెంటర్ ప్లాంట్ మెయింటెనెన్స్‌కు ఈవోఐలు జారీ చేశారు. తర్వాత థర్మల్ పవర్ ప్లాంట్–1, థర్మల్ పవర్ ప్లాంట్–2, ఎస్‌ఎంఎస్ సీసీఎం–4, మాధారం మైన్స్, ఫౌండ్రీ, సెంట్రల్ మెషిన్ షాప్ (సీఎంఎస్) వంటి అనేక ఇతర విభాగాలను కూడా ప్రైవేట్‌కు కట్టబెట్టే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

ప్లాంట్‌కు వెన్నెముక ఇది...

స్టీల్ ప్లాంట్‌లోని ప్రధాన ఉత్పత్తి విభాగం ఎస్‌ఎంఎస్–1లో కోల్ కెమికల్ డిపార్ట్‌మెంట్ (సీసీడీ) ప్రైవేటీకరణకు టెండర్లు ఆహ్వానిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం ఆరు కంటిన్యూస్ క్యాస్టింగ్ మెషీన్ (సీసీఎం)లతో పాటు గ్యాస్ కటింగ్ మెషీన్లను ప్రైవేటుకు ఇచ్చేందుకు టెండర్లు పిలవడంతో ప్లాంట్ ఉద్యోగుల్లో కలకలం మొదలైంది.

➜ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్‌లో తయారయ్యే హాట్ మెటల్‌ను స్టీల్ మెల్ట్ షాప్(ఎస్‌ఎంఎస్)లో వివిధ ప్రక్రియల ద్వారా శుద్ధి చేసి లిక్విడ్ స్టీల్‌గా తయారు చేస్తారు. ఈ ద్రవపు ఉక్కును ఫినిష్డ్ స్టీల్‌గా తయారు చేసే ప్రక్రియలో తొలుత సీసీఎంల ద్వారా బ్లూమ్స్‌గా మారుస్తారు. ఈ బ్లూమ్స్‌ను డిమాండ్‌ను బట్టి రోలింగ్ మిల్స్ విభాగంలో రీబార్స్, యాంగిల్స్, చానెల్స్ తదితర ఫినిష్డ్ స్టీల్‌గా చేస్తారు. కన్వర్టర్‌లో తయారైన లిక్విడ్ స్టీల్‌ను సీసీఎంలో పంపడం ద్వారా బ్లూమ్స్ తయారవుతాయి. గతంలో 3 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్నప్పుడు ఎస్‌ఎంఎస్–1లో సీసీఎంల ద్వారా ఏడాదికి 2.82 మిలియన్ టన్నుల బ్లూమ్‌లు ఉత్పత్తి చేసేవారు. ఆధునికీకరణ తర్వాత సామర్థ్యం 3.5 మిలియన్ టన్నులకు పెరిగింది. తద్వారా 3.29 మిలియన్ టన్నుల బ్లూమ్స్ తయారయ్యే సామర్థ్యం ఏర్పడింది. స్టీల్ ప్లాంట్ నిర్వహణలో సీసీడీ ఇంతటి కీలక విభాగం. ఇలాంటిదానిని ప్రైవేట్‌కు ఇస్తే... ప్లాంట్ మొత్తం వారి చేతుల్లో పెట్టినట్లేననే ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. 680 మంది ఉద్యోగులను తొలగించే ప్రమాదం పొంచి ఉందని భయపడుతున్నారు. ఇప్పటికే వేలమంది కార్మికులను ఖర్చు నియంత్రణ (కాస్ట్ కటింగ్) పేరుతో బయటకి పంపారని గుర్తుచేస్తున్నారు. తాజా టెండర్లలో కూడా పూర్తిగా ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోని భారీ ప్రైవేటు సంస్థలే పాల్గొనే విధంగా నిబంధనలను రూపొందించారనే ఆరోపణలు వస్తున్నాయి. రూ.131.33 కోట్ల విలువైన ఆపరేషన్స్ పనులకు టెండర్ తుది గడువును జనవరి 3వ తేదీగా నిర్ణయించారు. 4వ తేదీన బిడ్‌ను తెరిచి ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారు.

స్టీల్‌ప్లాంట ప్రైవేటీకరణ దిశగా బాబు అడుగులివి

ప్రైవేటుపరం చేసేందుకు ప్లాంట్‌నష్టాల్లో ఉందంటూ ముద్ర	1,590 మంది రెగ్యులర్ ఉద్యోగులు వీఆర్‌ఎస్ ద్వారా ఇంటికి	విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు అడగకుండా ప్రైవేటు మిట్టల్ ప్లాంట్‌కు గనుల కోసం కేంద్రాన్ని కోరిన టీడీపీ కూటమి ఎంపీలు
46 విభాగాల ఎంపిక.. ఒకే రోజు 32 ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తుల ఆహ్వానం	నెలల పాటు ఉద్యోగులకు జీతాలు ఆలస్యంగా చెల్లింపు.. ఉత్పత్తికి తగిన వేతనం అంటూ మెలిక	ఉద్యోగులు ఇంట్లో పడుకుంటే జీతాలివ్వాలా? అని నవంబరు 15న చంద్రబాబు మండిపాటు
5,500 మంది కాంట్రాక్టు కార్మికులు తొలగింపు		ప్రధాన ఉత్పత్తి విభాగం స్టీల్ మెల్ట్ షాప్–1లో కోల్ కెమికల్ డిపార్ట్‌మెంట్ (సీసీడీ) ప్రైవేటీకరణకు టెండర్ల ఆహ్వానం

పని చేయకున్నా జీతాలివ్వాలా?

కష్టపడకుండా తెల్ల ఏనుగులా మారితే ఎలా?

విశాఖ ఉక్కు కార్మికులపై రెచ్చిపోయిన సీఎం చంద్రబాబు

ఈ ఏడాది నవంబర్ 15న సీఐఐ సదస్సు ముగింపు సందర్భంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు

కాపాడడమంటే ఇదేనా చంద్రబాబూ...?

2021 ఫిబ్రవరిలో 'సేవ్ విశాఖ స్టీల్' పేరుతో ర్యాలీ నిర్వహిస్తున్న చంద్రబాబు(ఫైల్)



ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్ ఇలా..

స్టీల్ ప్లాంట్‌ను కాపాడతాం అంటూ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు గెలిచాక పట్టించుకోవడం మానేశారు. ప్రైవేటీకరణకు బాటలు వేస్తున్నారని ప్లాంట్ కార్మికులు మండిపడుతున్నారు. ఒత్తిడి పెరగడంతో చివరకు 'ప్యాకేజీ' అంటూ కొత్త నాటకం మొదలుపెట్టారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అయితే, ప్యాకేజీలో భాగంగా చేసుకున్న ఒప్పందం ప్రకారం మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడపడం, శాశ్వత, కాంట్రాక్టు ఉద్యోగులను గణనీయంగా తగ్గించడం వంటి చర్యలు ప్రారంభించారని విమర్శిస్తున్నారు. అంతేకాక ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలను తగ్గించి, గత ఏడాది సెప్టెంబర్ నుంచి పూర్తి జీతాలు చెల్లించడం లేదని వాపోతున్నారు. ఇప్పుడు ఆపరేషన్స్ విభాగం టెండర్లు పూర్తయితే... మరింతమంది శాశ్వత ఉద్యోగులను తొలగించే ప్రమాదం ఉందని ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చాక ఉక్కు కర్మాగారం, కార్మికుల గురించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యల కోసం స్కాన్ చేయండి

ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామని పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల వీడియో కోసం స్కాన్ చేయండి

మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ పోరాటం

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ మొదటి నుంచి ఒకే పంథా అనుసరిస్తోంది. ప్రైవేటీకరణ ప్రయత్నాలను వెనక్కి తీసుకునేవరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేసింది. వైఎస్సార్‌సీపీ దీర్ఘకాలం పాటు ఒత్తిడిని కొనసాగించడంతో ఆ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రైవేటీకరణపై అడుగులు ముందుకుపడలేదు.

విశాఖ ఉక్కుకు కాకుండా మిట్టల్ కోసం పాట

దశాబ్దాల చరిత్ర ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌పై చంద్రబాబు ప్రభుత్వ వైఖరి ఇటీవల మరింత స్పష్టమైంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ ఆంధ్రుల హక్కుగా గొప్పగా చెప్పుకొనే ఈ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని కోరలేదు. సరికదా... నక్కపల్లి వద్ద ఏడాదికి 24 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు చంద్రబాబు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేకాక ఈ ప్రైవేట్ ప్లాంట్‌కు బొగ్గు గనులు ఇవ్వాలని కూడా టీడీపీ కూటమి ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి.

ముద్ర వేసి.. వదిలించుకునే కుట్ర...

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం దొడ్డిదారి ప్రయత్నాలు చేసింది. మొదట ప్లాంట్‌నష్టాల్లో ఉందంటూ ముద్ర వేసింది. అంతేకాక నెలల పాటు ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా వేధించడం మొదలుపెట్టారు. అనంతరం ప్లాంటులో ఉన్న కాంట్రాక్టు కార్మికులను 5,500 మందిని తొలగించారు. ఇక రెగ్యులర్ ఉద్యోగులను కూడా వీఆర్‌ఎస్ ద్వారా 1590 మందిని ఇంటికి సాగనంపారు. ఉద్యోగులు ఇంట్లో పడుకుని జీతాలు ఇవ్వాలంటే ఎలా ఇస్తాం? అంటూ ఏకంగా సీఎం చంద్రబాబు నవంబరు 15న విశాఖపట్నంలో పెట్టుబడుల సదస్సు సందర్భంగా వ్యాఖ్యానించారు. తద్వారా ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీశారు. ప్రజల్లో వారి పట్ల వ్యతిరేక ధోరణి వచ్చేలా వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే అసలు సక్రమంగా జీతాలివ్వకుండా... ఉత్పత్తికి తగిన వేతనం అంటూ మెలికపెట్టారు. మూడో విడతలో మరో వెయ్యిమంది ఉద్యోగులను ఇంటికి పంపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగులు ఇంట్లో తిని పడుకుంటే జీతాలివ్వాలా అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించాక వెంటనే యాజమాన్యం ఉత్పత్తికి తగిన వేతనమంటూ కొత్త విధానాన్ని ప్రకటించింది. తాజాగా ప్లాంట్ ఆపరేషన్స్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు టెండర్లను ఆహ్వానించి మిగిలిన ఉద్యోగులను కూడా సాగనంపేందుకు నిర్ణయించుకున్నట్టు స్పష్టమవుతోంది.

దొడ్డిదారిలో కుట్ర

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసే కుట్రలు చాలా రోజులుగా జరుగుతున్నాయి. ఇందులోభాగంగా ఎస్‌ఎంఎస్–1లో సీసీడీ సెక్షన్ ప్రైవేటీకరణకు టెండర్లు పిలిచారు. తద్వారా ఈ విభాగంలో పనిచేసే 450 మంది రెగ్యులర్, 230 మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఉద్యోగాలు తొలగిస్తారనే ఆందోళన నెలకొంది. టెండర్లలో పాల్గొనే సంస్థలకు విధించిన నిబంధనలన్నీ చంద్రబాబు ప్రభుత్వం కనుసన్నల్లోని భారీ ప్రైవేటు సంస్థలకు కావాల్సిన విధంగా ఉన్నాయి. ఇదంతా చూస్తుంటే ప్లాంట్‌ను దొడ్డిదారిలో ప్రైవేటుపరం చేసే కుట్రగా అర్థమవుతోంది.

– జగ్గునాయుడు, గౌరవాధ్యక్షుడు, విశాఖ స్టీల్ ప్లాంట్, సీఐటీయూ

ముక్తకంఠంతో ఖండిస్తున్నాం

ఏవో చిన్నచిన్న విభాగాలను కాకుండా ఏకంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఆపరేషన్స్ సెక్షన్‌నే ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారు. ఇది మొత్తం ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకేనని స్పష్టమవుతోంది. ఒకవైపు ప్రైవేటుకు ఇవ్వమని చెబుతూనే, మరోవైపు కీలక విభాగాలను ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టేందుకు టెండర్లను పిలవడం ఏమిటి? ఇదంతా చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం పూర్తి సహకారంతోనే జరుగుతోంది. దీనిని ప్లాంట్ కార్మికులతో పాటు ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలి.

– దాలినాయుడు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ స్టీల్ ప్లాంట్ అధ్యక్షులు

టెండర్లను రద్దు చేయాలి

స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్‌ఎంఎస్)... స్టీల్‌ప్లాంట్‌కు గుండెకాయ వంటిది. దానిని ప్రైవేటీకరించడం అంటే ప్లాంట్‌ను ప్రైవేటీకరణే అవుతుంది. మెయింటెనెన్స్ పనులకు పరిమితమైన ప్రైవేటీకరణను ఆపరేషన్స్‌కూ వర్తింపజేయడం దుర్మార్గం. యాజమాన్యం వెంటనే ఈ టెండర్లను రద్దు చేయాలి.

– ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ స్టీల్‌ప్లాంట్ విభాగం

వికటించిన మధ్యాహ్న భోజనం

- 10 మంది విద్యార్థులకు అస్వస్థత
- వైఎస్సార్ కడప జిల్లా యాదవారిపల్లెలో ఘటన
- పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలింపు
- పురుగుల మందు కొట్టిన వంకాయలు కడగకుండా కూర వండటమే కారణం
- 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచాలన్న వైద్యులు

వైఎస్సార్ కడప జిల్లా తొండూరు మండలం యాదవారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్ని 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళుతున్న సిబ్బంది

తొండూరు: మధ్యాహ్న భోజన పథకం అమలులో అధికారులు, ఏజెన్సీల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుకుంది. రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక పాఠశాలలో దారుణ ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా.. వైఎస్సార్ జిల్లా తొండూరు మండలం సంతకొవ్వూరు పంచాయతీ పరిధిలోని యాదవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 10మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇది రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత ఏపాటిదో స్పష్టం చేస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం పాఠశాలలో మెనూ ప్రకారం అన్నం, పప్పు, రసం అందించాల్సి ఉంది. అయితే అన్నం, వంకాయ కూర, సాంబారు, స్వీట్ పొంగలిని విద్యార్థులకు వడ్డించారు. వీటిని తిన్న విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయి కడుపునొప్పి, విరేచనాలు, వాంతులు అయ్యాయి. పాఠశాలలో 10 మందికి ఒకేసారి వాంతులు, విరేచనాలు కావడంతో పాఠశాల ఉపాధ్యాయిని భారతి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలియజేశారు.

24 గంటలపాటు అబ్జర్వేషన్‌లో ఉంచాలన్న వైద్యులు

వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు 108 వాహనంలో పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి 24 గంటలు ఆస్పత్రిలోనే అబ్జర్వేషన్‌లో ఉంచాలన్నారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ వల్లే విరేచనాలు, వాంతులు అయ్యాయని తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న మండల విద్యాధికారి భారతి ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. ఘటనకు గల కారణాలపై విచారణ చేపడతామని, విద్యార్థుల ఆరోగ్యంపై పూర్తిస్థాయి పర్యవేక్షణ చేస్తామని చెప్పారు.

పురుగుమందుల అవశేషాల వల్లే..

కూర కోసం తోటలోని వంకాయలు తెచ్చి కడగకుండా వండారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. విషపూరిత వంకాయలతో కూర వండటం వల్లే ఫుడ్ పాయిజన్ జరిగి ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వాన్ని నమ్మి విద్యార్థుల్ని పాఠశాలలకు పంపిస్తుంటే.. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను కనీసం పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. తరచూ ఏదో ఒకమూల మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురికావడం.. కొందరు మరణించడం చూస్తుంటే విద్యార్థుల పట్ల ప్రభుత్వ తీరు ఎలా ఉందో అవగతం అవుతోందని విద్యార్థి సంఘాల నేతలు దుయ్యబడుతున్నారు.

ఉపాధ్యాయిని సస్పెన్షన్

ఈ ఘటనతో పాఠశాల ఉపాధ్యాయిని భారతిని సస్పెండ్ చేస్తున్నట్టు జిల్లా విద్యా శాఖ కార్యాలయం ప్రకటించింది. ఎంఈవో భారతికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు సమాచారం.

బస్ షెల్టర్‌నూ వదలని టీడీపీ నేత

- మంత్రి సవిత ఇలాకాలో బస్ షెల్టర్ కబ్జా
- అర్ధరాత్రి జేసీబీతో కూల్చేసిన పచ్చ సైన్యం
- పెనుకొండ మండలం మావటూరులో గ్రామస్తుల నిరసన

రాస్తారోకో చేస్తున్న మావటూరు వాసులు

పెనుకొండ రూరల్: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో మంత్రి సవిత అనుచరుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండాపోయింది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి ఓ టీడీపీ నేత ఏకంగా బస్ షెల్టర్‌ను కబ్జా చేశాడు. దాన్ని కూల్చి ఆ స్థలంలో కాంప్లెక్సు నిర్మించేందుకు సిద్ధమయ్యాడు. గ్రామస్తులు ఎదురు తిరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

నాలుగు గ్రామాలకు అదే షెల్టర్

పెనుకొండ మండలం మావటూరులోని బస్ షెల్టర్ నాలుగు గ్రామాల ప్రయాణికులకు ఆదరువుగా ఉంది. నాగళూరు, బండపల్లి, సానిపల్లి, మావటూరు గ్రామాల ప్రజలు పెనుకొండ, మడకశిర పట్టణాలకు వెళ్లేందుకు ఈ బస్‌షెల్టర్ వద్దే వేచి ఉంటారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఈ షెల్టర్ స్థలంపై కన్నేసిన టీడీపీ నాయకుడు జ్యోతీష్ దాన్ని కూల్చి అక్కడ కాంప్లెక్స్ నిర్మించి అద్దెలకు ఇవ్వాలనే పన్నాగం వేశాడు. శుక్రవారం అర్ధరాత్రి జేసీబీతో బస్‌షెల్టర్‌ను కూల్చేయించాడు. గ్రామస్తులు అతన్ని నిలదీయటంతో పారిపోయాడు. దీంతో బస్ షెల్టర్ కూల్చేందుకు ఉపయోగించిన జేసీబీని గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. ఉదయానికి ఈ విషయం మిగిలిన గ్రామాల వారికి తెలియడంతో మావటూరు, నాగళూరు, సానిపల్లి, బండపల్లి గ్రామాల ప్రజలు, వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం ఉదయం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పెనుకొండ నుంచి మడకశిర వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బస్‌షెల్టర్‌ను కూల్చిన జ్యోతీష్‌ను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని, కూల్చిన బస్ షెల్టర్ స్థానంలో నూతన షెల్టర్ కట్టించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. బస్‌షెల్టర్ కూల్చిన వారిపై తప్పక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వారంతా ఆందోళన విరమించారు. అనంతరం సర్పంచ్ నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ నాగభూషణ్‌రెడ్డి, ఎంపీటీసీ శివయ్య, మోహన్, మాజీ డీలర్ శ్రీనివాసులు, మేకల మారుతి, నరసింహ, పీజే రాజశేఖర్, శివారెడ్డి, మురళీ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. జ్యోతీష్, జేసీబీ డ్రైవర్‌పైన కేసు నమోదు చేశామన్నారు.

మంత్రి అండతోనే కూల్చివేత

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అండతోనే జ్యోతీష్ బస్‌షెల్టర్ కూల్చేశాడని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం బస్ షెల్టర్ ఉన్న స్థానంలో కాంప్లెక్స్ నిర్మాణం కోసం గతంలోనే జ్యోతీష్ తనను, సర్పంచ్ నాగరాజును అనుమతులు అడగ్గా తాము అంగీకరించలేదని ఆయన వెల్లడించారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

క్లుప్తంగా...

మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి కన్నుమూత

అమలాపురం టౌన్/అయినవిల్లి: అమలాపురం మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి (85) గుండెపోటుతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. హృద్రోగ సమస్యతో బాధ పడుతున్న ఆయన్ను రెండు రోజుల కిందట ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం కన్ను మూశారు. 1977, 1980, 1989 సంవత్సరాల్లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆయన..అమలాపురం(ఎస్సీ) నుంచి ప్రాతినిధ్యం వహించారు. తొలి నుంచీ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలసలో 1940 సెప్టెంబర్ 11న కృష్ణమూర్తి జన్మించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భారత రాజ్యాంగంలోని పలు అంశాలను ప్రస్తావిస్తూ ఆయన 'దళిత వేదం'అనే పుస్తకం రచించారు. విలసలో కృష్ణమూర్తి అంతిమ సంస్కారాలను ఆదివారం నిర్వహించనున్నారు.

నేడు మదనపల్లెకు ఉత్తరాఖండ్ సీఎం రాక

మదనపల్లె: ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు రానున్నారు. స్థానిక అన్నమయ్య సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

డాక్టర్ జైతీర్థ్ ఆర్. జోషీకి ఐఎస్ఎన్‌టీ ఫెలోషిప్

ఐఎస్ఎన్‌టీ అధ్యక్షుడిగా బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: బ్రహ్మోస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జైతీర్థ్ ఆర్. జోషీకి ఇండియన్ సొసైటీ ఫర్ నాన్–డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఐఎస్ఎన్‌టీ) ప్రతిష్టాత్మక గౌరవ ఫెలోషిప్‌ను ప్రదానం చేసింది. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తకు మొదటిసారి ఈ గౌరవం లభించడం విశేషం. జోషి శుక్రవారం ఐఎస్ఎన్‌టీ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ జోషి డీఆర్‌డీఓలో అత్యుత్తమ శాస్త్రవేత్తగా, భారత రక్షణ రంగంలో ప్రముఖుడిగా పేరొందారు. నాన్ డిస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్ (ఎన్‌డీఈ) రంగంలో ఆయన ఎంతో కృషి చేశారు. మిషన్–క్రిటికల్ సిస్టమ్‌లను బలపరచడమే కాకుండా, విశ్వసనీయత, భద్రత, ఔన్నత్యం విషయంలో కొత్త ప్రమాణాలను స్థాపించారు.

బాబు కరకట్ట ప్యాలెస్ రోడ్డుకు భారీ హంగులు

కళాత్మక విద్యుత్ దీప స్తంభాల ఏర్పాటుకు రూ.5.55 కోట్లు మంజూరు

ఆ పనులకు రూ.4.27 కోట్ల అంచనాతో టెండర్ పిలిచిన సీఆర్‌డీఏ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం ఉంటున్న అక్రమ భవనం కరకట్ట ప్యాలెస్ రోడ్డుకు ప్రభుత్వం భారీ హంగులు కల్పిస్తోంది. రూ.5.55 కోట్లతో కొండవీటివాగు ఎత్తిపోతల పథకం నుంచి చంద్రబాబు నివాసం ఉంటున్న కృష్ణా కరకట్ట ప్యాలెస్, ఈ3 (సీడ్ యాక్సిస్ రోడ్డు)–ఎన్9 జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న వీధి దీపాల స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కళాత్మకంగా తీర్చిదిద్దిన కొత్త స్తంభాలు, ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు పరిపాలన అనుమతిచ్చారు. ఆ పనులు చేపట్టడానికి అక్టోబర్ 10న రూ.4.27 కోట్ల అంచనా వ్యయంతో, నాలుగు నెలల్లో పూర్తి చేయాలనే షరతుతో సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. కానీ, కాంట్రాక్టర్ల నుంచి స్పందన లేకపోవడంతో ఆ టెండర్‌ను రద్దు చేసింది. తాజాగా ఈ పనులు చేపట్టేందుకు టెండర్ పిలవడానికి రూ.5.32 కోట్ల అంచనా వ్యయంతో నవంబర్ 29న సీఆర్‌డీఏ సీఈ సాంకేతిక అనుమతి ఇచ్చారు. దాంతో ఆ పనులకు రూ.4.27 కోట్ల అంచనా వ్యయంతో శనివారం రెండోసారి సీఆర్‌డీఏ నోటిఫికేషన్ జారీ చేసింది. టెండర్లలో బిడ్ల దాఖలుకు తుది గడువును ఈ నెల 17గా నిర్ణయించింది. అంటే.. కేవలం ఐదు రోజుల్లో టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించడం గమనార్హం. స్వల్పకాలిక టెండర్‌కు కనీస వ్యవధి వారం రోజులు. కానీ.. ఈ టెండర్‌ను కేవలం ఐదు రోజుల్లోనే ముగించాలని నిర్ణయించడాన్ని బట్టి చూస్తే.. పనులను ఏ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టాలన్నది ముందుగానే నిర్ణయించారన్నది స్పష్టమవుతోందని నిపుణులు చెబుతున్నారు. పాత విద్యుత్ స్తంభాలు, లైటింగ్ వ్యవస్థ బాగున్నప్పటికీ వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తుండటంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

18 నెలల్లో కరకట్ట అక్రమ ప్యాలెస్ మరమ్మతులకు రూ.4కోట్లకు పైగా ఖర్చు

ఇక చంద్రబాబు నివాసం ఉంటున్న కరకట్ట అక్రమ ప్యాలెస్‌లో ప్రస్తుతం ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ స్థానంలో కొత్త లైన్ వేయడానికి రూ.47 లక్షలు, 250 కేవీఏ జనరేటర్ స్థానంలో 320 కేవీఏ జనరేటర్ ఏర్పాటుకు రూ.60 లక్షలు... వెరసి రూ.1.07 కోట్లను మంజూరు చేశారు. కరకట్ట ప్యాలెస్ అత్యవసర మరమ్మతులకు రూ.2.16 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తంమీద 18 నెలల్లోనే కరకట్ట ప్యాలెస్ మరమ్మతులకు రూ.4 కోట్లకుపైగా ఖర్చు చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నారు. కృష్ణా నది కరకట్ట లోపల ఉండవల్లికి సమీపంలో లింగమనేని రమేష్ అక్రమంగా ఈ ప్యాలెస్ నిర్మించారు. ఆ ప్యాలెస్‌తోపాటు కరకట్ట లోపల నిర్మించినవన్నీ అక్రమ కట్టడాలేనని, వాటిని కూల్చివేస్తామని 2015లో అప్పటి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నదిలో పడవపై తిరుగుతూ హంగామా చేశారు. ఆ తర్వాత తెలంగాణ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేను కొనుగోలు చేస్తూ ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయిన అప్పటి సీఎం చంద్రబాబు... ఆ కేసు భయంతో హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చి ఉండవల్లిలోని లింగమనేని రమేష్ అక్రమ కట్టడం(కరకట్ట ప్యాలెస్)లోకి మకాం మార్చారు. 2014–19 మధ్య కరకట్ట ప్యాలెస్‌తోపాటు హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని నివాసం, మదీనగూడలోని ఫాంహౌస్‌లో వసతుల కల్పన, భద్రతకు ప్రభుత్వ ఖజానా నుంచి కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. ఇంకా ఖర్చు చేస్తూనే ఉన్నారు. మరోవైపు సీఎం చంద్రబాబు ప్రత్యేక హెలీకాప్టర్, ప్రత్యేక విమానాల కోసం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.10.92 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.40.96 కోట్లు ఖర్చు చేసినట్లయ్యింది. చంద్రబాబు అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను సద్వినియోగం చేసుకోవాల్సిందిపోయి దుబారా చేస్తున్నారంటూ సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రాన్ని 'అప్పులాంధ్రప్రదేశ్'గా మార్చేశారు

- 18 నెలల్లో ఏకంగా రూ.2.66 లక్షల కోట్ల అప్పు
- సంపద సృష్టిస్తామన్న వారు అప్పులెందుకు చేస్తున్నారు?
- ఒక్క సంక్షేమ పథకం లేకున్నా ఎందుకంతగా అప్పులు?
- చంద్రబాబు సర్కార్‌పై బొత్స సత్యనారాయణ ధ్వజం

సాక్షి, విశాఖపట్నం: ఆరోగ్యంగా ఉన్న ఆంధ్రప్రదేశ్.. ఈ 18 నెలల్లో అప్పులాంధ్రప్రదేశ్‌గా మారిందని, రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా రూ.2,66,175 కోట్ల అప్పు చేసిందని శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఆక్షేపించారు. ఇంత అప్పు చేస్తున్న బాబు ప్రభుత్వం, ఆ మొత్తం ఎక్కడ ఖర్చు చేస్తున్నారో చెప్పమంటే ఎందుకు నోరు మెదపడం లేదని ధ్వజమెత్తారు. శనివారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడారు.

అప్పు చేయడమే సంపద సృష్టించడమా?

'మాకు సంపద సృష్టించడం వచ్చు. మా దగ్గర మంత్రాలున్నాయి. మేం చెత్త నుంచి కూడా సంపద సృష్టిస్తామని పెద్ద పెద్ద మాటలు చెప్పారు. గత ఎన్నికల్లో ఓ వ్యూహం ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 14 లక్షల కోట్ల అప్పు చేసిందని చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి ఇష్టానుసారం అంకెలు చెప్పి ఆరోపించారు. రాష్ట్రం మరో శ్రీలంక, బంగ్లాదేశ్ అయిపోతోందని దుష్ప్రచారం చేశారు. మరి ఈ 18 నెలల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఎందుకు రూ.2.66 లక్షల కోట్ల అప్పు చేసింది? సంపద సృష్టించడం అంటే, అప్పు చేయడమేనా? తెచ్చిన అప్పు ఎక్కడ ఖర్చు చేస్తున్నారు?' అని బొత్స సత్యనారాయణ నిలదీశారు.

18 నెలల్లో ఒక్క కొత్త పెన్షన్ అయినా ఇచ్చారా?

'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడా అవినీతి, వివక్ష, దళారీ వ్యవస్థకు తావునివ్వకుండా, పూర్తి పారదర్శకంగా పథకాలు అమలు చేసి, లబ్ధిదారులకు నగదు బదిలీ చేయడం వల్ల, కోవిడ్ వంటి సంక్షోభ సమయంలో కూడా ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగింది. కానీ, ఇప్పుడు పరిస్థితి అంతా రివర్స్. ఎక్కడా, ఏ రూపంలో ప్రజలకు లబ్ధి చేకూరడం లేదు. రాష్ట్ర ఆదాయం పడిపోతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి లేకే జీఎస్టీ వసూళ్లు తగ్గుతున్నాయి. ఈ 18 నెలల్లో ఒక్క కొత్త పెన్షన్ అయినా ఇచ్చారా? రూ.1,000 పెన్షన్ పెంచి, దాదాపు 5 లక్షల పెన్షన్లు తొలగించారు. ఎన్నికల హామీలేవీ అమలు చేయకపోయినా, సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తున్నారా? ఏదీ అమలు చేయకపోయినా నిస్సిగ్గుగా ఎలా ప్రచారం చేసుకుంటున్నారు? రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో భ్రష్టు పట్టించారు' అని దుయ్యబట్టారు.

18న గవర్నర్ వద్దకు కోటి సంతకాలతో వైఎస్ జగన్..

'కొత్త మెడికల్ కాలేజీల్ని ప్రైవేటుపరం చేయడంపై ప్రజాభిప్రాయ సేకరణతో కోటికి పైగా సంతకాలు సేకరించాం. వీటిని ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అందిస్తారు' అని బొత్స వెల్లడించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15న వైఎస్సార్‌సీపీ ర్యాలీలతో దేశమంతా చర్చ జరగాలి

- ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యవహారం దేశంలో ప్రజలందరి దృష్టికి వెళ్లాలి
- పార్టీ నాయకత్వమంతా ఈ నాలుగు రోజులు దీనిపైనే దృష్టి పెట్టాలి
- జిల్లా కేంద్రాల్లో కోటి సంతకాల వాహనాలను జెండా ఊపి ప్రారంభించాలి
- 18న సాయంత్రం 4 గంటలకు గవర్నర్‌ని వైఎస్ జగన్ కలిసి కోటి సంతకాలు అందజేస్తారు
- పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల పిలుపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు ప్రజలు చేసిన కోటి సంతకాలను ఈనెల 15న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపుతూ నిర్వహించే ర్యాలీలు దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా, జిల్లా మొత్తం హోరెత్తేలా ఉండాలని వైఎస్సార్ సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యవహారం దేశంలో ప్రజలందరి దృష్టికి వెళ్లాలని అన్నారు. పార్టీ నాయకత్వమంతా ఈ నాలుగు రోజులూ దీనిపైనే దృష్టి పెట్టాలని, ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని చెప్పారు. కోటి సంతకాలు ఉన్న ప్రత్యేక వాహనాలను పార్టీ నాయకులు జిల్లా కేంద్రాల్లో జెండా ఊపి ప్రారంభించాలని అన్నారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ముఖ్యమైన నాయకులు గవర్నర్‌ను కలిసి కోటి సంతకాలను అందజేస్తారని చెప్పారు. సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు, రాష్ట్ర కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు, అసెంబ్లీ అనుబంధ విభాగ అధ్యక్షులు, కార్పొరేషన్ల చైర్పర్సన్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమ స్ఫూర్తితో సాగింది. గ్రామాలు, వార్డుల్లో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ప్రజల మద్దతు కూడగట్టాం. దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. లక్ష్యానికి మించి సంతకాల సేకరణ జరిగింది. ఈ మహాయజ్ఞంలో పాల్గొన్న పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు, నాయకులు, కార్యకర్తలను జగన్ ప్రత్యేకంగా అభినందించారు. సంతకాల సేకరణలో వివిధ గ్రామాల నేతలు ఒకరితో మరొకరు పోటీ పడ్డారు. అందుకే ఒక్కో నియోజకవర్గంలో 50 వేల నుంచి 60 వేల సంతకాల భారీ లక్ష్యాన్ని మించి సేకరించగలిగాం. మీ అందరి కష్టం, శ్రమను మన నాయకుడు వైఎస్ జగన్ అభినందించారు' అని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు కళ్లు తెరిచి, వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

మంత్రి సాక్షిగా ధాన్యం కొను'గోల్ మాల్' బట్టబయలు

- సర్కారు అండతో దళారులు, మిల్లర్లు ఏకం
- రైతులకు మద్దతు ధర రాకుండా మాయాజాలం
- మంత్రి పార్థసారథి తనిఖీ చేసిన ధాన్యం ఖరీదు రూ.1,630
- దానికి రైతుకు దళారీ ఇచ్చిన మొత్తం రూ.1,430 మాత్రమే
- బస్తాకు ఏకంగా రూ.200 తేడా
- అధికారులపై చిందులేస్తూ అక్కడి నుంచి జారుకున్న మంత్రి
- చంద్రబాబు ప్రభుత్వంలో ఏ పంటకూ ధర లేదని రైతుల మండిపాటు

కారకంపాడు (మొవ్వ) : ధాన్యం సేకరణలో ప్రభుత్వం రైతులను ఏ విధంగా పొట్టకొడుతోందో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలోనే బట్టబయలైంది. ప్రభుత్వ పెద్దలు, దళారులు, అధికారులు, మిల్లర్లు అంతా ఏకమై ఏ విధంగా దందా సాగిస్తున్నారో తేటతెల్లమైంది. శనివారం ఆయన తన స్వగ్రామమైన కృష్ణా జిల్లా మొవ్వ మండలం కారకంపాడులో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ విషయం తెలుసుకున్న అయ్యంకి, చిన ముత్తేవి, కారకంపాడు రైతులు మంత్రిని చుట్టుముట్టారు. ధాన్యం కొనేవారే కరువయ్యారని, ఒకవేళ కొనుగోలు చేసినా తక్కువ ధరకు కొనుగోలు చేసి తమ పొట్టకొడుతున్నారని చెప్పారు. అలాంటిదేమీ జరగదని చెప్పుకొచ్చిన మంత్రి.. రైతులు పట్టుపట్టడంతో ధాన్యం కొనుగోలు గురించి ఆరా తీసినట్టు షో చేశారు. ధాన్యం శాంపిల్ తీసుకొని తేమ శాతం, ధాన్యం నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అక్కడే ఉన్న అధికారులను ఈ ధాన్యానికి ఎంత రేటు కడతారంటూ ప్రశ్నించగా.. రూ.1,630కు కొనుగోలు చేయొచ్చని చెప్పారు. 'ఈ ధాన్యాన్ని ఎంతకు అమ్మావు' అని సంబంధిత రైతును అడగ్గా.. రూ.1,430కి దళారికి విక్రయించినట్లు రైతు తెలిపారు. దీంతో బస్తాకు రూ.200 చొప్పున రైతు నష్టపోయాడని బట్టబయలైంది. అంతటా ఇలానే జరుగుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయక పోవడం వల్లే దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని మండిపడ్డారు. రైతుల ఆగ్రహాన్ని చల్లార్చేందుకన్నట్లు మంత్రి అధికారులకు ఫోన్ చేసి చిందులేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. నెపాన్నంతటిని అధికారులపైకి నెట్టేసి అక్కడి నుంచి జారుకున్నారు. దీంతో చంద్రబాబు ప్రభుత్వంలో ప్రతి పంట పరిస్థితి ఇలానే ఉందని.. దళారులు, ప్రభుత్వ పెద్దలు అంతా కుమ్మక్కై తమను వ్యవసాయం మానుకునేలా చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి పార్థసారథిని నిలదీస్తున్న రైతులు

అమరావతి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

త్రిసభ్య కమిటీ భేటీ అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని

సమీక్ష సమావేశంలో పెమ్మసాని, నారాయణ, శ్రావణ్‌కుమార్, అధికారులు

తాడికొండ/గుంటూరు వెస్ట్: అమరావతి రైతుల సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. అమరావతి రాజధాని పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయంలో పెమ్మసాని, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌లతో కూడిన త్రిసభ్య కమిటీ విస్తృత స్థాయి సమీక్ష సమావేశం శనివారం జరిగింది. అనంతరం పెమ్మసాని విలేకరులతో మాట్లాడుతూ రాజధాని అవసరాల దృష్ట్యా సుమారు 2,500 ఎకరాల భూసేకరణ దశలవారీగా జరుగుతుందన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ లంక భూముల విషయంలో కోర్టు కేసులు ఉన్నప్పటికీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రిస్క్ తీసుకొని మరీ రిజిస్ట్రేషన్లు ప్రారంభించిందన్నారు. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ కంఠాలు, జరీబ్, నాన్–జరీబ్ భూములు, రోడ్ల వెంబడి ఇళ్ల తొలగింపు భూముల విషయంలో రైతుల్లో ఉన్న భయాలు, సందేహాలను తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, ఇదే అంశంపై శనివారం గుంటూరులోని ఓ హోటల్లో త్రిసభ్య కమిటీ సమావేశం కావడం గమనార్హం.

ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తాం

రాజధాని రైతుల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని సీఆర్డీఏ కమిషనర్ కె కన్నబాబు తెలిపారు. అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం రాయపూడి సీఆర్డీఏ కార్యాలయంలో శనివారం 'గ్రీవెన్స్ డే' నిర్వహించారు. వీధి పోట్లు, భవనాల అనుమతులు, వార్షిక కౌలు, గ్రామకంఠాలు, రిటర్నబుల్ ప్లాట్ల రీ అలాట్‌మెంట్ తదితర సమస్యలపై పలువురు తమ అర్జీలను 'గ్రీవెన్స్ డే'లో కమిషనర్‌కు అందజేశారు.

బుద్ధి నిన్ను కాపాడును.
వివేచన నీకు కావలి కాయును.
- క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం,
తిథి: బ.దశమి రా.8.35 వరకు తదుపరి ఏకాదశి,
నక్షత్రం: హస్త ఉ.10.58 వరకు, తదుపరి చిత్త,
వర్జ్యం: రా.7.36 నుండి 9.20 వరకు,
దుర్ముహూర్తం: సా.3.55 నుండి 4.41 వరకు,
అమృత ఘడియలు: తె.5.59 నుండి 7.42 వరకు (తెల్లవారితే సోమవారం)

సూర్యోదయం : 6.25
సూర్యాస్తమయం : 5.24
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఓం బిర్లా (లోక్‌సభ స్పీకర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇల్లు, వంటిల్లు చేజారిపోకూడదు. ఇల్లు చేజారితే లోన్‌లు, ఈఎంఐల స్వాధీనంలోకి వెళ్లిపోతుంది. వంటిల్లు చేజారితే ఫుడ్ డెలివరీ యాప్‌ల పాలౌతుంది. ఇల్లు అదుపు తప్పితే అప్పులు, వంటిల్లు ఆర్డర్ తప్పితే అనారోగ్యాలు!

సభ కూడా చేజారినట్లే నాకు అనిపిస్తోంది. సమావేశాలు 1న మొదలయ్యాయి. 19న ముగుస్తున్నాయి. భారత రాజ్యాంగంలోని అధికరణాలు, ఆదేశిక సూత్రాలతో పని లేకుండా శీతకాలం వచ్చి వెళ్లినట్లుగానే సమావేశాలూ ఒక రుతువులా మాత్రమే ప్రారంభమై ఒక రుతువులా మాత్రమే పూర్తయ్యే కాలం వచ్చేసిందా?!

సెషన్స్ ఇంకో 5 రోజులే ఉన్నాయి. బిల్లులు ఇంకా 10 పెండింగులో ఉన్నాయి. 150 ఏళ్ల వందేమాతరం, ఎస్ఐఆర్, ఈవీఎంలు... ఈ మూడే, సభలో రెండు వారాలుగా డిబేట్‌లు!

బంకిం ఛటర్జీని ప్రధాని "బంకిం దా" అనటం అహంకారం తప్ప మరొకటి కాదని తృణమూల్ ఎంపీలు! బెంగాల్లో అందరూ గౌరవంగా 'బంకిం బాబు' అంటారు కనుక ప్రధాని కూడా 'బంకిం బాబు' అనే అనాలని వాళ్ల పట్టు. మొత్తానికి ప్రధాని చేత 'బంకిం బాబు' అనిపించారు.

ఒక సభ్యుడు 'వందే మాతరం' అనబోయి రెండుసార్లు 'వందే భారత్' అన్నారు. "మాట్లాడే

ముందు నాలుగో తరగతి హిస్టరీ టెక్స్ట్ బుక్ ఒకసారి చూసుకొని రావాలి" అని వెక్కిరింపులు!

నోరు జారటం, మాట జారటం ఒకటేనా?! మనసులో ఉన్నదే నోట్లోంచి వస్తుంది. మాటగా జారింది మనసు లోనిది ఎలా అవుతుంది?!

మాట తడబాట్లను కూడా నవ్వుతూ తీసుకోలేనంత సీరియస్‌గా అయిపోతు న్నామా... చలిలో బిగుసుకుపోయినట్లు, మంచులో కూరుకుపోయినట్లు.

సెషన్స్‌లో నేనూ ఒకర్ని హర్ట్ చేయవలసి వచ్చింది!

వ్యవసాయ మంత్రి ప్రసంగిస్తుంటే, సభలో ఒక సభ్యుడు 'లంచ్' చేస్తూ నాకు కనిపించారు. "ఇక్కడ ఈటింగ్ ప్రోగ్రామ్ పెట్టకండి. ప్లేట్లు తీసేయండి" అని కాస్త హార్ష్ గానే అన్నాను. నిబంధనలు ఎలా ఉన్నా, నేనే కాస్త సౌమ్యంగా చెప్పి ఉండవలసిందా!

లంచ్ టైమ్‌లో లంచ్, డిబేట్ టైమ్‌లో డిబేట్, క్వొశ్చన్ అవర్‌లో క్వొశ్చన్స్ ఉండాల్సిందే. కొన్నిసార్లు లంచ్ టైమ్‌లోకి డిబేట్ టైమ్ వచ్చేసి, డిబేట్ టైమ్‌లోకి లంచ్ టైమ్ చొరబడుతుంది.

సభలో ఆ సభ్యుడు లంచ్ చేయటం కన్నా, సభలో ఆ సభ్యుడిని అందరి ముందూ "తినటం ఆపేయండి" అని నేను అనటమే సభా మర్యాదను తప్పినట్లుగా అనిపించింది నా మనసుకు.

శుక్రవారం సెషన్స్‌లో ఒక సభ్యుడు హఠాత్తుగా లేచి నిలబడ్డారు. "మాననీయ్ అధ్యక్ష్ మహోదయ్..." అని ఆగారు!

"చెప్పండి" అన్నాను.

"మాననీయ్ అధ్యక్ష్ మహోదయ్... 2019 లోనే భారత ప్రభుత్వం ఇ-సిగరెట్‌లను బ్యాన్ చేసింది కదా!" అన్నారు ఆ సభ్యుడు.

"ఆ... చేసింది" అన్నాను.

"భారత ప్రభుత్వం బ్యాన్ చేసినప్పటికీ సభలో ఇ-సిగరెట్‌లు తాగటానికి మీరు గానీ అనుమతి ఇచ్చారా?" అని ఆయన ప్రశ్న!

"ఇవ్వలేదు కానీ, మీరు విషయం చెప్పండి" అన్నాను.

"సభ లోపల టీఎంసీ సభ్యులు కొందరు ప్రతిరోజూ ఇ-సిగరెట్ తాగుతున్నారు. వెంటనే వారిని తనిఖీ చేయించండి" అని ఆదేశం!

నేను నవ్వాపుకోలేనంతగా నన్ను ఆదేశిం చారు ఆ సభ్యుడు!

స్పీకర్‌నే సభ్యులు ఆదేశిస్తున్నారంటే, స్పీకర్‌ని పక్కన పెట్టేసి సభ్యులే డిబేట్‌లు పెట్టేసుకుంటూ సభలో రౌండ్‌లు కొట్టేస్తున్నారంటే... సభ కూడా చేజారిన ఇల్లుగానో, వంటిల్లుగానో అయిపోతోందా?!

'హౌస్' కాస్తా 'హోమ్'గా మారిపోతోందా?!

అమరావతి చిక్కుముళ్ళకు బాధ్యులెవరు?

జనతంత్రం

వర్ధెల్లి మురళి

అమరావతిపై ఏపీ సర్కార్‌లో ఏదో గందరగోళం కనిపిస్తున్నది. చేస్తున్న పనుల్లో ఇసుమంతైనా పారదర్శకత లేదు. న్యాయమైన సందేహాలను కూడా కూటమి సహించలేకపోతున్నది. ప్రతిపక్షాలూ, మీడియా వేసే ప్రశ్నలే కాదు... తటస్థులూ, సానుభూతిపరుల సందేహాల పైన కూడా అసహనం వ్యక్తమవుతున్నది. ఈ ధోరణి కేవలం ప్రభుత్వ పెద్దల్లోనే కాదు, అనుబంధ మీడియాలో కూడా కనిపిస్తున్నది. తమకు నచ్చకపోతే నిఖార్సయిన వార్తలపై కూడా ఎల్లో మీడియా వీరంగం వేస్తున్నది. ఇక సర్కారు వారి సోషల్ మీడియాలోని ఎల్లో మెర్సినరీలను పట్ట వశం కావడం లేదు. అమరావతిపై ఎవరైనా సందేహాలు వ్యక్తం చేస్తే బూతుబాంబులతో చెలరేగిపోతున్నారు.

'అమరావతి బిల్లు వెనక్కి' అనే వార్త ఇటీవల 'సాక్షి'లో వచ్చింది. ఇది నూటికి నూరుపాళ్ళు నిజమైన వార్త. అమరావతికి సంబంధించిన పరిణామాలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమైన వార్తలే! ఆ వార్తలను అందించడం మీడియా బాధ్యత. ఎల్లో మీడియా కూడా ఆ వార్తను అందించి ఉండాల్సింది. కేంద్రం ఆమోదానికి రాష్ట్రం పంపించిన బిల్లులో సాంకేతిక లోపాలను గుర్తించినందువల్ల వాటిని సరిచేసి పంపాలని వెనక్కి పంపారు. 'సాక్షి' మీడియా అదే సమాచారాన్ని ప్రజలకు చేరవేసింది. అంతే తప్ప అమరావతి బిల్లుకు ఇక మోక్షమే ఉండబోదనీ, అమరావతి రాజధాని ప్రతిపాదనకు కేంద్రం తిరస్కరించిందనీ ఎక్కడా రాయలేదు. ఈమాత్రం దానికే ఎల్లో మీడియాకు, తెలుగుదేశం నేతలకు పూనకాలు వచ్చాయి. అమరావతి ఏర్పాటును సహించలేకపోతున్నారంటూ శాపనార్థాలు పెట్టారు. అసలు అమరావతిని ఒక నిష్ఫల ప్రయోగంగా మార్చుతున్నది ఎవరో పరిశీలించవలసిన అవసరం ఏర్పడింది. నిజంగానే ఈ బిల్లును ఆమోదించడంలో కేంద్రానికి కొన్ని చిక్కులున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం–2014లో రాష్ట్ర విభజన అమల్లోకి వచ్చిన రోజు (జూన్ 2, 2014) నుంచి 10 ఏళ్ల వరకు హైదరాబాద్ రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని పేర్కొన్నారు.

అందువల్ల 2014 నుంచి అమరావతిని ఏపీ రాజధానిగా గుర్తిస్తే, న్యాయపరమైన చిక్కులొచ్చే అవకాశం ఉంటుందని కేంద్రం భావించింది. 2024 జూన్ 2 నుంచి రాజధానిగా గుర్తించడమనేది ఒక ప్రత్యామ్నాయ మార్గం. అయితే 2014 నుంచి 2024 మధ్యకాలంలో రాజధాని కోసం కేంద్రం చేసిన సహాయం మాటేమిటి? ఈ చిక్కుముడులు తొలగించి, బిల్లును మళ్లీ పంపాలని కేంద్రం సూచించింది. ఆ పని చేస్తే సరిపోతుంది. ఇటువంటి చిక్కుముళ్ళన్నీ చంద్రబాబు సర్కార్ స్వయంకృతం. 2024 నుంచే అమరావతిని రాజధానిగా గుర్తిస్తే 34 వేల ఎకరాల భూ సమీకరణ ఏ పేరుతో చేసినట్టు? పైగా ఈ పదేళ్లపాటు రాజధాని లేని రాష్ట్రంగానే ఆంధ్రప్రదేశ్ కొనసాగిందా? రాష్ట్రం రాజధాని లేని అనాథగా మారిందని జగన్ హయాంలో దుష్ప్రచారం చేసిందెవరు? 2024 నుంచే అమరావతిని రాజధానిగా గుర్తిస్తే చంద్రబాబు తొలి ఐదేళ్ల పాలన కూడా రాజధాని లేని రాష్ట్రంగా భావించవలసిందేనా?

అమరావతి చుట్టూ వరుసగా చిక్కుముళ్ళు వేసుకుంటూ వెళ్ళిందే చంద్రబాబు సర్కార్. పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుందని పునర్విభజన చట్టం స్పష్టం చేసింది. కేవలం అసెంబ్లీ, సెక్రటేరియట్, శాఖాధిపతుల కార్యాలయాలకు మాత్రమే ఈ ఉమ్మడి రాజధాని పరిమితం కాదు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి మొత్తం ఉమ్మడి రాజధాని ప్రాంతంగానే ఉంటుందని చట్టంలో పేర్కొన్నారు. పదేళ్ల ఉమ్మడి రాజధాని అంశాన్ని ఉపయోగించుకోకుండా, ఏదో చేయకూడని పనిచేస్తూ దొరికిపోయినందువల్ల బాబు సర్కార్ హైదరాబాదుపై హక్కుల్ని వదిలేసుకుని వెళ్లిపోయిందని విమర్శలు వచ్చాయి.

పదేళ్ల తర్వాత ఏపీకి రాజధాని ఏర్పాటుకు అనువైన ప్రాంతాన్ని సూచించడం కోసం ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలనీ, ఆ కమిటీ ఆరు మాసాల్లోగా నివేదిక ఇవ్వాలనీ కేంద్రాన్ని చట్టం ఆదేశించింది. చట్ట ప్రకారం కేంద్రం 'శివరామకృష్ణన్ కమిటీ'ని నియమించింది. ఆ కమిటీ పలు ప్రాంతాల్లో పర్యటించి, వివిధ రంగాల ప్రజలతో సంభాషించి, ఒక నివేదికను అందజేసింది. నిపుణుల కమిటీ చేసిన సూచనలకు నూటికి నూరుపాళ్ళు వ్యతిరేకంగా చంద్రబాబు అమరావతిని ఎంపిక చేశారు. రాజధాని ఏర్పాటు కారణంగా అక్కడ పర్యావరణ సమతౌల్యం దెబ్బతినకుండా చూడాలనీ, వాగులు, వంకలు, చెరువుల వంటి జల వనరులను కాపాడాలనీ, వరదలు – భూకంపాలు – తుఫాన్లు వచ్చే అవకాశం లేని ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలనీ, పెద్ద సంఖ్యలో ప్రజలు నిర్వాసితులు కాకుండా చూడాలనీ కమిటీ ప్రతిపాదించింది. రాజధాని నిర్మాణ వ్యయం – భూ సేకరణ వగైరాలు వీలైనంత తక్కువ ఖర్చుతో పూర్తయ్యేలా ఉండాలని కూడా కమిటీ చెప్పింది. కొత్త రాజధాని హైదరాబాద్ వంటి 'సూపర్ సిటీ'గా కాకుండా ప్రభుత్వ శాఖల్ని వేర్వేరు ప్రాంతాలకు తరలించి వికేంద్రీకరణ సూత్రాన్ని పాటించాలని శివరామకృష్ణన్ కమిటీ సూచించింది.

నిపుణుల కమిటీ నివేదికను చంద్రబాబు పక్కన పడేశారు. కమిటీ చైర్మన్ శివరామకృష్ణన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, పాలసీ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయనతో పాటు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డీన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ సెటిల్మెంట్స్ డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ డైరెక్టర్లు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ సభ్యుల కంటే పిల్లల చదువుతో వ్యాపారం చేసే నారాయణ మెరుగైన నిపుణుడని మనసారా చంద్రబాబు నమ్మారు. అందుకే ఆ కమిటీ నివేదికను గిరాటేసి, 'నారాయణ కమిటీ' వేసుకున్నారు. 'ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ ఏరియా' చట్టం పేరుతో ఓ చట్టాన్ని ఆమోదించారు. విచిత్రం ఏమిటంటే ఈ చట్టంలో ఎక్కడా కూడా 'క్యాపిటల్ రీజియన్'గా అమరావతి ప్రాంతం ఉంటుందనే ప్రస్తావన లేదు. ఈ దాపరికం వెనుక 'ఇన్‌సైడర్ ట్రేడింగ్' అనే ఆర్థిక కుతంత్రం దాగి ఉందని అప్పట్లోనే ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. అటువంటిదేమీ లేదని నిరూపించుకునే ప్రయత్నం ఈ పదేళ్ళలో చంద్రబాబు ఎప్పుడూ చేయలేదు.

నిపుణుల కమిటీ నివేదికను పక్కన పడేయటం, ప్రపంచంలో ఏ నిపుణుడూ అంగీకరించని ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేసుకోవడం, దాన్ని గోప్యంగా ఉంచి చట్టం చేసుకోవటం, చట్టపరంగా పదేళ్లపాటు హైదరాబాదుపై ఉన్న హక్కుల్ని వదిలేసుకోవడం, 34 వేల ఎకరాల సారవంతమైన భూముల్ని రైతుల నుంచి నయానో భయానో సమీకరించడం, వారికి చేసిన వాగ్దానాలను నెరవేర్చలేకపోవడంతో పాటు సింగపూర్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు వరుసగా ఇప్పుడు చిక్కుముళ్ళుగా మారాయి. సింగపూర్ తరఫున అమరావతిలో ఉత్సాహం ప్రదర్శించిన మంత్రి ఈశ్వరన్ అవినీతి కథలు బయటపడటంతో సింగపూర్ కంపెనీలు ఒప్పందాన్ని రద్దు చేసుకున్నాయి. చిక్కుముళ్ళ పరంపర ఇంతటితో ఆగిపోలేదు. రైతుల దగ్గర సమీకరించిన భూమితో పాటు, ప్రభుత్వ భూమి కూడా కలిపితే 53 వేల ఎకరాలు అమరావతి కోసం సిద్ధంగా ఉన్నది.

ఇప్పుడు ఈ భూమి చిన్న మునిసిపాలిటీకి మాత్రమే సరిపోతుందని బాబు చెబుతున్నారు. ఇంకో రెండు దశల్లో మరో 40 వేల పైచిలుకు ఎకరాలను సేకరిస్తే తప్ప కలల రాజధాని సాకారం కాదట. రెండు కోట్లకు పైగా జనాభా ఉన్న ముంబై మహానగరమే (కార్పొరేషన్ ఏరియా) లక్షా పదివేల ఎకరాల్లో ఉందట! ఇంచుమించు అంత స్థలం ఉంటే తప్ప అమరావతి వెంచర్ ప్రారంభం కాదని ఇప్పుడు చెబుతున్నారు. ఇప్పుడున్న 53 వేల ఎకరాల్లోనే 'నవ నగరాల' పేరుతో మాస్టర్ ప్లాన్ గతంలోనే రూపొందించారు. అందులో 4 వేల ఎకరాలతో కూడిన స్పోర్ట్స్ సిటీ కూడా ఉన్నది. ఇప్పుడు అదనంగా స్టేడియాల కోసం, అంతర్జాతీయ విమానాశ్రయం కోసం, రెండో విడత భూసేకరణ కావాలని అడగటానికి కారణం ఏమిటో తెలియదు.

సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన అమరావతి భూముల లెక్కలు పరిశీలిస్తే అదనపు భూములు అవసరం ఏమిటన్న సందేహం మరింత పెరుగుతుంది. రైతులిచ్చిన భూములు ప్లస్ ప్రభుత్వ భూములు కలిసి సీఆర్‌డీఏ దగ్గర 53,747 ఎకరాల భూమి ఉన్నది. రోడ్లు, పార్కులు, చెరువులు వగైరాలు తీసేస్తే 29,220 ఎకరాలు మిగులుతాయి. ఇందులో 9,500 ఎకరాలు రైతులకు ఇవ్వాలి. 1,100 ఎకరాలు ఇప్పటికే వివిధ సంస్థలకు ఇచ్చారు. 300 ఎకరాల పైచిలుకు ప్రభుత్వ సంస్థలకు కావాలి. ఇంకా 18 వేల పైచిలుకు ఎకరాల భూమి సీఆర్‌డీఏ దగ్గర ఉంటుంది. ఇవన్నీ దాని లెక్కలే! ఇంకా అదనపు భూమి దేనికోసం? అభిజ్ఞ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఈ మొత్తం లేఅవుట్‌లో 15 వేల ఎకరాల ప్రభుత్వ భూమికి చెందిన సరిహద్దులు చెదిరిపోయాయి, రికార్డులు చిరిగిపోయాయి. కేటాయింపులకు గాని, అమ్మకాలకు గాని ఆ భూమి సీఆర్‌డీఏకి అందుబాటులో ఉంటుందో ఉండదోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లను చెరువుల్ని పూడ్చేసి, చదును చేసి ఇస్తున్నారట! న్యాయ వివాదాలు తలెత్తితే ఇవి చెల్లుబాటు అవుతాయా? అసలు చెరువులను పూడ్చి, ప్లాట్లు వేయాల్సిన అవసరం ఏమొచ్చింది?

రెండో దశ, మూడో దశ భూ సమీకరణలను దృష్టిలో పెట్టుకుని కొందరు భారీగా భూములు కొనుగోలు చేశారట! ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్‌పోర్టు పేరుతో వారు భూములు అమ్ముకోవాలి. అందుకోసం కాగితాలు మీదనే నగర విస్తరణ అక్కడిదాకా పాకాలి. ఈ లోగుట్టు అర్థమైనందు వల్లనే ఎంతోమంది తటస్థులతో పాటు, తెలుగుదేశం మద్దతుదారులు సైతం అమరావతి వ్యవహారాలను ప్రశ్నిస్తున్నారు. ఆలూ లేదు చూలూ లేదు... ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదన ఇప్పుడు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. పక్కనే గన్నవరంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండగా, మరో అంతర్జాతీయ విమానాశ్రయం దేనికని నిలదీస్తున్నారు. ప్రభుత్వం వైపు నుంచి దేనికీ సమాధానం లేదు. సరిగ్గా గమనిస్తే ఇంకో కోణం కనిపిస్తున్నది. మొదటి దశ సమీకరణలో చురుగ్గా కనిపించిన దేవినేని, ప్రత్తిపాటి, యరపతినేని, ధూళిపాళ్ల, శ్రీధర్ వగైరాలు ఇప్పుడు ఛూమంతర్ అన్నట్టుగా మాయమయ్యారు. రెండో దశ కోసం యవనిక ముందుకు పెమ్మసాని, భాష్యం, చిన్న కేశినేని వంటి వారు రంగప్రవేశం చేశారు. మొదటి టీమ్‌కు సారాంశం బోధపడినందువల్లనే పక్కన పెట్టి ఉంటారా?

పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రంలో మంత్రి. పని చేస్తున్నది మాత్రం రాష్ట్రంలో అమరావతి శాఖ కోసం! త్రీ మెన్ కమిటీ ముసుగులో ఆయన పూర్తి సమయం అమరావతి వ్యవహారాలనే చూస్తున్నారని తెలుగుదేశం వారే చెబుతున్నారు. అందుకు ప్రధానమంత్రి కూడా అంగీకరించారేమో తెలియదు. అంతకు ముందు పూర్తి బాధ్యతగా అమరావతి సంగతులు సర్దుబాటు చేసిన నారాయణ ఇప్పుడూ ఉన్నారు. కాకపోతే ఆయన పెమ్మసాని పక్కన జూనియర్ ఆర్టిస్టుగానే కనిపిస్తున్నారు. అమరావతి చుట్టూ చిక్కుముళ్ళు చాలా పడ్డాయి. ప్రజల మదిలో చాలా సందేహాలు ఉన్నాయి. అవి లేవనెత్తిన వారిపై బీపీ పెంచుకొని విరుచుకుపడటం పరిష్కారం కాదు. భూముల సమీకరణతో సహా మొత్తం అమరావతి వివరాలను పబ్లిక్ ఆడిట్ కోసం విడుదల చేయాలని డిమాండ్ చేయాలి. శ్వేత పత్రం కావాలని అడగాలి. ఇది బాధ్యతాయుతమైన మీడియా స్థానాల్లో, రాజకీయ పదవుల్లో ఉన్నవారు చేయవలసిన పని. ఎన్నికలకు ముందు అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ రాజధాని అని చెప్పిన బాబు, దానికోసం ఇప్పటికే 47 వేల కోట్లు అప్పు ఎందుకు చేయవలసి వచ్చిందో ప్రజలకు తెలియజెప్పడం ప్రభుత్వ కనీస బాధ్యత.

vardhelli1959@gmail.com

'ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ ఏరియా' చట్టం పేరుతో ఓ చట్టాన్ని ఆమోదించారు. విచిత్రం ఏమిటంటే ఈ చట్టంలో ఎక్కడా కూడా 'క్యాపిటల్ రీజియన్'గా అమరావతి ప్రాంతం ఉంటుందనే ప్రస్తావన లేదు. ఈ దాపరికం వెనుక 'ఇన్‌సైడర్ ట్రేడింగ్' అనే ఆర్థిక కుతంత్రం దాగి ఉందని అప్పట్లోనే ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. అటువంటిదేమీ లేదని నిరూపించుకునే ప్రయత్నం ఈ పదేళ్ళలో చంద్రబాబు ఎప్పుడూ చేయలేదు.

నిపుణుల కమిటీ నివేదికను పక్కన పడేయటం, ప్రపంచంలో ఏ నిపుణుడూ అంగీకరించని ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేసుకోవడం, దాన్ని గోప్యంగా ఉంచి చట్టం చేసుకోవటం, చట్టపరంగా పదేళ్లపాటు హైదరాబాదుపై ఉన్న హక్కుల్ని వదిలేసుకోవడం, 34 వేల ఎకరాల సారవంతమైన భూముల్ని రైతుల నుంచి నయానో భయానో సమీకరించడం, వారికి చేసిన వాగ్దానాలను నెరవేర్చలేక పోవడంతో పాటు సింగపూర్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు వరుసగా ఇప్పుడు చిక్కుముళ్ళుగా మారాయి. సింగపూర్ తరఫున అమరావతిలో ఉత్సాహం ప్రదర్శించిన మంత్రి ఈశ్వరన్ అవినీతి కథలు బయటపడటంతో సింగపూర్ కంపెనీలు ఒప్పందాన్ని రద్దు చేసుకున్నాయి.

ఆ కాలేజీ... మా భవితకు బంగారు బాట

జ్ఞాపకం

బి. మల్లారెడ్డి

గ్రామీణ విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు క్రమశిక్షణతో కూడిన చదువు అందజేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో మరిన్ని విద్యాకుసుమాలు వికసించడానికి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 1975లో మొదటిసారిగా గుంటూరు జిల్లా నాగార్జున సాగర్ ప్రాంతంలో తొలి ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రారంభ సంవత్సరంలోనే ఈ కాలేజీలో సీటు సంపాదించడం నా జీవితంలో అతి పెద్ద మలుపు. నా స్వగ్రామమైన రామడుగు నుండి కేవలం 30 కిలోమీటర్ల దూరంలోని విజయపురి సౌత్ (నాగార్జున సాగర్)లో కళాశాల ఉండటం నాకు మరింత సంతోష కారణమయ్యింది. నాతోపాటు మరో వంద మంది గ్రామీణ విద్యార్థులు కాలేజీలో చేరారు. అందులో 40 మంది ఎంపీసీ, 40 మంది బైపీసీ, 20 మంది ఎంఈసీ వారు ఉన్నారు. నేను మాత్రం డాక్టర్ కావాలనే లక్ష్యంతో బైపీసీ గ్రూపులో చేరాను.

అప్పుడే ఏర్పాటు చేసినందున కళాశాలలో విద్యార్థులకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలు ఉండేవి కాదు. అయినా మాకు ప్రభుత్వం అందిస్తున్న ఉన్నతమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడమే లక్ష్యంగా నా చదువు కొనసాగింది. పదవ తరగతిలో అత్యధిక మార్కులు పొంది ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కలిసి రెసిడెన్షియల్ కళాశాలలో చదువుతున్నందుకు నేను గర్వపడ్డాను. రాష్ట్రంలో పలు జిల్లాలలో విద్యాధికారి (డీఈవో)గా విధులు నిర్వహించిన కె.పెంచలయ్య మొదటి ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఇంటర్ పూర్తయ్యే వరకు విద్యార్థులను ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దడంతోపాటు మా యోగక్షేమాల పట్ల అనుక్షణం పర్యవేక్షించిన ఆయనా, అధ్యాపక బృందం నా మనస్సులో ఇప్పటికీ నిలిచిపోయారు.

ఇంటర్మీడియట్ పూర్తయ్యాక, నేను రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ చదివాను. అనంతరం తిరుపతి వ్యవసాయ కళాశాలలో అగ్రోనమీలో పీజీ పూర్తి చేశాను. విద్య పూర్తయ్యాక సిండికేట్ బ్యాంకులో అగ్రికల్చరల్ ఆఫీసర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి, తరువాత 1987లో డిప్యూటీ ఎస్పీగా పోలీస్ శాఖలో చేరాను.

2002లో ఐపీఎస్‌కు కన్ఫర్మ్ అయ్యాక, కర్నూలు, నెల్లూరు, కడప జిల్లాల్లో జిల్లా ఎస్పీగా, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ, స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్, వరంగల్ – కరీంనగర్ రేంజ్ డీఐజీ, చివరగా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ)గా పదోన్నతి పొంది తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తూ 2020లో పదవీ విరమణ చేశాను. పదవీ విరమణ అనంతరం కూడా ప్రజాసేవలో కొనసాగుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఏసీబీలో ప్రత్యేక అధికారిగా, ఏపీ ట్రాన్స్‌కోలో విజిలెన్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా డిసెంబర్ 2020 నుండి జూన్ 2024 వరకు సేవలందించాను.

◆ ఈ తొలి ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలో చదువుకున్న నాలాంటి ఎంతోమంది విద్యార్థులు ఉన్నతమైన స్థానాలు సాధించారు. మా కళాశాలకు మేమెప్పుడూ రుణపడి ఉంటాం.

జీవితంలో రోల్ మోడల్స్

ప్రతి విద్యార్థీ తన విద్యార్థి దశలోనే మహనీయులను తమ మార్గదర్శకులుగా ఎంచుకుంటారు. కానీ నేను మాత్రం నా సహ విద్యార్థులనే నా రోల్ మోడల్స్‌గా ఎంపిక చేసుకున్నాను. నా రోల్ మోడల్ ధర్మారావు తర్వాత రోజుల్లో జాతీయ స్థాయిలో నిర్వహించిన సివిల్ సర్వీసులో ర్యాంకు సాధించి మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్‌కు ఎంపిక కావడం, అలాగే లక్ష్మీనారాయణ ఐఆర్‌టీఎస్‌కు ఎంపికై రైల్వే శాఖలో సీనియర్ అధికారిగా పని చేయడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

నేను ఇంటర్‌లో ఉన్నప్పుడే ఐఏఎస్ కావాలనే సంకల్పాన్ని గుర్తించిన రవి మాస్టారు... మా తరగతులు ముగిశాక సివిల్ సర్వీసు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఇందుకోసం ఎలాంటి పుస్తకాలు చదవాలి, ముఖ్యంగా 'ది హిందూ' పత్రికలో ఏఏ అంశాలను చదవాలనే సూచనలు చేస్తూ నాకు మార్గదర్శకులుగా నిలిచారు. ఆయనా, నేను తదుపరి రోజుల్లో కలిసి వివిధ జిల్లాల్లో పని చేయడం నాకు ఒక గొప్ప మధురానుభూతి.

ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకుని నేను, నా మిత్రులు మా చదువులను కొనసాగించాం. పూర్తి అటవీ ప్రాంతంలోనే నెలకొల్పిన మా కళాశాలలో నేను చేరిన తొలి రోజుల్లోనే ఒక రాత్రి భారీ వర్షం వచ్చింది. పెద్ద పెద్ద ఉరుములు, మెరుపులు రావడంతో నేను భయపడి నా రూమ్‌మేట్ అయిన మెహెర్ ప్రసాద్‌ను కౌగిలించుకుని నిద్రించడం మరిచిపోలేని జ్ఞాపకం. అతడు ప్రస్తుతం ఐఐటీ చెన్నైలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతిగా పని చేస్తున్నారు. ఇదే ఐఐటీలో నా రెండవ కుమారుడు చదువుకోవడం, మా అబ్బాయికి అతడు గురువు కావడం నాకు చాలా ఆనందం కలిగించింది. మా రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ నూతనంగా ఏర్పాటు కావడంతో మా తరగతులు మా కాలేజీ ఆవరణలో ఉన్న రావి చెట్టు కింద నిర్వహించేవారు. ఒక రోజు ఆ రావి చెట్టు కింద తరగతులు జరుగుతున్న సమయంలో, అనుకోకుండా చెట్టు మీద నుండి పాము కింద పడటంతో ఒక్కసారిగా తరగతిలో ఉన్న విద్యార్థులందరం పరుగులు పెట్టడం మరిచిపోలేని సంఘటన. ఈ కళాశాలలో చదువుకున్న నాలాంటి ఎంతో మంది విద్యార్థులు అనేక రంగాలలో ఉన్నతమైన స్థానాలు సాధించారు. మా కళాశాలకు మేమంతా ఎప్పుడూ రుణపడి ఉంటాం.

వ్యాసకర్త ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థి; ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (రిటైర్డ్), తెలంగాణ

పేదల పొట్టగొడతారా?

ఇన్ బాక్స్

ఎన్నో పోరాటాల ఫలితంగా, దేశంలో రెక్కాడితే గాని డొక్కాడని పేదల కోసం యూపీఏ ప్రభుత్వం 2006లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చింది. అలాంటి పథకాన్ని నేడు కేంద్ర ప్రభుత్వం, ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నీరు గార్చేస్తున్నాయి. కోట్లాదిమంది పేదలకు సంబంధించిన ఈ పథకాన్ని ఒకేసారి ఎత్తివేస్తే పెద్ద ఎత్తున తిరుగుబాటు వస్తుందని, అంచెలంచెలుగా ఎత్తివేసే కుట్రకు తెరలేపాయి. అందులో భాగంగా కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి ఉద్దేశపూర్వకంగానే ప్రతి సంవత్సరం కేటాయింపులు తగ్గించి వేస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే పేదరికం తగ్గిపోయిందని జవాబు చెబుతున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని కోరిన ప్రతి ఒక్కరికీ 15 రోజులలోగా పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఈ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి జాబు కార్డులను అధిక సంఖ్యలో రద్దు చేస్తున్నారు. అలాగే చట్టంలో పేర్కొన్నట్లు పని ప్రదేశంలో కల్పించాల్సిన సౌకర్యాలను ఎత్తివేస్తున్నారు. తద్వారా చంటిపిల్లల తల్లులు, గర్భవతులు, వయోవృద్ధులు, మహిళలను ఈ పథకానికి దూరం చేస్తున్నారు. పనిచేసిన 15 రోజుల లోపల వేతనాలు చెల్లించాలి. అలా చెల్లించకపోవడం ఉపాధి హామీ చట్టం ప్రకారం నేరం. ప్రస్తుతం బడ్జెట్ లేకపోవడం వల్ల ఇవ్వాల్సిన కూలీ డబ్బులు నెలల తరబడి ఇవ్వలేకపోతున్నారు. దీంతో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తే డబ్బులు అందక పస్తులుండాల్సి వస్తుందని ఆ పనులకు దూరమవుతున్నారు జనం. ప్రభుత్వాలు ఆశించింది కూడా అదే!

ఈ పథకం అమలు కావడం వల్ల వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదనీ, అందువల్ల రైతులు నష్టపోతున్నారనీ, వ్యవసాయం దెబ్బతింటున్నదనీ రైతులకు, కూలీలకు మధ్య వివాదాలు రేపి పథకాన్ని నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కావున కూలీలు ఐక్యమై దాన్ని రక్షించుకోవడానికి రాజీ లేని పోరాటాలకు సిద్ధం కావాలి. దేశంలో మెజారిటీ జనాభా పేదవారే! వారి చేతులలో డబ్బు ఉన్నప్పుడే వారికి కొనుగోలుశక్తి పెరుగుతుంది. డబ్బు రావాలంటే వారికి ఉపాధి తప్పనిసరి. అందుకే సమాజంలోని అన్ని వర్గాలూ ఈ పథకాన్ని రక్షించడానికి ముందుకు రావాలి.

– కె.వి. రమణ । 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక' ఏపీ ఉపాధ్యక్షులు, అనంతపురం

క్లుప్తంగా...

16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం

17 నుంచి సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 16న ప్రారంభం కానుంది. ఆరోజు మధ్యాహ్నం 1.23 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డిసెంబరు 17 నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. కాగా జనవరి 14న ధనుర్మాస ఘడియలు ముగుస్తాయి. ఈ సందర్భంగా శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు.

గోదావరి, కృష్ణా పుష్కరాలకు ఏర్పాట్లు

మంత్రి ఆనం

కర్నూలు (సెంట్రల్): రాష్ట్రంలో గోదావరి, కృష్ణ పుష్కరాలకు ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం కర్నూలులో నిర్మించిన దేవదాయ శాఖ జోనల్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజులపాటు గోదావరి పుష్కరాలు జరుగుతాయని తెలిపారు. అలాగే 2028లో కృష్ణా నది పుష్కరాలు నిర్వహించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. మరోవైపు రాష్ట్రంలో 1,058 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.846 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వివరించారు.

కుక్కల దాడి.. తెగిన చిన్నారి చెవి

యాసిన్

కదిరి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో ఓ చిన్నారిపై శునకాలు దాడి చేశాయి. ఈ ఘటనలో చిన్నారి చెవి తెగి కింద పడింది. ఒళ్లంతా గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని నిజాంవలి కాలనీకి చెందిన చిన్నారి యాసిన్ (5) శనివారం ఇంటి ముందు ఆడకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో చిన్నారి యాసిన్ చెవి తెగిపోవడంతో పాటు ఒళ్లంతా గాయాలయ్యాయి. దీంతో తల్లిదండ్రులు వెంటనే కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. తెగిన చెవిని అతికించేందుకు అవసరమైన పరికరాలు ప్రభుత్వాస్పత్రిలో లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. కదిరిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గతంలోని అడపావీధిలో 15 మంది చిన్నారులపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.

మా ఎమ్మెల్యేతో బేరం కుదిరాకే రండి!

శ్రీశైలం దేవస్థానంలో టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా అనుచరుల గూండాగిరి

తలనీలాల టెండర్‌లో పాల్గొనేందుకు వచ్చిన కాంట్రాక్టర్లపై దాడి

- మా ఎమ్మెల్యేతో మాట్లాడిన తర్వాతే రావాలని బెదిరింపులు
- వేలంలో పాల్గొనకుండానే పరుగులు తీసిన కాంట్రాక్టర్లు
- ఈ నెల 11న ఘటన... ఆలస్యంగా వెలుగులోకి..
- దేవదాయశాఖ కమిషనర్‌కు కాంట్రాక్టర్ల ఫిర్యాదు?
- అర్ధంతరంగా టెండర్ రద్దు

సాక్షి, నంద్యాల/సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఇటీవల అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసిన ఘటన మరువకముందే... ఆయన అనుచరులు ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీశైలంలో కాంట్రాక్టర్లపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. పరమేశ్వరుడి సన్నిధిలో భక్తులు సమర్పించిన తలనీలాలు పోగుచేసుకునే కాంట్రాక్టు కోసం టెండర్‌లో పాల్గొనేందుకు వచ్చిన కాంట్రాక్టర్లను తరిమికొట్టారు. 'మా ఎమ్మెల్యేతో బేరం కుదుర్చుకున్నాకే రండి..' అంటూ బెదిరించి వెనక్కి పంపినట్లు సమాచారం. రెండురోజుల కిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

టెండర్ ధర తగ్గించేందుకు ఎమ్మెల్యే కుట్ర?

కాంట్రాక్టర్లను బెదిరించి బహిరంగ వేలంలో పాల్గొనకుండా చేయాలని, తద్వారా తక్కువ ధరకు తలనీలాల కాంట్రాక్టును తాను సూచించినవారికి దక్కేలా చేయాలని ఎమ్మెల్యే కుట్ర పన్నినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందువల్లే తన అనుచరులతో కాంట్రాక్టర్లను బెదిరించి కొందరిని సిండికేట్‌గా ఏర్పాటుచేసి గత ఏడాది కన్నా తక్కువ ధరకు టెండర్ వేసేలా చక్రం తిప్పుతున్నారని విమర్శలు వస్తున్నాయి. అంతిమంగా దేవస్థానానికి వెళ్లాల్సిన ఆదాయాన్ని తాను పొందేలా పథకం రచించారని ప్రచారం జరుగుతోంది.

దేవస్థానం ఆఫీసు లోపలికి రాకుండానే బెదిరింపులు!

శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్ల దేవస్థానంలో తలనీలాలు పోగు చేసుకునే హక్కును గత సంవత్సరం రూ.4.89 కోట్లకు అనంతపురానికి చెందిన రాజా ఎంటర్‌ప్రైజెస్ పొందింది. వారి కాలపరిమితి పూర్తవడంతో ఒక ఏడాదికి సుమారు రూ.5కోట్ల అంచనాలతో టెండర్ కమ్ బహిరంగ వేలం కోసం దేవస్థానం నెల రోజుల కిందట టెండర్లు ఆహ్వానించింది. కొద్దిరోజుల కిందట బహిరంగ వేలంపాటకు అన్నీ సిద్ధం చేసినా దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్, ఈవో స్థానికంగా లేకపోవడంతో వాయిదా వేశారు. ఈ నెల 11న రెండోసారి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దీంతో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి పలువురు కాంట్రాక్టర్లు రూ.50లక్షలు చొప్పున డీడీలు తీసుకుని బహిరంగ వేలంలో పాల్గొనేందుకు దేవస్థాన పరిపాలన భవనం వద్దకు వచ్చారు. అప్పటికే అక్కడ ఆత్మకూరు, శ్రీశైలం, సున్నిపెంటకు చెందిన కొందరు ఎమ్మెల్యే బుడ్డా అనుచరులు కాపు కాసి కాంట్రాక్టర్లను అడ్డుకున్నారు. అయినా కొందరు కాంట్రాక్టర్లు వారి నుంచి తప్పించుకుని ఆఫీసు లోపలికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనుచరులు లోపలికివెళ్లి కాంట్రాక్టర్లపై దాడి చేశారు. 'మా ఎమ్మెల్యేతో బేరం కుదుర్చుకుని రమ్మంటే ఏంట్రా ఇంకా ఇక్కడే ఉన్నారు..' అంటూ కేకలు వేస్తూ బీభత్సం సృష్టించారు. వారి నుంచి తప్పించుకుని పారిపోతున్న కాంట్రాక్టర్లను వెంటపడి రక్తం వచ్చేలా కొట్టినట్లు తెలిసింది. కాంట్రాక్టర్లపై ఎమ్మెల్యే అనుచరుల దాడి దృశ్యాలను ఓ కాంట్రాక్టర్ డ్రైవర్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, టీడీపీ నాయకులు అతడిపైనా దాడి చేసి సెల్‌ఫోన్ లాక్కుని వీడియోలు డిలీట్ చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యే అనుచరుల గూండాగిరితో భక్తులు, దేవస్థాన అర్చకులు, సిబ్బంది భయభ్రాంతులకు గురైనట్లు తెలిసింది.

దాడి చేస్తారని పోలీసులకు ముందుగా తెలిసినా..!

తలనీలాల టెండర్‌లో పాల్గొనేందుకు వచ్చిన కాంట్రాక్టర్లపై ఎమ్మెల్యే బుడ్డా అనుచరులు దాడి చేసే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ సిబ్బంది ముందుగానే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో దేవస్థాన పరిపాలన భవనానికి పోలీసులు, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు చేరుకున్నారు. అయినా వారి సమక్షంలోనే టీడీపీ మూకలు రెచ్చిపోయి కాంట్రాక్టర్లపై దాడి చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

కమిషనర్‌కు కాంట్రాక్టర్ల ఫిర్యాదు.. టెండర్ రద్దు

తలనీలాల టెండర్‌లో పాల్గొనకుండా తమపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అనుచరులు దాడి చేశారని కాంట్రాక్టర్లు వెంటనే రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఆ టెండర్‌ను రద్దు చేశారు. తమపై దాడి గురించి సమగ్ర దర్యాప్తు జరిపించాలని కాంట్రాక్టర్లు కోరినట్లు సమాచారం. అసలు టెండర్‌తో సంబంధం లేని వ్యక్తులు దేవస్థాన పరిపాలన భవనం వద్దకు ఎలా వచ్చారు? వారిని ఎవరు పంపించారు? ఎవరు అనుమతించారు? వంటి విషయాలపై లోతుగా దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. దేవస్థాన పరిపాలన భవనం వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తే తమపై దాడి చేసిన దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తాయని చెప్పినట్లు సమాచారం.

ముగిసిన షోడశదిన సుందరకాండ పారాయణం

తిరుమల: నవంబర్ 28 నుంచి 16 రోజుల పాటు తిరుమలలో నిర్వహించిన షోడశదిన సుందరకాండ పారాయణం శనివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. లోక కళ్యాణార్థం తలపెట్టిన పారాయణంలో భాగంగా నవంబర్ 28 నుంచి డిసెంబర్ 13 వరకు రోజూ ఉదయం 8.30 నుంచి 9.30 తిరుమలలోని వసంత మండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఉదయం 9 నుంచి 12 గంటల మధ్య ఆరాధన, అభిషేకం, హోమం, అనుష్టానం నిర్వహించారు.

ధ్వజస్తంభాల కోసం దివ్య వృక్షాల ప్రాజెక్ట్

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి

తిరుమల: దేశంలోనే తొలిసారిగా ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం దివ్య వృక్షాల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దీనిని సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ విశిష్ట ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం ధ్వజస్తంభాల నిర్మాణానికి అవసరమైన దివ్య వృక్షాలను టీటీడీ స్వయంగా పెంచి, పరిరక్షించి వినియోగించడమేనని పేర్కొన్నారు. ఇందులో భాగంగా టేకు, వేగిస, ఇండియన్ కినో, టెర్మినేలియా, షోరియా వంటి జాతులకు చెందిన వృక్షాలను పెంచుతామన్నారు.

రూ. 35 లక్షల ఎర్రచందనం దుంగలు స్వాధీనం

భాకరాపేట: తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట అటవీశాఖ అధికారులు శుక్రవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న రూ.35 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. అటవీ శాఖ సమాచారం మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో భాకరాపేట రేంజ్ పరిధిలోని పింఛా రోడ్డులో అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని అటవీ స్ట్రైక్ ఫోర్స్, బేస్ క్యాంప్ సిబ్బంది తనిఖీ చేశారు. వాహనంలో ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారు తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన అరిమూర్తి కుప్పుసామి, సతియరాజ్ కమలనాథన్‌గా గుర్తించారు.

దుర్గగుడి ఈవో, చైర్మన్‌లను తక్షణమే తొలగించాలి

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ డిమాండ్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఎంతో నియమనిష్టలతో భవానీ దీక్షల విరమణకు వచ్చిన భక్తులను అవమానించేలా ప్రవర్తించిన దేవస్థానం చైర్మన్‌ను తొలగించాలని, ఈవోను తక్షణమే సస్పెండ్ చేయాలని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దుర్గగుడిలో చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. భక్తుల ఇరుముడిని శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు, లేదా గురుభవానీలు విప్పాల్సి ఉంటే అందుకు విరుద్ధంగా ఆలయ ఈవో, చైర్మన్ చేతులు పెట్టి భక్తులను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యత గల పదవుల్లో ఉన్న ఆలయ ఈవో, చైర్మన్ భక్తుల మనోభావాలను గౌరవించాల్సిందిపోయి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారన్నారు. ఆలయ అర్చకులు, గురుస్వాములు చేయాల్సిన పనిని వారు చేయడం సమంజసం కాదన్నారు. కనీసం భవానీ మాలధారణలో కూడా లేకుండా ఇరుముడులను విప్పడం ధర్మానికి విరుద్ధమన్నారు. చేతిలో అధికారం ఉంది కదా ఏం చేసినా చెల్లుతుందన్న అహంకారంతో వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అమ్మవారి గుడిలో జరిగిన అపచారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఆలయ ఈవోను తక్షణం సస్పెండ్ చేయాలని, చైర్మన్‌ను తొలగించాలని వైఎస్సార్‌సీపీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. హిందూ భక్తుల మనోభావాలను గాయపరిచేలా జరిగిన ఈ చర్య అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.

దుర్గగుడిలో అపచారం వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శుభేందు సమంత కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. డిప్యూటీ ఈవో రాధ స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. – సింహాచలం

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్ నాయక్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. – శ్రీకాళహస్తి

శ్రీవారిని దర్శించుకున్న సినీనటుడు రజనీకాంత్

తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. – తిరుమల

ఎస్వీ పాలిటెక్నిక్‌లో అన్యమత ప్రచారం

అధ్యాపకురాలు సస్పెండ్

తిరుపతి సిటీ: తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అన్యమత ప్రచారం కలకలంరేగింది. ఇంగ్లిష్ అధ్యాపకురాలు మాధవి బోర్డుపై రాస్తున్న అన్యమత వ్యాఖ్యలను కొందరు విద్యార్థులు వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఘటనపై ప్రిన్సిపల్ స్పందిస్తూ.. అధ్యాపకురాలిని విచారించి, నివేదికను ఉన్నతాధికారులకు పంపించామన్నారు. దీంతో మాధవిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



బోర్డుపై అన్యమత వ్యాఖ్యలు రాస్తున్న మాధవి

మదనపల్లె-చెన్నై పాసింజర్‌ను ప్రారంభించండి

ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె: మదనపల్లె–చెన్నై మధ్య మంజూరైన ప్యాసింజర్ రైలు ప్రారంభం గతంలో కోవిడ్ కారణంగా వాయిదా పడిన విషయాన్ని కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. ఈ రైలు ప్రారంభం కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారని, వెంటనే ప్రారంభించాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్టు పేర్కొన్నారు. ఈ రైలు చెన్నైలో ఉదయం 8 గంటలకు బయలుదేరి 11.25 గంటలకు చిత్తూరు చేరుకుని అక్కడినుంచి మధ్యాహ్నం 2 గంటలకు మదనపల్లెకు వస్తుందని, తిరిగి మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి రాత్రి 8.55 గంటలకు చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ చేరుకునేలా షెడ్యూలు కూడా నిర్ణయించినట్టు తెలిపారు. ఈ రైలును వెంటనే ప్రారంభిస్తే రెండు రాష్ట్రాలకు చెందిన మదనపల్లె, చిత్తూరు, చెన్నై ప్రయాణికులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని వివరించారు. వాయల్పాడు–మదనపల్లె రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కూడా మంత్రికి విన్నవించినట్టు మిథున్‌రెడ్డి తెలిపారు.

కోతుల నుంచి మా పిల్లలకు రక్షణ కల్పించండి

కలెక్టర్‌ను వేడుకున్న విద్యార్థినుల తల్లులు

ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

రావికమతం: అనకాపల్లి జిల్లా రావికమతం ఎస్సీ బాలికల వసతి గృహంలో చదువుతున్న తమ పిల్లలకు కోతుల బారి నుంచి రక్షణ కల్పించాలని చీమలపాడు పంచాయతీకి చెందిన గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. రావికమతం ప్రభుత్వ వసతి గృహాల్లోని బాలికలకు రక్షణ ఏది? మొన్న కుక్కలు, నిన్న కోతులు వసతి గృహాల్లోకి చొరబడి పిల్లలపై దాడులు చేస్తుంటే హాస్టల్ సిబ్బంది ఏం చేస్తున్నారు?అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. తమ గోడు ఆలకించాలని చేతులు జోడించి కలెక్టర్ విజయ కృష్ణన్‌ను శనివారం వేడుకున్నారు. కాగా, ఈ హాస్టల్లో సమీప మండలాలకు చెందిన 96 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. గత ఆదివారం రాత్రి గిరిజన బాలికలు స్నేహ, మంగపై కోతులు దాడి చేశాయి. గాయపడిన ఇద్దరినీ రావికమతం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి కోలుకున్నాక వారి ఇళ్లకు పంపించారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా విద్యార్థినుల తల్లిదండ్రులు మంగళవారం వసతి గృహానికి చేరుకొని సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ లోపల చెట్లు ఎక్కువగా ఉండటంతో వాటిపై కోతులు తిష్ట వేస్తున్నాయని, అవి బాలికలపై దాడి చేస్తున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. రక్షణ చర్యలు తీసుకునే వరకు తమ పిల్లల్ని హాస్టల్‌కు పంపించబోమని స్పష్టం చేస్తూ వారిని ఇళ్లకు తీసుకువెళ్లిపోయారు. ఇలా విద్యార్థులందరూ వెళ్లిపోవడంతో శుక్రవారం నాటికి హాస్టల్ మొత్తం ఖాళీ అయ్యింది.

మనకు సమస్యలున్నా అధిగమించే సత్తా ఉంది

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్

మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్

ప్రత్తిపాడు: మనకు సమస్యలున్నా, వాటిని అధిగమించే సత్తా ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రులో శనివారం 45వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో న్యాయమూర్తి మాట్లాడుతూ పాలపర్రుతో, ఇక్కడి ప్రజలతో సుదీర్ఘ సాన్నిహిత్యం ఉందన్నారు. నంగినేని చౌదరి బాబు, ముద్దన చెంచయ్య విగ్రహాలు ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. మన దేశ విద్యావ్యవస్థపై కొంత చిన్నచూపు ఉందని, ఎవరు ఎంత చిన్న చూపు చూసినా, మన దేశం నుంచి వచ్చే పట్టభద్రులను దాదాపు ప్రపంచం అంతా స్వీకరిస్తోందని తెలిపారు. మరి మన విద్యా వ్యవస్థ బాగాలేకపోతే వేరే దేశాలు మనల్ని ఎందుకు ఆహ్వానిస్తున్నాయని ప్రశ్నించారు. అందువల్ల మనం నిరుత్సాహపడాల్సిన పనిలేదన్నారు. సమస్యలున్నాయని, కానీ వాటిని అధిగమించే సత్తా కూడా ఉందని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల కన్నెర్ర

- అనంతపురం సర్వజనాస్పత్రిలో పద్మావతి ఏజెన్సీ ఆగడాలు
- కోవిడ్‌లో ప్రాణాలకు తెగించి పనిచేసిన వారిని తొలగించేందుకు సన్నాహాలు
- ఉద్యోగ భయంతో పారిశుద్ధ్య కార్మికురాలు ఆత్మహత్యాయత్నం
- విధులు బహిష్కరించి ఆందోళనకు దిగిన కార్మికులు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను నిలదీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

అనంతపురం (మెడికల్): అనంతపురం సర్వజనాస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులు కన్నెర్ర చేశారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమను ఇంటికి సాగనంపి కొత్త వారిని విధుల్లోకి తీసుకునేందుకు యత్నించిన ఏజెన్సీ నిర్వాకాన్ని నిరసిస్తూ శనివారం ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. సర్వజనాస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులను వయసు నిబంధన పేరిట 'పద్మావతి ఏజెన్సీ' విధుల నుంచి తొలగించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఏజెన్సీ నిర్వాహకుల దురుసు ప్రవర్తనతో మనస్తాపం చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు పద్మావతి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో శనివారం పారిశుద్ధ్య కార్మికులు విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ తదితర సంఘాలు వీరి ఆందోళనకు మద్దతుగా పాల్గొన్నాయి. ఆందోళన కొనసాగుతున్న సమయంలోనే పద్మావతి ఏజెన్సీ నిర్వాహకులు కొత్తగా పదుల సంఖ్యలో డైలీ వేజెస్ కింద సిబ్బందిని గుట్టుగా తీసుకువచ్చి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని చూశారు. దీనిపై కార్మికులు కన్నెర్ర చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత సమక్షంలోనే ఏజెన్సీ మేనేజర్లు హరి, సాయితేజారెడ్డితో వాగ్వాదానికి దిగారు. వివిధ వార్డుల్లో పనిచేస్తున్న ప్రైవేట్ సిబ్బందిని కార్మికులు అడ్డుకుని, తోసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. ఆందోళనలు చేపట్టి, దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు కార్మిక సంఘాల నాయకులను హెచ్చరించారు. ఆస్పత్రికి వచ్చిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను పారిశుద్ధ్య కార్మికులు చుట్టుముట్టారు. తమను అన్యాయంగా తొలగిస్తున్నారని వాపోయారు. సమస్యను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు.

కార్మికులకు అన్యాయం జరిగితే ఊరుకోం

కోవిడ్ పరిస్థితుల్లోనూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనులు చేసిన పారిశుద్ధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి మండిపడ్డారు. వయసు పేరిట కార్మికులను తొలగించాలని చూస్తే ఊరుకోబోమన్నారు. సీఐటీయూ నేత నాగేంద్ర మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మిత్రుడు భాస్కర్ నాయుడుకు చెందిన పద్మావతి ఏజెన్సీ దౌర్జన్యం, దాష్టీకానికి కార్మికులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు కొర్రపాడు హుస్సేన్ పీరా, రాజారెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ హుస్సేన్, వామపక్ష నాయకులు రామిరెడ్డి, సురేష్, యేసురత్నం, ఏటీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మా భూముల వద్దే జిల్లా ఆఫీసులు పెట్టాలి!

మార్కాపురంలో అధికారులపై కూటమి నేతల ఒత్తిళ్లు

మార్కాపురం/మార్కాపురం టౌన్: 'మా భూములు ఉన్న ప్రాంతంలోనే జిల్లా కార్యాలయాలు పెట్టాలి. ప్రభుత్వ భూములు ఉన్నా... అటువైపు వెళ్లకండి. అవసరమైతే మా పట్టా భూములు కొనుగోలు చేయండి...' అని మార్కాపురం అధికారులపై స్థానిక కూటమి నేతలు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో నాయకుల ఆదేశాలకు అనుగుణంగా అధికారులు కూడా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిసింది. మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో పట్టణంలో దాదాపు 74 ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఆయా శాఖల ఆఫీసులు, అధికారులకు అవసరమైన భవనాలను సిద్ధం చేయాల్సి ఉంది.

అక్కడ ప్రభుత్వ భూములు ఉన్నా: మార్కాపురం పట్టణంలోని రాయవరం రోడ్డు, కాలేజీ రోడ్డు, వేములకోట రోడ్డు, దరిమడుగు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. రాయవరం రోడ్డులో ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయి. అయితే, మార్కాపురం నియోజకవర్గంలోని కూటమి ముఖ్య నాయకులు మాత్రం తమకు వందల ఎకరాల భూములు ఉన్న తర్లుపాడు రోడ్డులోనే జిల్లా కార్యాలయాలు పెట్టాలని, ఆ దిశగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని స్థానిక అధికారులపై పది రోజులుగా ఒత్తిడి చేస్తున్నారు. తాత్కాలిక కార్యాలయాల కోసం తర్లుపాడు రోడ్డులో ఉన్న ప్రైవేట్ పాఠశాలల భవనాలను అద్దెకు తీసుకోవాలని సూచిస్తున్నారు. శాశ్వత భవనాల కోసం అవసరమైతే తమ పట్టా భూములను కొనుగోలు చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. తద్వారా తమ భూముల విలువ పెంచుకోవాలని నాయకులు ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకు అధికారులు సైతం తర్లుపాడు రోడ్డులోనే ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. ఆ రోడ్డులోని స్థలాలు, భవనాలు, ఇళ్లను పరిశీలిస్తున్నారు. దీంతో ఆ రోడ్డులో భూముల ధరలు భారీగా పెరుగుతున్నాయి.

మార్కాపురం పట్టణం వ్యూ

నక్సలిజం సాధించిందేమీ లేదు!

నక్సలిజం నల్లతాచు పడగనీడలో వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదు

- సాయుధ వామపక్ష ఉద్యమం నిరుపయోగం
- శాంతి మాత్రమే అభివృద్ధి బాటల్ని పరుస్తుంది
- మార్చి 31కల్లా నక్సలిజాన్ని అంతమొందిస్తాం
- ఛత్తీస్‌గఢ్‌లో అమిత్ షా పునరుద్ఘాటన

రాయపూర్: నక్సలిజం నల్లతాచు పడగనీడ కారణంగా దేశంలో వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి ఫలాలను అందుకోలేకపోయాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీకల్లా దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని ఆయన ప్రతిజ్ఞచేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రం జగ్‌దల్పూర్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం జరిగిన బస్తర్ ఒలింపిక్–2025 క్రీడోత్సవ ముగింపు వేడుకలో అమిత్ షా పాల్గొని ప్రసంగించారు. ''ఆయుధం చేతబట్టిన నక్సలైట్లు నక్సలిజం పేరుతో సాధించింది ఏమీ లేదు. నక్సలిజం అనేది ఇటు సాయుధులకు ఉపయోగపడలేదు. అటు గిరిజనులకూ అక్కరకు రాలేదు. సాయుధ భద్రతాబలగాలకూ ఎలాంటి ప్రయోజనంలేని పనికిమాలిన పనిగా నక్సలిజం తయారైంది. వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీలోపు దేశంలో నక్సలిజంను అంతం చేస్తాం. ఏడు జిల్లాల సమాహారంగా ఉన్న బస్తర్ రీజియన్‌ను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దుదాం. ఇకనైనా సీపీఐ(మావోయిస్ట్) ఉద్యమకారులు ఆయుధాలు విడనాడి సమాజ ప్రధాన స్రవంతితో కలిసి నడవాలి. దారితప్పిన యువతను పునరావాస పథకం ద్వారా మళ్లీ గాడినపెడతాం. గౌరవప్రద జీవితం గడిపే అవకాశం కల్పిస్తాం. ఈ ప్రాంతంలో అభివృద్ధికి బాటలు పడాలంటే ఒక్క శాంతితోనే సాధ్యం. బస్తర్ ఒలింపిక్–2024 చూడ్డానికి వచ్చా. ఈసారి కూడా బస్తర్ ఒలింపిక్–2025 వీక్షించేందుకు విచ్చేశా. వచ్చే ఏడాది బస్తర్ ఒలింపిక్–2026 చూడ్డానికి వచ్చేటప్పటికి ఈ ప్రాంతంలో నక్సలిజం తుడిచిపెట్టుకుపోవడం ఖాయం. ఛత్తీస్‌గఢ్‌లో మాత్రమేకాదు యావత్ భారతావని నుంచి దానిని తరిమేస్తాం. 2026 మార్చి 31కల్లా దేశవ్యాప్తంగా ఎరుపు ఉగ్రవాదాన్ని నామరూపాల్లేకుండా చేయాలని ప్రధాని మోదీ ప్రభుత్వం సంకల్పించింది. ఇది త్వరలో సిద్ధించనుంది. నక్సలిజాన్ని రూపుమాపడమే మా పనికాదు. ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధే మా కర్తవ్యం. నక్సలిజం శకం ముగిసి నూతన అభివృద్ధి శకం త్వరలో ఆరంభమవుతుంది''అని అమిత్ వ్యాఖ్యానించారు.

మరో ఐదేళ్లలో అద్భుతాభివృద్ధి

''బస్తర్ రీజియన్‌లో కాంకేర్, కొండగావ్, బస్తర్, సుక్మా, బీజాపూర్, నారాయణ్‌పూర్, దంతేవాడ జిల్లాలున్నాయి. వెనుకబడిన ఈ 7 గిరిజన జిల్లాలను వచ్చే ఐదేళ్లలో అంటే 2030 డిసెంబర్‌కల్లా దేశంలోనే అత్యంత అభివృద్ధిబాటలో పయనించిన జిల్లాలుగా మార్చేస్తా. ఛత్తీస్‌గఢ్‌తోపాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు ఈ ఏడు జిల్లాల కోసం శతథా కృషిచేస్తాయి. అర్హులకు ఇళ్లతోపాటు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వంటగ్యాస్ కనెక్షన్, ఐదు కేజీల ఉచిత రేషన్ బియ్యం, ప్రతి ఒక్క కుటుంబానికి ఏడాది రూ.5లక్షల దాకా ఉచితవైద్య సదుపాయం కల్పిస్తాం. ఏడు జిల్లాల మధ్య రహదారుల ద్వారా అనుసంధానతను పెంచుతాం. విద్యుత్ స్తంభాలు వేయించి అందరి ఇళ్లలో విద్యుత్ వెలుగుల్ని ప్రసరింపజేస్తాం''అని అన్నారు.

ప్రసంగిస్తున్న హోం మంత్రి అమిత్ షా

ప్రతి గ్రామాన్ని రోడ్లతో అనుసంధానిస్తాం

''ప్రతి ఒక్క గిరిజన గ్రామాన్ని రోడ్లతో అనుసంధానిస్తాం. ప్రతి ఐదు కిలోమీటర్ల పరిధిలో బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెస్తాం. ప్రాథమిక, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల పటిష్ట నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేస్తాం. అటవీ ఉత్పత్తులను శుద్ధిపరిచే కర్మాగారాలను సహకారసంఘాల సహకారంతో నెలకొల్పుతాం. ఇతర గిరిజన జిల్లాలతో పోలిస్తే అత్యధిక పాల ఉత్పత్తికేంద్రాలుగా ఈ ఏడు జిల్లాలను తీర్చిదిద్దుతాం. పాడి, కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించి ఇక్కడి రైతుల కుటుంబాదాయాన్ని రెట్టింపు చేస్తాం''అని అన్నారు.

కొత్త పరిశ్రమలను తీసుకొస్తాం

''నూతన పరిశ్రమలను ఈ జిల్లాలకు తీసుకొస్తాం. ఉన్నత విద్యా కేంద్రాలను నెలకొల్పుతాం. దేశంలోనే అత్యుత్తమమైన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తాం. బస్తర్ పట్టణంలో అత్యంత అధునాతనమైన ఆస్పత్రిని కడతాం. గిరిజన ప్రాంతాలను పట్టిపీడిస్తున్న పోషకాహార లోప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా కొత్త పథకాన్ని తీసుకొస్తాం. మావోయిస్టుల హింసాత్మక ఘటనల్లో గాయపడిన వారికి, లొంగిపోయిన మావోయిస్టుల కోసం అత్యంత అధునాతన సౌకర్యాలతో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేస్తాం''అని అన్నారు.

అప్పుడు రణగొణలు.. ఇప్పుడు గణగణలు

''ఒకప్పుడు నక్సలైట్ల మందుపాతరల పేల్చివేతలు, బుల్లెట్ల మోత, రణగొణలే వినిపించేవి. ఇప్పుడు రుధిర దారుల్లో విద్యాసుమాలు వెల్లివిరుస్తున్నాయి. విద్యాలయాలను నిర్మించాం. అందుకే నాటి రణగొణలు పోయి ఇప్పుడు బడిగంటల గణగణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి అనేది సుదూర స్వప్నంగా మారిన ఈ ప్రాంతంలో కొత్తగా రోడ్లు, రైల్వేలు, హైవేలు తీసుకొస్తున్నాం. అప్పట్లో ఇక్కడ లాల్ సలామ్ అనే నినాదమే వినిపించేది. ఇప్పుడంతా భారత్ మాతా కీ జై నినాదమే మార్మోగిపోతోంది. బస్తర్ అభివృద్ధికి మేమంతా కట్టుబడ్డాం. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుతీరాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నక్సలిజాన్ని కూకటివేళ్లతో పెకిలించడం మొదలెట్టాయి. అందుకే ఎన్నో పరస్పర కాల్పుల ఘటనలు జరిగాయి. చాలా మంది నక్సలైట్లు చనిపోయారు. ఆ భయంతోనే గత రెండేళ్లలో ఏకంగా 2,000 మంది నక్సలైట్లు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిపోయారు''అని అమిత్ షా అన్నారు.

సన్ క్యాండిల్

సకల ప్రాణకోటికి దినకరుడే ప్రత్యక్ష దైవం. నిత్యం ఉదయిస్తూ, అస్తమిస్తూ ప్రకృతిలో భిన్న కాలాలకు సూరీడే కారణభూతంగా నిలుస్తున్నాడు. సకల చరాచర జీవకోటికి శక్తిప్రదాతగా దేదీప్యమానంగా వెలిగిపోయే సూర్యుడు ఇదే ప్రకృతిలో ఎన్నెన్నో వింతలకు హేతువుగా ఉన్నాడు. అందులో ఒకటే సన్ క్యాండిల్. సముద్ర మట్టం నుంచి అత్యంత ఎత్తులో కదలాడే సిర్రస్ మేఘాల్లోని స్ఫటిక మంచు బిందువుల కారణంగా ఈ సూర్య కొవ్వొత్తులు వెలిగి చూపరులకు నేత్రానందం కల్గిస్తున్నాయి. తాజాగా ఆస్ట్రియాలోని ఒక మంచుమయ పర్వత సానువుల్లో స్కీయింగ్ చేస్తున్న ఒక బృందం ఎదుట ఈ సన్ క్యాండిల్ ప్రత్యక్షమైంది. దీంతో అక్కడి వాళ్లంతా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. అత్యంత అరుదైన ఈ వింతను అక్కడి స్కీయర్ లెంకా ల్యాంక్ వెంటనే తన కెమెరాకు పనిచెప్పారు. ల్యాంక్ తీసిన ఈ వీడియో ఇప్పుడు సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ''సైన్స్‌ఫిక్షన్ సినిమాల్లో చూపించినట్లుగా హఠాత్తుగా ఏర్పడిన ఈ వింతను చూసి కంగారుపడ్డా. దగ్గరికెళ్లి చూద్దామనుకున్నాగానీ భయపడిపోయా. ఎందుకంటే సమాంతర విశ్వానికి ఇది ముఖద్వారమేమో అన్నట్లు అనిపించింది''అని లెంకా ల్యాంక్ వీడియో లైసెన్సింగ్ వేదిక అయిన 'వైరల్‌హాగ్'లో రాసుకొచ్చారు.

ఎలా ఏర్పడుతుందంటే?..

ఇదొక సూర్యకాంతి సంబంధ దృగ్విషయం. సిర్రస్ మేఘాల మీదుగా కాంతి నేల మీదపై పడే సందర్భాల్లో ఈ సన్ క్యాండిల్ ఏర్పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. మంచు పొగలో కోట్ల సంఖ్యలో అతి సూక్ష్మ, స్ఫటికాకార, సమతల మంచు బిందువులు ఉంటాయి. వీటిల్లో కొన్ని భూమికి సమాంతరంగా ఏర్పడినప్పుడు చూడ్డానికి అవన్నీ స్ఫటికాల్లా ప్రవర్తిస్తాయి. అంటే అద్దంలా అన్నమాట. తమ మీద పడిన కాంతిని అచ్చంగా మళ్లీ అదే దిశలో పరావర్తనం చెందిస్తాయి. అలా పై నుంచి కిందకు వచ్చే కాంతి కిరణాలను ఈ స్ఫటిక బిందువులు తిరిగి ఎగువ దిశలో పంపిస్తాయి. దీంతో వెండి రంగులో దేదీప్యమానంగా వెలిగిపోయే కొవ్వొత్తులు ఏర్పడతాయి. సాధారణంగా పర్వత శిఖరాల వంటి అత్యంత ఎత్తయిన ప్రదేశాల్లో సన్ క్యాండిల్ ఆవిష్కృతమవుతుంది. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లోనే ఈ క్యాండిళ్లు ఏర్పడే అవకాశాలుంటాయి. సూర్యకాంతి పుంజం ఇలా పడి మళ్లీ అలా పైకి వెళ్తుండటంతో వీటిని సూర్య స్తంభాలు అని కూడా అంటారు. విమానాల్లోంచి కిందకు చూసినప్పుడు కూడా మంచు పర్వతాల సమీపంలో ఇలాంటి కాంతి కొవ్వొత్తులను చూడొచ్చు. ఎంత ఎక్కువగా స్ఫటిక మంచు బిందువులు ఒకే కోణంలో ఏర్పడతాయో అంతగా అతిపెద్ద కొవ్వొత్తి ఏర్పడుతుంది. అప్పుడు దానిని నేరుగా కంటితో చూడలేం. అంత ధగద్ధాయమానంగా అది వెలిగిపోతుంది. మేఘాల లోపలి నుంచి దూసుకెళ్తున్నప్పుడు ఇలాంటివి కొన్ని సార్లు విమాన కాక్‌పిట్‌లోని పైలట్ల కంట పడతాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రధాన సమాచార కమిషనర్‌గా గోయల్

ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: నూతన ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ)గా మాజీ ప్రభుత్వ ఉన్నతాధికారి రాజ్‌కుమార్ గోయల్‌ను కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల ఎంపిక ప్యానెల్ బుధవారం సమావేశమై గోయల్ పేరును సీఐసీ పదవికి సిఫార్సుచేసినట్లు శనివారం ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. సీఐసీగా గోయల్‌తోపాటు మరో ఎనిమిది మంది ఇన్ఫర్మేషన్ కమిషనర్(ఐసీ)లను కొత్తగా ప్యానెల్ సిఫార్సు చేసింది. గోయల్ చేత సీఐసీగా సోమవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణం చేయిస్తారు. అరుణాచల్ ప్రదేశ్–గోవా–మిజోరం–యూనియన్ టెరిటరీస్(ఏజీఎంయూటీ) క్యాడర్‌కు చెందిన

1990 బ్యాచ్(రిటైర్డ్) ఐఏఎస్ అధికారి అయిన గోయల్ ఇటీవల కేంద్ర న్యాయ శాఖ కార్యదర్శిగా సేవలందించారు. గతంలో ఈయన కేంద్ర హోం శాఖలో సరిహద్దు నిర్వహణ విభాగంలో కార్యదర్శిగా పనిచేశారు. అవిభాజ్య జమ్మూకశ్మీర్ రాష్ట్రంతోపాటు కేంద్రప్రభుత్వంలో పలు పదవుల్లో సేవలందించారు. సెప్టెంబర్ 13వ తేదీన ప్రస్తుత సీఐసీ హీరాలాల్ సమారియా రిటైర్ కావడంతో అప్పట్నుంచి ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలోనే రాజ్‌గోయల్‌ను సీఐసీ పదవికి ఎంపికచేశారు. కొత్త కమిషనర్లు, చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ బాధ్యతలు స్వీకరించాక దాదాపు 9 ఏళ్ల తర్వాత కమిషన్ గరిష్ట సామర్థ్యంతో పనిచేయనుంది. బుధవారం 8 మందిని ఐసీలుగా సిఫార్సుచేయగా ఇప్పటికే ఆనందీ రామలింగం, వినోద్ కుమార్ తివారీలు ఐసీలుగా పనిచేస్తున్నారు. సమాచార కమిషనర్(ఐసీ) పోస్ట్‌కు ప్రభుత్వం ఎంపికచేసిన 8 మందిలో సీనియర్ పాత్రికేయులు పీఆర్ రమేశ్, అశుతోష్ చతుర్వేది, పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డ్‌లో లీగల్ సభ్యురాలైన రేలంగి సుధారాణి, మాజీ రైల్వేబోర్డ్ చీఫ్ జయవర్మ సిన్హా, మాజీ ఐపీఎస్ అధికారి స్వాగత్ దాస్, సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ మాజీ అధికారి సంజీవ్ కుమార్ జిందాల్, మాజీ ఐఏఎస్ అధికారి సురేంద్ర సింగ్ మీనా, మాజీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి కుష్వంత్ సింగ్ సేఠీ ఉన్నారు.

సిరియాలో ఐఎస్ దాడి.. ఇద్దరు అమెరికా సైనికులు మృతి

డెమాస్కస్: ఏడాది క్రితం బషర్ అస్సద్ ప్రభుత్వం పడిపోయాక సిరియాలోని అమెరికా బలగాలపై మొదటిసారిగా పెద్ద దాడి జరిగింది. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు పొంచి ఉండి జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు, అమెరికా పౌరుడు చనిపోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు. సెంట్రల్ సిరియాలో దాడి జరిగిందని శనివారం యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. నిబంధనల ప్రకారం, మృతుల కుటుంబీకులకు ఈ సమాచారం అందించిన 24 గంటల తర్వాతే వారి వివరాలను వెల్లడించగలమని వివరించింది.

పోస్టర్ల గ్యాలరీ

గిరిజన గళానికి గిన్నిస్ కిరీటం!

అమెరికా రికార్డు బద్దలు • చరిత్ర సృష్టించిన పోస్టర్ల ప్రదర్శన

పుణే: భారతదేశం మరోసారి విశ్వవేదికపై మెరిసింది. ఈసారి ఒక సాంస్కృతిక ఘనతతో, పుణే నగరం 'అత్యధిక పోస్టర్ల ప్రదర్శన'లో గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. దేశంలోనే అతిపెద్ద పుస్తక మహోత్సవంలో భాగంగా ఈ చారిత్రక రికార్డు నెలకొల్పింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ న్యాయనిర్ణేత స్వప్నిల్ దంగ్రీకర్ శనివారం ఈ రికార్డును ధ్రువీకరించారు. అత్యధిక పోస్టర్ల ప్రదర్శన రికార్డులో అమెరికాను వెనక్కి నెట్టి, ఈ ఘనతను భారత్ సొంతం చేసుకుందని ప్రకటించారు.

1,678 పోస్టర్లతో భారతీయ అస్తిత్వం

ఫెర్గుసన్ కళాశాలలో జరుగుతున్న పుణే పుస్తక మహోత్సవంలో ఈ రికార్డును నెలకొల్పారు. నిర్వాహకుల సమాచారం ప్రకారం, గిరిజన పదాలను ప్రదర్శిస్తూ ఏకంగా 1,678 పోస్టర్లను ప్రదర్శించారు. గతంలో అమెరికాలో ఫిబ్రవరి 2025లో 1,365 పోస్టర్లతో నెలకొల్పిన రికార్డును ఈ ప్రదర్శన బద్దలు కొట్టింది. డిసెంబర్ 12న పుణే బుక్ ఫెస్టివల్, యశ్వంత్రావ్ చవాన్ మహారాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీ, రైజ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ రికార్డును సాధించినట్లు గిన్నిస్ ధ్రువపత్రంలో పేర్కొన్నారు.

బిర్సా ముండాకు అంకితం

ప్రపంచ రికార్డు సృష్టి వెనుక ఒక విశిష్ట లక్ష్యం ఉంది. ఈ రికార్డును గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండాకు నివాళిగా అంకితం చేశారు. పుస్తక మహోత్సవ కన్వీనర్ రాజేష్ పాండే మాట్లాడుతూ, గిరిజన సమాజం, భారత స్వాతంత్ర్య ఉద్యమానికి బిర్సా ముండా చేసిన సేవలను గౌరవించేందుకు ఒక ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరిజన పదజాలంతో కూడిన పోస్టర్ల ప్రదర్శనతో గిన్నిస్ ప్రపంచ రికార్డును సృష్టించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేశారు.

అంతరిస్తున్న భాషల పరిరక్షణ

సామాజిక కార్యకర్త గిరీష్ ప్రభూణే మాట్లాడుతూ, బిర్సా ముండా కృషి బహుముఖమైనదని కొనియాడారు. 'అంతరించిపోతున్న మాండలికాలను పరిరక్షించడం అత్యవసరం. వాటిని దేవనాగరి లిపిలో నమోదు చేస్తే.. గిరిజన భాషలలో నిక్షిప్తమైన జ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వీలవుతుంది'.. అని ఆయన అభిప్రాయపడ్డారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 13 నుంచి 21 వరకు జరుగుతున్న ఈ పుణే పుస్తక మహోత్సవం, పుస్తక ప్రదర్శన మాత్రమే కాదు, గిరిజన సంస్కృతి, భాషా పరిరక్షణకు ఒక శక్తివంతమైన వేదికగా నిలిచింది. ఈ రికార్డు విజయంతో, పుణే నగరం పుస్తకాల పండుగను కేవలం వినోద కార్యక్రమంగా కాకుండా, సామాజిక చైతన్యం, సాంస్కృతిక గౌరవానికి చిహ్నంగా మార్చింది.

అమరులకు ఘన నివాళి

- 2001 పార్లమెంట్ దాడికి 24 ఏళ్లు
- నివాళులర్పించిన ప్రధాని మోదీ, రాహుల్, సోనియా
- దేశం మీ త్యాగాన్ని ఎప్పటికీ మరువదు: రాష్ట్రపతి ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ: దేశ ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటి పార్లమెంట్‌పై ఉగ్రమూకలు విరుచుకుపడి 24 ఏళ్లు పూర్తయ్యాయి. 2001 డిసెంబర్ 13న పార్లమెంట్ భవనంపై జరిగిన ఆ భయానక దాడిలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజాస్వామ్య దేవాలయాన్ని రక్షించుకున్న వీర జవాన్లను యావత్ దేశం స్మరించుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఐదుగురు సాయుధ ఉగ్రవాదులు పార్లమెంట్‌లోకి చొరబడేందుకు యత్నించగా పార్లమెంట్ సెక్యూరిటీ సర్వీస్, సీఆర్‌పీఎఫ్, ఢిల్లీ పోలీసులు వారిని నిలువరించారు. ఉగ్రవాదులెవరినీ లోపలికి వెళ్లనీయలేదు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఢిల్లీ పోలీసులు, ఇద్దరు పార్లమెంట్ సెక్యూరిటీ సర్వీస్ సిబ్బంది, ఒక తోటమాలి, టీవీ జర్నలిస్ట్ ఒకరు ప్రాణాలు కోల్పోయారు. పార్లమెంట్ భవన ప్రాంగణంలోనే మొత్తం ఐదుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

ఉపరాష్ట్రపతి, మోదీ, రాహుల్, సోనియా నివాళి

పార్లమెంట్ హౌస్ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ తదితరులు పాల్గొన్నారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, మౌనం పాటించి వారి త్యాగాలను గుర్తుచేసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా నేతలంతా ఒక్కతాటిపైకి వచ్చి వీర జవాన్లకు సెల్యూట్ చేశారు.

ధైర్యసాహసాలకు సలాం: ప్రధాని మోదీ

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. '2001లో పార్లమెంట్‌పై జరిగిన దాడిలో ప్రాణత్యాగం చేసిన అమరులను దేశం నేడు స్మరించుకుంటోంది. ఆనాడు వారు చూపిన ధైర్యం, అప్రమత్తత, కర్తవ్య దీక్ష అమోఘం. సంక్షోభ సమయంలో వారు ప్రదర్శించిన తెగువకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది'అని కొనియాడారు.

నివాళి కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, రాహుల్, సోనియా గాంధీ

ఉగ్రవాదంపై పోరుకు పునరంకితమవుదాం: రాష్ట్రపతి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'ఎక్స్'వేదికగా స్పందిస్తూ.. '2001లో పార్లమెంట్‌ను రక్షించుకునే క్రమంలో ప్రాణాలర్పించిన వీరనాయకులకు దేశం సెల్యూట్ చేస్తోంది. వారి త్యాగం మన జాతీయ భావనను ఎప్పుడూ నడిపిస్తూనే ఉంటుంది. అమరుల కుటుంబాలకు దేశం అండగా ఉంటుంది. ఈ రోజున ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా పునరంకితమవుదాం'అని సందేశం ఇచ్చారు.

కమలేష్ కుమారికి సీఆర్పీఎఫ్ నివాళి

ఉగ్రవాదులను అడ్డుకోవడంలో అద్భుతమైన ధైర్యసాహసాలు ప్రదర్శించి, మరణానంతరం 'అశోకచక్ర'పురస్కారం అందుకున్న సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ కమలేష్ కుమారికి సీఆర్పీఎఫ్ ప్రత్యేక నివాళులర్పించింది. ఆమె చూపిన తెగువ 'సదాస్మరణీయం'అని పేర్కొంది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తదితరులు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. జాతి సార్వభౌమాధికారంపై జరిగిన దాడిని తిప్పికొట్టిన వీరుల త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

ఏకీకృత న్యాయ విధానం ఉండాలి: సీజేఐ

జైసల్మీర్: నేడు ఏకీకృత న్యాయవిధానం అవసరం ఎంతో ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో ప్రమాణాలు, విధానాలను ఏకీకృతం చేసేందుకు ఆధునిక సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దీనివల్ల పౌరులు దేశంలో ఎక్కడ ఉన్నా నిరంతరంగా సమాచారాన్ని తెలుసుకునేందుకు అవకాశమేర్పడుతుందని తెలిపారు. సమాఖ్య విధానం కారణంగా హైకోర్టులకు వేటికవి సొంత విధానాలు, సాంకేతికపరమైన సామర్థ్యాలను కలిగి ఉన్నాయంటూ ఆయన..ఇటువంటి అవరోధాలను సాంకేతిక సాయంతో, ఏకీకృత న్యాయ విధానంతో తొలగించుకోవచ్చని సీజేఐ చెప్పారు. జైసల్మీర్‌లో శనివారం జరిగిన వెస్ట్ జోన్ రీజినల్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ న్యాయవ్యవస్థ (నేషనల్ జ్యుడీషియల్ ఈకోసిస్టమ్) అవసరాన్ని గురించి నొక్కి చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని దేశ న్యాయ వ్యవస్థను సమూలంగా సంస్కరించాలని పిలుపునిచ్చారు.

కేరళ రాజధానిలో కమలవికాసం

- తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం
- 101 వార్డులకుగాను 50 చోట్ల జయకేతనం
- ఎల్‌డీఎఫ్ కూటమి 45 ఏళ్ల పాలనకు తెర

తిరువనంతపురం: కమ్యూనిస్ట్ కోటలో 45 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు బీజేపీ పాగావేసింది. కేరళ రాజధాని తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో తొలిసారిగా బీజేపీ ఒంటరిగా పోటీచేసి సంచలన విజయం సాధించింది. 101 వార్డులకుగాను 50 చోట్ల బీజేపీ అభ్యర్థులు ఘన విజయం సాధించి మేయర్ పీఠంపై కన్నేశారు. సీపీఐ(ఎం) సారథ్యంలోని వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి కేవలం 29 స్థానాలకు పరిమితమైంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి 19 చోట్ల గెలిచింది. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులనూ విజయం వరించింది. యూడీఎఫ్ నుంచి గట్టిపోటీని ఎదుర్కొని బీజేపీ పాలక్కాడ్ మున్సిపాలిటీలోనూ ఎక్కువ స్థానాల్లో విజయబావుటా ఎగరేసింది. త్రిప్పునిథురా మున్సిపాలిటీలో గతంలో కాంగ్రెస్ గెలవగా ఈసారి బీజేపీ సంచలన విజయంతో ఈ మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకుంది. కొడంగల్లూర్ మున్సిపాలిటీలోనూ 46 వార్డులకుగాను 18 చోట్ల బీజేపీ విజయంసాధించింది. మరికొన్ని మున్సిపాలిటీల్లోనూ బీజేపీ కొన్ని వార్డుల్లో గెల్చింది. 64 ఏళ్ల సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారి ఆర్. శ్రీలేఖను తిరువనంతపురం మేయర్‌గా ఎన్నుకునే అవకాశముందని తెలుస్తోంది. శ్రీలేఖ కేరళలో తొలి మహిళా ఐపీఎస్‌గా 1987 జనవరిలో చరిత్ర సృష్టించిన విషయం విదితమే. గత ఏడాది అక్టోబర్‌లో బీజేపీలో చేరిన శ్రీలేఖ తాజాగా శాస్త్రమంగళం వార్డు నుంచి గెలిచారు. ఐపీఎస్ అధికారిణిగా ఆమె గతంలో పలు జిల్లాలో ఎస్పీగా, తర్వాత సీబీఐలో, ఆ తర్వాత కేరళ క్రైమ్ బ్రాంచ్, అగ్నిమాపక దళం, మోటార్ వెహికల్ శాఖ, జైళ్ల శాఖలో సేవలందించారు.

కేరళ రాజకీయాల్లో కీలక మలుపు: మోదీ

తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయంపై ప్రధాని మోదీ ఆనందం వ్యక్తం చేస్తూ తన సొంత సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో శనివారం ఒక పోస్ట్‌పెట్టారు. '' తిరువనంతపురం ఓటర్లకు నా కృతజ్ఞతలు. తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ–ఎన్‌డీఏ కూటమికి అనుకూలంగా వచ్చిన ఈ ప్రజాతీర్పు కేరళ రాజకీయాల్లో కీలక మలుపు. ప్రజల ఆకాంక్షలను బీజేపీ మాత్రమే నెరవేర్చగలదని ఈ ఎన్నికల ఫలితాలు రుజువుచేస్తున్నాయి. నగరాభివృద్ధితోపాటు ప్రజల ఆనందమయ జీవనానికి అనుగుణంగా నగరాన్ని పాలిస్తాం. బీజేపీ కార్యకర్తలే పార్టీకి బలం. వాళ్లను చూసి మేమంతా గర్విస్తున్నాం. గెలుపు కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నేనెంతో రుణపడిపోయా'' అని మోదీ అన్నారు.

కేరళ స్థానికంలో యూడీఎఫ్ హవా

కేరళలో స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి హవా కొనసాగింది. ఇది వచ్చే ఏడాది జరగబోయే కేరళ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నైతికబలం చేకూర్చింది. ఇటీవల రెండు దశల్లో 1,199 స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికలకు సంబంధించిన ఫలితాలను శనివారం వెల్లడించగా యూడీఎఫ్ కూటమి పార్టీలు మెజారిటీ చోట్ల గెలిచాయి. శబరిమలలో విగ్రహాల తాపడంలో బంగారం తరుగుదల, ఇతర పరిపాలనా వ్యవహారాల్లో ఆరోపణలను యూడీఎఫ్ విజయవంతంగా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లుగా మలచగలిగింది. మరోవైపు తిరువనంతపురంలో బీజేపీ ఘన విజయంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ఆనందం వ్యక్తంచేయడం గమనార్హం. '' ప్రజాస్వామ్యంలోని గొప్పతనం అంటే ఇదే. స్థానిక ఎన్నికల్లో మా యూడీఎఫ్ కూటమితోపాటు తిరువనంతపురంలో బీజేపీ గెలుపు నిజంగా ఎంతో సంతోషించదగ్గ పరిణామం. 45 ఏళ్ల ఎల్‌డీఎఫ్ అధ్వాన్న పాలనకు ఓటర్లు చరమగీతం పాడారు. రాజధాని రాజకీయాల్లో మార్పు తప్పదని ప్రజలు రుజువుచేశారు'' అని థరూర్ అన్నారు.

సాక్షి
గుంటూరు
ఆదివారం । 14 । డిసెంబర్ । 2025

సీతారాముల పవళింపు సేవ

నగరంపాలెం: గుంటూరు ఆర్.అగ్రహారంలోని శ్రీరామనామక్షేత్ర ఆవరణలో శ్రీరామకోటి మహోత్సవాల్లో శనివారం అద్దాల మందిరంలో సీతారాముల పవళింపు సేవ నిర్వహించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీటి విడుదల నిలిపివేశారు. దిగువకు 3400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 42.4733 టీఎంసీలు.

దక్షిణాముఖ ఆంజనేయుడికి పూజలు

ఫిరంగిపురం: స్థానిక వేణుగోపాల స్వామి దేవాలయంలో ఉన్న దక్షిణాముఖ ఆంజనేయుడికి శనివారం అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. నాగవల్లీ దళాలతో ఘనంగా పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టులో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 53 బెంచీలను, గుంటూరు జిల్లా కోర్ట్ ప్రాంగణంలో 17 బెంచీలను ఏర్పాటు చేశారు. చిలకలూరిపేట ఎన్‌హెచ్16 వంతెన వద్ద జరిగిన ఒక ప్రమాదంలో అశోక్‌కి సంబంధించిన ప్రమాద బీమా కేసులో బాధిత కుటుంబానికి ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ రూ. కోటి అందించింది. విజ్ఞాన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ట్రస్ట్, డాక్టర్ పి. రాజారామ్మోహన్ మధ్య ఐదు ముఖ్యమైన చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించారు. బెంగళూరులోని ఒక భూమి విక్రయ ఒప్పందం విఫలమైన వివాదంలో లోక్ అదాలత్ ద్వారా రూ.20 కోట్ల మేరకు రాజీ కుదిర్చారు. జిల్లా వ్యాప్తంగా సివిల్ కేసులు 1,376, క్రిమినల్ కేసులు 21,415, చెక్ బౌన్స్ కేసులు 578, ప్రీ లిటిగేషన్ కేసులు 97 కలిపి మొత్తం 23,466 కేసులు పరిష్కరించారు. న్యాయ సేవాధికార సంస్థ తరపున కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ సహకారం అందించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. విడిపోయిన జంటను ఐదవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.నీలిమ సమక్షంలో కౌన్సెలింగ్ ద్వారా కలిపారు.

పశ్చిమ డెల్టాకు 2,212 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 2,212 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం స్థిరంగా ఉంది. బ్యాంక్ కెనాల్ 150 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 70, పశ్చిమ కాలువకు 45, నిజాంపట్నం కాలువకు 50, కొమ్మూరు కాలువకు 1,666 క్యూసెక్కులు విడుదల చేశారు.

2 నుంచి విజయవాడ పుస్తక మహోత్సవం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు 36వ విజయవాడ పుస్తక మహోత్సవం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు టి.మనోహర్‌నాయుడు, కె.లక్ష్మయ్య తెలిపారు. సొసైటీ కార్యాలయంలో శనివారం పుస్తక మహోత్సవం పోస్టర్లను ఆవిష్కరించి మీడియాతో మాట్లాడారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం ప్రాంగణంలో జరిగే ఈ పుస్తక మహోత్సవం ప్రాంగణానికి వడ్లమూడి విమలాదేవి, ప్రధాన వేదికకు ప్రముఖ రచయిత డాక్టర్ బి.వి.పట్టాభిరామ్, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించే ప్రతిభ వేదికకు జయంత్ నార్లేకర్ పేర్లు పెడుతున్నట్లు వెల్లడించారు. రెండో తేదీ సాయంత్రం ఆరు గంటలకు పుస్తక మహోత్సవం ప్రారంభమవుతుందని, ముఖ్యమంత్రిని లేదా ఉపముఖ్యమంత్రి తదితర ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. జనవరి ఐదో తేదీ సాయంత్రం పుస్తక ప్రియుల పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు జె.ప్రసాద్, సహాయ కార్యదర్శి ఎ.బి.ఎన్.సాయిరామ్, కోశాధికారి కె.రవి, కార్యవర్గ సభ్యులు జి.లక్ష్మి, నాగిరెడ్డి, శ్రీనివాస్, ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 574.10 అడుగులకు చేరింది. ఇది మొత్తం 266.8601 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు వెయ్యి, ఎడమ కాలువకు 8,541, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 29,354, ఎస్‌ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. జలాశయం నుంచి ఔట్‌ఫ్లోగా 49,995 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి 49,995 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

ప్రైవేటీకరణపై నిరసన సంతకం

ప్రత్తిపాడు నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణకు అపూర్వ స్పందన

- ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజాగ్రహం
- స్వచ్ఛందంగా సంతకాలు చేసిన యువత, మహిళలు
- నియోజకవర్గంలో 71,226 సంతకాల సేకరణ
- ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యపరిచిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెదనందిపాడు మండలం కొప్పర్రులో వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేస్తున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలన్న అనాలోచిత నిర్ణయంపై ప్రజల నుంచి ఆగ్రహజ్వాలలు ఎగసిపడ్డాయి. ఊరూ, వాడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రజా ఉద్యమంలో మేము సైతం అంటూ నిరసన 'సంతకం' చేశారు. చంద్రబాబూ.. ఇదేం తీరు... అంటూ తల్లిదండ్రులు ఆవేదన వెళ్లగక్కారు. సారూ.. భవిష్యత్తు ఏంటంటూ యువత నిగ్గదీసి అడిగింది. ఇక ఆరోగ్యం దేవుడి దయేనా.. అంటూ పేదలు నిష్టూర్చారు. యువత, మహిళలు, పెద్దలు, పేద, మధ్య తరగతి ప్రజలు ముక్తకంఠంతో నిరసన గళం వినిపించారు. తమ నిరసనను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేస్తూ సంతకాల సేకరణ ఉద్యమంలో భాగస్వాములు అయ్యారు.

నియోజకవర్గంలో అనూహ్య స్పందన

చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు శ్రీకారం చుట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమానికి నియోజకవర్గంలో అనూహ్య స్పందన లభించింది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో అక్టోబరు 17వ తేదీన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గ్రామాల్లో రచ్చబండలు

అప్పటి నుండి గుంటూరు రూరల్ మండలం పరిధిలోని 11 గ్రామాల్లో, అర్బన్ పరిధిలోని ఎనిమిది డివిజన్లలో, ప్రత్తిపాడు మండలంలోని గొట్టిపాడు, గనికపూడి, పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, కోయవారిపాలెం, కొండేపాడు, యనమదల, ఈదులపాలెం, తుమ్మలపాలెం.. సహా మొత్తం 16 గ్రామ పంచాయతీల్లో, పెదనందిపాడు మండలంలోని కొప్పర్రు, పెదనందిపాడు, అన్నపర్రు, పాలపర్రు, జీజీపాలెం, గోగులమూడి.. సహా పద్నాలుగుకు పైగా గ్రామాల్లో, కాకుమాను మండలంలోని కొండపాటూరు, రేటూరు, కెబిపాలెం, చినలింగాయపాలెం.. సహా పదికి పైగా గ్రామాల్లో, వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరు, వట్టిచెరుకూరు, అనంతవరప్పాడు, ఐదవమైలు, పుల్లడిగుంట, గారపాడు సహా మొత్తం పదమూడుకు పైగా గ్రామాల్లో రచ్చబండలో నిర్వహించి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డలో సంతకం చేస్తున్న బలసాని కిరణ్‌కుమార్

స్వచ్ఛందంగా సంతకాలు..

నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ప్రైవేటీకరణ వలన కలిగే అనర్థాలను వివరిస్తూ, అన్ని వర్గాల ప్రజలు తమకు తాముగా సంతకాల ఉద్యమంలో భాగస్వాములు అయ్యేలా ప్రణాళికలు రచించారు. ప్రజలు తమ నిరసన గళాన్ని స్వచ్ఛందంగా సంతకాల రూపంలో వినిపించేలా పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేశారు. ఇప్పటివరకు గుంటూరు రూరల్ మండలంలో సుమారు 8,245, పెదనందిపాడు మండలం 4,416, కాకుమాను మండలం 10,498, ప్రత్తిపాడు మండలం 16,419, వట్టిచెరుకూరు మండలం 3,921, గుంటూరు అర్బన్ మండలం 27,727 కలిపి నియోజకవర్గం మొత్తం మీద సుమారు 71,226 సంతకాల సేకరణ పూర్తి అయింది. చంద్రబాబు ప్రభుత్వం తమకున్న వ్యతిరేకతను ప్రజలు సంతకాల రూపంలో చాటి చెప్పారు.

ప్రత్తిపాడు మండలం ఈదులపాలెంలో కోటి సంతకాల సేకరణ రచ్చబండ

అన్ని వర్గాల మద్దతు

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ఊహించిన దాని కంటే ప్రజల నుంచి అనూహ్య స్పందన కనిపిస్తోంది. ముఖ్యంగా యువత, మహిళలు పెద్ద సంఖ్యలో రచ్చబండ వద్దకు వచ్చి స్వచ్ఛందంగా సంతకాలు చేసి నిరసన తెలుపుతున్నారు. ప్రజాసంఘాలు కూడా సంతకాల ప్రజా ఉద్యమంలో భాగస్వాములు అయ్యాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో ఏకంగా ఏపీకి 17 మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారు. వాటిలో ఐదు కళాశాలలను పూర్తి చేశారు. మిగిలిన కళాశాలలను పూర్తి చేయాల్సిన చంద్రబాబు సర్కారు పీపీపీ పేరుతో వాటిని ప్రైవేటీకరించేందుకు పూనుకోవడం సిగ్గుచేటు. ఈ నిర్ణయంపై చంద్రబాబు ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకూ వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదు.

–బలసాని కిరణ్‌కుమార్,
సమన్వయకర్త, ప్రత్తిపాడు నియోజకవర్గం

భవానీ.. శరణు శరణు

భవానీ దీక్షల విరమణకు తరలివస్తున్న భక్తులు

మహామండపంలో ఉత్సవమూర్తి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లు కొలువైన ఇంద్రకీలాద్రికి భవానీ మాలధారులు తరలివస్తున్నారు. భవానీల రాకతో ఆలయ పరిసరాలు ఎరుపెక్కాయి. మూడో రోజైన శనివారం లక్ష మంది మాలవిరమణ చేశారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. తెల్లవారుజాము రెండు గంటలకు అమ్మవారికి నిత్య పూజల అనంతరం భవానీలను దర్శనానికి అనుమతించారు. చలి తీవ్రత అధికంగా ఉన్నా భవానీలు పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి చేరుకుని దీక్షలు విరమిస్తున్నారు. శనివారం వేకువ జాము రెండు నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు ఆలయానికి భవానీలు భారీగా తరలివచ్చారు. వీఎంసీ కార్యాలయం, సీతమ్మ వారి పాదాల వద్ద ఏర్పాటు చేసిన కంపార్టుమెంట్లు కిటకిటలాడాయి.

సాయంత్రమే అధికం

గిరిప్రదక్షిణ మార్గంలో పగటి వేళ కంటే రాత్రి వేళలోనే భవానీల రద్దీ అధికంగా కనిపిస్తోంది. కుటుంబ సమేతంగా దీక్షల విరమణకు వస్తున్న భవానీలు సాయం సమయంలో ప్రశాంత వాతావరణంలో గిరిప్రదక్షిణ చేసి, తెల్లవారుజామున అమ్మవారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం అవుతున్నారు. వినాయకుడి గుడి నుంచి క్యూలైన్‌లో చేరుకున్న తర్వాత రెండు గంటల్లో అమ్మవారి దర్శనం, ఇరుముడి, హోమ గుండంలో నేతి కొబ్బరి కాయ సమర్పణ, ప్రసాదాల కొనుగోలు పూర్తవుతోందని భవానీలు పేర్కొంటున్నారు. ఉదయం ఆరు గంటల లోపే భవానీలు దీక్షలను పరిపూర్ణం చేసుకుని రైల్వేస్టేషన్, బస్టాండ్‌కు చేరుతున్నారు. విశాఖపట్నం వైపు రత్నాచల్, హైదరాబాద్ వైపు శాతవాహన, చెన్నయ్ వైపు పినాకినీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉదయం ఆరు నుంచి ఆరున్నర గంటల లోపు అందుబాటులో ఉండటం ఇందుకు కారణం.

వ్యాపారుల సమస్యలు తెలుసుకుంటున్న అంబటి, మోదుగుల, బాల వజ్రబాబు, పార్టీ నేతలు

గుంటూరుకు శనిలా పెమ్మసాని

- అహంకారంతో గుంటూరు నగరాన్ని సర్వనాశనం చేస్తున్నారు
- రైల్వే శాఖ అనుమతులు లేకుండా ఓవర్ బ్రిడ్జి ఎలా పడగొట్టారు?
- వ్యాపారులపై దౌర్జన్యం చేసి ఏం చేద్దాం అనుకుంటున్నారు?
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజం
- ఆర్‌యూబీ నిర్మించకుండా ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్నారు
- మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి ఆగ్రహం

పట్నంబజారు: గుంటూరుకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శనిలా పట్టుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. అధికారం ఉందనే గర్వంతో విర్రవీగుతున్నారని మండిపడ్డారు. 'అధికారం ఉంటే నువ్వేమైనా రౌడీవా పెమ్మసాని' అని ప్రశ్నించారు. శనివారం గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ సెంటర్‌లో జరుగుతున్న ఓవర్ బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. తొలుత గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పరిశీలించిన అనంతరం అరండల్‌పేట వైపు వచ్చి పిల్లర్లు, తదితర అంశాలను పరిశీలించారు. స్థానిక వ్యాపారులు తమ గోడును వైఎస్సార్‌సీపీ నేతలకు తెలిపారు. ఫ్లయ్ ఓవర్‌కు అటు, ఇటు 12 అడుగులు వదిలి పెట్టాలని కోర్టు ఆదేశించినప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్పొరేషన్ అధికారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, షాపుల తాళాలు పగులగొడుతున్నారని తెలిపారు. ఖాళీ పేపర్ల మీద సంతకాలు పెట్టాలని ఇబ్బంది పెడుతున్నారని, బాండ్లు ఇస్తామని చెబుతున్నారు తప్ప నష్ట పరిహారంపై మాట్లాడటం లేదన్నారు.

డమ్మీలుగా ముగ్గురు ఎమ్మెల్యేలు

ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో పెమ్మసాని పెత్తనమే కొనసాగుతోందని ఆరోపించారు. నగరంలోని ముగ్గురు ఎమ్మెల్యేలు డమ్మీలు మాత్రమేనని విమర్శించారు. రూ. 90 కోట్లతో అసలు బ్రిడ్జిని ఏవిధంగా నిర్మిస్తారని ప్రశ్నించారు. తాము బ్రిడ్జి నిర్మాణానికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. 2014, 2019 సమయంలో ఆర్ అండ్ బీ మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు, అప్పటి ఎంపీ గల్లా జయదేవ్, పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్న మోదుగుల వేణుగోపాలరెడ్డి రూ. 167 కోట్లతో సింగిల్ పిల్లర్ బ్రిడ్జినిర్మాణంతోపాటు, ఆర్‌యూబీ నిర్మించి నగరానికే మణిహారంలా తీర్చిదిద్దేందుకు ప్రయత్నించారని తెలిపారు. నగరాన్ని సర్వనాశనం చేసేందుకే పెమ్మసాని అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. కనీసం అఖిల పక్ష సమావేశం నిర్వహించకుండా పెద్ద ఇంజినీర్లు చెబుతున్నప్పటికీ ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోవడం సిగ్గుచేటన్నారు. కేవలం సగం బ్రిడ్జి మాత్రమే పడగొట్టారని, కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండా అసలు బ్రిడ్జి ఎలా ప్రారంభిద్దామని అనుకున్నారని ప్రశ్నించారు.

అడ్డగోలుగా పనులు

మాజీ ఎంపీ, ఎన్టీఆర్, పల్నాడు జిల్లా పార్టీ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ శంకర్‌విలాస్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణంపై కనీసం అఖిల పక్ష కమిటీతో చర్చలు లేకుండా ఎలా పనులు ప్రారంభించారని ప్రశ్నించారు. బ్రాడీపేటకు సంబంధించి 14 అడ్డరోడ్డు తెరవకపోవడం పాలకులు, అధికారుల బుద్ధి లేని తనానికి నిదర్శనమన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ అనుమతి లేకుండా బ్రిడ్జి పడగొట్టి, ఆర్‌యూబీ కూడా నిర్మాణం చేపట్టని దుస్థితిలో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రులకు వెళ్లే సమయాల్లో పేదలు ఆటోలోనే మృతి చెందుతున్న పరిస్థితులు ఎంతో బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, గులాం రసూల్, మెట్టు వెంకటప్పారెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి, నందేటి రాజేష్, మామిడి రాము, పఠాన్ అబ్దుల్లా ఖాన్, ఎర్రబాబు, మేడా మురళి, వంగా సీతారామిరెడ్డి, సింగ్ నరసింహారావు, యేటి కోటేశ్వరరావు యాదవ్, బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు ఆచారి, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, కామిరెడ్డి రంగారెడ్డి, అంబేద్కర్, పూనూరి నాగేశ్వరరావు, పోలవరపు వెంకటేశ్వర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆలా కిరణ్, పఠాన్ సైదా ఖాన్, కానూరి శిధర్, బుల్లెట్ సలీం, పిల్లి మేరి, తదితరులు పాల్గొన్నారు.

వెటరన్.. అదిరెన్

పోటీలను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్ తదితరులు

మైదానంలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

ఉత్సాహంగా ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ ఆరంభం

ప్రత్తిపాడు: వెటరన్ క్రీడాకారులు అదరగొట్టారు. వయస్సును లెక్కచేయకుండా మూడు పదుల నుంచి ఏడు పదుల వయసు వరకూ సత్తా చాటారు. ప్రతిభకు ఆసక్తికి వయస్సు అడ్డంకి కాదని నిరూపించారు. పెదనందిపాడు మండలం పాలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 45వ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్ హాజరయ్యారు. జాతీయ పతాకంతోపాటు క్రీడా జెండాను ఎగురవేశారు. అనంతరం క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆయా ర్యాష్ట్రాల క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల్లో భాగంగా తొలిరోజు లాంగ్ జంప్, షాట్ పుట్, 100, 800 మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. అన్ని జిల్లాల నుంచి సుమారు నాలుగు వందల మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి 35 ప్లస్, 40 ప్లస్ , 45 ప్లస్ , 50 ప్లస్ , 55 ప్లస్ , 61 ప్లస్ , 65 ప్లస్, 70 ప్లస్.. ఇలా వయస్సుల వారీగా మహిళలు, పురుషుల విభాగాల్లో పోటీలు జరిగాయి.

విజేతల వివరాలు ఇవీ..

తొలిరోజు విజేతలుగా నిలిచిన వారి వివరాలను ఏపీఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ మంగా వరప్రసాద్, వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ గణేశుని రాంబాబు, జాయింట్ సెక్రటరీ చెన్నుపాటి శివనాగేశ్వరరావులు వెల్లడించారు. షాట్‌పుట్ 30 ప్లస్ మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో వి. సుదీప్తి (కృష్ణా జిల్లా), ద్వితీయ స్థానం ఎ. సావిత్రి (గుంటూరు), 40 ప్లస్ విభాగంలో డి. స్వర్ణవాహిణి (కృష్ణా) ప్రథమ స్థానం, ఆర్. నిర్మల (విశాఖపట్నం) ద్వితీయ స్థానం, 60 ప్లస్ విభాగంలో నెల్లూరు జిల్లాకు చెందిన డాక్టర్ సి. విజయకళ ప్రథమ, కె. పద్మావతి ద్వితీయ స్థానాలు, 65 ప్లస్ విభాగంలో నెల్లూరు జిల్లాకు చెందిన జె. లక్ష్మీ నరసమ్మ ప్రథమ స్థానం సాధించింది. మహిళల 800 మీటర్ల రన్నింగ్ పోటీల్లో 60 ప్లస్ విభాగంలో నెల్లూరు జిల్లాకు చెందిన పి. కోటేశ్వరమ్మ ప్రథమ స్థానం, పి. రాజేశ్వరమ్మ ద్వితీయ స్థానం, 65 ప్లస్ విభాగంలో నెల్లూరుకు చెందిన జె. లక్ష్మీనరసమ్మ ప్రథమ స్థానం సాధించారు. షాట్‌పుట్ 70 ప్లస్ మహిళల విభాగంలో విశాఖపట్నానికి చెందిన బి. వెంకటలక్ష్మి ప్రథమ స్థానం సాధించింది. 100 మీటర్ల పురుషుల పరుగు పందెం 70 ప్లస్ విభాగంలో చిత్తూరు జిల్లాకు చెందిన ధనుంజయ, గుంటూరుకు చెందిన పి. వెంకటప్పయ్య, విశాఖకు చెందిన శంకరరావులు విజయం సాధించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.



లాంగ్ జంప్ పోటీల్లో మహిళ

రన్నింగ్ పోటీల్లో క్రీడాకారుడు

ఆన్‌లైన్‌లో పరిచయం.. రూ. 18 లక్షలకు టోకరా

లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన యువకుడు

తుమ్మల వెంకటేష్‌బాబు

సత్తెనపల్లి: ఫేస్‌బుక్‌లో పరిచయమైన యువతి మాటలు నమ్మి ఓ యువకుడు రూ.18 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో వెలుగు చూసింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి 20వ వార్డుకు చెందిన తుమ్మల వెంకటేష్‌బాబు సెల్ ఫోన్‌కు సంబంధించిన విడిభాగాలు విక్రయిస్తుంటారు. వెంకటేష్‌బాబుకు సెప్టెంబర్ నెలలో ఢిల్లీకి చెందిన సీహెచ్ రుచి అనే యువతి ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. ఇరువురు వాట్సాప్ ద్వారా చాటింగ్, మాట్లాడుకోవటం చేశారు. ఆమె తెలుగులో మాట్లాడటంతో నమ్మాడు. ఢిల్లీలోని వసంత విహార్ ఏరియాలో నివసిస్తున్నానని, ఎలైట్ మాల్ స్టోర్ అండ్ ఈ కామర్స్ ఆన్‌లైన్ వ్యాపారానికి మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు ఆమె చెప్పింది. ఆన్‌లైన్‌లో బంగారం, వెండి, తదితర విలువైన వస్తువులు తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి లాభాలు గడించవచ్చని నమ్మించింది. ఆమె రిఫరల్ ఐడీ లింకు ద్వారా లాగిన్ అయి మొదట ప్రవేశ రుసుము కింద రూ. 40 వేలు కట్టాడు. వివిధ వస్తువుల కొనుగోలు నిమిత్తం నగదు చెల్లించాడు. కొద్ది రోజులకే ధర పెరిగి లాభాటు వచ్చినట్టు చూపారు. గోల్డ్ రింగులు, చైన్లు, బ్రాస్లెట్స్ వంటివి తక్కువ ధరకు ఉన్నట్లు రుచి చెప్పింది. అత్యాశకు పోయిన వెంకటేష్ బాబు మరికొంత డబ్బును యూపీఐ, బ్యాంక్ అకౌంట్ ద్వారా చెల్లించి వస్తువులు కొనుగోలు చేశారు. ఆ నగదు వచ్చేలోపు మరో వస్తువు తక్కువ ధరకు చూపిస్తుండడంతో మొత్తం రూ.18 లక్షలు పెట్టి సామగ్రి కొన్నారు. లాభాలు అధికంగా వచ్చాయని నగదు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. శుక్రవారం రాత్రి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1400 గరిష్ఠం : రూ. 1800

మోడల్ ధర రూ. 1600

క్లుప్తంగా

తెలుగు వరల్డ్ ఆర్టిస్ట్స్ ఆర్ట్ సొసైటీ ప్రదర్శనకు తెనాలి శిల్పాలు

తెనాలి: విజయవాడలోని టీటీడీ కల్యాణ మండపం రోడ్డులో ఆదివారం జరగనున్న తెలుగు వరల్డ్ ఆర్టిస్ట్స్ ఆర్ట్ సొసైటీ 4వ చిత్ర కళా సంతలో తెనాలి శిల్పకళా ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నారు. సొసైటీ కోరికపై తెనాలిలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు ఇందుకు సన్నాహాల్లో ఉన్నారు. ఈ ప్రదర్శనలో భారతరత్న అటల్ బిహారి వాజపేయి, ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా విగ్రహాలతోపాటు స్టైలిష్ స్టీల్‌తో తయారుచేసిన సింహం, పులి, జామెంట్రిక్ షేప్‌తో రూపొందించిన జింక, త్రీడీ టెక్నాలజీతో చేసిన ఎలిఫెంట్ ఫైట్, స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, సెల్ఫ్ మేడ్ పర్సన్ విగ్రహాలను ప్రదర్శిస్తున్నట్టు 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్ష శనివారం విలేకరులకు తెలియజేశారు.

నేడు యూటీఎఫ్ జిల్లా మహాసభలు

చేబ్రోలు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గుంటూరు జిల్లా మహాసభలు ఆదివారం ఉదయం చేబ్రోలులోని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరరావు తెలిపారు. మహాసభ ఏర్పాట్లను శనివారం యూటీఎఫ్ నాయకులు పర్యవేక్షించారు. జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణతో మహాసభలు ప్రారంభం కానున్నాయని, చేబ్రోలు ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభలలో జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని చేబ్రోలు మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ఖాదర్ బాషా, పి పార్థసారధి కోరారు.

ఉపాధ్యాయ క్రీడా పోటీలు ప్రారంభం

నరసరావుపేట: ఉపాధ్యాయుల డివిజన్ స్థాయి క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో 2025–26 విద్యా ఏడాదికి ఆదివారం వరకు కొనసాగనున్నాయి. పోటీలలో పురుషుల ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు లూథరన్ హైస్కూల్ మైదానంలో నిర్వహించగా, మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్ పోటీలు శంకరభారతీపురం జెడ్పీ హైస్కూలులో నిర్వహించారు. టీడీపీ నాయకుడు డాక్టర్ రాంప్రసాద్, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఉపాధ్యాయుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదం చేస్తాయని వారు తెలిపారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే కఠిన చర్యలు

బాపట్లటౌన్: హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా హెల్మెట్ వినియోగంపై శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ హెల్మెట్ బరువు కాదు, అది మీ ప్రాణానికి రక్షణ కవచంలాంటిదన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ ధారణతోపాటు రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన వివరించారు.

మానవుల రక్షణార్థం సిలువపై ఏసు మరణం

ప్రత్యేక ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భాగ్యయ్య తదితరులు

వేడుకల్లో పాల్గొన్న భక్తులు

రోమన్ క్యాథలిక్ మేత్రాసన పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య

గుంటూరు రూరల్: ఏసుక్రీస్తు ఈ భువిలో 2025 సంవత్సరాల క్రితం జన్మించి మానవుల రక్షణార్థమై సిలువపై మరణించెనని గుంటూరు రోమన్ క్యాథలిక్ మేత్రాసన పీఠాధిపతులు డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య తెలిపారు. ఏసుక్రీస్తు మార్గము అనుసరణీయమని పేర్కొన్నారు. గుంటూరు మేత్రాసన పరిధిలో ఏసు క్రీస్తు జయంతి 2025 జూబ్లీ వేడుకలు శనివారం నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. జగద్గురువులు, కీర్తిశేషులు ఫ్రాన్సిస్ పోపు ద్వారా రూపుదిద్దుకుని, ప్రస్తుత రోమన్ క్యాథలిక్ విశ్వ పీఠాధిపతులు లియో పోపు నేతృత్వంలో జూబ్లీ వేడుకలు విశ్వవ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ప్రత్యేక జూబిలీ ప్రార్థన ద్వారా జ్యోతి ప్రజ్వలన చేసి, గుంటూరు పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య వేడుకలను ప్రారంభించారు. అనంతరం జూబ్లీ విశిష్టతను గురించి గురు డాక్టర్ చాట్ల మరియదాసు, క్రీస్తు రాకడ కోసం నిరీక్షణ, ఆశయాలు, లక్ష్యాలు అనే అంశంపై గురు పెంటారెడ్డి రాజారెడ్డి, దేవుని వాక్కు శ్రీసభ జీవన విధానం అనే అంశంపై గురు పూదోట స్టాటన్ తోమాసు వివరించారు. విశ్వాస సంఘాల నిర్మాణం, గురువులు, మఠవాసులు, గృహస్థ క్రైస్తవుల పాత్ర అనే అంశంపై గురు డాక్టర్ గోవింద రాయన్న భక్తులకు వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న క్రీస్తు భక్తులందరికీ భోజన సదుపాయం కల్పించారు. మధ్యాహ్నం ఏసు సభ గురు విద్యార్థులు నిర్వహించిన సంస్కరణ రథసారథి జగద్గురులు ఫ్రాన్సిస్ పోపు జీవిత సందేశ నృత్య, నాటక కళా ప్రదర్శన భక్తులను అలరించింది.

బాల ఏసు నృత్య రూపకం

వైభవంగా దివ్య బలిపూజ

స్వస్థత ప్రార్థనల అనంతరం గుంటూరు మేత్రాసన పీఠాధిపతులు, గుంటూరు మేత్రాసన విశ్రాంత పీఠాధిపతులు మోస్ట్ రెవరెడ్డి డాక్టర్ గాలిబాలిలు ప్రధాన యాజకులుగా, గుంటూరు మేత్రాసనంలోని గురువులందరితో కలిసి జూబ్లీ మహోత్సవ దివ్యబలి పూజను నిర్వహించారు. గురువులు, మఠకన్యలు, విశ్వాసులు 7000 మందికిపైగా పాల్గొన్న కార్యక్రమంలో పీఠాధిపతులు తమ వాక్యోపదేశాన్ని కొనసాగించారు. క్రీస్తు రాక కోసం అనేకమంది నిరీక్షించారన్నారు. ఆయన మనుషావతారంలో ఈ భువిలో జన్మించారన్నారు. గొల్లలు, దేవదూతలు, ముగ్గురు జ్ఞానులు ఆ దివ్య బాల ఏసుని కనుగొని ఆరాధించి, స్తుతించి కానుకలు సమర్పించారని వివరించారు. మనమందరం దివ్య ఏసు రెండో రాక కోసం నిరీక్షించి, క్రీస్తు ప్రభువు చూపించిన మార్గంలో నడిచి, పాప క్షమాపణ పొందాలని తెలిపారు. నూతన జీవితం ద్వారా ఆ దేవదేవుని కృపావరాలకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. జూ బ్లీ వేడుకలకు గురు డాక్టర్ గోవిందు రాయన్న, గురు పెంటారెడ్డి రాజారెడ్డి కోర్ కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. మహోత్సవానికి సహకరించిన లయోలా పబ్లిక్ స్కూల్ యాజమాన్యాని కి, అధ్యాపకులకు, అధ్యాపకేతర బృందానికి, గురువులకు, సిస్టర్స్‌కు, సకల విశ్వాసులకు గురు డాక్టర్ గోవిందు రాయన్న అభినందనలు తెలిపారు.

మహిళల్లో మౌనం బలహీనత కాకూడదు

- కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- తుళ్లూరులో ఘనంగా నయీ చేతన 4.0 కార్యక్రమం
- పాల్గొన్న రాష్ట్ర హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ప్రమాణం చేయిస్తున్న మంత్రులు పెమ్మసాని, అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే తదితరులు

తాడికొండ: మహిళల్లో మౌనం బలహీనత కాకూడదని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. లింగ సమానత్వ జాతీయ ప్రచార కార్యక్రమం నయీ చేతన 4.0 కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ సెర్ప్ సంయుక్తంగా తుళ్లూరు మేరీమాత హైస్కూలులో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీఆర్‌డీఏ స్కిల్ హబ్ భవనంలో జెండర్ రిసోర్స్ సెంటర్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ప్రదర్శన శాలలను మంత్రులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మంత్రి డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ మహిళల్లో వివక్ష తగ్గించడమే నయీ చేతన 4.0 కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సమాజంలో బాల్య వివాహాలు, గృహ హింస, లింగ వివక్ష వంటి దుర్గుణాలు ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలో 4.50 లక్షల గృహ హింస కేసులు నమోదు అయ్యాయని గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. ప్రతి ముగ్గురిలో ఒక మహిళ వివక్షకు గురౌతున్నట్లు అంచనా ఉన్నప్పటికీ అన్ని కేసులు నమోదు కావడం లేదని, ఇందుకు పరువు ప్రతిష్ట కోసం ఆలోచించడం కారణమన్నారు. అందుకే నయీ చేతన కార్యక్రమాన్ని 2021 సంవత్సరంలో శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ మహిళలు రాణిస్తున్నారన్నారు. లింగ సమానత్వం వంట గది నుంచి ప్రారంభం కావాలని, అప్పుడే మహిళలు శారీరకంగా, మానసికంగా ధైర్యంగా, స్థైర్యంగా ఉండగలరన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ సూర్యకుమారి మాట్లాడారు. జెండర్ చాంపియన్‌లు చలివేంద్రి సుగంధ, తురకా శ్యామల మాట్లాడారు. జెండర్ చాంపియన్‌లను మంత్రులు సత్కరించారు. అనంతరం లింగ సమానత్వం కోసం అవగాహన కల్పిస్తూ లఘు నాటికను ప్రదర్శించారు. లింగ సమానత్వంపై అవగాహన కరదీపికను విడుదల చేసి సెల్ఫీ తీసుకున్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ ఉచిత వైద్య శిబిరం, మిషన్ శక్తి కార్యక్రమంలో ఐసీడీఎస్, శక్తి టీమ్‌పై జిల్లా పోలీస్ శాఖ, మహిళా సాధికారతపై ..., విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్, గ్రామీణ యువతకు డీడీయు జీకేవై 2.0 ద్వారా శిక్షణ కార్యక్రమాలు, సీడాప్–డీఆర్‌డీఏ, స్వయం సహాయక సంఘాల వ్యాపార ఉత్పత్తుల విక్రయాలు, ప్రదర్శన శాలలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వాకాటి కరుణ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సెర్ప్ సంచాలకులు శివ శంకర్ ప్రసాద్, డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జి ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతిబసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయి కుమార్, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

యర్రబాలెంలో స్పటిక రాళ్లు చోరీ

- బీభత్సం సృష్టించిన గుర్తు తెలియని వ్యక్తులు
- వాచ్‌మెన్‌ను బంధించి రూ. 5 లక్షల విలువైన రాళ్లు అపహరణ

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని యర్రబాలెంలో క్రిస్టల్స్ (స్పటిక రాళ్లు) చోరీకి గురైన ఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. యర్రబాలెం - పెనుమాక రహదారిలో కొన్నేళ్లుగా పలువురు భాగస్వామ్యంతో క్రిస్టల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున రెండు గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు బీభత్సం సృష్టించారు. నెంబరు ప్లేట్లు లేని మూడు కార్లలో వచ్చి వాచ్‌మెన్ కుటుంబాన్ని బెదిరించి, తాళ్లతో బంధించారు. కేకలు వేయకుండా నోటికి ప్లాస్టిక్ స్టిక్కర్లు అతికించారు. అనంతరం గోడౌన్ షట్టర్ తాళాన్ని కటింగ్ మిషన్‌తో కట్ చేసి, సీసీ కెమెరాల కనెక్షన్లను సైతం తొలగించారు. గోడౌన్‌లోకి ప్రవేశించి కొన్ని క్రిస్టల్స్‌ను గోతాల్లో నింపుకుని, వారు వచ్చిన కార్లలో వేసుకుని పరారయ్యారు. అపహరణకు గురైన క్రిస్టల్స్ విలువ 5 లక్షల రూపాయలు విలువ చేస్తుందని సమాచారం.

ముందుగానే చోరీకి వ్యూహం

దుండగులు పక్కా వ్యూహంతోనే చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. రెండు నెలల కిందట ఇదే విధంగా గుర్తు తెలియని వ్యక్తులు క్రిస్టల్స్ చోరీకి యత్నించారు. గోడౌన్ బయట వున్న కెమెరాల కనెక్షన్ కూడా కత్తిరించారు. గమనించిన వాచ్‌మన్ కుటుంబీకులు పెద్దగా కేకలు వేయడంతో పారిపోయే క్రమంలో వాకీటాకీని జారవిడుచుకున్నారు. అప్పట్లో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసి, దుండగులు వదిలి వెళ్లిన వాకీటాకీని సైతం పోలీసులకు అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ బ్రహ్మం, ఎస్ఐ వెంకట్

విభేదాలే కారణమా?

నలుగురు భాగస్వాములు ఈ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వారి మధ్య విభేదాల కారణంగానే ఈ చోరీ జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నలుగురిలో ఒక భాగస్వామి వేరే ప్రాంతంలో క్రిస్టల్స్ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. ఆయనే ఈ ముఠాను పంపి బీభత్సం సృష్టించడంతో పాటు దొంగిలించుకుపోయారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చోరీకి జరిగిన తీరులో కొంత భాగం కెమెరాల్లో నమోదైంది. గోడౌన్ లోపలికి ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించిన ప్రవేశించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. వారిలో ఒక వ్యక్తి గతంలో ఇదే గోడౌన్‌కు వచ్చాడని, వాచ్‌మేన్ కుటుంబ సభ్యులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన రూరల్ పోలీసులు

ఘటనపై మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం రావడంతో శనివారం ఉదయం గోడౌన్‌ను సీఐ ఎ.వి. బ్రహ్మం, ఎస్ఐ వెంకట్ సిబ్బందితో పరిశీలించారు. లోపల, బయట పరిశీలించి కొన్ని ఆధారాలు సేకరించి, దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

ఏపీఆర్‌జేసీలో ఘనంగా స్వర్ణోత్సవాలు

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల నాగార్జునసాగర్ పరివార్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైమ్యాట్ డైరెక్టర్, ఏపీఆర్ఈఐ కార్యదర్శి వి.ఎన్. మస్తానయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. రెండు రోజులుపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గురు సత్కారం జరిగింది. 1975వ సంవత్సరం నుంచి ప్రస్తుతం అధ్యాపకులుగా ఉన్న 118 మందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్.సరోజిని మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్, ఆర్ఎస్ఐ, ఎఫ్ఎస్ వంటి ఉన్నత ఉద్యోగులుగా, వివిధ రంగాలలో ఉన్నతులుగా చేసిన కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పని చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. గురువుల గౌరవం మసకబారుతున్న ఈ తరుణంలో దాన్నిసజీవంగా ఉంచి, గురుభక్తిని చాటుకుని కళాశాల పూర్వ విద్యార్థులు ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమాన్ని ఏపీఆర్‌జేసీ పూర్వ విద్యార్థులు ఎ.సైదారెడ్డి, ఎస్.నాగచారి, కె.వీరనంది, చక్రపాణి, జి.గోపాలరావులు నిర్వహించారు. తెలంగాణ విశ్రాంత డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి, తెలంగాణ ఐజీ రమేష్‌రెడ్డి, ఐఏఎస్ అధికారి కె.వెంకటేశం, ఐఎఫ్ఎస్ అంబాసిడర్ సీహెచ్ రాజశేఖర్, పూర్వ విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న రిటైర్డ్ డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్, కలైపట్టు పోటీలు ప్రారంభం

పెదకాకాని: విద్యార్థులంతా క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చుక్కా కొండయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి కలైపట్టు, ఫెన్సింగ్ పోటీలు గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆధునిక నర్సింగ్ హోం డాక్టర్ వీర్నల ప్రత్యూష్ మాట్లాడుతూ క్రీడల ద్వారా దేహదారుఢ్యం, స్నేహ సంబంధాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చెప్పారు. కలైపట్టు అండర్– 17 బాలబాలికల విభాగాల్లో 60 మంది పాల్గొన్నారన్నారు. ఫెన్సింగ్ అండర్– 17, అండర్– 19 బాలబాలికల విభాగాల్లో పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. 360 మంది క్రీడాకారులు హాజరు పోటీలకు రాష్ట్రస్థాయిలో 13 జిల్లాల నుంచి సుమారు 360 మంది క్రీడాకారులు హాజరయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీలు ఎం. గోపి, కె. నాగశిరీష ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ శిల్ప సిందూర, పర్యవేక్షకులు మోహనలక్ష్మి, వ్యాయామోపాధ్యాయుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి. లక్ష్మీపతి, పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

పోటీల్లో విజేతలను ప్రకటిస్తున్న పీఈటీలు

ఘనంగా ముగిసిన విజ్ఞాన్ బాలోత్సవ్

- జోనల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు
- హాజరైన ఎంపీ లావు, ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట రూరల్: విద్యార్థులు బాల్యం నుంచే విభిన్నంగా ఆలోచించే దృక్పథాన్ని అలవరచుకోవాలని ఎంపీ, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని డీఎస్ఏ స్టేడియంలో రెండు రోజులపాటు నిర్వహించిన విజ్ఞాన్ బాల మహోత్సవ్ జోనల్ ఆటల పోటీలు శనివారం ముగిశాయి. ఎంపీ లావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రియేటివిటీ, ఇన్నోవేషన్, విభిన్న ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఇండోర్ గేమ్, అవుట్ డోర్ గేమ్, వ్యక్తిగత హాబీ వంటి మూడు వ్యాపకాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. మూడు వ్యాపకాలను పాటిస్తే విద్యార్థులు కోరుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలుగుతారని వివరించారు. జీవితంలో ఎప్పుడూ సెల్ఫ్ రెస్పెక్ట్, ఇంటిగ్రిటి విషయంలో రాజీపడకూడదని, తల్లిదండ్రులు గర్వపడేలా మన పనులు ఉండాలని హితవు పలికారు. దేశం యువతపై ఆశలు పెట్టుకుందని, మీ జీవిత కథలో మీరే హీరోలుగా మారాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇటువంటి ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా సమాజంలో ఎలా మెలగాలి, ఎలా పనిచేయాలో తెలుస్తుందన్నారు. బాల మహోత్సవ్‌లో భాగంగా బాలబాలికలకు వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, 100 మీటర్లు, 800 మీటర్లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎంపీ లావు

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ జిల్లా కేంద్రం నరసరావుపేటలో బైపాస్ రోడ్డుకు దగ్గరగా అతి తక్కువ ధరకు ఇంటి స్థలాలు లభించును. వివరాలకు: 73869 48543

■ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజ మరెక్కడైనా ప్లాట్స్ అ/కొ. సంప్ర॥ జనచైతన్య ప్లాట్స్ మా ప్రత్యేకత. 9492770739

FLAT FOR SALE

■ గుంటూరు, ఇన్నర్ రింగ్ రోడ్డు - అగతవరప్పాడు రోడ్డు, భాష్యం రామసేతు క్యాంపస్ దగ్గర SSS స్వగృహ అపార్ట్‌మెంట్ లోని కొత్త 3BHK ఫ్లాట్ నెం.504 (1525 చ॥అ॥ల) అమ్మకమునకు కలదు. ✆ 94406 44248

■ మాచర్ల, శ్రీశైలం రోడ్, అఖిల టవర్స్ 3వ ఫ్లోర్‌లో 1250 చ.అ.ల డబుల్‌బెడ్ రూమ్ ఫ్లాట్ SBI వేలం ద్వారా అమ్మకం రిజర్వు ధర: 25 లక్షలు. 99663 93649

■ 1650 Sft East Facing 3 BHK Apartment All Facilities Chandramouli Nagar. Phone: 7989324772

HOUSE FOR SALE

■ కొల్లిపర గ్రామం, ఆలపాటి రాజా కళ్యాణ మండపం దగ్గరలో 225 స్థలం అందు గల ఇల్లు SBI వేలం ద్వారా అమ్మకం రిజర్వు ధర: 17.5 లక్షలు. 96030 61724

LAND FOR SALE

■ గుంటూరు, రైలుపేట 3 వంతెనలకు దగ్గర తలపకట్టే బిర్యానీ పాయింట్ దగ్గర తూర్పు ఫేసింగ్ 105 గజాల, అన్ని వ్యాపారాలకు అనుకూలమైన ఖాళీ స్థలము అమ్మకమునకు కలదు. సంప్రదించండి. ✆ 94406 44248

OLD BUILDINGS

■ పాత బిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకుల షెడ్‌లు పగలగొట్టబడును. పాత కలప, కిటికీలు, పాత ఐరన్ కొనబడును. సంప్ర॥ 9703290782, 9700442419

PLOT FOR SALE

■ గుంటూరు ఆటోనగర్లో 200 గజాలు 500 గజాలు, 800 గజాలు ప్లాట్స్ అమ్మబడును. సంప్రదించవలసిన ఫోన్ : రమేష్ 94403 51174

TOLET

■ మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ ఫేస్-1 లో (2రోడ్ కార్నర్ బిట్) 1st ఫ్లోర్ 2 షాప్స్ అద్దెకు ఇవ్వబడును. Just bake (పైన) గోరంట్ల. సెల్: 86393 56174

SERVICES

AGRI BUSINESS

■ Lab (Cross Breed) Male Dog సంవత్సరం వయస్సు కలది ఉంది. పెంచుకునే ఆసక్తి గల వారికి ఉచితంగా ఇవ్వబడును.నూతక్కి ✆ 9885081746

BOREWELLS

■ విజయ బోర్‌వెల్స్: 4-1/2, 6-1/2, 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ నరసమైన ధరలకు వేయబడును. గుంటూరు. సంప్ర॥ 9866222717, 9848183887

WANTED

■ స్వచ్ఛ విద్యాలయంలో పనిచేయుటకు మండలాల వారీగా స్టాఫ్ కావలెను. (మేనేజర్లు, ఫీల్డ్‌స్టాఫ్, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, స్వీపర్లు) 91826 31699

■ తెనాలి సూర్య సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్ నందు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ & బ్రాంచ్ మేనేజర్ కావలెను. M/F జీతం: TA+30000/- ✆ 88869 73753

■ గుంటూరు కొత్తపేట ఇంటి వద్ద పని చేయుటకు వాచ్‌మెన్ కావలెను. భార్యాభర్తలకు ప్రాధాన్యత. వసతి కలదు. సంప్ర: 9866132826, 9441121025

■ మిర్చి ఎక్స్‌పోర్ట్ వర్క నందు పని చేయుటకు అనుభవం కలిగిన బయ్యర్స్ & అకౌంటెంట్స్ మరియు గుమస్తాలు కావలెను. ఫోన్: 96761 55535

■ డ్రైవర్ కావలెను: హెవి వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన గుంటూరు లోకల్ డ్రైవర్ కున్న స్కూల్ వ్యాను నడుపుటకు కావలెను. ✆ 94406 44248

■ గుంటూరు మరియు నరసరావుపేట లోని ప్రముఖ అడ్వకేట్ ఆఫీస్ నందు Legal Opinions టైపు చేయుటకు అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. 93469 83822

■ కేర్‌టేకర్ కావలెను. గుంటూరులో ఇంట్లోనే ఉండి పెద్ద వయస్సు గల మగవారిని చూసుకోవలెను. ఏ బాదరాబందీ లేకుండా ఉన్న మగవారు మాత్రమే కావలెను. 10వ తరగతి చదివి ఉండవలెను. జీతము: నెలకు 12000/- రూ॥లు, సంవత్సరమునకు బోనస్: 40000/- రూ॥లు మరియు భోజనం, వసతి కల్పించబడును. వివరములకు ఫోన్ నెంబర్: 90102 99252

■ Wanted Accounts Executive to work a reputed company at vijayawada. Minimum. 2 to 3 years experience in tally. Contact Number : 91333 99257

■ గుంటూరు శ్యామలనగర్‌లోని డాక్టర్ గారి ఇంట్లో పనిచేయుటకు భార్య భర్తలు కావలెను. ఉచిత వసతి కలదు. సం: 8019559657, 9398281363, 9133430333.

■ Web designing, మల్టీమీడియా, యూట్యూబ్ వీడియో వర్క్ పనిచేయుటకు ఎడిటింగ్ తెలిసిన వ్యక్తి హాస్పిటల్లో కావలెను. యుద్రాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్తపేట, గుంటూరు. సం : 8019559657, 9949125425, 9133430333.

■ Wanted Accountants to Work in Audit Office having Knowledge in Tally. GST Contact Numbers: 89780 21054

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీ నందు హాస్టల్ ఇన్‌ఛార్జిస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 33372

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జిస్, క్లాస్ ఇన్‌ఛార్జిస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ మరియు పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ తెనాలి దగ్గర, దుగ్గిరాలలో ప్రముఖ కాఫీ పరిశ్రమకు ASO (Ex. Service Man & Civil), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సంప్రదించండి ✆ 80961 61777, 70939 24466

■ విజయవాడలో A/C Rental Events కంపెనీ కి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీ షియన్స్ కావలెను. జీతం: 20-25,000/- భో + వసతి + ఫ్రీ ట్రైనింగ్. ✆ 76808 06109, 99660 44671

■ గుంటూరులోని హాస్పిటల్ నందు ANM, GNM M/F నర్సింగ్ స్టాఫ్ మరియు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. వసతి కలదు. ✆ 91339 19291

■ గుంటూరు ఆయుర్వేదిక్ హాస్పటల్లో పని చేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. 10వ తరగతి పాస్, జీతం: 15,000 వరకు + బోనస్. సంప్ర॥ 9440870099

■ గాయత్రి ఓల్డేజ్ హోమ్, ఇండ్లలో వృద్ధులు /పేషంట్లుసేవ, ఇంటి/ వంటపని, బేబీ కేర్ కొరకు వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు ✆ 92907 95581, 72071 37329

■ విశ్వశాంతి ట్రస్ట్, VJA. సేవ/డ్యూటీ చేయుటకు టెలికాలర్స్, వాలంటీర్స్, అన్ని రకాల స్టాఫ్ కావలెను. భో+వ+ జీతము. 9491821122, 9949021122

■ మా ఆఫీసు నందు పనిచేయుటకు టాలీ అకౌంటెంట్స్, సివిల్ డిప్లొమా ఇంజనీర్స్, కారు డ్రైవర్స్, ఆఫీస్‌బాయ్స్, ఆఫీస్‌బాయ్స్ GNTలో నివసించే వారు మాత్రమే. 9985268300, 9394107300

■ గుంటూరులోని ప్రముఖ హోటల్ వారికి డిగ్రీ అర్హత కలిగిన ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, హౌస్ కీపింగ్, రూమ్ సర్వీస్ బాయ్స్ కావలెను. అర్హత: అనుభవమును బట్టి జీతం. సంప్ర॥ 9704300575 email:rcrorchid@gmail.com

■ SHO కు MLT, DMLT, BSc-MLT, ANM, GNM లు కావలెను. జీతం: 8-10వేలు, సం॥ SHO 2/1 బ్రాడీపేట, గుంటూరు. 9848391212

■ Wanted Experienced Lady Tele caller cum Computer Operater for Education Consultancy in Guntur, Lakshmipuram. Sal: 15k to 20K, Qua: Degree. 9052975353

■ శ్రీ ఇన్‌ఫ్రా రియల్‌ఎస్టేట్ గుంటూరు నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎంప్లాయిస్ కావలెను. అర్హత: 7th-10th, జీతం: పార్ట్‌టైమ్- 6000/-, ఫుల్‌టైమ్-13000/-+ఇన్సెంటివ్. 9908686363

■ సె॥ గార్డ్స్ అమరావతి కొత్త CRDA ప్రాంతంలో 12 గం కావలెను. వ: 45 Q: 10 P/F, జీ: 17 వేలు + PF, ESI. సంప్ర: 94903 80213, 94902 48039

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్, ఇండ్లలో వృద్ధులు /పేషంట్లు సేవ, ఇంటి/ వంటపని, బేబీ కేర్ కొరకు వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ✆ 90631 72246, 96525 31847

■ గుంటూరు మరియు నరసరావు పేటలో బ్యాంక్ వాల్యూయర్స్ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు DCE క్యాండిడేట్స్ కావలెను. Send Your Resume. ఫోన్: 95057 99599

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మందడి పరిసర ప్రాంతాలలో మంచిర్యాల మండలం, పల్నాడు జిల్లా, గుంటూరు. ఫోన్ : 90000 40439

■ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్ ఏజ్ 22-35 ఫ్రెషర్స్ కూడా కావలెను. Ph : 6281037879

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

గుంటూరు 7075167663 7075167541

గమనిక: సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు పరిశీలించి పాఠకులు సరైన నిర్ణయం తీసుకోవాలి. బ్యాంకు ఖాతాల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని చింతిక్రింది కనకయ్య పాఠశాలలో శనివారం నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మంగళగిరి మండల వ్యాప్తంగా 195 మంది ఐదో తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 71 మంది పరీక్షలకు హాజరు కాలేదు. మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయ ఉపాధ్యాయులు రాధాకృష్ణ సెంటర్ లెవల్ అబ్జర్వర్‌గా, మంగళగిరి మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సంగినేని శ్రీనివాసరావు చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష సజావుగా జరిగినట్లు వారు తెలియజేశారు.

అండర్ పాస్ వద్ద నిల్వ నీటితో అవస్థలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం రైల్వే అండర్ పాస్ వద్ద నీరు నిలిచి పోవడంతో గ్రామస్తులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. నాలుగు రోజులుగా కాలువల నుంచి నీరు అండర్ పాస్ వద్ద మోకాళ్ల లోతున నిలిచి పోతోంది. వెంటనే నీరు తొలగించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజీయే రాజ మార్గం

లోక్ అదాలత్‌లో 1800 పైగా కేసులు రాజీ

మంగళగిరి టౌన్ : రాజీయే రాజమార్గమని మంగళగిరి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఇష్రత్ ఫాతిమా అన్నారు. మంగళగిరి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి మహమ్మద్ ఇష్రత్ ఫాతిమా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగడం వల్ల సమయం వృథా అవుతుందని తెలిపారు. కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ అదాలత్ ఏర్పాటు చేశారని వివరించారు. కేసుల పెండింగ్ తగ్గించేందుకు కక్షిదారులు నిత్యం వాయిదాలకు తిరగకుండా రాజీ పడ దగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. సురేష్‌బాబు మాట్లాడుతూ న్యాయవాదులు కూడా కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు పరిష్కరించుకునేలా కృషి చేయాలని చెప్పారు. ఈ అదాలత్‌లో 1800 పైగా కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు హేమంత లక్ష్మి, రమణకుమార్, మురళీకృష్ణ, పలువురు న్యాయవాదులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

మంగళగిరి టౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయిన ఘటన మంగళగిరి మండలంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా, జొన్నలగడ్డ గ్రామానికి చెందిన రాయపూడి వినయ్ కుమార్ (42), దాసరి సాల్మన్, బురదగుంట శ్రీను ముగ్గురూ వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పని నిమిత్తం ఈనెల 9వ తేదీన వ్యాన్‌లో తణుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో తణుకు నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మరో అరగంట వ్యవధిలో తమ గ్రామానికి చేరుకునేలోపు అనుకోని ఘటన చోటుచేసుకుంది. మంగళగిరి మండలం కాజ గ్రామ టోల్‌గేటు సమీపంలోకి వచ్చే సరికి రోడ్డు పక్కనే ఆగివున్న లారీని వారు ప్రయాణిస్తున్న వాహనం ఢీకొట్టింది. డ్రైవర్ పక్కనే కూర్చున్న రాయపూడి వినయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ దాసరి సాల్మన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. వెనుక సీటులో వున్న బురదగుంట శ్రీను స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన సాల్మన్‌ను గుంటూరులోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. వినయ్‌కుమార్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలకు తరలించారు. మృతుడు అన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆగి ఉన్న లారీకి సంబంధించిన వారు ఘటన జరిగిన మరుక్షణమే పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు.

జగనన్న జన్మదిన వేడుకలకు సిద్ధం కావాలి

మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో మాట్లాడుతున్న డీవీఆర్

తాడేపల్లి పార్టీ కార్యాలయంలో..

- నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి
- పార్టీ శ్రేణులకు పిలుపు

మంగళగిరి టౌన్ / తాడేపల్లి రూరల్ : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడులకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) పిలుపునిచ్చారు. మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరు నియోజకవర్గ కార్యాలయంలో, తాడేపల్లి పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పార్టీ మహిళా నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 21న జగన్న జన్మదిన వేడుకల్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని మహిళలు వేడుకలకు సమాయత్తం కావాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళా నాయకులు మాట్లాడుతూ అక్కాచెల్లెమ్మల సంక్షేమమే ఊపిరిగా, ప్రతి మహిళ, ఆడబిడ్డకు ప్రయోజనం చేకూర్చేలా అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో వారికి అండగా నిలిచిన నాయకుడు జగనన్న మాత్రమేనని తెలిపారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేసిన చరిత్ర జగనన్నదని కొనియాడారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని, వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే తమ కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మంగళగిరి, తాడేపల్లి పట్టణ, మండలాల మహిళా అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

విశాఖలో నెలాఖరు నుంచి సీఐటీయూ మహాసభలు

తాడేపల్లి రూరల్: విశాఖలో ఈనెల 31 నుంచి జనవరి 4వరకు జరగనున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ గుంటూరు జిల్లా నాయకులు ఎం. రవి మున్సిపల్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో లక్షలాది మంది కార్మికులతో మహా ర్యాలీ, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. మహాసభల నేపథ్యంలో రాజధానిలోని కార్మికవాడల్లో డిసెంబర్ 15వ తేదీన సీఐటీయూ పతాకావిష్కరణ చేపడుతున్నట్లు ప్రకటించారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం లేబర్‌కోడ్‌ల పేరుతో కాలరాస్తోందని మండిపడ్డారు. లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునే వరకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శాంతకుమారి, బాబు, యూనియన్ నాయకులు ఆర్. వేణు, నారాయణ, స్వర్ణకుమారి, మేరి, సహాయం, సుందరరావు, కుశాలరావు, వి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న రవి

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న బాల వజ్రబాబు

తాడికొండ: మండలంలోని లాం గ్రామంలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి బాధిత షేక్ జబీర్ కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రేకుల షెడ్డు కూలి ఇబ్బందులు పడుతున్నారని, పక్కా గృహం కోసం రుణం మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వంగా పోలారెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు షేక్ సలీమ్, వివిధ విభాగాల నాయకులు షేక్ మీర్జావలి, షేక్ అజీస్, షేక్ షాజహాన్, షేక్ నెమలికల్లు సుభాని, షేక్ వలీ, షేక్ నైలో సుభాని, రాయపూడి సాగర్ బాబు, షేక్ మస్తాన్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై జాగ్రత్త అవసరం

అవగాహన కల్పిస్తున్న రామనాథం

మంగళగిరి టౌన్: స్క్రబ్ టైఫస్ వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలని, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని డెప్యూటీ డైరెక్టర్ రామనాథం తెలిపారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం సీజనల్ వ్యాధులు, స్క్రబ్ టైఫస్ వైరస్‌పై యూపీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డెప్యూటీ డైరెక్టర్ రామనాథం ముఖ్య అతిథిగా హాజరై స్క్రబ్ టైఫస్ వైరస్ గురించి వివరించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై సిబ్బందికి సూచనలతో పాటు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధికి పూర్తి చికిత్స అందుబాటులో ఉందని, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్క్రబ్ టైఫస్ సోకిన ఆరు నుంచి 10 రోజుల్లో వ్యాధి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయన్నారు. ప్రధానంగా జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వణుకు, బలహీనత, చర్మంపై దద్దుర్లు, కీటకం కుట్టిన ప్రదేశంలో చర్మం నల్లగా మారడం వంటి లక్షణాలు కనబడతాయని తెలిపారు. సమయానికి వైద్య సహాయం తీసుకోవడం తప్పనిసరని చెప్పారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, వైద్యాధికారులు డాక్టర్ అనూష, మెబీనా,సతీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర

సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ

కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

తాడేపల్లి రూరల్ : విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక ప్రాత పోషిస్తారని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో శనివారం అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఎబిఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యాస వర్గ (స్టేట్ ఫ్యాకల్టీ ట్రైనింగ్)– 2025 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగంలో ఉపాధ్యాయుని పాత్ర గురుతరమైనదని స్పష్టం చేశారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడి పాత్ర తరగతి నుంచి మొదలవుతుందని తెలిపారు. ప్రాచీన గురు శిష్యవిధానం ఎప్పటికీ అనుసరణీయమని, విశేషమైనదని అన్నారు. భారత్ అంటే సూర్యకాంతి, జ్ఞాన కాంతిల సమ్మేళనం అని పేర్కొన్నారు. తర్కం, మీమాంస భారతీయ తత్వంలో ఇమిడి ఉన్నాయన్నారు. మాతృభాషను వాడుక భాషగా అలవర్చుకోవడం ఆవశ్యకమని స్పష్టం చేశారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యదర్శి గంత లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అగ్రగామి ఉపాధ్యాయ సంస్థ అని తెలిపారు. భారతదేశంలో ప్రాథమిక దశ నుంచి ఉన్నత విద్యా సంస్థల వరకు 15 లక్షల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశాన్ని విశ్వగురువుగా మార్చడంలో విద్యావ్యవస్థ, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. కార్యక్రమానికి ఉన్నత విద్యా సంస్థల నుంచి 200 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రోచాన్సలర్ రాజశేఖరరావు, ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం , డాక్టర్ సంధ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాదవ భవన్‌కు స్థలాన్ని కేటాయించాలి

మంగళగిరి టౌన్: అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రధాన నియోజకవర్గమైన మంగళగిరిలో యాదవ భవన్‌కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని, కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని అమరావతి రాజధాని ప్రాంత యాదవ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని యాదవ సంఘం కార్యాలయంలో శనివారం సంఘ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో జనవరి 23న మంగళగిరిలోని అంబేడ్కర్ బొమ్మ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అమరావతి రాజధాని ప్రాంత యాదవ సంఘం అధ్యక్షులు తోట శివరామప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యావవ సంఘం అధ్యక్షులు కుర్రా శ్రీనివాస్, అఖిల భారత యాదవ మహా సంఘం రాష్ట్ర సెక్రటరీ తులసీ రామ్, మంగళగిరి నియోజకవర్గ యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కరించడంలో యాజమాన్యం ఇప్పటికైనా స్పందించాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కొర్రపాటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానంద పురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ గత 375 రోజులుగా కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని, యాజమాన్యం గానీ ప్రభుత్వం గానీ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. కార్మికులకు వయసు మీద పడి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బూరుగ అంకయ్య, ఏనుగుల రమాదేవి, శారద, రమణమ్మ, లక్ష్మి, సువర్ణకుమారి, నాగమల్లేశ్వరి, కార్మికులు తుపాకుల నాగేశ్వరరావు, సుభాని, గురవయ్య, డి. నాగేశ్వరరావు, శారమ్మ, కనకదుర్గమ్మ, శివకుమారి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు పునాది

మంత్రి నారా లోకేష్

మంగళగిరి టౌన్: విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు పునాదులు వేసుకుని ఉన్నత శిఖరాలకు చేరకోవాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని డాన్ బాస్కో ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత శిలా ఫలకాన్ని ఆవిష్కరించి, నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. డాన్ బాస్కో ప్రేమ్‌నివాస్ పాఠశాల వ్యవస్థాపకులు రెవరెండ్ ఫాదర్ థోమస్ చిన్నప్ప విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లోకేష్ మాట్లాడుతూ ప్రేమతో గొప్ప సేవా కార్యక్రమాలు చేపడుతున్న డాన్ బాస్కో ప్రేమ్ నివాసానికి గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగులకు అండగా నిలబడాలనే లక్ష్యంతో డాన్‌బాస్కో పాఠశాలను ప్రారంభించారని, వ్యక్తిగతంగా తాను అండగా ఉండి సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. అనంతరం జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని అలరించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినులు

మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

లైంగిక దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలి

అవగాహన కల్పిస్తున్న సిస్టర్ విద్య

తాడేపల్లి రూరల్ : లైంగిక దాడులను బాలికలు ధైర్యంగా ఎదుర్కోవాలని సిస్టర్ విద్య తెలిపారు. బాలికలపై జరిగే లైంగిక దాడులపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ విద్య బాలికలపై లైంగిక దాడులు, బాల్య వివాహాలు, బాలల హక్కుల గురించి తెలియజేశారు. బాలికలకు ఎదురయ్యే సమస్యలను స్వయంగా పరిష్కరించుకునే విధానాన్ని సూచించారు. తాడేపల్లి మండలంలోని పది గ్రామాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం, బడి ఈడు పిల్లలు ఎవరూ బడి బయట ఉండకూదనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. ప్రాజెక్ట్ కో– ఆర్డినేటర్ అనూష మాట్లాడుతూ గ్రామ పెద్దలతో ఏర్పాటు చేసిన వీసీపీపీ కమిటీల వల్ల పిల్లలకు భరోసా, నమ్మకం కలుగుతోందని తెలిపారు. ప్రతి ముగ్గురు పిల్లలో ఇద్దరు శ్రమదోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. కుటుంబపరంగా శ్రమ దోపిడీకి గురవుతున్న పిల్లల్లో 88.60 శాతం తల్లిదండ్రుల ద్వారానే అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు, ఇశ్రాయేల్, మహాత్మాగాంధీ బాలల పార్లమెంట్, తేజ బాలల పార్లమెంట్, ఏపీజె అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ చిన్నారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ వీరాంజనేయులు

మంగళగిరి టౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంగళగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జి. వీరాంజనేయులు సూచించారు. పట్టణ పరిధిలోని టిప్పర్ల బజారులో గల నేషనల్ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో శనివారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత బానిసలై, జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తం చేయాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్తు ప్రశ్నార్థంగా మారే అవకాశం ఉందని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలు అమ్మినా, కొనుగోలు చేసినా శిక్షలు తప్పవని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, వివరాలు ఇచ్చిన వ్యక్తుల గురించి గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.రవికుమార్, ఎయిమ్స్ వైద్యశాల సైక్రియాట్రిస్ట్ డాక్టర్ చైతన్య, కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.

వైభవంగా అన్నమయ్య గళార్చన

నగరంపాలెం: కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిపై తాళ్లపాక అన్నమాచార్యులు స్వయంగా రచించి స్వరార్చన చేశారని ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ అన్నారు. జైకిసాన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఆవరణలోని బళ్లారి రాఘవ ఓపెన్ ఆడిటోరియంలో అన్నమయ్య గీతాల సామూహిక గళార్చన వైభవంగా నిర్వహించారు. తొలుత సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ జనవరి 23న జరిగే ప్రపంచ మూడో తెలుగు మహాసభల్లో తొలిరోజు అన్నమాచార్యుల భక్తి సంగీత విభావరి నిర్వహించనున్నట్లు తెలిపారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, జైకిసాన్ సంస్థ సీఈఓ బండ్లమూరి స్వామి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

విజేతగా నిలిచిన తెనాలి మండల టీమ్

మంగళగిరి టౌన్: రెండు రోజులుగా మండల పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న తెనాలి డివిజన్ ఉపాధ్యాయుల ఆటల పోటీలు శనివారంతో ఉత్సాహంగా ముగిశాయని డెప్యూటీ డీఈఓ డి. శాంత కుమారి తెలిపారు. ఆఖరి రోజు తెనాలి మండల క్రికెట్ టీం – కొల్లిపర మండల క్రికెట్ టీం ఫైనల్‌లో తలపడ్డాయన్నారు. ఇందులో తెనాలి టీమ్ విజేతగా నిలిచిందన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఎనిమిది మండలాల నుంచి ఎనిమిది టీమ్‌లు పాల్గొన్నాయని తెలిపారు. విజేతలు ఈనెల చివరిలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలియజేశారు. గెలుపొందిన టీంకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కరరావు, కార్యదర్శి రాజీవ్ రత్న, పీఈటీలు పాల్గొన్నారు.

రాజకీయంలో రాజధర్మం రహస్యంగా ఉండాలి

నగరంపాలెం: భారతీయ ఇతిహాసాలలో ఒకటైన మహాభారతంలో నారదుడు, దుర్వాసుడు రాజనీతి శాస్త్రాలు ఔపాసన పట్టి చరిత్రలో నిలిచిపోయారని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనాకారులు డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. శనివారం బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై గుళ్లపల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేశారు. భారతంలో రాజనీతి అంశంపై గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ రాజు మంత్రాంగంలో నిర్ణయాలను అతి ముఖ్యమైన వారితో మాత్రమే ఉంటుందని అన్నారు. నిర్ణయాలు బహిరంగపరచడం అనర్థాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీ సీఎం నందమూరి తారక రామారావు మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు బహిరంగ పరచగా, మంత్రి వర్గాన్నే రద్దు చేసి చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. రాజు త్రికరణ శుద్ధితో పాలన నిర్వహించడం ద్వారా ఫలాలు పేద ప్రజలకు సమానంగా అందుతాయని చెప్పారు. పాలనలో ఉద్యోగులు ఉత్తములు మధ్యములు అధములుగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సంస్థ అధ్యక్షులు గుళ్లపల్లి సుబ్బారావు, ఆర్గనైజర్ గుళ్లపల్లి రాఘవేంద్రరావు, డాక్టర్ నేహా, పారా అశోక్ పాల్గొన్నారు.

చదువుతో పాటు సామాజిక బాధ్యతలు నేర్పించాలి

టెన్త్ ప్రతిభావంతులతో డీఎస్పీ భానోదయ, చిన్నపరెడ్డి, చిన్నమ్మ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యతలు నేర్పించాలని గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ జి.భానోదయ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని నవీన విద్యాసంస్థల 46వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో జ్ఞానం అనంతంగా విస్తరించిందని, బట్టీపట్టే విధానాలకు స్వస్తి పలకాలని తెలిపారు. డాక్టర్ సీహెచ్ పవన్ కుమార్ మాట్లాడుతూ వృత్తి వ్యాపారాల్లో బిజీగా ఉండే తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడిపేందుకు కృషి చేయాలని సూచించారు. పాఠశాల చైర్మన్ ఏరువ చిన్నపరెడ్డి మాట్లాడుతూ గత టెన్త్ ఫలితాల్లో 500 మార్కులకు పైగా సాధించిన 111 మంది విద్యార్థులకు రజత పతకాలతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వై.చిన్నమ్మ, ప్రధానోపాధ్యాయులు నవీన్ రెడ్డి, డైరెక్టర్లు ఆనంద రెడ్డి, సునీత, మాధవి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలు ఏకమవ్వాలి

మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రు

కర్నూలు(సెంట్రల్): బీజేపీ పాలనలో రాజ్యాంగం ప్రతి రోజూ హత్యకు గురవుతోందని మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ కె.చంద్రు అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం మరో స్వాతంత్ర్య పోరాటానికి ప్రజలు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక, ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో కర్నూలులో శనివారం జరిగిన సదస్సులో 'జై భీం' ఫేమ్, మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ కె.చంద్రు మాట్లాడారు. ప్రధాని మోదీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను తెర పైకి తెచ్చారని విమర్శించారు. చరిత్ర నుంచి కొందరిని కనుమరుగు చేయడానికి దేశంలో ఇష్టారీతిన పేర్ల మార్పులు చేస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూజ్య బాపు రోజ్‌గార్ యోజనగా మార్చబోతున్నారని పేర్కొన్నారు. ఉన్న పేర్లను తీసివేసి కొత్త పేర్లు పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. గాంధీతో పాటు గాడ్సేకు కూడా నివాళులర్పించడం బీజేపీకే చెల్లిందన్నారు. ప్రస్తుత పరిస్థితులతో న్యాయ వ్యవస్థ కూడా ప్రమాదంలో పడిందని.. రక్షించుకోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఐలు జాతీయ కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.1.32 కోట్లు దోపిడీ

- 87 ఏళ్ల వృద్ధునికి సైబర్ నేరగాళ్ల టోకరా
- బెంగళూరులో దారుణం

బనశంకరి: ముంబై పోలీసుల ముసుగులో 'డిజిటల్ అరెస్ట్' అంటూ ఒక వృద్ధుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.32 కోట్లు దోచేశారు. బెంగళూరు, యలహంక నివాసి వరదరాజన్ (87) స్థానిక సైబర్ పోలీసు స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు ప్రకారం నవంబరు 19న గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ వీడియో కాల్ చేసి ముంబై క్రైం బ్రాంచ్ ఏసీపీ అని చెప్పాడు. మనీ లాండరింగ్ కేసులో వరదరాజన్ ఆధార్ కార్డు లభించిందన్నాడు. విచారణ కోసం ముంబైకి రావాల్సి ఉంటుందన్నాడు. కానీ సీనియర్ సిటిజన్ కావడంతో వీడియో కాల్‌లోనే ప్రశ్నిస్తామని చెప్పాడు. 'డిజిటల్ అరెస్ట్' అంటూ ఈ వ్యవహారంపై విచారణ పూర్తయ్యే వరకూ ఎవరితో మాట్లాడడం, విషయాన్ని చెప్పడం చేయరాదని, హద్దుమీరితే ప్రత్యక్షంగా అరెస్ట్ చేస్తామని బెదిరించాడు. మీ బ్యాంక్ అకౌంట్లలోని నగదును ఆర్‌బీఐ పరిశీలిస్తుందని, తాము చెప్పిన ప్రభుత్వ బ్యాంక్ ఖాతాలోకి డబ్బును జమచేయాలని, విచారణ జరిపి వెనక్కి ఇస్తామని తెలిపాడు. నిజమని భయపడిపోయిన వృద్ధుడు.. నవంబరు 19 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు తన బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.1.32 కోట్లను దుండగులు చెప్పిన అకౌంట్లకు జమచేశారు. డబ్బు తిరిగిరాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి బెంగళూరు ఆగ్నేయ విభాగం సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వరదరాజన్ పిల్లలు విదేశాల్లో స్థిరపడినట్లు తెలిసింది.

ఇంధన సంరక్షణలో ఏపీకి జాతీయ పురస్కారం

సాక్షి, అమరావతి: ఇంధన సంరక్షణలో రాష్ట్రానికి వరుసగా నాలుగో ఏడాది జాతీయ స్థాయిలో ఇంధన సంరక్షణ పురస్కారం లభించింది. నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు–2025లో గ్రూప్–11 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి ఏపీ ఈ అవార్డును కైవసం చేసుకుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం తెలిపారు. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవాలు ఈనెల 14 నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్రం తరపున ఈ అవార్డును ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎల్.శివశంకర్ అందుకోనున్నారని విజయానంద్ తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో భారీ మార్పులు

సిలబస్‌కు అనుగుణంగా మొదటి ఏడాదిలో మార్కుల విభజన

అన్ని పేపర్లు 100 మార్కులకు ఉండేలా కూర్పు

- సైన్స్ సబ్జెక్టులకు 85 మార్కులకు పేపర్, రెండో ఏడాదిలో 30 మార్కులకు ప్రాక్టికల్స్
- బోటనీ 43, జువాలజీ 42 మార్కులకు వేర్వేరు పేపర్లు
- సిలబస్ మారిన సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్
- తొలిసారి ఒక్క మార్కుల ప్రశ్న విధానం
- ఈసారికి ఇంటర్ రెండో ఏడాదికి పాత పరీక్షా విధానమే అమలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యలో 2025–26 విద్యా సంవత్సరంలో కొత్త సిలబస్‌ను అమలు చేసిన బోర్డు.. అందుకు అనుగుణంగా పరీక్షా విధానంలోనూ మార్పులు చేసింది. ప్రశ్నల సరళి, మార్కుల కూర్పు సైతం మారనుంది. జాతీయ విద్యా విధానం–2020కి అనుగుణంగా ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను, పరీక్షలకు సీబీఎస్ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ముఖ్యంగా ఎక్కువ మంది విద్యార్థులు ఎంచుకునే సబ్జెక్టులైన మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, చరిత్ర, ఎకనామిక్స్, కామర్స్, సివిక్స్ సిలబస్‌లో ఈ ఏడాది మార్పులు చేశారు. ప్రతి పేపర్‌కు 100 మార్కులు ఉంటాయి. అలాగే ఒక్క మార్కు ప్రశ్నల విధానం ప్రవేశపెట్టారు. సిలబస్ మారిన సబ్జెక్టుల పరీక్షలు రాసేందుకు జవాబుల బుక్‌లెట్‌ను 32 పేజీలకు పెంచారు. సిలబస్ మారని సబ్జెక్టులకు 24 పేజీల బుక్‌లెట్ ఉంచారు. సబ్జెక్టులు మారినందున పరీక్షల నిర్వహణలోనూ మార్పులు తెచ్చారు. ఒక్కో పరీక్షకు కనీసం 2 రోజుల వ్యవధి ఉండేలా టైంటేబుల్ రూపొందించారు. ఈ విద్యా సంవత్సరం మొదటి ఇంటర్ పరీక్షల్లో ఈ మార్పులు ఉంటాయి. రెండో ఏడాది పరీక్షలను మాత్రం ఈ ఏడాది పాత విధానంలోనే నిర్వహిస్తారు.

అమల్లోకి ఐదు సబ్జెక్టుల విధానం

ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో సైన్స్ గ్రూపుల్లో రెండు లాంగ్వేజెస్, నాలుగు మెయిన్‌సబ్జెక్టులు (మొత్తం ఆరు), ఆర్ట్స్ గ్రూపుల్లో రెండు లాంగ్వేజెస్, మూడు మెయిన్ సబ్జెక్టులు (మొత్తం ఐదు) ఉన్నాయి. మార్కుల కేటాయింపు కూడా భిన్నంగా ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 5 సబ్జెక్టుల విధానం అమల్లోకి తెచ్చారు. అన్ని గ్రూపులకు ఒక లాంగ్వేజ్, 4 మెయిన్ సబ్జెక్టులు ఉంటాయి. ఇందులో ఇంగ్లిష్ తప్పనిసరి. రెండో లాంగ్వేజ్‌ని 'ఎలక్టివ్' (ఆరో సబ్జెక్టు)గా మార్చారు. అంటే విద్యార్థి లాంగ్వేజ్ లేదా 23 మెయిన్ సబ్జెక్టుల్లో ఒకటి ఎంచుకోవచ్చు. విద్యార్థులు మొదటి 5 సబ్జెక్టుల్లో ఒకటి ఫెయిలై.. ఆరో సబ్జెక్టు పాసైతే అప్పుడు ఆరో సబ్జెక్టును మెయిన్ సబ్జెక్టుగా పరిగణిస్తారు. అయితే, ఆరో సబ్జెక్టును పరిగణనలోకి తీసుకోవాలంటే ఇంగ్లిష్ తప్పనిసరిగా పాసవ్వాలి.

- సైన్స్ లేదా ఆర్ట్స్ గ్రూపుల్లో మూడు (3, 4, 5 సబ్జెక్టులు) ప్రధాన సబ్జెక్టులు ఉంటాయి.
- గతంలో ఎంపీసీలో 'మ్యాథ్స్–ఏ, బి' పేపర్లు (ఒక్కో పేపర్ 75 మార్కులు) ఉండగా, ఇప్పుడు ఒక్క పేపర్ మాత్రమే ఉంటుంది.
- బైపీసీలో బోటనీ, జువాలజీ సబ్జెక్టులను కలిపి 'బయాలజీ'గా ఒక్క ప్రశ్నపత్రం మాత్రమే ఇస్తారు. ఇందులో బోటనీకి 43, జువాలజీకి 42 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. జవాబులు రాసే బుక్‌లెట్స్ రెండింటికీ వేర్వేరుగా ఇస్తారు. వేర్వేరుగా జవాబులు రాయాలి.
- ఆర్ట్స్‌లో సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రస్తుతం ఉన్న 26 కాంబినేషన్లు ఉంటాయి. విద్యార్థులు నచ్చిన కాంబినేషన్‌ను ఎంచుకోవచ్చు.
- కామర్స్‌లో కామర్స్ పార్ట్–ఏ 50 మార్కులకు, అకౌంటెన్సీ పార్ట్–బి 50 మార్కులకు పేపర్ ఉంటుంది.

మార్కుల్లో మార్పులు

- మొదటి ఏడాది ఇంటర్మీడియట్‌లో ప్రతి సబ్జెక్టు 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో సైన్స్ సబ్జెక్టులైన ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ సబ్జెక్టులకు 85 మార్కుల చొప్పున రాత పరీక్ష ఉంటుంది. రెండో ఏడాది పరీక్షల్లో ప్రాక్టికల్స్ 30 మార్కులకు ఉంటుంది. అంటే రెండేళ్లకు రాత పరీక్ష 170 (85+85) మార్కులకు, ప్రాక్టికల్స్ 30 మార్కులు.. మొత్తం 200 మార్కులకు ఉంటుంది.
- గతేడాది వరకు మ్యాథమెటిక్స్–ఏ, బి పేపర్లుగా 150 మార్కులకు ఉండగా, వాటిని కూడా రద్దు చేసి ఒకటే పేపర్ 100 మార్కులకు కుదించారు.
- ఉత్తీర్ణతకు 100 మార్కుల పేపర్లకు 35 మార్కులు, 85 మార్కుల పేపర్లకు 29 మార్కులకు తప్పనిసరి చేశారు. అంటే సైన్స్ సబ్జెక్టుల్లో రెండేళ్లకు కలిపి 59 మార్కులు రావాలి. సైన్స్ ప్రాక్టికల్స్ రెండేళ్లలో 30 మార్కులకు గాను 11 మార్కులు తప్పనిసరిగా సాధిస్తేనే ఉత్తీర్ణులుగా పరిగణిస్తారు.
- ఒకటి రెండు సబ్జెక్టుల్లో అధిక మార్కులు, మరో రెండు, మూడు సబ్జెక్టుల్లో 30 శాతం మార్కులు సాధించినా ఉత్తీర్ణతగా పరిగణిస్తారు. అన్ని సబ్జెక్టుల్లోనూ సరాసరి 35 శాతం మార్కులు తప్పనిసరి. అయితే, ఈ అవకాశం మొదటి ప్రయత్నంలో పరీక్షలు రాసేవారికి మాత్రమే వర్తిస్తుంది.
- ఈసారి పరీక్షల్లో అర, 1, 2, 4, 5, 8, 16 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. అర, ఒక్క మార్కు ప్రశ్నలకు తప్ప మిగిలిన వాటికి ''ఛాయిస్'' విధానం అమల్లోకి తెచ్చారు.
- ప్రస్తుత (2025–26) విద్యా సంవత్సరంలో రెండో ఏడాది ఇంటర్ విద్యార్థులకు పాత సిలబస్‌తోనే పరీక్షలు జరుగుతున్నందున ఎలాంటి మార్పులు చేయలేదు.

ఇంటర్ ఫస్టియర్ పాత విధానంలో మార్కులు ఇలా..

ఇంగ్లిష్	100
తెలుగు/సంస్కృతం/హిందీ	100
మ్యాథమెటిక్స్ పేపర్–ఎ	75
మ్యాథమెటిక్స్ పేపర్–బి	75
ఫిజిక్స్	60
కెమిస్ట్రీ	60
బోటనీ	60
జువాలజీ	60

కొత్త విధానంలో మార్కులు ఇలా..

ఇంగ్లిష్	100
తెలుగు/సంస్కృతం/హిందీ	100
మ్యాథమెటిక్స్	100
ఫిజిక్స్	85
కెమిస్ట్రీ	85
బయాలజీ (బోటనీ+జువాలజీ)	85

ఫిబ్రవరి 23 నుంచి పరీక్షలు

- పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు నిర్వహిస్తారు. ప్రతి పరీక్షకు కనీసం 2 రోజుల వ్యవధి ఉండేలా టైంటేబుల్ రూపొందించారు. అయితే, హోలీ (మార్చి 3), రంజాన్ (మార్చి 20) తేదీల్లో ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో ఆ తేదీల్లో జరిగే పరీక్షలను మరుసటి రోజు నిర్వహించేలా టైంటేబుల్‌లో మార్పులు చేసి, ప్రభుత్వానికి పంపినట్టు తెలిసింది. ప్రభుత్వ అనుమతి రాగానే మార్పులతో కూడిన టైంటేబుల్‌ను ఇంటర్ విద్యా శాఖ వెల్లడించనుంది.

గతంలో ఒక్కో సబ్జెక్టు ఒక్కో తీరుగా మార్కుల విధానం..

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో గతంలో భాషా పేపర్లు 100 మార్కులకు ఉండేవి. సబ్జెక్టులకు మాత్రం వేర్వేరుగా ఉండేవి. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో తీరుగా ప్రశ్నలు, మార్కుల కేటాయింపు ఉండేది. ఆర్ట్స్ గ్రూపులకు మొత్తం 5 పేపర్లు 500 మార్కులు ఉండేవి. ఎంపీసీకి 470 మార్కులు, బైపీసీలో 440 మార్కులకు పరీక్షలు నిర్వహించేవారు. మ్యాథమెటిక్స్‌లో రెండు పేపర్లు 75 మార్కుల చొప్పున 150 మార్కులకు, సైన్స్ గ్రూప్‌లో సబ్జెక్టుకు 60 మార్కుల చొప్పున పేపర్లు ఉండేవి. రెండో ఏడాదిలో మ్యాథ్స్ మినహా మిగిలిన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీలకు సబ్జెక్టుకు 30 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ మార్కులు కేటాయించేవారు. ఈ విద్యా సంవత్సరంలో ఆర్ట్స్ గ్రూపులు మినహా, సైన్స్ సబ్జెక్టులకు ప్రశ్నల సరళి, మార్కుల కేటాయింపులో మార్పులు చేశారు. మొదటి ఏడాది ఎంపీసీలో మొత్తం మార్కులు యథావిధిగా 470 మార్కులే ఉండగా, బైపీసీలో గతంలో 440 మార్కులు ఉండగా, కొత్త విధానంలో 455 మార్కులకు పెరిగాయి.

అప్పులు చేయడంలోనే చంద్రబాబు దిట్ట

- 18 నెలల పాలనలో రూ.2.66 లక్షల కోట్ల అప్పులు
- ఎక్సైజ్ బాండ్ల రూపంలో మరో రూ.5,490 కోట్లు
- గత ప్రభుత్వంలో జగన్ అప్పులు చేస్తే శాపమన్నట్టు దుష్ప్రచారం
- ఇప్పుడు బాబు విపరీతంగా అప్పులు చేస్తున్నారు
- చంద్రబాబు తెచ్చిన అప్పులు ఏం చేస్తున్నారు?
- మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: అప్పులు చేయడం, ప్రజలను రుణాల ఊబిలో దింపడంలో సీఎం చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే చంద్రబాబు రూ.2,66,175 కోట్ల మేర అప్పులు చేశారని, సగటున రోజుకు రూ.500 కోట్ల అప్పు చేయడమే ఆయన గొప్పతనం, సీనియారిటీ, పరిపాలనా దక్షతా అని ఎద్దేవా చేశారు. కన్నబాబు శనివారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా కొద్దిపాటి అప్పులు తెస్తే.. రాష్ట్రం అప్పుల ఆంధ్రప్రదేశ్ అయిపోతుందంటూ అనుకూల మీడియాలో గగ్గోలు పెట్టేవారని, రాష్ట్రాన్ని శ్రీలంక చేసేస్తున్నారంటూ ప్రచారం చేశారని దుయ్యబట్టారు. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న అప్పులకు ఏ పేరు పెట్టాలని నిలదీశారు. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కోవి

డ్‌తో భయంకర పరిస్థితులు ఎదురైనప్పటికీ, పథకాలు ఆగలేదని, ప్రజలకు నేరుగా నగదు అందించారని, వైద్య పరంగా అన్ని విధాలుగా ఆదుకున్నారని తెలిపారు. ఈవేళ సంపద సృష్టికర్త అని చెప్పుకొనే చంద్రబాబు తెచ్చిన అప్పులతో ప్రజలకు ఏమైనా సంక్షేమం అందించారా? అకౌంట్లలో ఏమైనా వేశారా అంటే అదీ లేదని తెలిపారు. కనీసం రోడ్లపై గోతులు కూడా పూడ్చడం లేదన్నారు. అమరావతిలో తుప్పలు కొడుతూ, నీళ్లు తోడుతున్నారన్నారు. కొత్తగా ఎక్సైజ్ బాండ్ల రూపంలో రూ.5,490 కోట్లు తేవాలని చూస్తున్నారని, అదీ 9.25 శాతం వడ్డీకని చెప్పారు. ఇది కారు లోన్, హౌసింగ్ లోన్ కన్నా ఎక్కువన్నారు. వైఎస్ జగన్ ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ద్వారా అప్పు తేవాలని ప్రయత్నిస్తే కేంద్రానికి లేఖలు రాసి, కోర్టుల్లో కేసులు వేశారని, ఇప్పుడు మీరే విధంగా ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు విరుద్ధంగా అప్పులు తెస్తున్నారని అన్నారు. ఆరోజు జగన్ చేసింది తప్పు అనుకుంటే ఇప్పుడు చంద్రబాబు చేసేది ఒప్పు ఎలా అవుతుందని నిలదీశారు. చంద్రబాబు అప్పులు చూస్తే రాష్ట్రం సౌత్ సూడాన్‌లా మారిపోతుందని నిపుణులు చెబుతున్నారన్నారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ నగరమని చెబుతున్నప్పుడు పెద్ద మొత్తంలో అప్పులు ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు.

140% రెవెన్యూ లోటు ఎలా వచ్చింది?

'రాష్ట్రంలో లోటు పోటెత్తుతోందని, ఆర్థిక పరిస్థితి ప్రమాదంలో ఉందని చంద్రబాబు అనుకూల మీడియా ఆంధ్రజ్యోతిలోనే రాశారు. మొదటి 6 నెలల్లోనే రెవెన్యూ లోటు 140 శాతం ఎలా వచ్చింది? మీ అంచనాలైనా తప్పవాలి లేదా బడ్జెట్ అయినా తప్పు కావాలి. కానీ రివర్స్ అయ్యింది' అని అన్నారు. లక్షల కోట్లు అప్పులు తెస్తున్నా ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించడంలేదని, క్రిస్మస్, సంక్రాంతి నెలల్లో కూడా ఉద్యోగులు ఇబ్బంది పడాల్సిందేనా అని ప్రశ్నించారు. విశాఖ ఆర్థిక రాజధాని అని నాడు వైఎస్ జగన్ చెబితే నానా అల్లరీ చేశారని, ఇప్పుడు అదే విశాఖను గ్రోత్ ఇంజిన్ అని, ఏపీ పవర్ హౌస్ అని అంటున్నారని అన్నారు.

ఇప్పుడు రాష్ట్రాన్ని ఏ లంక అనాలి?

- రాష్ట్రం శ్రీలంక అవుతుందంటూ 2022 ఏప్రిల్ 5న చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రాన్ని శ్రీలంకగా ప్రకటిస్తారేమోనంటూ ఏప్రిల్ 14న మరో ప్రకటన చేశారు.
- శ్రీలంక పరిస్థితికి రాష్ట్రం కూతవేటు దూరంలో ఉన్నట్లు ఈనాడులో కథనాలు రాశారు.
- శ్రీలంక కంటే రాష్ట్రం అప్పులు 4 రెట్లు అని 2022 మే 17న పవన్ ట్వీట్ చేశారు. తిరిగి 2023లో అప్పుల ఆంధ్రగా రాష్ట్రానికి పేరు పెట్టాలని పవన్ ట్వీట్ చేశారు.
- పురందేశ్వరి 2023 అక్టోబర్‌లో రాష్ట్ర రుణం రూ.11 లక్షల కోట్లన్నారు. ఇలా ప్రజల చెవుల్లోకి పచ్చి అబద్ధాలు ఎక్కించారు. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న అప్పులకు రాష్ట్రాన్ని ఏ లంక అనాలి?

చంద్రబాబు జీవితంలో ఒక్క భూసంస్కరణా లేదు

- 18 నెలల పాలనలో పేదల కోసం ఎకరం కూడా కొనలేదు
- రెవెన్యూ శాఖ సమీక్షకు ఏడాదిన్నర పట్టిందా?
- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీఎం చంద్రబాబు తన రాజకీయ జీవితంలో పేదలకు ఉపయోగపడే ఒక్క సంస్కరణ కూడా చేపట్టలేదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత ధర్మాన ప్రసాదరావు ఎద్దేవా చేశారు. 18 నెలల పాలనలో పేదల కోసం కనీసం ఎకరం భూమి కూడా కొనుగోలు చేయలేదు సరికదా.. పేదలను కొట్టి పెద్దలకు పంచడమే నైజంగా చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం శ్రీకాకుళంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖపై సమీక్ష చేయడానికి చంద్రబాబు ఏడాదిన్నర సమయం తీసుకోవడం పేదల సంక్షేమంపై ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 1977 తర్వాత 2020లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన భూసంస్కరణల వల్లే రైతులకు మేలు జరిగిందని స్పష్టం చేశారు. ఎవరి భూమి ఏదో గుర్తించలేని పరిస్థితులు, కోర్టు వివాదాలు వంటి అంశాలకు చెక్ పెట్టేందుకు జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు.

చంద్రబాబు అభ్యంతరం ఏంటి?

పేదలకు లబ్ధి చేకూర్చేలా తీసుకున్న వైఎస్ జగన్ నిర్ణయంపై చంద్రబాబు ప్రభుత్వానికున్న అభ్యంతరం ఏమిటో చెప్పాలని ధర్మాన ప్రశ్నించారు. 1952 తర్వాత 2019లో ఏర్పడిన జగన్ ప్రభుత్వంలో మాత్రమే పేదలకు భూపంపిణీ జరిగిందని గుర్తు చేశారు. పిల్లల చదువులు, ఇతర అవసరాలు తీర్చుకునేందుకు ఆ భూమిని అమ్ముకునే అవకాశం ఇవ్వాలని కోరితే.. వైఎస్ జగన్ ప్రభుత్వంలో దానికోసం పెద్దఎత్తున కసరత్తు చేశామన్నారు. దీనికోసం ఏర్పాటైన కమిటీ నివేదికను కేబినెట్ ఆమోదిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాటిని అమలు చేశామన్నారు. అందులో ఏం తప్పు ఉందని ఏడాదిన్నరగా నిలిపివేశారని ప్రశ్నించారు. బ్రిటిషర్లు వెళ్లిన తర్వాత వైఎస్ జగన్ హయాంలోనే

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూసర్వే చేసినట్టు తెలిపారు. సుమారు 10 వేల రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయిందని, ఒకటి అరా లోపాలు తప్ప సమర్థవంతంగా సర్వే చేయగలిగామన్నారు. ఏడాదిన్నరగా చంద్రబాబు ఎందుకు సర్వే చేయలేకపోయారో చెప్పాలన్నారు. ఏడాది కాలంగా రైతులు, పేదల భూములను లాక్కుని ధనవంతులకు అప్పగించడమే తప్ప చంద్రబాబు పాలనలో సెంటు భూమినైనా పేదలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజల భూములను లాక్కుని మార్కెట్ వాల్యూ పెంచడం ద్వారా ఎవరికి మేలు చేయాలనుకుంటున్నారో చెప్పాలన్నారు. భూమి హోదాదారు పేరిట సర్టిఫికెట్ ఇచ్చి బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ యాక్ట్‌లో 22–ఏ నోటిఫికేషన్ పెట్టి గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. కేసులు పెట్టి అధికారులను బెదిరించి ఇవ్వడం వల్ల.. ఏ ఒక్క అధికారి 22–ఏ నుంచి ప్రాసెస్ చేసి ఇవ్వడానికి భయపడి ముందుకు రావడం లేదన్నారు.

ఎమ్మెల్యేల చేతుల్లోకి కార్యాలయాలు

తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ ఎమ్మెల్యేల చేతుల్లోకి వెళ్లిపోయాయని ధర్మాన విమర్శించారు. ఏ కార్యాలయానికి వెళ్లినా.. మీ ఎమ్మెల్యేకు చెప్పారా? లేదా? అక్కడ డబ్బులిచ్చుకుని రండి అనే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో 80 శాతం మంది ఎమ్మెల్యేలు రెడ్ జోన్‌లోకి వెళ్లిపోయారని చెప్పారు. జగన్ హయాంలో రూ.12 వేల కోట్లు పెట్టి భూమి కొనుగోలు చేసి 30 లక్షల మందికి పట్టాలిచ్చే కార్యక్రమం చేశారని, ఆ పట్టాల్ని సైతం ఎలా అమ్ముకోవాలో అనే ఆలోచన తప్ప పేదలకు న్యాయం చేయాలన్న ఉద్దేశం ఏ ఒక్క కూటమి నాయకులకూ లేదన్నారు. సమాజ హితం కోసం జగన్ ఈ సంస్కరణలన్నీ తీసుకొస్తే.. అంతా నాశనమైందని తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఉద్యోగులతో తప్పుడు పనులు చేయించే ప్రయత్నం చేస్తుంటే.. వారంతా మూకుమ్మడి సెలవు పెట్టి వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్నారని ధర్మాన హెచ్చరించారు.

అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా పనిచేయాలి: మంత్రి కొండపల్లి

సాక్షి, అమరావతి: పెద్ద పరిశ్రమలు వచ్చే చోట చిన్న తరహా పరిశ్రమలకు అవకాశాలున్నాయని, వాటిని పారిశ్రామిక వేత్తలు వినియోగించుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పోలో ఆయన మాట్లాడారు. మన దేశ ఎంఎస్ఎంఈ విధానాలకు ప్రేరేపితమై భారత్ మార్కెట్‌లో ఎలా అడుగు పెట్టాలనే దానిపై ప్రపంచ దేశాలు ఎదురు చూస్తున్నాయన్నారు.

జోయ్ అలుక్కాస్ 'సీజన్ ఆఫ్ గిఫ్టింగ్' ఆఫర్

సాక్షి, హైదరాబాద్: జోయ్ అలుక్కాస్ సీజన్ ఆఫ్ గిఫ్టింగ్ ఆఫర్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఈనెల 12వ తేదీ నుంచి జనవరి 4 వరకు దేశంలోని అన్ని షోరూంలలో ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. సీజన్ ఆఫ్ గిఫ్టింగ్ వినియోగదారులకు విలువను పెంచడానికి, పండుగ షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరచడానికి రూపొందించిన రెండు ప్రత్యేక ఆఫర్లను అందిస్తుందని తెలిపింది. వినియోగదారులు పాత బంగారం మార్పిడిపై అదనంగా ప్రతి గ్రాముకు రూ.250 పొందవచ్చని పేర్కొంది. అలాగే డైమండ్స్, అన్‌కట్ డైమండ్స్ విలువపై ఫ్లాట్ 25% తగ్గింపు ఉంటుందని వెల్లడించింది.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దు వరకు పోరాటం

అఖిలపక్ష, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే విధానం రద్దు చేసేంత వరకూ పోరాటం కొనసాగిస్తామని అఖిల పక్ష, ప్రజాసంఘాల నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ విషయమై వెనక్కు తగ్గి ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్మించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ కాకినాడ జిల్లా సమితి ఆధ్వర్యాన నగరంలో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఈ మేరకు ఒక తీర్మానం చేసింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, బీఎస్పీ, జైభీమ్ పార్టీ నేతలతో పాటు 19 ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. వీరిలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ వంగా గీత, సీపీఎం సీనియర్ నేత దువ్వా శేషుబాబ్జీ, ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు కిర్ల కృష్ణారావు, బీసీ సంఘాల జేపీసీ చైర్మన్ చొల్లంగి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత తాటిపాక మధు

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వైద్య విద్యను దూరం చేయొద్దు

సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వైద్య విద్యను దూరం చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే ప్రజలు క్షమించరని అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా గత జగన్ ప్రభుత్వం మెడికల్ కాలేజీల నిర్మాణాలు చేపట్టిందన్నారు. పీపీపీ విధానంతో ప్రభుత్వ భూములు, భవనాలు, కాలేజీల ఆస్పత్రులు దాదాపు 60 ఏళ్ల పాటు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లిపోతాయని అన్నారు. దీనివల్ల నాణ్యమైన వైద్యం ఒక హక్కుగా పొందే అవకాశాన్ని ప్రజలు కోల్పోతారన్నారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్య రంగానికి సంబంధించి మందులు, పరికరాలు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. తాటిపాక మధు మాట్లాడుతూ, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ ఆలోచన అత్యంత దుర్మార్గమన్నారు.

గుంటూరులో మళ్లీ డ్రగ్స్ కలకలం

- కుమార్తె డ్రగ్స్‌కు అలవాటు పడిందని తల్లి ఆత్మహత్యాయత్నం
- పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలింపు
- ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఇద్దరు యువకుల ద్వారా బాలికకు డ్రగ్స్ అందుతున్నట్టు సమాచారం

పట్నం బజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు తల్లీకుమార్తె మధ్య డ్రగ్స్ వివాదం కలకలం రేపింది. కుమార్తె డ్రగ్స్‌కు బానిసగా మారిందని తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సంచలనం రేకెత్తించిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బాలిక బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు చిన్నబజారుకు చెందిన ఓ మహిళ హైదరాబాద్‌లోని ఒక టీవీ చానల్‌లో న్యూస్ రీడర్‌గా పనిచేస్తోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. తండ్రితో కలిసి గుంటూరులోనే ఉంటున్న పెద్ద కుమార్తె (17) ఇక్కడే ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఇద్దరు యువకులు తన కుమార్తెను డ్రగ్స్‌కు బానిసగా మార్చారని తల్లి ఆరోపిస్తున్నారు. డ్రగ్స్ అలవాటు మానుకోవాలని తల్లి చెప్పగా.. శుక్రవారం తల్లీకుమార్తె మధ్య ఘర్షణ తలెత్తగా కుమార్తె తల్లికి ఎదురుతిరిగింది. దీంతో మనస్తాపానికి గురైన తల్లి ఫిట్స్ తగ్గడానికి ఉపయోగించే టాబ్లెట్లను అధికంగా మింగడంతో స్పృహ కోల్పోయింది. ఆమెను చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

బాధితురాలితో మాట్లాడుతున్న ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఎస్పీ వకుల్ జిందాల్

బాధితురాల్ని కలిసిన పోలీసు అధికారులు

మహిళ ఆత్మహత్యాయత్నం విషయం తెలుసుకున్న ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి ఆమెతో మాట్లాడారు. ఈగల్ ఐజీ రవికృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. సోషల్ మీడియా ద్వారా మైనర్ విద్యార్థినిని మాదక ద్రవ్యాల ఉచ్చులోకి లాగిన ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణిస్తామన్నారు. పూర్తిస్థాయిలో డ్రగ్స్‌కు బానిసైన బాలికకు అడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స అందించి సాధారణ స్థితికి వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రేమ పేరుతో యువతిని వంచించి మాదకద్రవ్యాల మత్తుకు అలవాటు చేసిన వారిని పట్టుకు తీరుతామన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ.. కుమార్తె తన మాట వినడం లేదని, బాలికను వారించే క్రమంలో తల్లిపై తిరగబడిందని చెప్పారు. దీంతో తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఆ బాలికకు డ్రగ్స్ ఎక్కడ నుంచి వస్తున్నాయి, ఎవరు ఇస్తున్నారనే కోణంలో పూర్తిస్థాయి దర్యాప్తు చేపడతామని చెప్పారు. ప్రత్యేక బృందాల ద్వారా విచారిస్తామన్నారు. కొన్ని కళాశాలల్లోని విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారన్న సమాచారం తమ వద్ద ఉందన్నారు. బాలికకు డ్రగ్స్ అలవాటు చేసిన ఇద్దరు యువకులను త్వరితగతిన అదుపులోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

'వేగ'లో పండుగల ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): రానున్న ధనుర్మాసం, క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని వేగా జ్యూయలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు ప్రవేశ పెట్టారు. ఈ నెల 15 నుంచి అందుబాటులోకి రానున్న ఈ ఆఫర్ల బ్రోచర్‌ను శనివారం విజయవాడ బృందావనకాలనీలోని నందమూరి రోడ్డులో ఉన్న వేగా షోరూమ్‌లో మిరాయ్ సినిమా ఫేమ్ రితిక నాయక్ లాంఛనంగా ఆవిష్కరించారు. అన్ని రకాల అత్యాధునిక ఫ్యాషన్ ఆభరణాల నుంచి ప్రాచీన సంప్రదాయ ఆభరణాలు షోరూమ్‌లో అందుబాటులో ఉంచారు. ఆఫర్లలో భాగంగా బంగారు ఆభరణాల తరుగులో 50 శాతం తగ్గింపు, పోల్కి ఆభరణాల తయారీ, తరుగు చార్జీలు ఉండవని షోరూమ్ నిర్వాహకులు తెలిపారు. వజ్రాభరణాల క్యారట్ ధర కేవలం రూ.49,999 ఉంటుందని, అందరూ ఈ అద్భుతమైన ఆఫర్లు సద్వినియోగం చేసుకోవాలని షోరూమ్ యజమానులు తెలిపారు.

ఆభరణాలు ప్రదర్శిస్తున్న సినిమా నటి రితిక నాయక్

హెల్త్

సోషల్ మీడియా వచ్చాక ఓ ఉత్పాతమూ వచ్చిపడింది. 'పాత పేషెంట్ కొత్త డాక్టర్‌తో సమాన'మంటూ అప్పట్లో ఓ సామెత లాంటి వాడుక ఉండేది. దాన్ని నిజం చేస్తూ పాత పేషెంట్లూ అంతకుమించి పాపులర్ సెలబ్రిటీలైన సోనాలీ బెంద్రే, మనీషా కోయిరాలా, క్రికెట్ దిగ్గజం యువరాజ్ సింగ్, హాలీవుడ్ మోడల్ లీజా రే వంటి జనాల్లో మంచి క్రేజ్ ఉన్న వ్యక్తులు... 'ఆటోఫేజీ' అనే ఓ సైంటిఫిక్ పదాన్ని... ఇటీవలి పాపులర్ చిట్కా మంత్రా పదమైన 'వెల్‌నెస్ చికిత్స'తో కలగలిపి 'వెల్‌నెస్' అద్భుతాల తాలూకు ప్రభావాలను సోషల్ మీడియా ప్రచారం చేస్తున్నారు. ఉపవాసాలూ, డీటాక్స్ విధానాల్లాంటివే అద్భుత మాయా-మంత్రాలంటూ ప్రజలకు ఇంపుగా ప్రజెంట్ చేస్తున్నారు. అసలు అన్నం కంటే పక్కన అంచుకుపెట్టుకుని నంజుకునే చిరుతిండినే నిజభోజనంగా వర్ణిస్తున్నారు. వాళ్ల మాటల మాయల్లో పడుతున్న జనాలు... అసలు వాస్తవాల కంటే అద్భుతాలనే ఎక్కువగా నమ్ముతున్నారు. ఫలితంగా ఈ 'మిరాకిల్స్ థెరపీ'లను ఎక్కువగా నమ్ముతూ ఉండే అదే క్యాన్సర్‌కు అద్భుత చికిత్సేమోనంటూ అమాయక ప్రజలు అసలుకే మోసం తెచ్చుకుంటున్నారు. ఈ విషయంపై క్యాన్సర్ నిపుణులైన డాక్టర్ల మాటేమిటో చూద్దాం.

యువరాజ్ సింగ్

మనీషా కొయిరాలా

సోనాలీ బింద్రే

లీజా రే

వాళ్లు క్యాన్సర్‌ను జయించిన యోధులే. అద్భుత మనోబలంతో క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కొన్న మహామహులే. తాము క్యాన్సర్‌ను అధిగమించాక తాము అనుసరించిన చిట్కాలను వెల్లడిస్తూ వాళ్లు చెబుతున్న కొన్ని మాటలేమిటో చూద్దాం.

- ఇంటర్‌మిట్టెంట్ ఫాస్టింగ్ (రోజుకు నియమిత వేళల్లోనే తిని... మిగతా సమయమంతా ఉపవాసంలో గడపడం), యాంటీ ఇన్‌ఫ్లమేషన్ డైట్ తీసుకోవడం, కొద్దిపాటి వ్యాయామంతో తాను క్యాన్సర్‌నుంచి బయటపడ్డానంటోంది ప్రముఖ బాలీవుడ్- టాలీవుడ్ ఫేమ్ సోనాలి బెంద్రే.
- క్లీన్ ఈటింగ్ (ప్రాసెస్ చేయని, రిఫైన్ చేయని, పొట్టుతీయని ముడి ధాన్యాలతో వండిన భోజనం)తో పాటు యోగా, ప్రాణాయామం వంటి వాటితో క్యాన్సర్‌ను జయించానన్నది ప్రముఖ నటి మనీషా కోయిరాలా మాట.
- కీమోతో పాటు... క్రమశిక్షణతో కూడిన జీవనమూ భోజనమూ, దేహంలోని విషాలను శుభ్రపరిచే డీ-టాక్స్ ఆహార విహారాలూ తననుంచి క్యాన్సర్‌ను దూరం చేశాయంటాడు క్రికెటర్ యువీ (యువరాజ్ సింగ్).
- శాకాహారంతో కూడిన భోజనం, ధ్యానం (మెడిటేషన్), యోగా ఆయుర్వేద మార్గాల పయనం వల్లనే తనకు క్యాన్సర్ నయమయ్యిందంటోంది ప్రముఖ మోడల్, లీజా రే.

డాక్టర్ ఏవీఎస్ సురేశ్
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్

ఇక్కడ ఈ ప్రముఖులు చెప్పిన చిట్కాలన్నీ 'ఆటోఫేజీ' అనే ప్రక్రియను వేగవంతం చేశాయనీ... అందువల్లనే తమకు క్యాన్సర్ వేగంగా, ప్రభావపూర్వకంగా నయమైందంటూ చెబుతున్న సోషల్ మీడియా వేదికగా చెబుతున్న మాటలు సాధారణ ప్రజల మెదళ్లలోకి తేలిగ్గా ఎక్కుతున్నాయి. వాళ్ల మనసుల్లోకి సులువుగా వెళ్తున్నాయి.

అయితే జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులైన ఆ వెల్‌నెస్ మార్గాలు మంచివే. కానీ అవే క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయలేవని అంటున్నారు. 'ఆటోఫేజీ' అనే ఇటీవలి సైంటిఫిక్ పరిభాషకు చెందిన ఆ పదం అర్థం ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఎక్కువగా ఉందన్నది వైద్యప్రముఖుల మాట. దాంతోపాటు 'అపాప్టోసిస్', 'ప్రోటీయోజోమ్' అనే పదాలకు అర్థాలు వాటి వెనక పరమార్థాలూ తెలుసుకుంటే కేవలం అద్భుతాలనిపించే చికిత్సప్రక్రియలు... (మిరాకిల్ రెమిడీలు) మాత్రమే కాకుండా వాస్తవ చికిత్సలకు తోడుగా... ఈ అనుబంధ మార్గాలూ జతగూడినప్పుడే అసలు ఫలితాలు వస్తాయంటున్న డాక్టర్ల మాటల ఆంతర్యాలను తెలుసుకుందాం...

చిట్కాలున్నా... చికిత్సే ముఖ్యం!

అసలు 'ఆటోఫేజీ' అంటే ఏమిటి?

దేహంలో ఎప్పటికప్పుడు కణాలు పుడుతూ, చనిపోతూ ఉంటాయి. అందులో చనిపోయిన కణాలతో పాటు కొన్ని నిరర్థకమైనవీ, వ్యర్థమైనవీ ఉంటాయి. అది దేహంలోని శుభ్రం చేసే వ్యవస్థ ఇలాంటి మృతకణాలూ, నిరర్థక, వ్యర్థకణాలను తొలగిస్తూ ఉంటుంది. ఇలా ఆరోగ్యకరమైన కణాలు మనుగడను సుగమం చేస్తూ, ఈ మృత, వ్యర్థ, నిరర్థక కణాలను తినేసే ప్రక్రియనే 'ఆటోఫేజీ' అంటారు. ఈ సెలబ్రిటీల మాటేమిటంటే... పైన చెప్పిన ఉపవాసాలూ, ప్రాణాయామ యోగా, డీటాక్స్ ప్రక్రియ వంటి వెల్‌నెస్ మార్గాల ద్వారా మన ఆరోగ్యకరమైన కణాలన్నీ 'క్యాన్సర్ కణాలనే' తినేస్తే? అప్పుడు క్యాన్సర్ హరించుకుపోయి ఆరోగ్యం దక్కుతుందనేలా వారి సోషల్ మీడియా సందేశాలు ప్రజలకు చేరుతున్నాయి.

అదీ మరచిపోతున్న ముప్పు... ఇదీ చేస్తున్న తప్పు...

ఇక్కడ సెలబ్రిటీలు ఒక విషయం మరచిపోతున్నారు. తమకున్న పరిమితమైన వైద్యపరిజ్ఞానంతో అసలు విషయాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఉపవాసాలు చేస్తున్నప్పుడు తన జీవక్రియల కోసం దేహంలోని కణాలు తమకు కావాల్సిన ఆహారం కోసం మృత/వ్యర్థకణాలనూ, క్యాన్సర్ కణాలనూ తినేస్తాయని భావిస్తున్నారు. కానీ అక్కడ ఒక ముప్పును విస్మరిస్తున్నారు. క్యాన్సర్ కణం కూడా ఒక కణమే. దానికీ ఆహారం కావాలి. ఉపవాసం ద్వారా దానికి అవసరమైన ఆహారాలు అందనప్పుడు అది కూడా ఆరోగ్యకరమైన కణాలనూ తినేయడం మొదలుపెట్టేందుకు అవకాశాలు ఎక్కువ. అంతేకాదు... మామూలు కణం కంటే కూడా అది మరింత దుర్మార్గం, మరింత వేగంగా ఆరోగ్యకరమైన కణాలను కబళించవచ్చు. పైగా ఆహారం అందకపోవడంతో దేహాన్ని రక్షించుకునే వ్యాధి నిరోధక వ్యవస్థ మరింత బలహీనపడితే క్యాన్సర్ కణజాలాలే మామూలు ఆరోగ్యవంతమైన కణాలను తినేయడం ప్రారంభిస్తే అది మరింత మోసం వచ్చే పరిస్థితి! అంటే ఉపవాసం వల్ల క్యాన్సర్ ఎండిపోవడానికి (ఫాస్టింగ్ స్టార్వ్స్ క్యాన్సర్) బదులుగా తామే ఆకలితో మాడాల్సి వస్తుందని తెలిసినప్పుడు క్యాన్సర్ కణాలు ఇంకా ఇంకా కుతంత్రాలతో (కన్నింగ్‌గా) ఆరోగ్యవంతమైన కణాలను తినేయడం మొదలుపెట్టే ప్రమాదలెన్నో పొంచి ఉంటాయి.

అంతకంటే సంక్లిష్టమైనది ఆటోఫేజీ...

నిజానికి 'క్యాన్సర్ బయాలజీ'లో ఆటోఫేజీ ప్రక్రియ అంతకంటే చాలా సంక్లిష్టమైనది అంటున్నారు ఆధునిక వైద్యచికిత్సకులు. ఒకసారి అదేమిటో చూద్దాం.

- కణంలో మరిన్ని సూక్ష్మమైన అంతర్గతమైన భాగాలు (ఆర్గనెల్స్) దెబ్బతిన్నప్పుడు ఆ కణం మనుగడ కష్టం. అది చనిపోయే ప్రక్రియలో దేహం దాన్ని శుభ్రం చేసి తొలగిస్తుంది. అందులోని ప్రోటీన్ శిథిలాలను ఒకచోట చేర్చి ఊడ్చేస్తుంది. అలా చనిపోయిన లేదా బలహీనపడి నిరర్థకం కాబోతున్న కణాలను దేహం తొలగించివేస్తుంది. దీన్నే 'ఆటోఫేజీ' అంటారు.

ఆటోఫేజీ లాంటిదే ఆటాప్టోసిస్...

సెలబ్రిటీలు ఆటోఫేజీ గురించి సోషల్ మీడియాలో మాట్లాడటం వల్ల దాని గురించి మామూలు ప్రజలకు తెలియరావచ్చు. కానీ... ఈ రంగంలో ఇలా ఆటోఫేజీలా పనిచేస్తూ క్యాన్సర్ కణాలను తినేసేందుకు దోహదపడే పరిశోధనలూ, అలాంటి పరిజ్ఞానాలూ, పరిభాషా... ఇలాంటివి వాళ్లకు తెలియని అంశాలెన్నో ఇంకా ఉన్నాయి. ఉదాహరణకు అటాప్టోసిస్, యూబిక్విటిన్- ప్రోటియోజోమ్ సిస్టమ్ వంటివి. ఉదాహరణకు అటాప్టోసిస్ అంటే ఏమిటో చూద్దాం. ఎవరినైనా బాగా కించపరిచి, కోలుకోలేనంతగా నిందిస్తే వాళ్లేం చేస్తారు? తట్టుకోలేక ఆత్మహత్యకూ ఒడిగట్టవచ్చు కదా! అచ్చం అపాప్టోసిస్ ప్రక్రియలో కూడా అలాంటిదే జరుగుతుంది.



అపాప్టోసిస్ అంటే...

క్యాన్సర్ అంటేనే అది చెడిపోయిన / నార్మల్‌గా ఉండని కణం అన్న విషయం తెలిసిందే. ఏవైనా రసాయనాల ద్వారా ఓ చెడిపోయి దెబ్బతిన్న కణాన్ని మరింతగా అవమానించేలా చేస్తే అది బాగా కుంగి కుచించుకుపోయి నశించిపోయే పరిస్థితే 'అపాప్టోసిస్' అని చెప్పవచ్చు. నిజానికి చాలా సంక్లిష్టమైన జీవరసాయన పద్ధతికి ఇక్కడ చెప్పినది మామూలు ప్రజానీకానికి అర్థమయ్యేలా చెప్పేందుకు ఇదో సింపుల్ వివరణ అనుకోవచ్చు. అంటే కొన్ని రసాయనాలను ఉపయోగించి ఓ కణాన్ని అవమానించడం ద్వారా దాని మరణాన్ని అదే తెచ్చుకునే 'ప్రోగ్రామ్‌డ్ సెల్ డెత్' కార్యక్రమం ఈ అపాప్టోసిస్.

యుబిక్విటిన్ - ప్రోటియోజోమ్ సిస్టమ్ అంటే...

యుబిక్విటిన్ అనేది ఏ ప్రోటీన్‌కు అంటుకుంటుందో దాన్ని కాలపరిమితి ముగిసిపోయిన లేదా చెడిపోయిన / లోపభూయిష్టమైన ప్రోటీన్‌గా గుర్తించవచ్చు. అది కణంలో ఉన్నప్పుడు కణం సమతౌల్యాన్ని దెబ్బతీస్తుంది. అందుకే యుబిక్విటిన్ ప్రోటీన్ కణం నుంచి తొలగిపోవాలి. అప్పుడే కణం చురుగ్గా నార్మల్ కణంగా ఉంటుంది. అలా కణం నుంచి యుబిక్విటిన్‌ను తొలగించడానికి తోడ్పడేందుకు ఉద్దేశించిన వ్యవస్థ... అంటే యుబిక్విటిన్ ప్రోటీన్‌ను ధ్వంసం చేసేందుకు తోడ్పడే వ్యవస్థే ప్రోటియోజోమ్ వ్యవస్థ. అంటే ప్రోటియోజోమ్ అన్నది ప్రోటీన్ డిస్ట్రక్షన్ సిస్టమ్ అన్నమాట. ఈ యుబిక్విటిన్ అనేది అలాగే ఉంటే అది చెడిపోయిన కణానికి అమరత్వం ఇస్తుంది. ఒకవేళ ఆ చెడిపోయిన కణాలకు అమరత్వం ఉంటే అవి తొలగిపోవు. కాబట్టి ఈ ప్రోటియోజోమ్... తన డబుల్ నెగెటివ్ మార్గంలో వాటిని గుర్తించి ధ్వంసం చేస్తుంది. అలా చెడుకణాలూ లేదా దెబ్బతిన్న/లోపభూయిష్టమైన కణాలను తొలగిస్తుంది. ఇది జరిగేందుకు దోహదపడేదే 'యుబిక్విటిన్ – ప్రోటియోజోమ్ వ్యవస్థ'గా చెబుతారు.

కొన్ని మందులతో ప్రోటీయోజోమ్ ప్రక్రియను అడ్డుకుని క్యాన్సర్‌ను తగ్గించడం ఇలా...

ఈ యుబిక్విటిన్–ప్రోటియోజోమ్ ప్రక్రియను గుర్తించిన వైద్య శాస్త్రవేత్తలు 'బార్టెజోమిబ్' అలాగే 'కార్ఫిల్జోమిబ్' వంటి ప్రోటియోజోమ్ ఇన్హిబిటర్లను తయారు చేసి ప్రయోగించారు. ఈ మందులతో 'మైలోమా' అనే క్యాన్సర్ నయం కావడం మొదలైంది. ఇలాంటి మందులను (ప్రోటియోజోమ్ ఇన్హిబిటర్స్‌ను) మరిన్ని కనుగొనడం ద్వారా అనేక రకాల క్యాన్సర్లను తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలా చూసినప్పుడు ఆటోఫేజీ, అపాప్టోసిస్, ప్రోటీయోజోమ్ అనేవి చాలా సంక్లిష్టమైన ప్రక్రియలు. అవి కొనసాగే మార్గాలను (పాత్ వేస్) అనేక మందుల సహాయంతో నిర్వహితమయ్యేలా చేయడం వల్ల క్యాన్సర్ కణం తనంతట తాను మటుమాయమయ్యే పరిస్థితి ఉంటుంది. ఇప్పటికి ఇది 'మైలోమా'లోనే సఫలీకృతమైంది. కానీ ఇంకా కొన్ని క్యాన్సర్ల (సాలిడ్ ట్యూమర్స్) విషయంలోనూ, మరిన్ని క్యాన్సర్లలోనూ విజయవంతం కావాల్సి ఉంది. ఇందుకోసం రకరకాల కాంబినేషన్లలో అపాప్టోసిస్ మాడ్యులేటర్లు, ఇమ్యూనో, టార్గెట్ థెరపీ ప్రక్రియలూ, ప్రోటియోజోమ్ ఇన్హిబిటర్లు రూపొందించడంలో వైద్యశాస్త్రజ్ఞులు నిమగ్నమై ఉన్నారు.

ఆ అపోహలన్నీ అలా ఆవిర్భవించినవే...

ఎన్నో ఏళ్లుగా అటాప్టోసిస్ ప్రక్రియను క్యాన్సర్‌ను జయించేందుకు ఒక ప్రత్యామ్నాయ 'నేచర్ క్యూర్' ప్రక్రియగా జనం అపోహపడుతున్నారు. కొన్ని ఆహారాల ద్వారా క్యాన్సర్ లాంటి లోపభూయిష్టమైన కణాలు తమంతట తామే తమ మరణశాసనం రాసుకునేలా చేయడం (యాక్టివేటెడ్ / ప్రోగ్రామ్‌డ్ సెల్ డెత్)గా చాలామంది పొరబడుతుంటారు. కానీ అది పొరబాటు. క్యాన్సర్ కణాలు ఎంత జిత్తులమారివి అంటే... అవి 'అటాప్టోసిస్'నూ తప్పించుకోగలవు. అదెలాగంటే... సెల్‌ను అపాప్టోసిస్‌కు గురిచేసే ప్రక్రియలో క్యాన్సర్ కణంలోని పవర్‌హౌజ్ అయిన మైటోకాండ్రియాను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతుంది. అదే సమయంలో 'బీసీఎల్-2' అనే కుటుంబానికి చెందిన మరో ప్రోటీన్ విడుదలై అది యాంటీ అపాప్టోటిక్ ప్రక్రియ ద్వారా క్యాన్సర్ కణంలోని మైటోకాండ్రియాలోకి రసాయనాలు వెళ్లకుండా చేయడం ద్వారా తనను తాను రక్షించుకుంటుంది.

చివరగా... ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న ప్రభావవంతమైన క్యాన్సర్ చికిత్సలు రేడియోథెరపీ, కీమోథెరపీ, శస్త్రచికిత్సలే. వీటి తర్వాతే ఉపవాసాలూ, యోగా, ధ్యానం, డీ-టాక్స్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారాలూ, పోషకాహారాలూ, నేచురోథెరపీలను అనుబంధంగా ఉపయోగించుకోవాలి. ఏ సెలబ్రిటీలు చెప్పినా అవి ప్రత్యామ్నాయ చిట్కాలే తప్ప ప్రధాన చికిత్సలు కావని అందరూ తెలుసుకోవాలంటున్నారు డాక్టర్లు.

నిర్వహణ: యాసీన్

మాజులి

మట్టితో... ఫేస్‌మాస్కులు

సినిమాల్లో మనకు కనిపించే నటులు మేకప్‌తో సదరు పాత్ర ఆహార్యం ఉట్టిపడేలా తయారవుతుంటారు. ముఖ్యంగా ముఖ కవళికలే ఆ పాత్రను నడిపిస్తాయి. ఇప్పుడంటే మేకప్ టెక్నాలజీ అందుబాటులో ఉంది కానీ... కొన్నేళ్ల క్రితం కేవలం మొహాలకు మాస్కులు వేసుకుని నాటకాల్లో నటించేవారు. అలాంటి మాస్కులకు అస్సాంలోని మాజులీ ప్రసిద్ధిగాంచింది. శ్రీమంత శంకర దేవుల వైష్ణవ సంప్రదాయం ఆధారంగా అభివృద్ధి చెందిన సంప్రదాయ మాస్కులు ప్రసిద్ధికెక్కాయి. ఈ మాస్కుల తయారీ కళ 16వ శతాబ్దం నుంచి మనుగడలో ఉందని చరిత్ర చెబుతోంది. వారసత్వ కళగా ఉన్న ఈ ప్రాంతాల్లోని కొన్ని కుటుంబాలకు ఏఎస్ఆర్ఎల్ఎం వారధిగా నిలిచింది. మైక్రో ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎంఈడీపీ)లో భాగంగా కళాకారులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఉపాధిబాట పట్టించింది. వారి వారసత్వ కళను ప్రోత్సహించి వాటిని మార్కెటింగ్ చేసేందుకు ఏర్పాటు చేసింది. కళాకారుల కుటుంబాల్లోని మహిళలతో స్వయం సహాయక సంఘం(ఎస్‌హెచ్‌జీ)గా ఏర్పాటు చేసింది. పదిహేను మంది ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఇలా రెండు బృందాలు ఈ మాస్కులను తయారు చేస్తున్నాయి. సహజసిద్ధ రంగులతో తయారు చేసే ఈ మాస్కులను బహిరంగ మార్కెట్‌కు తరలించి విక్రయించడమే కాకుండా ఆ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెట్‌లోకి సైతం అడుగుపెట్టింది. వీటికి గతేడాది మార్చిలో జీఐ ట్యాగింగ్ (భౌగోళిక గుర్తింపు)ను ప్రభుత్వం ఇచ్చింది.

మాజులీ ఫేస్‌మాస్కులు తయారు చేస్తూ...

సహజసిద్ధ సరుకుతో...

అస్సాం రాష్ట్రంలోని మాజులీ ద్వీపంలోని కళాకారులు ఈ ఫేస్ మాస్కులను తయారు చేస్తున్నారు. వెదురు కర్ర ముక్కలు, బ్రహ్మపుత్ర నదీలో లభించే బంక మట్టి, ఆవు పేడ, జూట్, పేపర్, కాటన్‌తో ఈ మాస్కులు తయారు చేస్తారు. ముందుగా తయారు చేసే ముఖ ఆకృతిని వెదురు ముక్కలతో ఫ్రేమ్ మాదిరి తయారు చేసి వాటికి బంకమట్టి, ఎండిన ఆవుపేడ పొడి కలిపిన మిశ్రమంతో ఆ ఫ్రేమ్‌పైన పూతలా అద్దుతారు. ఈ ప్రక్రియలో జూట్, పేపర్, కాటన్‌ను అనువైన రీతిలో వినియోగిస్తారు. ఈ నమూనా పూర్తిగా ఎండిన తర్వాత వాటికి అవసరమైన రంగులు అద్దుతారు. ప్రస్తుతం సూరత్ నుంచి దిగుమతి చేసుకునే రంగులను వినియోగిస్తున్నారు. సహజసిద్ధమైన రంగుల వినియోగం ఖరీదవుతుందని, త్వరలో ఈ రంగులను స్థానికంగా తయారు చేసిన తర్వాత పూర్తిస్థాయిలో వీటినే వినియోగిస్తామని వాటిని తయారు చేస్తున్న మహిళలు చెబుతున్నారు. ఈ మాస్కులు మూడు రకాల పరిమాణంలో ఉంటాయి. మొదటి రకం కేవలం మొహాన్ని మాత్రమే కవర్ చేస్తుండగా... రెండో రకం నటుడి శరీరంలో మెజార్టీ భాగాన్ని కవర్ చేస్తుంది. మూడో రకం మాత్రం అవసరానికి అనుగుణంగా వాటిని తయారు చేస్తారు. ఈ కళను పరిరక్షించి ఆధునీకరించేందుకు పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ హేమ్‌చంద్ర గోస్వామి కృషి చేశారు. ప్రస్తుతం వీటిని నాటకాల్లో మాత్రమే వినియోగించకుండా పర్యాటకుల జ్ఞాపికలుగానూ, అలంకరణ వస్తువులగానూ వినియోగిస్తున్నారు.

మార్కెట్‌లో ఇలా...

కళాకారులు తయారు చేసే మాస్కులపైనే ఆదాయం ఆధారపడి ఉంటుంది. ఒక్కో మాస్కుపైన రూ.100 పెట్టుబడి పెడితే చాలు సంతృప్తికరమైన ఆదాయం ఉంటుంది. మహిళలు తయారు చేసే ఒక్కో మాస్కు కనీస ధర రూ.200 నుంచి ప్రారంభమవుతుంది. ఫేస్ మాస్కు పరిమాణం ఆధారంగా వీటి ధర రూ.3వేల వరకు ఉంటుంది. ఈ మాస్కుల తయారీ ద్వారా మహిళా సంఘానికి నెలకు కనీసం రూ.50 వేల ఆదాయం లభిస్తోంది. ప్రస్తుతం ఈ తయారీ ప్రక్రియ ప్రారంభదశలో ఉండగా... రానున్న ఏడాదిలో ఆర్థిక స్థితి భారీగా వృద్ధి సాధిస్తుందని, ఈమేరకు వ్యూహాత్మక కార్యాచరణ రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.

మాజులీ నుంచి
– చిలుకూరి అయ్యప్ప, సాక్షి,

● న్యూస్‌మేకర్

పట్టిన చెట్టు విడువ లేదు...

కెన్యాలోని న్యారీ కౌంటీలో పర్యావరణ కార్యకర్త ట్రంఫెనా ముతోని నాలుగు రోజుల క్రితం ఒక చెట్టును పట్టుకుని నిలబడిపోయింది. 72 గంటల పాటు ఆ చెట్టును వదలకుండా ఉంది. నిద్ర పోలేదు. విశ్రాంతి తీసుకోలేదు. కాలకృత్యాల కోసం కూడా అతి తక్కువ సమయమే తీసుకుంది. ఒక దశలో వాటి అవసరమే రాలేదు.

72గంటల పాటు ఆమె చేస్తున్న నిరసనను ఆన్‌లైన్‌లో సోషల్ మీడియాలో జనం చూశారు. చాలా మంది నేరుగా వచ్చి చూశారు. మరెంతో మంది దశలు దశలుగా చూస్తూ ఉండిపోయారు. ఆరోగ్య కార్యకర్తలు దగ్గరే ఉండి ఆమె ఆరోగ్యాన్ని గమనిస్తూ వచ్చారు. జనం చప్పట్లతో ఆమెను ఉత్సాహపరిచి 72 గంటల తర్వాత నిరసనను ముగించేలా చూశారు. ముతోని గతంలో కూడా ఇలాగే 48 గంటల పాటు చెట్టును కావలించుకుని ఉండిపోయి రికార్డు స్థాపించింది. ఇప్పుడు తన రికార్డును తానే బ్రేక్ చేసింది. ఇది గిన్నెస్ రికార్డు అని పరిశీలకులు భావిస్తున్నారు.

'నేను ఈ పని ప్రచారం కోసమో, డబ్బు కోసమో చేయడం లేదు. నాలాంటి యువతీ యువకులు పర్యావరణ సంరక్షణ అవసరాన్ని తెలుసుకోవాలని చేస్తున్నాను. నన్ను చూసి ఏ మూల ఏ ఒక్కరైనా ఒక్క చెట్టు నాటినా నా నిరసనలోని ప్రతి సెకండ్ సద్వినియోగం అయినట్టే భావిస్తాను' అని నిరసన ముగించాక ముతోని మీడియాతో అంది. ఈ 72 గంటలలో ఒక రాత్రి భారీగా వాన పడింది. అయినా ముతోని చలించలేదు. చెట్టును కరుచుకుని ఉండిపోయింది. ఆమె దృఢ నిరసనకు ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాలో స్పందన వచ్చింది.

కెన్యాలో అడవుల నరికివేత మాత్రమే కాదు మృగాల సంహారం కూడా సాగుతూ ఉన్న దరిమిలా ఈ నిరసన ఏ మార్పుకు కారణమవుతుందో చూడాలి.

● బ్యూటిప్స్

రెండు టేబుల్ స్పూన్ల టీ డికాషన్‌ను ఫ్రిజ్‌లో అరగంటసేపు ఉంచి తీసేయాలి.అందులో దూది ఉండను ముంచి, కనురెప్పల మీద పెట్టి, ఇరవై నిముషాలు విశ్రాంతి తీసుకోవాలి. అలసిన కళ్లకు మంచి సాంత్వన లభిస్తుంది. కళ్లకిందవలయాలు తగ్గుతాయి.

చలికాలం చర్మం పొడిబారే సమస్య ఉండటం వల్ల కాలిపగుళ్లు విసిగిస్తుంటాయి. అలాంటప్పుడు అలోవెరా జెల్‌ను పగిలిన కాలి మడమలకు, గాయాలకు రాస్తే త్వరగా తగ్గుతాయి. చర్మం మృదువుగా తయారవుతుంది.

భారత్ X దక్షిణాఫ్రికా
ధర్మశాలలో నేడు
మూడో టి20 మ్యాచ్
రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత్ X పాకిస్తాన్
దుబాయ్‌లో నేడు ఇరు జట్ల మధ్య
ఆసియా కప్ అండర్-19 టోర్నీ మ్యాచ్
ఉదయం గం. 10:30 నుంచి
సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మెస్సీ మాయలో...

హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ దిగ్గజం సందడి

ఊగిపోయిన ఉప్పల్ స్టేడియం • సీఎం రేవంత్‌తో సరదా ఆట • విజయవంతంగా ఈవెంట్ నిర్వహణ

‘మెస్సీ కిక్ కొట్టిన బంతి నా వైపే దూసుకొచ్చింది. ఒక్కసారిగా ఎంతో భావోద్వేగానికి గురయ్యాను’... ఒక పదో తరగతి పిల్లాడి ఆనందం... ‘పదేళ్ల క్రితం మెస్సీ చాంపియన్స్ లీగ్ గెలిచినప్పటి నుంచి అతని ఆటంటే చాలా ఇష్టం. ఇప్పుడు ప్రత్యక్షంగా చూడటంతో నా కల నెరవేరింది’... ఒంటిపై మెస్సీ టాటూ వేసుకున్న ఒక వీరాభిమాని సంతోషమిది. మెస్సీ మైదానంలో గడిపింది గంట సమయం మాత్రమే కావచ్చు. కానీ ఫ్యాన్స్‌కు సంబంధించి అది అమూల్యమైన సమయం... అతని ప్రతీ కదలిక, వేసిన ప్రతీ అడుగు వారిలో అమిత ఉత్సాహాన్ని రేపింది. మెస్సీ కూడా ఉన్నంత సేపు చాలా సరదాగా, జాలీగా కనిపించడం ఈ మెగా ఈవెంట్ సక్సెస్‌కు సరైన సూచిక.

మెస్సీ

రన్నరప్ అపర్ణ ఆల్‌స్టార్స్ జట్టుతో మెస్సీ, ఉదయ్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: నగర ఫుట్‌బాల్ అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూసిన లయోనల్ మెస్సీ షో విజయవంతంగా ముగిసింది. ‘గోట్ ఇండియా టూర్’లో భాగంగా రెండో నగరమైన హైదరాబాద్‌లో జరిగిన ఈ ఈవెంట్ ఎలాంటి ఇబ్బందులు, ప్రతిబంధకాలు లేకుండా సాఫీగా సాగింది. శనివారం ఉదయం కోల్‌కతాలో జరిగిన ఘటన నేపథ్యంలో హైదరాబాద్ కార్యక్రమంపై కాస్త సందేహాలు తలెత్తాయి. అయితే ప్రభుత్వం పూర్తి స్థాయిలో పటిష్ట ఏర్పాట్లు చేసి ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడింది. దాంతో అటు మెస్సీ బృందంతోపాటు ఇటు అభిమానులు కూడా సంతృప్తిగా మైదానాన్ని వీడారు.

రేవంత్‌కు పాస్‌లు...

మెస్సీ టూర్ ఖరారైన రోజు నుంచి ప్రభుత్వం హడావిడి చేసిన మెస్సీ వర్సెస్ రేవంత్ మ్యాచ్ మాత్రం జరగలేదు కానీ... మెస్సీ, సీఎం మధ్య కొన్ని సరదా కిక్‌లు, పాస్‌లు మాత్రం నడిచాయి. మెస్సీ ఇచ్చిన పాస్‌లు చక్కగా అందుకున్న రేవంత్ రెడ్డి వాటిని మళ్లీ రిటర్న్ కూడా చేశారు. స్వారెజ్, రోడ్రిగో కూడా దీనికి జత కలిశారు. ఈ నలుగురు కలిసి ఆడుతున్న సమయంలో స్టేడియంలో ఫ్యాన్స్ పెద్ద ఎత్తున విజిల్స్, కేకలతో సందడి చేశారు. చివరకు మెస్సీ కొట్టిన ఒక కిక్ రేవంత్‌ను దాటి గోల్ పోస్ట్‌లోకి వెళ్లడంతో ఈ ఆట ముగిసింది. దీనికి ముందు రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన సింగరేణి ఆర్‌ఆర్ టీమ్, అపర్ణ మెస్సీ ఆల్‌స్టార్స్ టీమ్ మధ్య ఎగ్జిబిషన్ మ్యాచ్ జరిగింది. ఇందులో సింగరేణి టీమ్ విజేతగా నిలిచింది.

చిన్నారులతో సందడి...

ముందుగా ఎంపిక చేసిన వర్ధమాన ఫుట్‌బాలర్లు, చిన్నారులతో కూడా మెస్సీ కొద్దిసేపు ఆడాడు. వీటి కోసం నాలుగు వేర్వేరు జోన్‌లను ఏర్పాటు చేయగా, ప్రతీ చోటికి వెళ్లి ‘గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్’ కొంత సమయం కేటాయించాడు. మెస్సీతో కలిసి ఆడిన వారిలో అంతుపట్టలేని ఆనందం కనిపించింది. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి మనవడు కూడా సందడి చేశాడు. అతని వైపు కూడా మెస్సీ రెండు పాస్‌లు ఇవ్వడం విశేషం.

స్టాండ్స్‌లోకి బంతులు...

స్టేడియంలో అభిమానులను బాగా అలరించి వారంతా పూర్తిగా ఎంజాయ్ చేసింది మాత్రం మెస్సీ స్పెషల్ కిక్‌లతోనే. ఆ సమయంలో మాత్రం స్టేడియంలో పూర్తి స్థాయిలో హోరెత్తిపోయింది. అతను ప్రత్యేకంగా పెనాల్టీలు ఆడకపోయినా... నిర్వాహకులు ఇచ్చిన బంతులను తనదైన శైలిలో కిక్‌లతో స్టాండ్స్‌లోకి పంపించాడు. బంతిని అందుకొని అర్జెంటీనా స్టార్ కిక్‌కు సిద్ధమైన ప్రతీ సారి ఉప్పల్ ఊగిపోయింది. ఆ బంతులను అందుకోవడంలో స్టాండ్స్‌లో ఫ్యాన్స్ ఒక్కసారిగా ఎగబడ్డారు. కానీ కొందరు అదృష్టవంతులకే ఆ అవకాశం దక్కింది!

ఉల్లాసంగా...ఉత్సాహంగా...

మెస్సీ మొత్తం ‘షో’లో అతను మైదానంలో గడిపిన తీరే చెప్పుకోదగ్గ విశేషం. అక్కడ ఉన్నంత సేపు అతను చాలా ఉత్సాహంగా, నవ్వుతూ గడిపాడు. ముందుగా ప్రేక్షకుల హర్షధ్వానాలతో మైదానంలోకి రావడం మొదలు చివరి వరకు అతను దీనిని కొనసాగించాడు. ఉదయం కోల్‌కతాలో రసాభాసగా మారిన ఈవెంట్‌లో పూర్తి అసౌకర్యంగా కనిపించిన అతను హైదరాబాద్‌లో మాత్రం అలాంటి ఛాయలు కూడా కనపడనివ్వలేదు. ఇరు జట్ల ఆటగాళ్లతో కరచాలనం, రేవంత్‌తో ఆడిన కొద్దిసేపు, ఆపై చిన్నారులతో ఆట, స్టాండ్స్‌లోకి కిక్ కొడుతూ ఉత్సాహం నింపడం, చివర్లో గ్రూప్ ఫోటోలు... ఇలా ఎక్కడైనా అతనిలో చిరునవ్వు చెక్కుచెదర్లేదు. ఎక్కడా ఎలాంటి అసహనాన్ని ప్రదర్శించలేదు. ఆఖర్లో ‘హైదరాబాద్‌కు రావడం సంతోషంగా ఉంది. మీరు ఎంతో ప్రేమాభిమానాలు చూపించారు’ అంటూ కృతజ్ఞతలు చెప్పడం వరకు చూస్తే అతను కూడా హైదరాబాద్ టూర్‌ను బాగానే ఎంజాయ్ చేసినట్లు కనిపించాడు. ఆఖర్లో మెస్సీకి ముఖ్యమంత్రి జ్ఞాపిక అందించగా, స్వారెజ్‌కు రాహుల్ గాంధీ జ్ఞాపిక ఇచ్చారు. వీరిద్దరికీ మెస్సీ తన ఆటోగ్రాఫ్‌తో కూడిన జెర్సీలను అందించాడు.

అభిమానం ఆగ్రహించింది

రసాభాసగా మెస్సీ కోల్‌కతా కార్యక్రమం

మనకిప్పుడు శీతాకాలం. డిసెంబర్, జనవరిలో అయితే ఎముకలు కొరికే చలి ఉంటుంది. ఇంతటి చలిని సైతం లెక్కచేయకుండా కోల్‌కతా వాసులు తమ ఆరాధ్య ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ రాక కోసం ఒళ్లంతా కళ్లు చేసుకొని రేయి అంతా వేచి చూశారు. తెల్లవారుజాము 2 గంటల 26 నిమిషాలకు మెస్సీ రాకతో ‘గోట్ ఇండియా టూర్-2025’ మొదలైంది.

- ఇంటర్ మయామి, బార్సిలోనా సహచరులు స్వారెజ్, రోడ్రిగో డి పాల్‌లతో కలిసి మెస్సీ భారత్‌లో అడుగుపెట్టాడు. వేల సంఖ్యలోని బెంగాలీ అభిమానులు, చిన్నారులు తమ తండ్రి భుజాలపై గంటల తరబడి ఫోన్ లైట్లు, కెమెరా ఫ్లాష్ లైట్లు, ఇవేవి లేనివాళ్లు చేతి వేళ్లతో ఈల, గోలలతో ఘన స్వాగతం పలికారు.
- ఎయిర్‌పోర్ట్ నుంచి మెస్సీ నేరుగా హోటల్‌కు వెళ్లిపోయాడు. హోటల్ గది నుంచే తన 70 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించారు. బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తన కుమారుడు అబ్‌రామ్‌తో వచ్చి మెస్సీని కలిశాడు.

మెరుపు కలలా....

మెస్సీ అన్నా... మెస్సీ 10 నంబర్ జెర్సీ అన్నా... ఆ క్రేజ్ గురించి చెప్పనక్కర్లేదు. జెర్సీనే వేసుకొని సంబరపడిపోయే అభిమానులకు అతనే తమ నగరానికి వచ్చి మైదానంలోకి దిగుతాడంటే ఎవరు మాత్రం ఎగబడరు చెప్పండి? అందుకే కోల్‌కతా వాసులు రూ.వేలల్లో టికెట్లు కొని సాల్ట్‌లేక్ స్టేడియానికి వచ్చారు. ఎప్పుడు టీవీల్లో కనపడే మెస్సీ ప్రత్యక్షంగా కళ్లముందు ఆడితే ఆ మజానే వేరు! ఇక పండగ చేసుకోవచ్చనుకున్నారు. అతను కిక్ కొడితే మనకెక్కే కిక్కు మరో దశలో ఉంటుందనుకొని అభిమానులందరూ స్టేడియానికి పోటెత్తారు. కానీ తీరా చూస్తే పట్టుమని పది నిమి**షాలైనా తమ ఆరాధ్య అర్జెంటీనా స్ట్రయికర్ లేకపోవడంతో సుమారు 80 వేల మంది అభిమానుల** ఆగ్రహం కట్టలు తెగింది. రూ. వేలల్లో కొన్నవారు, రూ. వేల టికెట్‌కు లక్ష పైచిలుకు బ్లాకులో వెచ్చించిన వారు మెస్సీ మెరుపు కలలా వచ్చి

పోవడాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేకపోయారు. గోల చేశారు. చేతిలో ఉన్న బాటిళ్లను మైదానంలోకి కోపంగా విసిరారు. అంతటితో ఆగలేదు... కూర్చున్న కుర్చీలను ఎత్తి పడేశారు. ఫ్లెక్సీలను చించేశారు. రెయిలింగ్‌కు కట్టిన బ్యానర్లను నేల మట్టం చేశారు. అభిమానుల వీరంగంతో మైదానం రణరంగంగా మారిపోయింది.

అదుపులో నిర్వాహకుడు

అభిమానుల ఆగ్రహం చల్లార్చేందుకో... లేదంటే పరిస్థితిని చక్కబెట్టేందుకో తెలీదు కానీ ‘గోట్ టూర్’ ప్రధాన నిర్వాహకుడు శతద్రు దత్తాను అదుపులోకి తీసుకున్నట్లు కోల్‌కతా పోలీసులు ప్రకటించారు. మరోవైపు నిర్వాహకుడు సైతం టికెట్ల రుసుం వెనక్కి ఇస్తామని ప్రకటించారు. మొత్తానికి సాల్ట్‌లేక్ మైదానంలో ఇంతటి ఆగ్రహజ్వాల జరిగినా పోలీసుల సమన్వయంతో ఎలాంటి తొక్కిసలాటకు దారి తీయలేదు. తమ రాష్ట్ర ప్రజల ప్రవర్తన, ఈవెంట్ నిర్వహణ వైఫల్యంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోషల్ మీడియా వేదికగా మెస్సీని క్షమాపణలు కోరారు.

సాక్షి సినిమా

మరో కాలానికి వెళ్లడం ఆసక్తిగా ఉంటుంది

- సంగీతదర్శకుడు మిక్కీ జే మేయర్

రోషన్, అనస్వర రాజన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘చాంపియన్’. జీ స్టూడియోస్ సమర్పణలో ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్, స్వప్న సినిమాస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ చిత్రం సంగీతదర్శకుడు మిక్కీ జే మేయర్ మాట్లాడుతూ – ‘‘స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కథతో ‘చాంపియన్’ సినిమా రూపొందింది. ఈ తరహా సినిమాలకు సంగీతం అందించడం నాకు ఇలా ఇష్టం. ఎందుకంటే ఒక టైమ్ నుంచి మరో టైమ్‌లోకి వెళ్లి మరో కాలాన్ని చూడడమనేది ఆసక్తికరంగా ఉంటుంది. ‘మహానటి’ సినిమా నాకు అలాంటి అనుభూతినే ఇచ్చింది. ‘చాంపియన్’లో నిజాం బ్యాక్‌డ్రాప్ ఉంటుంది. ఈ సినిమాలో మొత్తం నాలుగు పాటలు ఉన్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ‘సల్లంగుండాలి, గిర గిర గిర గింగిరాగిరే..’ పాటలకు మంచి స్పందన లభిస్తోంది. తెలంగాణ జానపదంతో పాటు వెస్ట్రన్ మ్యూజిక్‌ను మిళితం చేసి ఒక జానర్‌ను క్రియేట్ చేసే అవకాశం ఈ కథ కల్పించింది. ఈ కథలో హీరోకు సికింద్రాబాద్ బ్యాక్‌డ్రాప్ ఉంటుంది. నేను కూడా సికింద్రాబాద్‌లోనే పెరిగాను. నాకు ఆ కల్చర్ పై అవగాహన ఉంది. యాక్టర్‌గా, డ్యాన్సర్‌గా... ఇలా రోషన్ ఆల్ రౌండర్ పెర్ఫార్మెన్స్ చేశాడు. ప్రదీప్ చక్కగా డైరెక్ట్ చేశాడు’’ అని చెప్పారు.

• వెంకటేశ్

సూపర్ స్టైల్

‘‘మై డియర్ వెంకీ జన్మదిన శుభాకాంక్షలు. నువ్వెక్కడ ఉన్నా నీ చుట్టూ పాజిటివిటీ పంచుతుంటావు. ‘మన శంకర వరప్రసాద్‌గారు’ షూటింగ్‌లో మనం గడిపిన ప్రతి క్షణాన్ని నేనెంతో మధురంగా గుర్తు చేసుకుంటాను’’ అని సోషల్ మీడియా వేదికగా వెంకటేశ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు చిరంజీవి. డిసెంబరు 13 వెంకటేశ్ బర్త్ డే. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి, ‘మన శంకరవరప్రసాద్‌గారు’లో ఆయన చేసిన కీ రోల్ లుక్‌ని విడుదల చేసింది యూనిట్. ఈ చిత్రంలో వెంకటేశ్ సూపర్ స్టైలిష్ క్యారెక్టర్ చేశారని లుక్ స్పష్టం చేస్తోంది. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించిన చిత్రం ‘మన శంకర వరప్రసాద్ గారు’. చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జనవరి 12న రిలీజ్ చేయనున్నామని శనివారం నిర్వహించిన విడుదల తేదీ ప్రకటన వేడుకలో దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు.

గీతాంజలి మళ్లీ వస్తోంది

• నాగార్జున, గిరిజ

నాగార్జున నటించిన అద్భుతమైన ప్రేమకథా చిత్రాల్లో ‘గీతాంజలి’ది ప్రత్యేకమైన స్థానం. 1989లో మణిరత్నం దర్శకత్వంలో నాగార్జున, గిరిజ జంటగా రూపొందిన ఈ చిత్రం ఘనవిజయం సాధించింది.
35 ఏళ్ల తర్వాత ఈ చిత్రం మళ్లీ వెండితెరపైకి రానుంది. చెన్నై మినహా ఈ చిత్రం ప్రపంచవ్యాప్త విడుదల హక్కులను శ్రీ పద్మినీ సినిమాస్ అధినేత బూర్లె శివప్రసాద్ దక్కించుకున్నారు. ‘‘4కే రిజల్యూషన్‌తో మంచి క్వాలిటీతో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. ‘గీతాంజలి’ నాకెంతో ఇష్టమైన సినిమా. అందుకే రీ-రిలీజ్ చేయాలనుకున్నాను. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం. ఈ అద్భుతమైన ప్రేమకథా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాను’’ అని బూర్లె శివప్రసాద్ పేర్కొన్నారు.

ఎమోషన్స్‌కి కనెక్ట్ అవుతున్నారు

- దర్శకుడు సందీప్ రాజ్

• సందీప్ రాజ్, విశ్వప్రసాద్, రోషన్, సాక్షి, హర్ష

రోషన్ కనకాల, సాక్షీ మడోల్కర్ జోడీగా నటించిన చిత్రం ‘మోగ్లీ 2025’. వైవా హర్ష, బండి సరోజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించారు. సందీప్ రాజ్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం శనివారం విడుదలైంది. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌లో రోషన్ మాట్లాడుతూ– ‘‘ఈ సినిమానే నా జీవితం అనుకుని ఒక్క నిమిషం కూడా రిలాక్స్ కాకుండా వర్క్ చేశాను. ఇప్పుడు ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి లభిస్తున్న స్పందన సంతోషాన్నిస్తోంది. మా సినిమా టికెట్ ధర. రూ. 99 మాత్రమే. ఫ్యామిలీతో కలిసి థియేటర్స్‌కి వెళ్లి చూడండి... ఎంజాయ్ చేస్తారు’’ అన్నారు. ‘‘ఈ సినిమాలోని ఎమోషన్స్, కామెడీకి ఆడియన్స్ కనెక్ట్ అవుతున్నారు’’ అని చెప్పారు సందీప్ రాజ్. ‘‘శుక్రవారం ‘మోగ్లీ 2025’ ప్రీమియర్స్ వేశాం. ఇక మోగ్లీ సైజ్ ఉన్న సినిమాకు 90 శాతం ఆక్యుపెన్సీ రావడం మంచి విషయం. రోషన్‌కి ఒక మంచి సినిమా ఇచ్చామనుకుంటున్నాం’’ అన్నారు టీజీ విశ్వప్రసాద్.

మీరు అనుకున్నది కాదు

• తల్లాడ సాయికృష్ణ, దశరథ్, ఏకదంతాయ సిరి

తల్లాడ సాయికృష్ణ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి ‘మ్యాజిక్ మూమెంట్స్’ అనే టైటిల్ ఖరారైంది. ‘మీరు అనుకున్నది కాదు’ అనేది ట్యాగ్‌లైన్. ఏకదంతాయ సిరి హీరోయిన్‌గా నటించారు. దర్శకుడు కె. దశరథ్ సమర్పణలో తల్లాడ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో దశరథ్ మాట్లాడుతూ– ‘‘మంచి సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా ఇది. సినిమా అంటే ప్యాషన్ ఉన్న సాయికృష్ణకు సపోర్ట్ ఇవ్వాలనే ఈ చిత్ర సమర్పణకు ముందుకు వచ్చాను’’ అన్నారు. సాయికృష్ణ మాట్లాడుతూ– ‘‘సాయిబాబా ఆశీస్సులు ఇస్తున్నట్లుగా ఉన్న ఫొటో ఒకటి మా ఇంట్లో ఉంది. ఆ ఫొటో చూసిన స్ఫూర్తితో ‘మ్యాజిక్ మూమెంట్స్’ సినిమా స్క్రిప్ట్ మొదలైంది. మంచి సస్పెన్స్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో పాటు డివోషనల్ టచ్ కూడా ఈ మూవీలో ఉంది’’ అని చెప్పారు. ‘‘ఈ సినిమాలో ముఖ్య పాత్ర చేశాను. తల్లాడ సాయితో మరో పెద్ద సినిమా నిర్మించనున్నాను’’ అని చెప్పారు తల్లాడ వెంకన్న. ‘‘ఈ సినిమాలో మంచి రోల్ చేశాను’’ అన్నారు సహ నిర్మాత వెంకట్ దుగ్గిరెడ్డి.

దండోరా... దండోరా

• రవికృష్ణ, మనికా, రవీంద్ర బెనర్జీ, నందు

శివాజీ, నవదీప్, బిందు మాధవి, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘దండోరా’. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సినిమా టైటిల్ సాంగ్ లాంచ్ ఈవెంట్ శనివారం జరిగింది. ‘‘నిను మోసినా నను మోసినా అమ్మ పేగు ఒకటేనన్నా, నిను కోసినా నను కోసినా రాలే రగతం ఎరుపేనన్నా, చిన్నా పెద్దా తేడా ఎట్లొచ్చేరా... నన్ను తొక్కే హక్కు ఎవడిచ్చేరా... దండోరా... దండోరా...’ అంటూ ఈ పాట సాగుతుంది. కాసర్ల శ్యామ్ సంగీతం అందించిన ఈ పాటను ఆంథోని దాసన్‌తో కలిసి ఈ చిత్రం సంగీతదర్శకుడు మార్క్ కె. రాబిన్ పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో శివాజీ మాట్లాడుతూ– ‘‘తెలంగాణ రూటెడ్ ఫిల్మ్ ఇది. ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్... అన్నీ ఉన్నాయి’’ అన్నారు. ‘‘ఈ ఏడాది గుర్తుపెట్టుకునే సినిమాల్లో ‘దండోరా’ ఉంటుంది’’ అని చెప్పారు రవికృష్ణ. ‘‘కులవ్యవస్థపై లోతైన విషయాలను హ్యూమరస్‌గా, కమర్షియల్ వేలో చెప్పే ప్రయత్నం చేశాం’’ అన్నారు నందు. ‘‘ఏం చెప్పదలచుకున్నామో ఈ డిసెంబరు 25న థియేటర్స్‌కు వచ్చి చూడండి’’ అన్నారు మురళీకాంత్. ‘‘ఈ ‘దండోరా’ సాంగ్‌లోని ఎమోషన్ సినిమాలోనూ ఉంటుంది’’ అని పేర్కొన్నారు రవీంద్ర బెనర్జీ. ప్రేక్షకులు ‘దండోరా’ సినిమాను ఆదరించాలని మ్యూజిక్ డైరెక్టర్ మార్క్ కె. రాబిన్, హీరోయిన్ మణిక, ఎడిటర్ సృజన్ కోరారు.

శవాల్ని దొంగతనం చేయాలా?

• ‘గుర్రం పాపిరెడ్డి’ పోస్టర్

నరేశ్ అగస్త్య టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం ‘గుర్రం పాపిరెడ్డి’. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించారు. డా. సంధ్య గోలీ సమర్పణలో మురళీ మనోహర్ దర్శకత్వంలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించిన ఈ డార్క్ కామెడీ ఎంటర్‌టైనర్ ఈ నెల 19న రిలీజ్ కానుంది. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ‘మనందరం శ్రీశైలం పోతున్నాం. శ్రీశైలం అడవిలో ఉన్న ఓ సమాధి నుండి బాడీని తవ్వుకుని రావాలి. శవాలను దొంగతనం చేయాలా? శవాలను దొంగతనం చేసే ముఠా రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు..., ఏదో ఒకటి చెయ్ గుర్రం పాపిరెడ్డి వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఇది మామూలు సిరీస్ అయితే కాదు

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ సిరీస్ కుట్రమ్ పురిందవన్ ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.

ఒక సినిమా ఊహకందని సన్నివేశాలతో నడిస్తే అది దర్శకుడి ప్రతిభగా చెప్పొచ్చు. దానినే సినీ పరిభాషలో గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే అంటారు. ఇలాంటి స్క్రీన్‌ప్లేతో, తర్వాత ఏం జరుగుతుందో ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఇటీవల సోనీలివ్ ఓటీటీ వేదికగా విడుదలైన ఓ సిరీస్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. అదే ‘కుట్రమ్ పురిందవన్’. ఈ సిరీస్‌కి సెల్వమణి మునియప్పన్ దర్శకత్వం వహించారు. ఈ సిరీస్ ఆఖరి రెండు ఎపిసోడ్ల ట్విస్టులు చూస్తే మతి పోవడం ఖాయం. అంతలా ఈ సిరీస్‌లో ఏముందో, కథాంశం ఏంటో చూద్దాం. తమిళనాడులోని ఓ కుగ్రామంలో జరిగే జాతర నుండి ఈ సిరీస్ ప్రారంభమవుతుంది. ఉద్యోగ రీత్యా ఫార్మసిస్ట్ అయిన భాస్కర్ తన మనవణ్ణి జాతర మధ్యలోనే ఇంటికి తీసుకువెళుతుంటాడు. దారి మధ్యలో తన ఇంటి పక్కన ఉన్న స్టీఫెన్ తాగి రోడ్డుకు అడ్డదిడ్డంగా నడుస్తూ కనబడతాడు. ఇంటికి వచ్చిన కాసేపటికి భాస్కర్ ఇంటి తలుపులు ఎవరో బాదుతుంటారు. తలుపు తీస్తే... ఇందాక కనిపించిన స్టీఫెన్ స్పృహ తప్పిపోయిన అతని కూతురు మెర్సీని తీసుకు వచ్చి కాపాడమని భాస్కర్‌ని అడుగుతాడు.

తనకి అంత పెద్ద వైద్యం తెలీదన్నా భాస్కర్ చేతుల్లో మెర్సీని పెట్టి బయటకు వెళతాడు స్టీఫెన్. మెర్సీని చూసి భాస్కర్ కంగారుపడుతుండగా స్టీఫెన్ ఆ అంతస్తు నుంచి కిందపడి చనిపోతాడు. ఇవతల మెర్సీ కూడా చనిపోయి ఉంటుంది. ఇక్కడ మెర్సీ, అక్కడ స్టీఫెన్ ఎలా చనిపోయారో తెలియక భాస్కర్ కంగారు పడుతుంటాడు. ఈలోపల మెర్సీ బాడీని మాత్రం తన ఫ్రిజ్‌లో దాస్తాడు భాస్కర్. మరోవైపు తన మనవడి సర్జరీ కోసం తన పెన్షన్ డబ్బుల కోసం వెయిట్ చేస్తూ ఉంటాడు భాస్కర్. మర్డర్ కేస్ తన మీదకు వస్తే ఆ డబ్బులు ఆగిపోతాయన్న భయంతో మెర్సీ బాడీని దాస్తాడు భాస్కర్. ఆ తరువాత ఆ మిస్టరీ ఎలా వీడుతుంది? అన్నది మాత్రం సిరీస్‌లో చూడవలసిందే. ముఖ్యంగా ఈ సిరీస్ ఆఖర్లో వచ్చే ట్విస్టులను ఎవ్వరూ ఊహించలేరు. పిల్లలు తప్ప పెద్ద వాళ్ళకి ఇదో అద్భుతమైన వీకెండ్ సిరీస్... మస్ట్ వాచ్.

– హరికృష్ణ ఇంటూరు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను

దూదేకుల /31/5'6"/డిగ్రీ, ఓన్ హౌస్, బిజినెస్, ప్రాపర్ వరంగల్ జిల్లా వరునికి తగిన వధువు కావలెను. Cast No Bar (Except SC) కట్నం ప్రసక్తి లేదు. Self: 8985773533 [HA-801306]

రజక/M.Tech/C.Govt/ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ రైల్వే/90,000 PM/5'11" ఎత్తు/29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9550166072 [HA-16178]

SC హిందుమాల/కట్నం ప్రసక్తి లేదు/ BE/ Govt. Asst. ఇంజినీర్ ట్రాన్స్‌కో/1 Lakh. PM/6' ఎత్తు/30 సం.ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 9908222406 [HA-16178]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/DAO Accounts ఆఫీసర్/70,000 PM/5'10" ఎత్తు/29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 7075953400 [HA-16178]

SC & మాల క్రిస్టియన్/కట్నం ప్రసక్తి లేదు/Govt. A.E.E/ ట్రాన్స్ కో/2Lakh. PM/5'8"ఎత్తు/28 సం.ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 9676995093 [HA-16178]

2వ పెళ్లి/CNB/ రెడ్డి/పిల్లలు లేరు /1st or 2nd మ్యాచ్ OK/45/5'9"/BE/2 Lakhs PM/20 Cr. ప్రాపర్టీ, వరుడికి వధువు కావలెను. అర్జెంట్ వాట్సాప్ : 8187053655, 6303293337 [HA-16178]

దేవాంగ(Cast No Bar)/ A.P. 41Y, 5'5" Fair, M.Tech, MCA, IRPM, Govt. Job, 4Cr, Prp. మంచి ఆదాయం గల వరునికి వధువు కావలెను (డైరెక్ట్) ఫోన్: 7036361292 [HA-16178]

40 సం॥/B.Tech/సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ /Salary: ₹ 1 lakh-P.M./ తగిన వధువు కావలెను. కుల, కట్నం ప్రసక్తి లేదు. Direct Contact: 7337586682. [SCA25010664]

Telaga, Kapu/ Age : 29/ 5'.10.6" / B.Tech/ M.S/ Employeed in Germany. Need a bride from good background. Cont : 99482 22017 [SCA25010557]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel - kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Divorcee/USA-Citizen/MS/ 1976/ 5'10"/500K/100Cr *1986/5'11"/ 350K/ 50Cr *Cont: K.C. Reddy-Mar - Bureau, Hyd. Ph: 9347807015 /9849321309

Reddy/Divorcee/B.Tech/MBA/Business/ 1993/5'10"/400Cr*1994/5'11"/250Cr/ *1981/ 5'8"/1500Cr *79/5'9"/300Cr *Cont: K.C. Reddy-Mar-Bureau, Hyd. Ph: 9849321309

Reddy/Divorcee/MBBS/MD/DM/1988/ 5'9"/80Cr *94/5'9"/100Cr *86/5'10"/ 10Cr *Cont: K.C. Reddy-Mar - Bureau, Hyd. Ph: 9347807015 /9849321309

Reddy/Divorcee/Business/MBA/1986/5'5" /1000Cr *1987/5'8"/70Cr * B.Tech/MS/ 1990/ 5'10"/80Cr *Cont: K.C. Reddy-Mar - Bureau, Hyd. Ph: 9347807015 /9849321309

Reddy/Divorcee/B.Tech/SWE/Hyd/1986/ 5"11"/70L/Yr/15Cr * MS/1989/ 5'11"/ 60L/ Yr/30Cr *Cont: K.C. Reddy-Mar - Bureau, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA/1992/6'/95K/ 30Cr *1986/6'/220k/10Cr *USA-Doctor/ 1982/ 5'8" *Cont: K.C. Reddy-Mar - Bureau, Hyd. Ph: 9347807015 / 9849321309

Reddy/Business/B.Tech/1982/5'8"/ 250Cr *1998/6'/400Cr *1995/6'/150Cr & 1993/5'7"/50Cr *Cont:K.C. Reddy - Hyd. Ph:9849321309/9347807015

Reddy/USA-Citi Zen/Now in Hyd, B.Tech/ MBA/ 1995/5'10"/ 230K/ 100 Cr *Cont : K.C. Reddy - Mar-Bureau-Pvt. Ltd- Hyd. Ph: 9347807015 / 9849321309

Reddy/B.Tech/MS/H1/USA/1995/5'10"/ 170K/20Cr*1997/5'7"/500K/20Cr *93/5'11"/ 240K/50Cr *95/5'8"/ 125K /20Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/MD/1996/6'/50Cr *90/5'10"/ 20 Cr / USA-Doc/1992/6' *95/5'8" *83/5'6"/ 50Cr * Cont : K.C. Reddy - Mar-Bureau-Pvt. Ltd- Hyd. Ph: 9347807015 / 9849321309

వరుడు కావలెను

Reddy/ Divorcee/B.Tech/MS/Job/ Hyderabad/ 1988/ 5'5"/70L/yr/15Cr *MBBS/ MD/ DM/ 1992/ 5'3"/ 10Cr *Cont: K.C. Reddy-Mar - Bureau- Hyd. Ph:9347807015 /9849321309

Reddy/Divorcee/B.Tech/MS/USA/Green Card/1991/5'3"/25Cr. & BDS/1995/ 5'5"/8Cr *Cont: K.C. Reddy-Mar-Bureau - Hyderbad. Ph:9849321309/9347807015

Reddy/Divorcee/B.Tech/MS/H1/USA/ 1994/5"2"/150K/8Cr *1992/6"/110K/* 85/ 5'4" 80K/10Cr. *1986/5'6"/20Cr *Cont: K.C. Reddy-Hyd. Ph:9347807015 /9849321309

Reddy/Divorcee/B.Tech/1997/5'4"/10Cr* MBBS/MD/1993/5'8"/40Cr * B Arch/ 1993/ 5'6"/50Cr. *B.Tech/MS/1992/5'5"/50Cr. *Cont: K.C. Reddy - Hyd- Ph : 9849321309

Reddy/Divorcee/MBBS/MD/DM/1988/ 5'4"/25Cr *M.Tech/1986/5'6"/20Cr * MBBS/ MD/ 1990/5'6"/10Cr *Cont: K.C. Reddy - Mar - Bureau, Hyd. Ph:9347807015

Reddy/Divorcee/B.Tech/MS/USA/ 1985/ 5'6"/10 Cr *1987/5'8"/3Cr * 1993/ 5'7"/15 Cr *1990/5'6"/2Cr *Cont: K.C. Reddy -Mar - Bureau, Hyd. 9849321309/9347807015

Reddy/Divorcee/B.Tech/MS/1994/ 5'2"/ 75Cr, *1990/5'6"/10Cr 1991/5'4"/10Cr * 1985/5'5"/400Cr *Cont: K.C. Reddy -Mar - Bureau, Hyd. 9347807015/9849321309

Reddy/Divorcee/MBBS/MD/1986/5'6"/50 Cr&B.Tech/1989/5'6"/10Cr *1992/5'6"/ 1Cr/ MBA/1994/5'4"/10Cr *Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/ 9849321309

Reddy/Divorcee/BA/1978/5'1"/Govt Job *1987/B.Tech/M.Tech/Govt. Officer/5'2"/ 10Cr *Cont:K.C. Reddy -Mar - Bureau - Hyd - Ph: 9849321309/ 9347807015

Reddy/Divorcee/USA/Doctor/MBBS/M BA/1984/5'4"/200K/B.Tech/MS/Hyd/199 1/5'8"/6Cr*Cont: K.C. Reddy - Mar- Bureau - Ph:9849321309/ 9347807015

[D-583]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No : 3, Banjara Hills (TV - 9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5 PM. www.avinashreddy.com + 91 98480 11818 , + 91 93933 11818

వధువు కావలెను

రెడ్డి Business, BS, MBA (ISB), 30, 5' 7", Very Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 28, 5' 7", SWE, USA, Rich Family, Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 27, 5' 10", Analytics Consultant, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyderbad. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 27, 6', Sr. SWE, 400 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 6', SWE, TCS, 9 L P/A, 7 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 6' 1", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, 33, 5'8", Engineer, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, 25, 5'8", SWE, 27L P/A, Hyd, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 2", SWE, 250 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MTech (BITS), 27,5'7", 20 L P/A, 6 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 32, 5' 7", Sr. SWE, 16 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 28, 5'8", SWE, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 29, 5' 8", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MBA (ISB), 36, 5' 4", Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyderabad. 9393311818, 9848011818.

LETTER

★★

వధువు కావలెను: ఆశించేవి: అనాథ/ First/sec, Caste no bar, Goa Engg 43, 5'8' Ph: 6304751936 [HA-34037]

డైరెక్ట్/45 / ప్రభుత్వ ఉద్యోగం/ఒంటరి వరుడికి కుల, మత, వయస్సు ప్రసక్తి లేని వధువు పెళ్ళి / తోడు / ఇల్లరికం అయినా ఓకే. సెల్ : 85199 34926. [SCA25010698]

డైరెక్ట్ కాంటాక్ట్:(నో బ్రోకర్స్)ఆర్యవైశ్య/ 43Yrs /5'.5"/బిజినెస్,జాబ్ 30 కోట్లు స్థిరాస్తి గల అబ్బాయికి అందమైన 1వ, 2వ అమ్మాయి కావలెను.✆79955 85722, 76808 72085. [T-2639]

42yrs, 2వ పెళ్ళి ఏ బాదరబంది లేని వరునికి ANM, GNM, B.Sc నర్సింగ్ Govt (or) Pvt. Job గల ఏ బాదరబంది లేని వధువు కావలెను. ఇల్లరికం OK. సెల్ నెం. 9704469413. [WA-6800]

వరుడు కావలెను

రెడ్డి/విడో/45Y/కుల, ఆస్తి, పట్టింపు లేదు/ Govt. Job, మంచి ప్రాపర్టీస్ గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము ఒకే) అన్ని వయస్సులు వారికి 1st/2nd మ్యారేజ్‌లు మా వద్ద కలవు. 9063558878 [HA-801306]

రెడ్డి 2nd (కుల-ఆస్తి), పట్టింపు లేదు/Age:31, Q: MBA/Own Business & Property's గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము ఒకే) అన్ని వయస్సులు వారికి 1వ/2వ సంబంధాలు కలవు. 9704782370 [HA-801306]

రెడ్డి /విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ Age:35, Q: Degree, Job/కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము ఒకే) 8074131208 [HA-801306]

49Y/ విడో/ 5'3"/Govt. లెక్చరర్/రూ.80,000/- సొంత ఇల్లు/కోచింగ్ సెంటర్/1,00,000/- ఆస్తి, కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను, పిల్లలు లేరు ఫోన్. 7569246407 [HA-801306]

కమ్మ/ 50y/ విడో/ Govt Head Master/ Own kids Playing School/50 Acres Land/18 Lac Income కోట్ల ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను కుల ప్రసక్తి లేదు. 9030505826 [H-821224]

OC/50y/ విడో/Deputy తహసీల్దార్ /Own విల్లా/53Acres/ మామిడి తోట &మాగాణి/16 Lak Income కోట్ల ప్రాపర్టీ కలిగిన వధువుకి FC/BC వరుడు కావలెను. 6304494883 [H-821224]

రెండో పెళ్లి/విడో/50y/ విజయవాడ/ Hydలో Settled/Own House (Rents) పిల్లలు లేని, ఏ బాధర బందీలేని వధువుకు FC/BC వరుడు కావలెను. (ఇల్లరికం OK) 8519803423 [H-821224]

నాయుడు/49y/విడో/5'4"/Govt teacher 80K/- PM/సొంత ఇల్లు/ట్యూషన్స్/50 K/- PM/ఆస్తి కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. పిల్లలు లేరు. 9100867741 [H-821224]

రెడ్డి/విడో/Govt రైల్వే Rtd పెన్షనర్/సొంత అపార్ట్‌మెంట్స్/30 ఎకరాలు పొలం/సొంత రైస్ ఫ్యాక్టరీ/ 5L/- PM/ కలిగిన వెల్ సెటిల్ వధువుకి వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. 7732054195 [H-821224]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech (సివిల్) Govt. ఎంప్లాయి/రెవెన్యూ డిపార్ట్‌మెంట్/65000/- PM/5'4" ఎత్తు/25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. 6304407230 [HA-16178]

క్రిస్టియన్ మాల/ఏకైక కుమార్తె/B.Tech, NIT/C.Govt/ Asst. మేనేజర్/ SBI/90,000/- PM/5'6"ఎత్తు/25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9908222406 [HA-16178]

గౌడ/B.Tech/Govt/ Asst. ఇంజినీర్/ RWS/60,000/- PM/5'5"ఎత్తు/25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9550166072 [HA-16178]

బ్రాహ్మణ వధువు: ఏజ్ 25 సంవత్సరాలు ఇంటర్మీడియట్ ఫాదర్ బిజినెస్, మదర్ క్యాటరింగ్ బిజినెస్, బ్రదర్ ఒక్కరు మ్యారిడ్, శాఖ పట్టింపు లేదు పౌరోహిత్యం అయినా ఓకే. సెల్: 8121031369 [HA-02335]

వేదికలు



అన్ని కులాల MBBS. MD, PG, గైనిక్, జనరల్ Govt. డాక్టర్/సాఫ్ట్ వేర్ ఇంజనీర్/Govt. ఎంప్లాయి, వధూవరుల సంబంధాలకై సంప్ర. ఫోన్: 9908222406 [HA-16178]

కమ్మ, కాపు, రెడ్డి పెళ్లి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Shyam. Ph: 9949233422/Blue Trend Matrimonial(P) Ltd. [H-16179]

USA, UK, CANADA, AUS పెళ్లి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Srinivas. Ph: 8522047149/Blue Trend Matrimonial (P) Ltd. [H-16179]

Christian, పెళ్లి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Shyam. Ph: 9949233422/Blue Trend Matrimonial(P) Ltd. [H-16179]

Divorcee & Widowed పెళ్లి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Srinivas. Ph: 8522047149/Blue Trend Matrimonial (P) Ltd. [H-16179]

మాదిగ-మాల, పెళ్లి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Shyam. Ph: 9949233422/ Blue Trend Matrimonial(P) Ltd. [H-16179]

సాక్షి పెళ్ళిచూపులు ప్రకటనల కొరకు
3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
AP+TS+Metros: (Chennai + Bengaluru + Delhi + Mumbai) 1800/- for 4 Lines 485/- Extra Line
Telangana: (Incl. Hyd) 1100/- for 4 Lines 300/- Extra Line
Andhra Pradesh: (Incl. Hyd) 1350/- for 4 Lines 375/- Extra Line
* Color 25% Extra
గమనిక: ప్రకటనలపై 5% GST అదనం
అనంతపూర్-9912220718 | గుంటూరు - 9912220356
కర్నూలు - 9010825556 | విజయవాడ - 7995554534
YSR కడప - 9951602932 | తాడేపల్లిగూడెం-9912220558
తిరుపతి - 9912220586 | రాజమండ్రి - 9912220358
నెల్లూరు - 9951602861 | విశాఖపట్నం - 9912220550
ఒంగోలు - 9912225431 | శ్రీకాకుళం - 9912220343

గిరిజన మహిళా మేయర్‌పై బాబు సర్కారు కుట్ర

నెల్లూరు మేయర్ పదవిని వదులుకున్న స్రవంతి

- నెల్లూరు నగరపాలక సంస్థ అత్యున్నత పీఠంపై గిరిజన మహిళను కూర్చోబెట్టిన జగన్
- బాబు ప్రభుత్వం రాగానే మేయర్ పీఠంపై కన్ను
- అధికార పార్టీలోకి రావడానికి అంగీకరించని మేయర్
- ఆమె, ఆమె కుటుంబాన్ని వేధించిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి
- అడిగిన చోట సంతకాలు పెట్టలేదని అక్కసు
- మేయర్ భర్తపై అక్రమ కేసులు, జైలుపాలు
- తమ అవినీతి, అక్రమాలకు మేయర్ అడ్డుగా ఉందనే అవిశ్వాసానికి తెగింపు
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు బెదిరింపులు, అక్రమ కేసులు
- మహిళా కార్పొరేటర్లకు వేధింపులపై చలించిన మేయర్
- తన రాజీనామాతో కార్పొరేటర్లకు విముక్తి లభిస్తుందని ఆశాభావం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: దశాబ్దాల తర్వాత గిరిజన మహిళకు దక్కిన రాజ్యాధికారాన్ని చంద్రబాబు చిదిమేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెల్లూరు నగరపాలక సంస్థలో అత్యున్నత పదవి అయిన మేయర్‌గా ఓ గిరిజన మహిళకు అవకాశం కల్పించారు. ఇప్పుడు చంద్రబాబు సర్కారు నేతలు అనేకానేక కుట్రలకు పాల్పడి, మేయర్‌ను, ఆమె కుటుంబ సభ్యులను, కార్పొరేటర్లను పైశాచికంగా వేధించి, చివరకు ఆ పదవి నుంచి గిరిజన మహిళా మేయర్‌ను తప్పించారు. ఇందుకోసం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన వికృత రాజకీయం రాష్ట్రాన్ని నివ్వెరపరిచింది. నాలుగేళ్ల క్రితం జరిగిన నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో మొత్తం 54 డివిజన్లలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. టీడీపీకి ఒక్క సీటు కూడా దక్కలేదు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన మహిళ అయిన పోట్లూరు స్రవంతిని అత్యున్నతమైన మేయర్ పీఠంపై కూర్చోబెట్టారు. నెల్లూరు నగర పాలక సంస్థను అభివృద్ధి పథంలో నడిపించారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పాలన సాగించారు.

బాబు ప్రభుత్వం రాగానే కుట్ర

చంద్రబాబు ప్రభుత్వం రాగానే మేయర్ పదవిని చేతిలోకి తీసుకొని, దోపిడీ చేయాలని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి కుట్ర పన్నారు. నగర మేయర్‌ను అధికార పార్టీలోకి తీసుకోవాలని ప్రయత్నిం[illegible]చారు. అధికార పార్టీలోకి రాలేదన్న కారణంతో పాటు తాము చెప్పిన చోట సంతకాలు చేయలేదన్న అక్కసుతో మేయర్ కుటుంబాన్ని అష్టకష్టాలు పెట్టారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం పూర్తి కాలం పదవిలో కొనసాగనీయకుండానే ఆమెను పదవి నుంచి దింపేసి, మంత్రి నారాయణకు అనుకూలుడైన కార్పొరేటర్‌కు ఆ పదవి కట్టబెట్టేందుకు కుట్రలకు తెగబడ్డారు. ఇందుకోసం రూ.10 కోట్లు ఖర్చు చేయడానికి కూడా వెనుకాడలేదు. మేయర్ పీఠంపై డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌ను కూర్చోబెట్టేందుకు కార్పొరేటర్లకు తాయిలాలు ఎరవేశారు. కార్పొరేటర్లు లొంగకపోవడంతో వేధింపులు, అరాచకాలకు తెరతీశారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై అక్రమ కేసులు, వ్యాపారాలను టార్గెట్ చేస్తూ బెదిరించి 40 మందికి పైగా కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకున్నారు. మేయర్ కుటుంబాన్ని కూడా టార్గెట్ చేయడంతో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి తటస్థంగా ఉండాల్సి వచ్చింది. అధికార పార్టీ చెప్పిన విధంగా ఉండాలని రాయబేరాలు చేసినా మేయర్ ససేమీరా అనడంతో మంత్రి, ఎమ్మెల్యే ఆమె కుటుంబాన్ని టార్గెట్ చేశారు. 18 నెలలుగా ఆమెను, ఆమె కుటుంబాన్ని రౌడీమూకలతో బెదిరించారు. కార్పొరేషన్ పరిధిలో భవనాల మార్టిగేజ్ విషయంలో ఫోర్జరీ సంతకాలు చేశారని, కార్పొరేషన్ ఉద్యోగులపై దౌర్జన్యాలు చేశారంటూ పలు అక్రమ కేసులతో మేయర్ భర్త జయవర్ధన్‌ను జైలుపాలు చేశారు. మేయర్‌ను సోషల్ మీడియాలో మానసికంగా వేధించారు. కార్పొరేషన్‌లో మేయర్‌కు దక్కాల్సిన కనీస సౌకర్యాలు కూడా లేకుండా చేశారు. అడుగడుగునా అవమానాలకు గురి చేశారు. మేయర్ అన్నింటినీ భరిస్తూ వచ్చారు. చివరకు ఆమెపై అవిశ్వాసం పెట్టడానికి నిర్ణయించారు. అవిశ్వాసానికి సహకరించాలని కార్పొరేటర్లపైనా వేధింపులు, బెదిరింపులు మితిమీరాయి. తమకు మద్దతు పలకని కార్పొరేటర్లను పోలీసులతో కిడ్నాప్ చేయించి క్యాంపు రాజకీయాలకు దిగారు. కార్పొరేటర్లకు తాయిలాలు ప్రకటించి తమ గెలుపు ఖాయమని ధీమాగా ఉన్న తరుణంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ టీడీపీలోకి ఫిరాయించిన ఐదుగురు కార్పొరేటర్లను తిరిగి వైఎస్సార్‌సీపీలో చేర్పించి, ఝలక్ ఇచ్చారు. ఈ పరిణామాలతో టీడీపీ గంగవెర్రులెత్తిపోయింది. క్యాంపు రాజకీయాలకు తెరతీసింది. ఒక్కో కార్పొరేటర్‌కు రూ.40 లక్షలు ఇచ్చి క్యాంపులకు తరలించారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను సైతం తాయిలాలతో పాటు అక్రమ కేసులతో బెదిరించి టీడీపీ కండువా కప్పారు. వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లను కూడా అసభ్య పదజాలాలతో బెదిరించారు. వారి కుటుంబాలను సైతం టార్గెట్ చేశారు. దీంతో మేయర్ స్రవంతి తన వల్ల మహిళా కార్పొరేటర్‌లు పడుతున్న బాధకు చలించి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

నెల్లూరు మేయర్ రాజీనామా

గిరిజన మహిళను అధికారం నుంచి దింపేందుకు మంత్రి, ఎమ్మెల్యే నీచమైన కుట్రలు చేశారు: పోట్లూరి స్రవంతి ఆవేదన

భర్త జయవర్ధన్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మేయర్ పోట్లూరి స్రవంతి

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ పోట్లూరి స్రవంతి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనకు మేయర్‌గా అవకాశం ఇచ్చి, ఇంతటి గౌరవాన్ని కల్పించిన వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. రాజీనామా లేఖను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 'నన్ను మేయర్ పదవి నుంచి దింపేందుకు మంత్రి, ఎమ్మెల్యేలు అనేక కుట్రలు పన్నుతున్నారు. కొందరు కార్పొరేటర్లను అనేక రకాలుగా వేధిస్తున్నారు. మహిళా కార్పొరేటర్ల ఇళ్లకు రాత్రి వేళల్లో వెళ్లి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ ఘటనలు నన్ను ఎంతగానో బాధించాయి. గిరిజన మహిళ అని చూడకుండా నన్ను, నా భర్తను ఎంతగానో ఇబ్బందులకు గురి చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. వారంతా తగిన ఫలితం అనుభవిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టకాలంలో తనకు వెన్నుదన్నుగా నిలిచిన గిరిజన సామాజిక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. స్రవంతి భర్త జయవర్ధన్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఐదుగురు కార్పొరేటర్లు తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారని, ఆ వెంటనే నెల్లూరు రాక్షసుడు వికృత రూపం దాల్చాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఐదుగురు ఎక్కడ మాకు మద్దతు ఇస్తారోనని ఆ రాక్షసుడికి రేయింబవళ్లు నిద్ర పట్టలేదన్నారు. అటువంటి రాక్షసుడికి మంత్రి నారాయణ వత్తాసు పలుకుతుండటం దారుణమన్నారు.

ఒకరోజంతా బెదిరించి వదిలేశారు!

ముగిసిన నజీర్ కిడ్నాప్ ఉదంతం

చిల్లకూరు: తిరుపతి జిల్లా తీర ప్రాంతంలోని వాకాడులో నెల్లూరు 34వ వార్డు కార్పొరేటర్ తండ్రి నజీర్‌ను గురువారం దుండగులు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి విషయం తెలియడంతో ఆయన నజీర్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం స్థానిక సీఐకి ఫిర్యాదు చేశారు. గురువారం మసీదు నుంచి వస్తున్న నజీర్‌ను కారులో కొంతమంది బలవంతంగా ఎక్కించుకుని పలుచోట్లకు తిప్పి చివరికి నెల్లూరులోని ఓ ప్రాంతానికి తరలించారు. అక్కడే ఒక రోజంతా ఉంచుకున్నారు. అయితే కిడ్నాప్ చేసిన వ్యక్తులు నజీర్‌ను తీసుకెళ్లే సమయంలో నీ మీద, నీ కుటుంబ సభ్యులు మీద పలు కేసులు ఉన్నాయి అని బెదిరించినట్లు నజీర్ తెలిపారు. ఒక రోజు తర్వాత మళ్లీ వాకాడుకు తీసుకొచ్చి వదిలేసినట్లు చెప్పారు.

ఉపాధి పథకాన్ని నీరుగార్చే కుట్రల్ని ప్రతిఘటించండి: సీపీఎం



సాక్షి, అమరావతి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే కుట్రలను ప్రతిఘటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రజలకు శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ పథకాన్ని ఓ సాధారణ సంక్షేమ పథకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన సవరణ బిల్లు పేరు మార్చడానికి మాత్రమే కాదని, పూజ్యబాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన పేరుతో చేసిన సవరణ చాలా ప్రమాదకరమైందన్నారు. ఉద్దేశపూర్వకంగా మహాత్మాగాంధీ పేరు తొలగించడమే కాకుండా దీని ప్రకారం చట్టం కాస్తా పథకంగా మారుతుందన్నారు.

చంద్రబాబుది అనైతిక రాజకీయం

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్

సాక్షి,అమరావతి: చంద్రబాబు రాజకీయ జీవితమంతా కొనుగోలు, అమ్మకం, వ్యాపారం, పైరవీలు, ప్రలోభాలేనని, ఏ మాత్రం సంఖ్యాబలం లేకపోయినా నెల్లూరు మేయర్ పదవి కోసం చంద్రబాబు దారుణ రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వై.నాగార్జున యాదవ్ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేవలం 8 నెలల పదవీకాలం ఉన్న నెల్లూరు మేయర్ పదవి నుంచి ఒక గిరిజన మహిళను తొలగించి, తన తాబేదార్లను కూర్చోబెట్టాలనే నీచ స్థాయికి చంద్రబాబు దిగజారారని ధ్వజమెత్తారు. నెల్లూరు కార్పొరేషన్‌లో మొత్తం 54 డివిజన్లను వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసిందని, అయినా పదవుల కోసం వైఎస్సార్‌సీపీ బీ- ఫాంపై గెలిచిన కార్పొరేటర్లను కొనుగోలు చేసి, మొన్న డిప్యూటీ మేయర్ పదవిని సంపాదించుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు గిరిజన మహిళను బలిపశువును చేయాలనే ఉద్దేశంతో పాటు, రాజకీయంగా అణగదొక్కేందుకు అవిశ్వాస తీర్మానం పెట్టారని, ఆ తీర్మానంపై 42 మంది కార్పొరేటర్లు సంతకం చేశారని, వారిలో ఐదుగురు తమ పార్టీ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారని చెప్పారు. అయినా ఓటమి భయంతో చంద్రబాబు పోలీసులను పహారాగా పెట్టి కార్పొరేటర్లను కిడ్నాప్ చేయించారని తెలిపారు. సీబీఎన్ అంటే 'కానిస్టిట్యూషన్ బైపాసింగ్ నాయుడు' అని అందరూ అనుకుంటున్నారన్నారు.

ఓటమి భయంతో కార్పొరేటర్ల కిడ్నాప్ ...

54 మంది కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడవకుండా అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారనే భయంతో చంద్రబాబు కిడ్నాప్ రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. గిరిజన కార్పొరేటర్ రవిచంద్ర, మరో కార్పొరేటర్ కుమారుడు శ్రీధర్, 34వ వార్డు కార్పొరేటర్ తండ్రి నజీర్‌ను కిడ్నాప్ చేశారని చెప్పారు. చంద్రబాబు పాలనలో 'ఖాకీ క్యాబ్ సర్వీస్' అనే కొత్త స్కీమ్ తెచ్చారని, పోలీసు వాహనాల్లో, ఖాకీ చొక్కాలు వేసుకుని వచ్చి కిడ్నాప్‌లు చేస్తున్నారని అన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ల పేర్లు మార్చి, 'బాబు అన్యాయ సమిత సెక్షన్లు'గా మార్చేశారని మండిపడ్డారు. కిడ్నాప్ చేసిన వారిని పోలీసులే టీడీపీ క్యాంపులకు తరలిస్తున్నారని, ఒక్కో కార్పొరేటర్‌కు రూ.కోటి వరకు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని చెప్పారు.

బాబుకు రైతుల ఆత్మహత్యలు పట్టడంలేదు

- రాష్ట్రంలో వారానికి ఇద్దరు రైతులు బలవన్మరణం పొందుతున్నారు
- ఆ రైతుల కుటుంబాలను ఆదుకోవాలి
- పరిహారాన్ని రూ.7 లక్షల కంటే పెంచాలి
- ఘటన జరిగిన వారంలోనే బాధిత కుటుంబాలకు పరిహారం అందాలి
- చంద్రబాబు ప్రభుత్వం గిట్టుబాటు ధరలివ్వకుండా అన్నదాతను రోడ్డుపాలు చేసింది
- వైఎస్ జగన్ హయాంలో అన్ని పంటలకు గిట్టుబాటు ధరలతో రైతుల్లో ఆనందం
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాగిరెడ్డి

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం గిట్టుబాటు కాక నష్టాలపాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రతి వారం కనీసం ఇద్దరు రైతులు బలవన్మరణం పాలవుతున్నా బాబు ప్రభుత్వానికి పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం – రైతు సంక్షేమం) ఎంవీఎస్ నాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శనివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాదిన్నర కాలంలోనే 300 మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, కానీ ఏ ఒక్కరికీ బాబు పరిహారం చెల్లించి ఆదుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. పరిహారం ఇవ్వకూడదన్న కుటిల ఆలోచనలతో ఆత్మహత్యలను అధికారికంగా ప్రకటించడంలేదని ధ్వజమెత్తారు. ఆత్మహత్యలు వాస్తవమేనని, అధికారికంగా ప్రకటించాల్సి ఉందని ఓ జిల్లా వ్యవసాయాధికారి స్వయంగా చెప్పడం ఇందుకు ఉదాహరణ అన్నారు. అనంతపురం జిల్లాలో అరటి రైతు ఆత్మహత్య చేసుకుంటే, ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తారనే భయంతో నిబంధనలకు విరుద్ధంగా తెల్లవారుజామున హడావుడిగా పోస్టుమార్టం చేయించి పంపారన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం ఇస్తున్న రూ.7 లక్షల పరిహారాన్ని పెంచి, వారంలోగా నేరుగా బాధిత కుటుంబ సభ్యుల ఖాతాల్లోనే జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ.116 కోట్లు చెల్లించిన వైఎస్ జగన్..

2014– 19 మధ్య చంద్రబాబు రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలే లేవని ప్రకటించి, పరిహారం ఎగ్గొట్టి, బాధిత కుటుంబాలకు క్షోభ మిగిల్చారని తెలిపారు. 2019లో వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకిచ్చే పరిహారాన్ని రూ.7 లక్షలకు పెంచారని తెలిపారు. అంతకు ముందు చంద్రబాబు హయాం ఐదేళ్లలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు రూ.116 కోట్లు చెల్లించి, రోడ్డున పడ్డ రైతు కుటుంబాలకు ఆదుకున్నారని చెప్పారు. చంద్రబాబుకు వ్యవసాయంపై చిత్తశుద్ధి ఉంటే వైఎస్ జగన్ ప్రభుత్వం మాదిరిగా ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రుణం పథకాలను అమలు చేయాలని అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని పంటలకు గిట్టుబాటు ధరలతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసేదని, చంద్రబాబు ఒక్క పంటకూ గిట్టుబాటు ధర ఇవ్వక అన్నదాతలను రోడ్డు పాలు చేశారని మండిపడ్డారు. కౌలు రైతులను అస్సలు గుర్తించడం లేదన్నారు. ఏడాదిన్నరలోనే రూ. 2.66 లక్షల కోట్లు అప్పులు చేసిన చంద్రబాబు.. ఏ ఒక్క పంటకీ మద్దతు ధర చెల్లించకా, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలనూ ఆదుకోకుండా ఆ డబ్బంతా ఏం చేస్తున్నట్టు అని నిలదీశారు. వ్యవసాయ రంగంలో ఏపీని తెలంగాణతో పోల్చి మాట్లాడటం చంద్రబాబు అవివేకం అని అన్నారు.

పొగమంచు ప్రమాదం.. అప్రమత్తతే ప్రధానం

శీతాకాలంలో డ్రైవింగ్ అంత ఈజీ కాదు

- రహదారులపై దట్టంగా కమ్మేస్తున్న పొగ
- ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా పెను ప్రమాదాలే
- ఏటా శీతాకాలంలో 30 వేలకుపైగా రోడ్డు ప్రమాదాలు
- అర్ధాంతరంగా ముగుస్తున్న జీవితాలు
- డ్రైవర్ల అప్రమత్తతే శ్రీరామరక్ష



సాక్షి, అమరావతి: శీతాకాలంలో ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంటుంది. వాహనంలో ప్రయాణిస్తుంటే రోడ్లకు ఇరువైపులా పొగమంచు హృద్యంగా కనువిందు చేస్తుంది. కారులోగానీ ఇతర వాహనాల్లో మంచి సంగీతం వింటూ డ్రైవింగ్ చేయడం మధురానుభూతి కలిగిస్తుంది. కానీ ఆ పొగమంచు మాటునే ప్రమాదం పొంచి ఉందన్నది డ్రైవర్లు గుర్తుపెట్టుకోవాలి. ఎందుకంటే దేశంలో రహదారులపై పొగమంచు కమ్మేయంతో రోడ్డు ప్రమాదాలు ఏటేటా పెరుగుతున్నాయి. ఒక్క శీతాకాలంలోనే దేశంలో ఏటా 30 వేలకుపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మొత్తం రోడ్డు ప్రమాదాల్లో పొగమంచుతో సంభవిస్తున్న ప్రమాదాలు 7% వరకు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున ఓ ట్రావెల్స్ బస్సు లోయలోపడి ప్రమాదానికి గురికావడంతో 9మంది దుర్మరణం చెందడంతోపాటు 37 మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. పొగమంచును బస్సు డ్రైవర్ సరిగా అంచనా వేయలేక పోవడంతోనే ఈ ప్రమాదం సంభవించింది. అందుకే శీతాకాలంలో వాహనాలను డ్రైవింగ్ చేసేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జాతీయ రహదారులపై రాత్రి వేళల్లో 7గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు పొగమంచు పరుచుకుని ఉంటుంది. ఘాట్ రోడ్లలో పొగమంచు మరింత దట్టంగా కమ్మేస్తుంది కూడా. అందుకే అరకు, మారేడుమిల్లి, శ్రీశైలం, తిరుమల, హార్స్‌లీ హిల్స్ వంటి ఘాట్ రోడ్లపై ప్రయాణించేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలి. పొగమంచులో డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

చేయాల్సినవి...

- లో బీమ్ హెడ్‌లైట్లనే ఉపయోగించాలి. హై బీమ్ లైట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు.
- పొగమంచు దారిలో ప్రయాణిస్తున్నంత సేపు ఫాగ్‌లైట్లు ఆన్ చేయాలి.
- టైల్ ల్యాంప్స్‌ను క్లీన్‌గా ఉంచాలి. స్పష్టంగా కనిపించేట్టుగా ఉండాలి.
- బ్రేక్ లైట్లు కచ్చితంగా పనిచేసేట్లుగా జాగ్రత్తలు తీసుకోవాలి. దాంతో వాహనం నెమ్మదించగానే ఆ విషయం వెనుక వాహనదారులకు గుర్తించగలరు.
- వాహనంలో టూల్ కిట్ తప్పనిసరిగా ఉంచుకోవాలి.
- రోడ్లపై ఉన్న లైన్ మార్కింగ్‌లను గమనిస్తూ.. తదనుగుణంగా డ్రైవింగ్ చేయాలి. రోడ్డుకు కుడి, ఎడమ చివర్లో ఉన్న లైన్లను దాటి వెళ్లకూడదు. ఒక లైన్ నుంచి మరో లైన్‌లోకి మారేటప్పుడు వెనుక, పక్కన ఉన్న వాహనాలను గమనించాలి. వెనుక నుంచి ఏ వాహనం రావడం లేదని నిర్ధారించుకున్న తరువాతే లైన్ మారాలి.
- వాహనం వైపర్లు సరిగా పని చేసేట్టుగా చూసుకోవాలి.
- వాహనాన్ని నిలుపుదల చేయాల్సి వస్తే... రోడ్డుకు ఎడమవైపు లైన్‌లోనే నిలపాలి.
- ఎదురుగా వెళుతున్న వాహనాలకు తగినంత దూరంగా ఉంటూ వాహనాన్ని నడపాలి.
- రోడ్డు సరిగా కనిపించడంలేదని గుర్తించగానే వాహనాన్ని రోడ్డు పక్కగా నిలిపివేయాలి. జాతీయ రహదారులపై నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాలు, సమీపంలోని దాబాలు, పెట్రోల్ బంకులు, టోల్ ప్లాజాల వద్ద ఉండే పార్కింగ్ ప్రదేశంలోనే వాహనాలను నిలపాలి.
- విండ్ షీల్డ్ క్లీన్‌గా ఉండాలి. యాంటీ ఫాగింగ్(డీ ఫాగర్) మోడ్‌లో వాహనం ఉంచి నడపాలి.

చేయకూడనివి...

- మితిమీరిన వేగంతో ప్రయాణించవద్దు. పరిమిత వేగంతోనే డ్రైవింగ్ చేయాలి. వాహనం ఎప్పుడూ డ్రైవర్ నియంత్రణ ఉండాలి. రోడ్డును స్పష్టంగా చూడగలిగేంత వేగంతోనే ప్రయాణించాలి.
- దారిలో పొగమంచు ఉన్నప్పుడు ముందు వెళ్తున్న వాహనాలను ఎట్టి పరిస్థితిల్లోనూ ఓవర్ టేక్ చేయకూడదు.
- క్రూయిజ్ కంట్రోల్ మోడ్‌లో వాహనాన్ని నడపకూడదు.
- డ్రైవింగ్ చేస్తున్నపుడు డ్రింక్స్ తాగడం గానీ ఏమైనా తినడంగానీ చేయకూడదు. పొగ తాగకూడదు.
- ఎదురుగా వాహనం వస్తుంటే హైబీమ్ లైట్లను ఫ్లాష్ చేయ కూడదు.
- డ్రైవింగ్ చేస్తున్నప్పుడు హజార్డ్ (త్రికోణాకృతి) లైట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్ చేయకూడదు. వాహనాన్ని పార్క్ చేసినప్పుడే ఇతరులు గమనించేందుకు హజార్డ్ లైట్లను ఆన్ చేసి ఉంచాలి.

క్లుప్తంగా...

వాజ్‌పేయి కాంస్య విగ్రహాల రూపకల్పన నా అదృష్టం

ప్రముఖ శిల్పి డి.రాజ్‌కుమార్



కొత్తపేట: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఏర్పాటు చేస్తున్న కాంస్య విగ్రహాలను తయారు చేసే అవకాశం దక్కడం తన అదృష్టమని ప్రముఖ శిల్పి డి.రాజ్‌కుమార్ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలోని వుడయార్ శిల్పశాలలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వాజ్‌పేయి 12 అడుగుల ఎత్తు విగ్రహాలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. తన చేతిలో రూపుదిద్దుకున్న విగ్రహాలను బీజేపీకి చెందిన వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆవిష్కరిస్తున్నారని తెలిపారు. అలాగే తాను తయారు చేసిన ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆవిష్కరించబోతున్నారని చెప్పారు.

ఐ-ఫోన్లకూ తప్పని ఫేక్ లోన్ యాప్‌ల బెడద

- వెల్లడించిన ఐ4సీ (ఇండియన్ సైబర్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్)

సాక్షి, హైదరాబాద్: డిజిటల్ భద్రత పరంగా సురక్షితంగా భావించే ఐ-ఫోన్లకు ఫేక్‌లోన్ యాప్‌ల బెడద తప్పడం లేదు. ఆండ్రాయిడ్ ఫోన్ల మాదిరిగానే యాపిల్ యాప్ స్టోర్‌లో ఇటీవల మూడు ఫేక్ లోన్ యాప్‌లను గుర్తించినట్టు కేంద్ర హోంశాఖకు చెందిన ఐ4సీ (ఇండియన్ సైబర్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్) వెల్లడించింది. థిన్‌లోన్, రిష్నాలోన్, అంబాలా క్యాష్ అనేవి నకిలీ యాప్‌లు అని తెలిపింది. ఈ యాప్‌లను గుర్తిస్తే వెంటనే అప్రమత్తం కావాలని సూచించింది. ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తే వ్యక్తిగత సమాచారం దొంగిలించి ఆ తర్వాత ఆన్‌లైన్ బెదిరింపులకు పాల్పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. డాక్యుమెంట్లు లేకుండా లోన్లు ఇస్తామని ఊదరగొట్టే ఈ యాప్‌లను నమ్మి మోసపోవద్దని తెలిపింది. అనుమానాస్పద యాప్‌లకు సంబంధించిన సమాచారం టోల్ ఫ్రీ నంబర్ 1930లో లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

నేడు వైజాగ్ నేవీ మారథాన్

విశాఖ స్పోర్ట్స్: నేవీ డే వేడుకల్లో భాగంగా పదో ఎడిషన్ వైజాగ్ నేవీ మారథాన్‌కు విశాఖ సాగరతీరం సిద్ధమైంది. భారత నావికా దళం ఆధ్వర్యంలో ఫిట్‌నెస్, సముద్ర ఆహ్లాద వాతావరణ అవగాహనతో నేవీ డే స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ మారథాన్ నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం జరగనున్న 42 కిలోమీటర్ల ఎయిర్‌క్రాఫ్ట్ కారియర్ మారథాన్, 21 కిలోమీటర్ల సబ్‌మెరైన్ హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్ల ఎయిర్‌క్రాఫ్ట్ రన్‌తో పాటు సరదాగా సాగిపోయే 5 కిలోమీటర్ల ఫ్రిగేట్ పరుగులో ఈసారి 18 వేల మంది ఔత్సాహికులు రిజిస్టర్ చేసుకున్నారు. ఆర్కే బీచ్ వెంబడి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి మారథాన్ ప్రారంభం కానుంది.

ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది

- యుద్ధక్షేత్రంలో సదా సన్నద్ధత ముఖ్యం
- మీరు భవిష్యత్ నాయకులుగా ఎదగాలి
- ఫ్లైట్ కేడెట్ల కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్

సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, భారత త్రివిధ దళాలు ప్రతినిత్యం అప్రమత్తతోనే ఉండాలని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. అప్రమత్తత, యుద్ధసన్నద్ధతే మనల్ని విజయం వైపు తీసుకెళుతుందని, విజయాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలన్నారు. యుద్ధ సమయంలో ఏ చిన్న పొరపాటు జరిగినా నష్టం భారీగా ఉంటుందని, త్రివిధ దళాల సమన్వయంతోనే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతామని ఆయన చెప్పారు. శనివారం హైదరాబాద్ సమీపంలోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన ఫ్లైట్ కేడెట్ల కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో 216 బ్యాచ్‌కు చెందిన 29 మంది మహిళా అధికారులతో సహా మొత్తం 244 మంది కేడెట్లు పాల్గొన్నారు. వీరిలో భారత నావికాదళం నుంచి ఎనిమిది మంది అధికారులు, భారత కోస్ట్ గార్డ్ నుంచి ఆరుగురు, వియత్నాం వైమానిక దళం నుంచి ఇద్దరు అధికారులు ఉన్నారు. ఫ్లైట్ కేడెట్ల కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో ముఖ్య అతిథిగా సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన ఫ్లయింగ్ బ్రాంచ్, నావిగేషన్, గ్రౌండ్ డ్యూటీ శాఖల ఫ్లైట్ క్యాడెట్లకు 'వింగ్స్', 'బ్రెవెట్స్' ప్రదానం చేశారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీలు బహూకరించారు. భారత వాయుసేనతోపాటు పరేడ్‌లో పాల్గొన్న భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్స్ వియత్నాం సోషలిస్ట్ రిపబ్లిక్ ఫ్లైయింగ్ కేడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం యువ అధికారులనుద్దేశించి సీడీఎస్ మాట్లాడారు.

మూడు సూత్రాలు మరవొద్దు..

మూడు మూల సూత్రాలను ఎప్పుడూ మరవొద్దని యువ అధికారులకు సీడీఎస్ అనిల్ చౌహాన్ సూచించారు. 'మొదటిది.. జీవితమనేది సైకిల్ ప్రయాణం వంటిది. సమతుల్యత ఉంటేనే ప్రయాణం ముందుకు సాగుతుంది. రెండోది.. గర్వాన్ని, నిర్లక్ష్యాన్ని మీ దరిచేరనివ్వద్దు. మూడోది.. నిబంధనలు పాటించడంలో ఒక రాయిలా ఉండాలి' అని పేర్కొన్నారు. పరిస్థితులకు అనుగుణంగా సైన్యం సైతం ఎన్నో మార్పులు చేసుకుంటోంది. సర్వీస్‌లోకి అడుగుపెట్టబోతున్న మీరు నూతన సవాళ్లకు తగినట్టుగా తయారు కావాలి. సాంకేతికత యుద్ధ క్షేత్రంలో కీలకంగా మారుతున్న తరుణంలో ఏఐ వాడకాన్ని పెంచడంతోపాటు నూతన సాంకేతికతలను భారత సైన్యానికి జోడిస్తున్నాం' అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆకాశ్‌గంగ స్కైడైవింగ్ బృందం, ఎయిర్ వారియర్ డ్రిల్ టీమ్ అద్భుతమైన ప్రదర్శనలతో పాటు, పిలాటస్ పీసీ-7, కిరణ్, చేతక్ విమానాల ఫ్లై-పాస్ట్‌లు..సారంగ్ హెలికాప్టర్ డిస్‌ప్లే బృందం, సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం వైమానిక ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి.

శాంతిసరోవర్‌కు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము రాక

- ఈనెల 20న శాంతిసరోవర్ 21వ వార్షికోత్సవం
- 'టైమ్‌లెస్ విజ్డమ్ ఆఫ్ భారత్: పాత్‌వే టు పీస్ అండ్ ప్రోగ్రెస్' అంశంపై జాతీయ సదస్సు

రాయదుర్గం: విలువలతో కూడిన జీవనం, శాంతి, ఆధ్యాత్మికశక్తిని ప్రజల్లో ప్రతిధ్వనించేలా చేయడంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి శాంతిసరోవర్ కీలకపాత్ర పోషిస్తోంది. బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందిన శాంతిసరోవర్ క్యాంపస్.. ప్రపంచ వ్యాప్తంగా తమ సేవా కార్యక్రమాలను, మెడిటేషన్, రాజయోగ కార్యక్రమాలు, విస్తృతస్థాయిలో వివిధ కోర్సులు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ అందరి మనసుల్లో నిలిచిపోయేలా చేస్తోంది. ఈనెల 20న శాంతిసరోవర్ 21వ వార్షికోత్సవాన్ని క్యాంపస్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఆరోజు సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జాతీయ సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ సదస్సును 'టైమ్‌లెస్ విజ్డమ్ ఆఫ్ భారత్: పాత్‌వే టు పీస్ అండ్ ప్రోగ్రెస్' అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పాల్గొంటారు. ఈక్యాంపస్‌కు విచ్చేసే మూడవ రాష్ట్రపతిగా ద్రౌపదీముర్ము నిలిచారు.

నాన్న ఆటోనే యమపాశం

- తండ్రి ఆటో కింద పడి కుమార్తె దుర్మరణం
- టెట్ పరీక్షకు తీసుకువెళుతుండగా ప్రమాదం

సునీత (ఫైల్)

అనకాపల్లి: తండ్రి నడుపుతున్న ఆటో కిందనే ప్రమాదవశాత్తు పడి కుమార్తె మృతి చెందిన విషాద ఘటన అనకాపల్లిలో జరిగింది. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం చిన్నసాన గ్రామానికి చెందిన బోకర లక్ష్మణరావు బతుకు తెరువు కోసం కుటుంబంతో విశాఖకు వలస వచ్చాడు. ఇతడు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి కుమార్తె, ఇద్దరు కుమారులు. కుమార్తె బోకర సునీత (25) టీచర్ ట్రెయినింగ్ చదువుకుంది. కుమారులు ప్రైవేటు పనులు చేసుకుంటున్నారు. సునీత శనివారం అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో టెట్ రాయాల్సి ఉంది. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పరీక్ష కోసం కుమార్తెను సొంత ఆటోలో ఎక్కించుకొని లక్ష్మణరావు బయలుదేరాడు. అనకాపల్లిలోని సుంకరమెట్ట జంక్షన్ వద్దకు వచ్చేసరికి గూగుల్ మ్యాప్ చూస్తూ.. దారి తప్పామని తండ్రికి కుమార్తె చెప్పింది. దాంతో వెనక్కి తిరిగిన లక్ష్మణరావు రోడ్డుపై ముందున్న స్పీడ్ బ్రేకర్‌ను గమనించలేదు. ఎత్తయిన స్పీడ్ బ్రేకర్ రావడంతో ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటో బోల్తా పడి వెనుకసీటులో కూర్చున సునీత ఆటో నుంచి జారి పడింది. ఆమె రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడే మృతి చెందింది. లక్ష్మణరావు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములవ్వాలి

- యూపీఎస్ఎస్‌సీ సబార్డినేట్ బోర్డు చైర్మన్ డాక్టర్ సాబత్
- సెంచూరియన్‌లో ఘనంగా 5వ స్నాతకోత్సవం

విద్యార్థినికి డిగ్రీ ప్రదానం చేస్తున్న సాబత్, శంకరన్, తదితరులు

నెల్లిమర్ల రూరల్: వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వామ్యులు కావాలని ఉత్తరప్రదేశ్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎస్ఎన్ సాబత్ (విశ్రాంత ఐపీఎస్) పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో 5వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాబత్ మాట్లాడుతూ నిజాయతీ, నైతిక విలువలతో యువత ముందడుగు వేస్తే భవిష్యత్ గొప్పగా ఉంటుందన్నారు. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంలో సెంచూరియన్ అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ సీఐవో శంకరన్ నరేన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కృత్రిమ మేధస్సు, జన్యుచికిత్స, బయో టెక్నాలజీ వంటి ఆవిష్కరణలతో కొత్త మార్పులు రాబోతున్నాయని, మారుతున్న సాంకేతిక వేగాన్ని అందుకోలేకపోతే వెనుకబడతారన్నారు. చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నైపుణ్య సమీకృత ఉన్నత విద్యా కేంద్రంగా సెంచూరియన్ వర్సిటీ పేరు గడించిందన్నారు. జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను విద్యార్థులు దీటుగా ఎదుర్కోవాలని సూచించారు. అనంతరం 409 మంది విద్యార్థులకు డిగ్రీలతో పాటు ప్రధాన అతిథులు సాబత్, శంకరన్ నరేన్‌లకు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. 14 మంది టాపర్లకు బంగారు పతకాలు, మరో 8 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకూ చట్టాలు రావాలి

వారి హక్కులను హరించే హక్కు ఎవరికీ లేదు: తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సమయ పాలన లేకుండా విధులు నిర్వహిస్తున్నారని, వారి పరిరక్షణకు చట్టాలు రావాల్సిన అవసరం ఉందని తెలంగాణ హైకోర్టు అభిప్రాయపడింది. వేతనాలు ఘనంగా ఉన్నా వారి వ్యక్తిగత జీవితం విరుద్ధంగా ఉంటోందని చెప్పింది. దేశ ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చిన ఇలాంటి రంగం గురించి పాలకులు ఆలోచించాలని సూచించింది. ఆ ఉద్యోగుల హక్కులు హరించే అధికారం ఎవరికీ లేదని ఓ కేసు విచారణ సందర్భంగా స్పష్టం చేసింది. అగ్రిమెంట్‌ను పాటించకుండా రాజీనామా చేస్తున్నందుకు రూ.5.9 లక్షల పరిహారం చెల్లించాలని కంపెనీ డిమాండ్ చేయడంపై ఫిర్యాదు చేసినా.. లేబర్ డిపార్ట్‌మెంట్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాజేశ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టి.. తాజాగా తీర్పు వెలువరించింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సామాజిక భద్రతపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. పాలకులు వీరి అంశాలపై అధ్యయనం చేయాలని, ఆ మేరకు అనువైన చట్టాలు రూపొందించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. కాంట్రాక్ట్ చట్టంలోని సెక్షన్ 27 ప్రకారం ఒక వ్యక్తిని చట్టబద్ధమైన వృత్తి, వాణిజ్యం, వ్యాపారం చేపట్టకుండా ఆపే ఒప్పందాలు చెల్లుబాటు కావన్నారు. అందులో సహేతుకమైన షరతులు ఉంటే మాత్రం వర్తింపు సమర్థనీయమని తెలిపారు. ఈ కేసులో కంపెనీ ఏ ప్రాతిపదికన పరిహారం నిర్ణయించిందో తేల్చాలని కార్మికశాఖను ఆదేశించారు. పిటిషనర్ రాజీనామాను ఆమోదించాలంటూ కంపెనీకి తేల్చిచెప్పారు.

గుండెపోటుతో విద్యార్థిని హఠాన్మరణం

నల్లమిల్లి సిరి (ఫైల్)

రామచంద్రపురం: తరగతి గదిలో పాఠాలు వింటూ అకస్మాత్తుగా కింద పడిపోయి, ఓ విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో జరిగింది. జిల్లాలోని రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన నల్లమిల్లి వెంకటరెడ్డి, సుజాతల కుమార్తె సిరి (14) రామచంద్రపురంలోని వివేకానందా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. తరగతి గదిలో ఉండగా శనివారం ఒక్కసారిగా బెంచ్ మీద నుంచి కిందకు వాలిపోయింది. గమనించిన ఉపాధ్యాయులు ఆమెను వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సిరి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె ఆకస్మిక గుండెపోటుతో మరణించి ఉండవచ్చని వైద్యులు భావిస్తున్నారు. ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు పాఠశాలకు వెళ్లి సీసీటీవీ ఫుటేజీని సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేశారు.

21న బ్లూబర్డ్-6 ప్రయోగం

'బాహుబలి' రాకెట్ ద్వారా అమెరికా ఉపగ్రహాన్ని ప్రయోగించనున్న ఇస్రో

పీఎస్ఎల్‌వీ సీ62 రాకెట్ (ఫైల్)

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలకమైన వాణిజ్య ప్రయోగానికి సిద్ధమవుతోంది. అమెరికాకు చెందిన 6,500 కిలోల బరువైన బ్లూబర్డ్-6 అనే కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఈనెల 21న ప్రయోగించబోతోంది. ఇస్రో రూపొందించిన బాహుబలి (ఎల్‌వీఎం3-ఎం6) రాకెట్ ద్వారా దీనిని నిర్వహించనుంది. అక్టోబర్ 19వ తేదీనే అమెరికా నుంచి ఈ ఉపగ్రహం షార్‌కు చేరుకుంది. ఈ ప్రయోగాన్ని గత నెలలో నిర్వహించాల్సి ఉండగా.. వాయిదాలు పడుతూ వచ్చింది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ ఈ ఉపగ్రహాన్ని రూపొందించింది. గతంలో పంపిన బ్లూబర్డ్ ఉపగ్రహాల కన్నా.. 10 రెట్ల అధిక డేటా సామర్థ్యంతో పని చేసేలా దీనిని రూపొందించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఇస్రో వాణిజ్య విభాగ సంస్థ అయిన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షిస్తోంది. అంతరిక్ష రంగంలో భారత్, అమెరికాల మధ్య ఇది రెండో అతిపెద్ద సహకారం. జూలైలో ఇస్రో, నాసా సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహాన్ని.. ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. కాగా, ఈ నెల 31న పీఎస్ఎల్‌వీ సీ62 ప్రయోగాన్ని నిర్వహించేందుకు కూడా ఇస్రో చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. పది రోజుల వ్యవధిలో రెండు ప్రయోగాలు నిర్వహించడం ఇస్రో చరిత్రలో మరో మైలురాయిగా నిలవనుంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పెన్నోబులేసునికి..

రాజకీయ గ్రహణం

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాలన అస్తవ్యస్తంగా మారింది. కార్యనిర్వహణాధికారి (ఈఓ) దీర్ఘకాలిక సెలవుల కారణంగా ఆలయ నిర్వహణ – మాన్యం భూముల రక్షణ ప్రశ్నార్థకంగా మారిపోయింది. మాన్యం భూములు దక్కించుకున్న అధికార పార్టీ నాయకులు లీజు ఎగ్గొట్టడమే కాకుండా అనధికారికంగా భూములు విక్రయించి సొమ్ము చేసుకుంటూ ఆలయ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఈఓలు సతమతం
- బాధ్యతలు స్వీకరించి.. ఆ వెంటనే దీర్ఘకాలిక సెలవులోకి
- అధికార పార్టీ నేతల కబంధహస్తాల్లో మాన్యం భూములు
- కౌలు చెల్లించకపోగా.. అనధికారికంగా భూముల విక్రయం

ఉరవకొండ/అనంతపురం కల్చరల్: తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక తదితర ప్రాంతాల భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న అనంతపురం జిల్లా పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సాగాల్సిన పాలనా వ్యవహారాలపై చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అధికార పార్టీ నేతల జోక్యం విపరీతంగా పెరిగిపోయింది. దీంతో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) గా ఎవ్వరు వచ్చినా కొద్దిరోజులకే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయ భూముల లీజుల కేటాయింపు–నిధుల ఖర్చు చేయాలంటూ వస్తున్న ఒత్తిళ్లే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. అటవీ ప్రాంతంలో ఉండే ఆలయంలో ఏమి జరిగినా దిక్కు లేకుండా పోతోంది.

కౌలు ఒకరు.. సాగు మరొకరు..

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 2,114 ఎకరాల మాన్యం ఉంది. ఇందులో 146 ఎకరాల ఈనామ్ భూమి, 412 ఎకరాల అటవీ ప్రాంతం ఉంది. మిగతా 1,554 ఎకరాలు ఆమిద్యాల, మోపిడి, కోనాపురం, పెద్దముస్టూరు, మూలగిరిపల్లి, రాచెర్ల, చిన్నముస్టూరు పరిధిలో ఉన్నాయి. ఆలయ మాన్యాలు కొంతమంది అధికార పార్టీ నేతల చేతుల్లో చిక్కుకున్నాయి. సొంత భూములు ఉన్నా సరే నామమాత్రపు కౌలు చెల్లిస్తూ కొన్నేళ్లుగా ఆలయ భూమిని అనుభవిస్తున్నారు. సాధారణంగా వర్షాధారం అయితే ఎకరాకు రూ.6 వేలు, సాగునీటి సౌకర్యం ఉంటే ఎకరాకు రూ.20 వేలు చొప్పున కౌలు చెల్లించాల్సి ఉన్నా.. ఇక్కడ నారసింహుడికే నామాలు పెట్టి ఎకరాకు నామమాత్రంగా రూ.500 నుంచి రూ.2,500 ఏడాదికి చెల్లిస్తున్నారు. కౌలుదారుల్లో చాలామంది అనధికారికంగా సబ్‌లీజుకు ఇచ్చుకున్నారు. కొందరు అధికార పార్టీ నేతలైతే కౌలు భూమి తమ సొంత ఆస్తి అయినట్టు ఇతరులకు విక్రయించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. 2024 నాటికి సుమారు 1,400 ఎకరాలకు సంబంధించి కౌలు లీజు ముగిసినా నేటికీ ఆలయ భూములకు బహిరంగ వేలం పాటను అధికారులు నిర్వహించలేదు. 20 శాతం మంది మాత్రమే అసలైన కౌలుదారులు సక్రమంగా ఆలయానికి సొమ్ము చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది.

టెండర్ల వాయిదాల పర్వం..

చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆలయ భూముల టెండర్లు వాయిదా పడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా అధికార పార్టీ నేతలు అన్నీ తామై సిండికేట్‌గా మారి టెండర్లు దక్కించుకోవాలని చూడటంతో గతేడాది ఆగస్టు నుంచి వరుసగా మూడుసార్లు వాయిదా పడ్డాయి. ఏడాదికి సగటున 20 వేల మంది స్వామివారికి తలనీలాలు సమర్పిస్తుంటారు. 2024–25 ఏడాదికి ఉరవకొండకు చెందిన టీడీపీ ముఖ్య నాయకుడు రూ.27 లక్షలకు తలనీలాల సేకరణ హక్కులను దక్కించుకున్నాడు. అయితే ఇందులో రూ.9.5 లక్షలు మాత్రమే సదురు టీడీపీ నాయకుడు ఆలయానికి చెల్లించి, మిగతా సొమ్ము నేటికీ జమ చేయలేదు. ఈ సొమ్ములో కూడా గతంలో ఈఓగా విధులు నిర్వహించిన ఓ అధికారి తన సొంతానికి రూ.3 లక్షలు వాడుకున్నట్లు ఆలయ సిబ్బందే గుసగులాడుకోవడం గమనార్హం.

- భక్తులు పరమపవిత్రంగా భావించే శ్రీవారి లడ్డూ ప్రసాదం పెన్నహోబిలంలో కొంతకాలంగా కనుమరుగైంది. లడ్డూ ప్రసాదం టెండరు ప్రక్రియ ఆగిపోయి చాలా కాలమైంది. అధికార పార్టీ నేతలు – దేవదాయ శాఖ మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో భక్తులకు లడ్డూ ప్రసాదమే లేకుండా చేశారు.

ఆలయ కార్యనిర్వహణాధికారి గది

బాబోయ్.. ఒత్తిళ్లు భరించలేం!

రాష్ట్రంలో చంద్రబాబు సర్కారు కొలువుదీరగానే పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓగా రమేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. అయితే టీడీపీ నాయకుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు రావడంతో భరించలేకపోయిన ఆయన దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లారు. దీంతో అప్పటి జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ) తిరుమలరెడ్డికి ఆలయ ఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయనకూ అధికార పార్టీ నుంచి ఒత్తిళ్లు తప్పలేదు. దీంతో ఆయన కూడా సెలవులోకి వెళ్లిపోయారు. తదుపరి ఈఓ బాధ్యతలు గుంతకల్లుకు చెందిన మల్లికార్జున తీసుకుంటారని ఎండోమెంటు అధికారులు చెప్పన్నా.. ఆయన మాత్రం ముందుకు రాలేదు. ఈ క్రమంలో అనంతపురంలోని చెన్నకేశవ స్వామి ఆలయం ఈఓగా ఉన్న సుధారాణికి తాత్కాలికంగా పెన్నహోబిలం ఆలయ బాధ్యతలు అప్పగించారు.

మేం చెప్పినట్టు వినాల్సిందే..

పెన్నహోబిలం ఆలయ నూతన పాలక మండలి ఇంకా కొలువుదీరలేదు. అయినా సభ్యులుగా తామే ఉంటామని, మేము చెప్పినట్లుగా మీరు పనిచేయాల్సి ఉంటుందని కొందరు అధికార పార్టీనేతలు ఈఓలపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పాటు ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి అయ్యే రూ.5 లక్షల ఖర్చును ఆలయ నిధుల నుంచే వెచ్చించాలని షరతు విధించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటి వరకు ఇలా ఎప్పుడూ జరగలేదు. ఈ అంశం అధికారులకు ఇబ్బందికరంగా మారింది. చేసేది లేక సెలవుపై వెళ్తున్నారని తెలుస్తోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

పెన్నహోబిలంలో మేం గుర్తించిన సమస్యలను పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఇక్కడ కొన్నాళ్లుగా ఈఓ లేనిమాట నిజమే. సెలవులో ఉన్న తిరుమలరెడ్డి ఈ నెల 19న వస్తారు. అప్పటి వరకు నేను ఇన్‌చార్జ్‌గా మాత్రమే కొనసాగుతాను. కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా మేము కూడా ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ ద్వారా పర్యవేక్షిస్తున్నాం.

– సుధారాణి, పెన్నహోబిలం ఆలయ ఇన్‌చార్జ్, దేవదాయ శాఖ ఇన్‌చార్జ్ ఏసీ

గంజాయి స్మగ్లర్ల అరెస్టు

మూడు కేజీల గంజాయి స్వాధీనం

ఆత్మకూరురూరల్: గంజాయి సరఫరా చేసే ఇద్దరు స్మగ్లర్లను నంద్యాల జిల్లా ఆత్మకూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 60వేల విలువ చేసే మూడు కేజీల గంజాయిని స్వాధీన పరుచుకున్నారు. ఆత్మకూరు ఎస్‌డీపీవో రామాంజినాయక్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు తెలిపారు. కొత్తపల్లె మండల కేంద్రానికి చెందిన కేతె పుల్లయ్య జీవనోపాధి నిమిత్తం జేసీబీ ఆపరేటర్‌గా ఒడిశాలో పని చేశేవాడు. కొత్తపల్లె మండలం గువ్వలకుంట్లకు చెందిన శ్రీరాములుతో పరిచయం పెంచుకుని తెలంగాణా కొల్లాపురం మండలంలోని సోమశిలకు చెందిన తిరుపాలుతో కలసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి అలవాటు పడిన వారికి అమ్మే వారు. ఒడిశా రాష్ట్రం బరంపురానికి చెందిన కిశోర్ నుంచి ఈ ముఠా కేజీ రూ.9500 కు కొనుగోలు చేసి కిలో రూ. 19వేల చొప్పున అమ్మేవారు. సమాచారం అందడంతో ఆత్మకూరు అర్బన్ సీఐ తన సిబ్బందితో వల పన్ని ఆత్మకూరు సమీపంలో కేతె పుల్లయ్య, శ్రీరాములులను అదుపులోకి తీసుకున్నారు.

అగ్నిప్రమాదంలోవృద్ధురాలు సజీవదహనం

తెర్లాం: విజయనగరం జిల్లా తెర్లాం మండలం కొరటాం పంచాయతీ పరిధిలోని కె.సీతారాంపురం (చిన గొలుగువలస) గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 12 పూరిల్లు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో 85 ఏళ్ల వృద్ధురాలు కోష్ట పాపమ్మ సజీవ దహనమైంది. కోష్ట లక్ష్మి ఇంటి వద్ద ప్రారంభమైన మంటలు పక్కనే ఉన్న 11 ఇళ్లకు వ్యాపించడంతో క్షణాల్లో కాలిబూడిదయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు రాజాం అగ్నిమాపక కేంద్రం, రెవెన్యూ అధికారులు తెలిపారు.

పుంజుకుంటున్నాయ్

కోట్లాటకు రెడీ

- కోడి పుంజులకు ప్రత్యేక శిక్షణ
- బలవర్ధక ఆహారం
- నెల రోజుల్లో బరిలోకి..
- రూ.10 వేల నుంచి రూ.లక్షకు పైగా ధర

ద్వారకా తిరుమల మండలం రాళ్లకుంటలోని గాబుల్లో పందెం కోళ్లు

ద్వారకాతిరుమల/బుట్టాయగూడెం: సంక్రాంతి పందేలకు కోడి పుంజులు సిద్ధమవుతున్నాయి. బరుల్లో కత్తులు దూసేందుకు కఠోర సాధన చేస్తున్నాయి. ఈత, బలవర్ధక ఆహారం, ప్రత్యేక శిక్షణతో శిబిరాల్లో నువ్వా నేనా.. అన్నట్టు తలపడుతున్నాయి. పెద్ద పండగకు నెల రోజులు మాత్రమే సమయం ఉండటంతో వీటి అమ్మకాలు ఊపందుకున్నాయి. నెమలి, డేగ, అబ్రాసు, సీతువ, కాకి, పర్ల, రసంగి, కెక్కిరాయి.. ఇలా పలు జాతుల పుంజులు 'కోట్లా'టకు రెడీ అవుతున్నాయి. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని రాళ్లకుంట, కొమ్మర, మలసాని కుంట, ద్వారకాతిరుమల, దొరసానిపాడు, పంగిడిగూడెం, గుణ్ణంపల్లి, బుట్టాయగూడెం ప్రాంతాల్లో పుంజుల శిబిరాలు ఉన్నాయి.

మెలకువలతో శిక్షణ : పందెం పుంజుల్లో పలు రకాల జాతులు ఉన్నాయి. ముఖ్యంగా డేగ, కాకి, పూల, పర్ల, కెక్కిరాయి, సీతువ, రసంగి, నెమలి బరుల్లో తలపడుతుంటాయి. లక్షలాది రూపాయలు చేతులు మారే పందేల్లో ఆషామాషీ కోళ్లు తలపడవు. వాటికి శక్తి, సామర్థ్యం ఎంతో అవసరం. అందుకే పందెం పుంజుకు బలవర్ధక ఆహారం అందిస్తున్నారు. ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడంలో భాగంగా మెలకువలు నేర్పిస్తున్నారు. పోరాడే సత్తా ఉన్న పుంజులను ఎంపిక చేసి మరీ వాటికి శిక్షణ ఇస్తున్నారు.

ఆహా ఏమి భోగం: బాదంపప్పు, జీడిపప్పు, మటన్ కైమా, తాటి బెల్లం నువ్వుల నూనె ఉండలు వంటి బలవర్ధక ఆహారాన్ని పుంజులకు అందిస్తున్నారు. వీటి పెంపకం రాజభోగాన్ని తలపిస్తుంది. ఉదయం 6 గంటలకు పందెం రాయుళ్లు వాటిని చెరువుల్లోను, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి తొట్టెల్లో ఈదిస్తున్నారు. అలాగే మూలికలు, ఆకులతో మరిగించిన నీటిని వాటికి పోతపోస్తున్నారు. ఆ తర్వాత వాకింగ్ చేయించి కొద్దిసేపు ఎండలో కడుతున్నారు. 9 గంటలకు అల్పాహారంగా బాదం పప్పు, జీడిపప్పు, మటన్ కైమా పెడుతున్నారు. తాటి బెల్లాన్ని నువ్వుల నూనెతో కలిపి ఉండలుగా చేసి వాటికి తినిపిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చోళ్లు, గంట్లు, వడ్లుతో కూడిన మేతను పెడుతున్నారు. వాటికి ఎండ తగలకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలో, చెట్ల కింద ఏర్పాటు చేసిన గాబుల్లో ఉంచుతున్నారు. సాయంత్రం 6 గంటలకు పొయ్యిపై అట్లపెనం ఉంచి, దానిపై జల్లిన వేడి నీటిని పుంజుల దేహంపై పూస్తున్నారు. ఆ తర్వాత రెవిటాల్ వంటి బలవర్ధక మందులు వేస్తున్నారు. ఇలా రోజుకు ఒక్కో పుంజుకు రూ.100 వరకు ఖర్చు చేస్తున్నారు. శిబిరాల వద్ద ఒక్కో పుంజును రూ.10 వేల నుంచి రూ.లక్షకు పైగా విక్రయిస్తున్నారు.

శిక్షకులకు డిమాండ్

కోడి పుంజులకు శిక్షణ ఇచ్చే వారికి డిమాండ్ ఏర్పడింది. పుంజులకు శిక్షణ ఇచ్చే వారి ఎంపికలోనూ పందెంరాయుళ్లు జాగ్రత్తలు పాటిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి శిక్షకులను తీసుకొచ్చి, పుంజులకు ట్రెనింగ్ ఇప్పిస్తున్నారు.

కత్తులు నూరితూ.. పందేల్లో పుంజులకు కత్తులు కట్టే వారి హవా మామూలుగా ఉండదు. బరిని బట్టి వారు ధరను నిర్ణయిస్తారు. అస్లీ పందేలు మినహా మిగిలిన అన్ని పందేలు కత్తిలేనిదే జరగవు. అందుకే కత్తులు కట్టేవారు ఇప్పటినుంచే కత్తులను నూరేందుకు సిద్ధమవుతున్నారు.

గెలుపు మాదే.. ఏటా పందేలు జరగనివ్వమని బీరాలు పలికే పోలీసులు చివరకు రాజకీయ నాయకుల సిఫార్సులతో పండుగ మూడు రోజులు చూసీచూడనట్టు వదిలేయడం పరిపాటిగా వస్తోంది. పందేల నిర్వహణ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ బాసులు పండుగ ముందు నెల రోజుల నుంచి చెప్పడం సర్వసాధారణంగా మారింది. ఇదంతా ఏటా జరిగే తంతేనని, పండుగ రోజుల్లో పందేలు మామూలే అని పందెంరాయుళ్లు ధీమా వ్యక్తం చేస్తూ.. పుంజులను బలంగా తయారు చేస్తున్నారు.

చలిలో బెల్స్ పాల్సీ ముప్పు!

- పెరుగుతున్న ముఖపక్షవాతం కేసులు
- పెద్దాసుపత్రిలో వారంలో నలుగురికీ సమస్య
- చలిగాలిలో తిరగకపోవడమే నివారణ

కర్నూలు(హాస్పిటల్): మూతి వంకర పోవడం, అలాంటి నోటి నుంచి నీరు కారుతుండటం, తినాలన్నా, తాగాలన్నా ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే దానిని వైద్యపరిభాషలో బెల్స్ పాల్సీ అంటారు. తెలుగులో దానిని ముఖ పక్షవాతమని పిలుస్తారు. శీతాకాలంలో ఇలాంటి ఇబ్బందులు మరీ ఎక్కువవుతాయి. శీతల గాలుల నుంచి రక్షణ పొందడమే ఈ సమస్య రాకుండా నివారించే చర్య అని వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల కాలంలో చలిగాలులు తీవ్రమయ్యాయి. రాత్రి పూటే కాదు పగలు కూడా వాతావరణం చల్లగా ఉంటోంది. ఈ కారణంగా ఇల్లు, కార్యాలయం ఏదైనా, ఎక్కడైనా ఫ్యాన్ వేయాలన్నా జంకుతున్నారు. విపరీతమైన చలి ప్రజలను తీవ్రంగా వణికిస్తోంది. చలికారణంగా వాతావరణంలో ఉష్ణోగ్రతలు పగలు 20 డిగ్రీల సెల్సియస్‌కు, రాత్రి 13 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతున్నాయి. చాలా మందికి వృత్తి, ఉద్యోగం, వ్యాపారాల రీత్యా చల్లగాలికి బయటకు వెళ్లాల్సి ఉంటోంది. మరికొందరు ఉదయం వేళల్లో వాకింగ్‌కు వెళ్తుంటారు. ఇలా చల్లగా ఉన్న సమయంలో బయటకు వెళ్లే వారు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే చెవుల్లో నుంచి చల్లగాలి లోపలికి వెళ్లి ముఖ పక్షవాతానికి దారి తీస్తుంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరాలజి, జనరల్ మెడిసిన్, క్యాజువాలిటీ విభాగాలకు ప్రతి వారం ముగ్గురు నుంచి నలుగురు ముఖ పక్షవాతానికి (బెల్స్‌పాల్సీ) గురై చికిత్స నిమిత్తం వస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు సైతం రోజూ 6 నుంచి 8 మంది వరకు న్యూరాలజిస్టులు, జనరల్ ఫిజిషియన్ల వద్దకు చికిత్సకు వెళ్తున్నారు.

కారణాలు

బెల్స్‌పాల్సీకి కచ్చితమైన కారణం ఉండదు. దీనికి అనేక వైరస్‌లు కారణమవుతాయి. వీటిలో హెర్పస్ సింప్లెక్స్, హెర్పెస్ జోస్టర్, హెచ్ఐవీ, సైటోమెగలోవైరస్, ఎప్సీ టన్ బార్ వైరస్‌లు ప్రధానమైనవి. మధుమేహం, గర్భిణులు, గాయం, వాపు, ముఖ నరాలకు హాని కలిగించే ఏదైనా కారణం ముఖ పక్షవాతానికి దారి తీస్తుంది. చలి వాతావరణంలో ఈ వైరస్‌లు మనుగడు ఎక్కువగా సాగిస్తాయి కాబట్టి అధిక శాతం వీటి ప్రభావానికి గురవుతుంటారు. వీరు వైద్యుల సూచన మేరకు మందులు వాడుతూ ఫిజియోథెరపీ కూడా చేయించుకోవాల్సి ఉంటుంది.

బెల్స్ పాల్సీ అంటే...!

బెల్స్ పాల్సీ (ముఖపక్షవాతం) అనేది ముఖంలోని నరాలకు హాని కలిగించే ఒక రకమైన ఆరోగ్య సమస్య. తద్వారా రోగి ముఖ కదలికలను వ్యక్తం చేయడం, తినడం, మాట్లాడటం వంటివి చేయలేడు.

లక్షణాలు

- కనురెప్పలు మూసివేయడం, రెప్పలు కొట్టుకోవడం సాధ్యపడదు
- ముఖం కదిలించడంలో ఇబ్బంది
- నోరు ఒకవైపునకు వాలిపోవడం
- ముఖ ఆకృతులను సమతుల్యం చేయడంలో ఇబ్బందులు
- బెల్స్ పాల్సీలో వ్యక్తి తన కనుబొమ్మలను ఎగురవేయలేడు
- మాట్లాడటం, తినడంలో ఇబ్బంది

చలిలో తిరిగితే ఈ సమస్య

గత కొన్ని రోజులుగా వాతావరణంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. చలి తీవ్రంగా ఉంటోంది. చలిగాలులు పగలు సైతం అధికమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చెవులకు అచ్ఛాదన లేకుండా బయటకు వెళ్లకూడదు. ఎందుకంటే చల్లటి వాతావరణంలో వైరస్‌లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మనిషి నరాలపై దాడి చేస్తాయి.

దీనినే న్యూరోట్రోపిక్ అటాక్స్ అంటాము. అధిక శాతం వైరస్‌ల వల్ల బెల్స్ పాల్సీ వస్తుంది. కొందరిలో ఎలాంటి కారణం లేకుండా వస్తుంది. ఇలాంటి వారికి అవసరమైన మందులు ఇచ్చి చికిత్స చేస్తాము.

– డాక్టర్ సి. శ్రీనివాసులు, న్యూరాలజి హెచ్ఓడీ, జీజీహెచ్, కర్నూలు

రిజర్వు ఫారెస్ట్‌లో విధ్వంసం

కన్నాపురం అటవీ రేంజ్‌లో అడ్డగోలుగా కలప నరికివేత

- పొగాకు బేరన్ క్యూరింగ్ పనులకు కలప అక్రమ రవాణా
- ఫారెస్ట్ బీట్ మీదుగా నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు
- అడ్డగోలుగా దందా కొనసాగిస్తున్న మాఫియా
- అటవీశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం

ఈ నెల 8న కన్నాపురం అటవీ శాఖ రేంజ్‌లోని కోపల్లె బీట్‌లో 3 హెక్టార్లలో అడవిలో నరికేసి ఉన్న కలప

చెట్లు మొదళ్లను కొట్టేసి..

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రిజర్వ్ ఫారెస్ట్‌లో పచ్చని విధ్వంసం ప్రారంభమైంది. అడ్డగోలుగా కలపను నరికి బహిరంగంగానే అక్రమ రవాణా చేశారు. అటవీ శాఖ బీట్ మీదుగానే నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు అడవి నుంచి కలప లోడుతో వస్తున్నాయి. గిరిజనులను కూలీలుగా మార్చి కొందరు గిరిజనేతరులు తెగబడిన ఈ విధ్వంసానికి అటవీశాఖా అధికారులు కూడా సహకరం అందిస్తుండటంతో 20 ఏళ్ల పైబడిన చెట్లు నేలకొరుగుతున్నాయి. పొగాకు బేరన్ క్యూరింగ్ కోసం ఈ కలపను వినియోగించడం, స్థానికంగా మార్కెట్ ఉండటంతో అక్రమార్కులు అందరికీ ఇవ్వాల్సిందిచ్చి బహిరంగంగా విక్రయిస్తున్నారు.

ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలో ఏజెన్సీ ప్రాంతం అధికంగా ఉంటుంది. పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల వెంబడి వేలాది ఎకరాలు అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ప్రధానంగా పోలవరంలో అభయారణ్యం ఉండగా మిగిలిన రెండు మండలాల్లో రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. ప్రధానంగా కన్నాపురం రేంజ్‌లో 17 వేల హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. ఈ క్రమంలో సంక్రాంతి నుంచి పొగాకు కోతలు పూర్తయితే బ్యారన్లల్లో క్యూరింగ్ ప్రక్రియ నిర్వహిస్తుంటారు. దీనికి అత్యధికంగా మారుజాతి కలపను వినియోగిస్తుంటారు. దీంతో కొందరు గిరజనేతరులు గిరిజనులను కూలీలుగా మార్చి అటవీ ప్రాంతంలో 20 నుంచి 25 సంవత్సరాల మారుజాతి చెట్లను ఎంపిక చేసి మెషీన్లతో నేలకూల్చి కలపను అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కొక్క లోడ్ కలప రూ.4 నుంచి 6 వేల ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కన్నాపురం రిజర్వ్ ఫారెస్ట్ రేంజ్‌లో మారుజాతి, వేగిస, సండ్ర, మద్ది, బండారు తదితర రకాల కలప వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. వందేళ్ల పైబడిన వృక్షాలు కూడా వేల సంఖ్యలో ఉన్నాయి. ఇవి కాకుండా అటవీశాఖ ప్రతి ఏటా విత్తనాలను సీజన్‌లో చల్లుతుంటారు. హోమ్ ఫర్నీచర్‌కు ఈ కలపను వినియోగిస్తుండటంతో అధిక డిమాండ్ ఉంటుంది. భారీ వృక్షాల మానులను ఫర్నీచర్‌కు, మిగిలిన మొత్తాన్ని క్యూరింగ్‌కు వినియోగిస్తుంటారు. అదే 25 ఏళ్ల పైబడిన మానులకు మంచి డిమాండ్ కూడా ఉంది. ఈ క్రమంలో బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెంలో పొగాకు సాగు విస్తీర్ణం అధికంగా ఉంటుంది. ఒక్కొక్క బేరన్‌లో పొగాకు కాల్చడానికి 5 నుంచి 6 టన్నుల కలపను వినియోగిస్తుంటారు. ప్రతి సీజన్‌లో ఇదే తరహాలో అడవి నుంచి 500 నుంచి 800 టన్నులను అధికారకంగా నరికి విక్రయిస్తుంటారు.

అటవీ శాఖ అధికారులకు తెలిసే..

అటవీ శాఖ అధికారులకు తెలిసే అక్రమ నరికివేతలు, రవాణా జరుగుతున్నాయనేది బహిరంగ రహస్యం. ప్రధానంగా కన్నాపురం రేంజ్‌లో కన్నాపురం మెయిన్ రోడ్డు వద్దే ఫారెస్ట్ బీట్, అలాగే దొండపూడి వద్ద మరో బీట్ ఉంటుంది. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు ఈ బీట్ల మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. రెండు రోజుల క్రితం ఒకే రోజు 40 ట్రక్కుల రిజర్వ్ ఫారెస్ట్ కలప యుద్ధ ప్రాతిపదికన తరలించారు. దీనిలో కోపల్లె బీట్ ఏరియాలో 3 హెక్టార్ల విస్తీర్ణంలో చెట్లను మెషీన్లతో నేలకూల్చి 40 ట్రక్కుల్లో తరలించినా కనీసం ఫారెస్ట్ అధికారులు తొంగిచూడని పరిస్థితి. మరోవైపు పొగాకు బేరన్లకు కలప రవాణా చేసే అక్రమార్కుల నుంచి భారీ ప్యాకేజీలు అటవీ శాఖాధికారులకు అందుతాయనే విమర్శ ఉంది. స్థానిక అధికారులు మొదలుకొని ఒక స్థాయి అధికారి వరకు అందరికీ మాముళ్లు ఉంటాయనే ఆరోపణలున్నాయి. దీంతో పొగాకు బేరన్ సీజన్ సమయంలో రెండు నెలల పాటు ఏం జరిగినా అన్నీ తెలిసి కూడా పట్టించుకోరనే అపవాదు ఉంది. కార్యాలయం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ కేసులు గత సంవత్సరం నమోదు కావడం గమనార్హం.

● తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, కమల్ హాసన్‌లతో 'జియో–హాట్‌స్టార్' ప్రతినిధులు

దేశంలో వేల కోట్ల రూపాయల పరిశ్రమగా యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఎ.వి.జి.సి) విజృంభణతో విస్తృతమైన వినోద రంగంలో... సినిమా ఓ చిరుభాగమైంది. ఇవాళ మారిన కాలంతో పాటు మారాల్సి వస్తున్న సినిమా ఒకపక్క భాష, ప్రాంతీయ భేదాలను చెరిపేస్తుంటే, మరోపక్క ఓటీటీ వేదికలు దక్షిణాదిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి సొంతంగా నిర్మిస్తున్న 'ఒరిజినల్స్' కొత్త తరహా కథ, కథనాలను పరిచయం చేస్తున్నాయి. ఫిల్మ్‌సిటీల నిర్మాణం మొదలు శిక్షణ, మెంటర్‌షిప్ల ద్వారా ఈ సరికొత్త 'క్రియేటివ్ ఎకానమీ'లో ముందుగా పై చేయి సాధించాలని ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలు పోటాపోటీ పడుతున్నాయి.

● తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లితో 'ఐఫా' ప్రతినిధి

వెండి వెలుగులకై దక్షిణాదిలో పోటాపోటీ!

సాధారణ ఆర్థిక రంగంలోనే కాదు... సృజనాత్మక ఆర్థికవ్యవస్థ (క్రియేటివ్ ఎకానమీ)లోనూ తమదైన ముద్ర వేసేందుకు దక్షిణాది రాష్ట్రాలు పోటాపోటీగా ముందుకు దూసుకు వస్తున్నట్టు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక పక్క హైదరాబాద్లో 'తెలంగాణ రైజింగ్' పేరిట డిసెంబర్ 8 – 9 తేదీలలో గ్లోబల్ సమిట్ జరిగి, అందులో భాగంగా హిందీ సినీ పరిశ్రమను సైతం తెలంగాణకు ఆకర్షించాలన్న ప్రయత్నం జరిగింది. సరిగ్గా అదే సమయంలో డిసెంబర్ 9న చెన్నైలో ప్రముఖ 'జియో – హాట్‌స్టార్' సంస్థ నాలుగు దక్షిణాది భాషల్లో సరికొత్త వెబ్ సిరీస్‌లు, షోలను జనం ముందుకు తెస్తూ, అందుకు ముందస్తుగా 'సౌత్ అన్ బౌండ్' అనే ఉత్సవం నిర్వహించింది. అక్కడే తమిళనాట సినీ పరిశ్రమ అభివృద్ధికి గాను ఆ సంస్థకూ, తమిళనాడు ప్రభుత్వానికీ మధ్య ఓ ప్రాథమిక అవగాహన కూడా కుదరడం విశేషం.

మరోపక్క తెలుగు రాష్ట్రాలు ఒకటికి రెండు అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో సైతం తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి కొన్నేళ్ళుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. షూటింగులకు సింగిల్ విండో అనుమతుల మొదలు పలు చర్యలు గతంలోనే పాలకులు చేపట్టారు. స్థానికంగా చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్లను ప్రోత్సహించి, ఇప్పటికిప్పుడు కాకపోయినా సమీప భవిష్యత్తులో పరిశ్రమకు మరో కేంద్రంగా విభజిత ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలనేది ప్రయత్నం. వెరసి, సినీ పరిశ్రమకు చెరగని చిరునామాగా నిలిచి, తద్వారా 'క్రియేటివ్ ఎకానమీ'లో ముందు వరుసలో నిలవాలని దక్షిణాది రాష్ట్రాలు పరస్పరం పోటీ పడుతుండడం గమనార్హం.

● కాజల్ అగర్వాల్

సినిమాకు 'ఫ్యూచర్ సిటీ'... వినోదానికి గ్లోబల్ హబ్...

తెలుగు సినీ పరిశ్రమకు ఆది నుంచి తమ కాంగ్రెస్ ప్రభుత్వాలే అండగా నిలుస్తున్నాయని పదే పదే నొక్కిచెబుతున్న ప్రస్తుత తెలంగాణ సర్కార్ హైదరాబాద్‌ను భారతీయ సినిమా పరిశ్రమకు మరో కీలక కేంద్రంగా రూపుదిద్దడానికి చాలాకాలంగా ముమ్మర ప్రయత్నాలు చేస్తూనే ఉంది. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టుగా రానున్న 'ఫ్యూచర్ సిటీ'లో సల్మాన్ ఖాన్, అజయ్ దేవ్‌గణ్ లాంటి హిందీ తారలకు సైతం ఫిల్మ్‌సిటీ నిర్మాణాలకు స్థలాలు ఇచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుముఖత వ్యక్తం చేసింది. దాదాపు 50 ఏళ్ళుగా హైదరాబాద్‌తో మమేకమైన అన్నపూర్ణ స్టూడియోస్ సైతం 'ఫ్యూచర్ సిటీ'లో భాగమవుతుందంటూ అక్కినేని నాగార్జున లాంటి వారు ప్రకటించారు.

అలాగే, సంస్కృతి, సినిమా, సృజనాత్మకతలకు గ్లోబల్ హబ్‌గా రాష్ట్రాన్ని నిలపడం కోసం ఈ డిసెంబర్ ప్రథమార్ధంలోనే 'ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడెమీ' (ఐ.ఐ.ఎఫ్.ఎ – 'ఐఫా')తో సైతం తెలంగాణ సర్కార్ పలు సంవత్సరాల భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా దాదాపు 120కి పైగా దేశాల్లో వీక్షకులున్న ''వార్షిక 'ఐఫా' ఉత్సవం 2026 నుంచి 2028 వరకు వరుసగా మూడేళ్ళ పాటు హైదరాబాద్‌లో జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక భాగస్వామిగా వ్యవహరిస్తుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినిమాలకు 'ఐఫా' అవార్డులు అందించే ఈ ఉత్సవాల వల్ల ఏటా కొన్ని వేల మంది సందర్శకులు మన దగ్గరకు వస్తారు'' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వివరించారు.

సౌత్‌పై కన్నేసిన 'జియో - హాట్‌స్టార్'!

ఇక, తమిళనాడు ప్రభుత్వంతో తాజాగా 'జియో–హాట్‌స్టార్' భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఆ మేరకు అక్కడి ప్రభుత్వంతో 'లెటర్ ఆఫ్ ఇంటెంట్'పై సంతకం చేస్తున్నట్లు డిసెంబర్ రెండోవారంలో ప్రకటించింది. ఫలితంగా, తమిళనాట సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆ సంస్థ కీలక పాత్ర పోషించనుంది. ''ప్రాంతీయతకు పెద్ద పీట వేసి, కొత్త తరం కథలు, భౌగోళిక సరిహద్దులను దాటి వినూత్న కథలను భారీ స్థాయిలో పరిచయం చేయాలన్నది ఈ ఒప్పందం ఉద్దేశం. అందుకు తగ్గట్టే నవతరం చిత్రనిర్మాతలు, రచయితలు, ఎడిటర్లు, డిజిటల్ కథకులను ప్రోత్సహించే విధంగా రైటింగ్ ల్యాబ్‌లు, మెంటర్‌షిప్ ప్రోగ్రామ్‌లు, నైపుణ్యాభివృద్ధి వర్క్ షాప్‌ల లాంటివి చేపడతాం'' అని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఇప్పటికే, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో లాంటివి దక్షిణాదిలోనూ అనేక రకాల ఒరిజినల్ కంటెంట్‌తో ముందుకొస్తున్నాయి. తాజాగా 'జియో – హాట్‌స్టార్' సైతం ఏకకాలంలో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం... ఇలా నాలుగు దక్షిణాది భాషల్లో ఫిక్షన్, నాన్ – ఫిక్షన్ కేటగిరీలలో 25 రకాల కొత్త టైటిల్స్‌ను వీక్షకుల నట్టింట్లోకి తెచ్చేందుకు సిద్ధమైంది. ''దక్షిణ భారతదేశం ఎప్పుడూ సృజనాత్మకశక్తికి కేంద్రం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడి ప్రేక్షకులు వినోద రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. వారి అభిరుచికి తగ్గట్టుగా సరికొత్త వినోదం అందించాలన్నది మా ప్రయత్నం. అందుకే ఈ 'సౌత్ అన్‌బౌండ్'. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో కొత్తగా 25 వెబ్ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, షోలు అందిస్తున్నాం. ఈ కృషిలో భాగంగా గత పది నెలల్లో, దాదాపు 500 మంది క్రియేటర్లు, డైరెక్టర్లు, షో రన్నర్లు మా సంస్థ కుటుంబంలో భాగమయ్యారు'' అని 'జియో స్టార్' ఎంటర్‌టైన్మెంట్ (సౌత్) హెడ్ కృష్ణన్ కుట్టి వివరించారు.



● 'కాట్టాన్'లో విజయ్ సేతుపతి

సినీ ప్రముఖులు ఎందరో...

ఈ ప్రసిద్ధ స్ట్రీమింగ్ దిగ్గజం అందిస్తున్న సిరీస్‌లు, షోలలో సినీ ప్రముఖులు సైతం భాగం కావడం చెప్పుకోదగ్గ విశేషం. పాపులర్ నటుడు విజయ్ సేతుపతి సైతం తమిళంలో 'కాట్టాన్' అనే ఓ వెబ్ సినిమాను స్వయంగా నిర్మిస్తూ, నటిస్తున్నారు. మలయాళంలో 'దృశ్యం' చిత్ర సిరీస్ ద్వారా దేశవ్యాప్త గుర్తింపు పొందిన దర్శక – నిర్మాత జీతూ జోసెఫ్ సైతం మరో ఓటీటీ ప్రయత్నాన్ని సమర్పిస్తున్నారు. ఇక, ప్రసిద్ధ నటుడు నివిన్ పాలీ సైతం భారతీయ ఔషధ రంగంలోని లోటుపాట్లపై నిర్మిస్తున్న 'ఫార్మా' అనే వెబ్ చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. తెలుగులో ప్రముఖ సినీ హీరోయిన్లు కాజల్ అగర్వాల్, ఐశ్వర్యా రాజేశ్, సీనియర్ నటి జయసుధ, యువ హీరో ప్రియదర్శి పులికొండ, యువ హీరోయిన్ శివాత్మికా రాజశేఖర్, కమెడియన్ అభినవ్ గోమఠం, సీనియర్ నటుడు సాయికుమార్... ఇలా సుపరిచితులైన పలువురు ఈ వెబ్ సిరీస్‌లలో అలరించనున్నారు.

ఇలా రాబోయే అయిదేళ్ళలో ఆ సంస్థ దక్షిణాది భాషల్లో ఏకంగా రూ. 12 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా ప్రత్యక్షంగా 1000 మందికి, పరోక్షంగా 15 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. స్వయంగా పలు చిత్రాలు నిర్మించి, వెండితెరపై నటించిన తమిళనాడు ఉప-ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సైతం రాష్ట్రంలో మరింత ఉపాధి, ఆదాయం పెంచే ఈ ఆలోచన పట్ల ఉత్సాహం కనబరుస్తున్నారు. ''దక్షిణాది రాష్ట్రాలకు చెన్నై ఓ ప్రధాన కేంద్రం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినిమాలు ఇక్కడే పుట్టాయి. అన్ని భాషల కళాకారులకూ ఇది నిలయం. దక్షిణాది సహకారం భారతీయ సినిమాకు కొత్త ప్రమాణాలను సృష్టించింది'' అని ఆయన వ్యాఖ్యానించారు.

● 'సేవ్ ది టైగర్స్–3' బృందం చైతన్యకృష్ణ, ప్రియదర్శి, అభినవ్, దేవియానీ శర్మ, పావని గంగిరెడ్డి, దర్శకుడు మహి వి. రాఘవ

రానున్న సరికొత్త ఫిల్మ్ సిటీలు!

నిజానికి, సినీ రంగంలోకి రావాలనుకొనే ఔత్సాహికులకు శిక్షణ నిచ్చేందుకు 1970ల నాటికే చెన్నైలో సౌతిండియన్ ఫిల్మ్ ఛాంబర్ పక్షాన ప్రతిష్ఠాత్మక ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఆరంభమైంది. ఆ తరువాత కాలంలో ప్రభుత్వమే పూర్తి స్థాయిలో చెన్నై ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను నడుపుతూ వచ్చింది. ఇప్పటికీ అది నడుస్తోంది. ఇక, 1990ల నాటికే చెన్నైలో ఒకే చోట పలు సినిమా, టీవీ సీరియళ్ళ నిర్మాణానికి అనువుగా ఉండేలా ప్రభుత్వం 'ఎం.జి.ఆర్. ఫిల్మ్‌సిటీ' పేరిట ప్రత్యేకంగా నెలకొల్పింది. అది చాలాకాలం తమిళ, తెలుగు, మలయాళ సినిమాలకు నిర్మాణ కేంద్రంగా నడిచింది. ఇప్పుడు హైదరాబాద్ 'ఫ్యూచర్ సిటీ'లో సినిమా స్టూడియోలు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో స్టూడియోల నిర్మాణం కోసం ప్రయత్నాలు సాగుతుంటే... మరోపక్క చెన్నైలో ఇప్పటికి రెండేళ్ళుగా సమస్త సౌకర్యాలతో, అధునాతన ఫిల్మ్ సిటీ నిర్మాణం కోసం తమిళనాడు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

2024 జనవరిలోనే డి.ఎం.కె. అధినేత – తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి శతజయంతి సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ ప్రణాళికను ప్రకటించారు. చెన్నై శివార్లలోని పూనమల్లి దగ్గర కుతంబాక్కమ్ ప్రాంతంలో 152 ఎకరాల స్థలంలో రూ. 500 కోట్లతో ఈ నవీన ఫిల్మ్ సిటీ రూపొందనుంది. యానిమేషన్, వీఎఫ్ఎక్స్ స్టూడియోలతో పాటు భారీ ఎల్ఈడీ గోడలతో కూడిన వర్చ్యువల్ ప్రొడక్షన్ టెక్నాలజీలు, పోస్ట్ ప్రొడక్షన్ వసతులు, పరిశ్రమ వర్గీయుల కోసం ఫైవ్ స్టార్ హోటల్ వసతి వగైరా అంతా అందుబాటులో ఉంచాలని యోచన. ''త్వరలోనే నిర్మాణం చేపట్టి, సరికొత్త ఫిల్మ్ సిటీ కల సాకారం చేస్తాం'' అని ఉదయనిధి ప్రకటించారు.

● శివాత్మికా రాజశేఖర్

నేరుగా ఇంట్లోనే రిలీజ్!

ఇప్పుడు ఓటీటీలు కూడా రావడంతో అవి ప్రత్యేకంగా నిర్మిస్తున్న ఒరిజినల్ వెబ్ సినిమాలు, సిరీస్‌లు, షోల చిత్రీకరణ కూడా హెచ్చింది. భాషలు, ప్రాంతాలతో సంబంధం లేకుండా దేశవ్యాప్తంగా అందరినీ అలరించడమూ పెరిగింది. దక్షిణాది మీద ఇటీవల ప్రత్యేకంగా దృష్టి పెడుతున్న ఈ ఓటీటీ వేదికల ప్రాజెక్టులకు సైతం వసతి సౌకర్యాలు పెరగాల్సి ఉంది. అందు కోసం రానున్న కొత్త ఫిల్మ్ సిటీ వసతులు, రాష్ట్రాల ప్రత్యేక పాలసీలు ఉపకరిస్తాయి. ఆ సంగతి గ్రహించబట్టే దక్షిణాది రాష్ట్రాలన్నీ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నాయి.

● నాగార్జున

థియేటర్లతో సంబంధం లేకుండా నేరుగా నట్టింటికే సినిమాను తీసుకొచ్చేసిన ఓటీటీలు ఇటీవల సులభమైన డబ్బింగ్, సబ్ టైటిల్స్ సాయంతో భాష, భౌగోళిక సరిహద్దుల్ని చెరిపేశాయి. ''కథలు చెప్పే విషయంలో కంటెంట్ ముఖ్యం. ఇప్పుడైనా, ఎప్పుడైనా కంటెంట్ ఈజ్ కింగ్. కంటెంట్ బాగుంటే చాలు, భాష, ప్రాంతం దాటి అన్ని భాషల వారిని అలరిస్తాయి'' అని అభిమానులు ఆప్యాయంగా 'కింగ్' అని పిలుచుకొనే హీరో నాగార్జున సైతం ఇటీవల బాహాటంగా అన్నారు. ఉదయనిధి స్టాలిన్ సైతం ఆ మాటే అంటూ, ''కథను ఎలా చెప్పాలి, ప్రజలకు ఎలా చేరువ చేయాలి అన్న దానికి కమలహాసన్ సార్ గొప్ప స్ఫూర్తి, ఉదాహరణ. సినీ రంగంలో ఆయన ఎన్నో ప్రయోగాలు చేశారు. ఓటీటీలు ఏవీ రాక ముందే, పుష్కరకాలం క్రితమే 2013 లోనే ఆయన తన ('విశ్వరూపమ్') చిత్రాన్ని డైరెక్ట్ టు హోమ్ (డీటీహెచ్) రిలీజ్ చేశారు'' అని గుర్తు చేశారు.

కరోనా కాలంలో థియేటర్లు మూసివేతలో ఉండడంతో కొన్ని సినిమాలు నేరుగా ఓటీటీలోకి వచ్చేయడం తెలిసిందే. ఇక, ఇప్పుడు తమదైన ప్రత్యేకత చాటాలని 'జియో–హాట్ స్టార్', నెట్ ఫ్లిక్స్, అమెజాన్ లాంటి ఓటీటీ స్ట్రీమింగ్ వేదికలు తమ ఒరిజినల్స్ ద్వారా చేస్తున్నది అదే. అవి నేరుగా నట్టింటిలోకే తమ కొత్త సినిమా, సిరీస్, షోలను అందిస్తున్నాయి. వినోద రంగంలో విప్లవం సృష్టిస్తున్నాయి. థియేటర్లలో రిలీజయ్యే కొత్త సినిమాకు సైతం పోటీ అవుతున్నాయి.

అయితే, ఓటీటీ కొత్త ద్వారాలు తెరిచింది. ఉదయనిధి అభిప్రాయపడినట్టు, ''ఇవాళ ఓటీటీ (ఓవర్ ది టాప్) వేదికలు వచ్చి, సినిమా స్థానాన్ని ఆక్రమిస్తున్నాయని అనుకుంటే పొరపాటు. నిజానికి, సినీ ప్రపంచాన్ని మరింత విస్తరింపజేస్తున్నాయి. కొత్త తరహా కథలు, కథనరీతులు, ఇంతకాలం లోకానికి వినిపించని అనేక గొంతులకు ఓటీటీ జాగా ఇస్తోంది.''

● 'మూడు లాంతర్లు' పోస్టర్

ఈ కొత్త అవకాశాన్నీ, అందుబాటులో ఉన్న స్థానాన్నీ ఓటీటీలు తమ దక్షిణ భారతీయ భాషా ఒరిజినల్స్ ద్వారా ఎంతవరకు అందిపుచ్చుకుంటాయో చూడాలి. వాటికి తగిన వాతావరణాన్నీ, వసతులనూ కల్పిస్తే... సొంత గడ్డపై సరికొత్త ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందన్నదే ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల దృష్టి. కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టే 'జియో – హాట్‌స్టార్' ప్రతిపాదనకు తమిళనాడు ప్రభుత్వం సై అన్నా, 'ఐఫా'తో తెలంగాణ సర్కారు జట్టు కట్టినా, సినిమా పరిశ్రమ వారిని ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో పదే పదే ప్రయత్నిస్తున్నా అందరూ ఈ 'ఆరెంజ్ ఎకానమీ' కోసమే మరి!

● ఐశ్వర్యా రాజేశ్

– రెంటాల జయదేవ

హారర్... థ్రిల్

అమిత్ రావ్, పర్వీజ్ సింబా, ప్రకాశ్ తుంబినాడు, రవి భట్, సంగీత ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'జిన్'. చిన్మయ్ రామ్ దర్శకత్వంలో నిఖిల్ ఎమ్. గౌడ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. ''ఈ రోజుల్లో వైవిధ్యభరితమైన కథలు ఏ స్థాయిలో ప్రేక్షకాదరణ అందుకుంటున్నాయో చూస్తూనే ఉన్నాం. కథలో విషయం ఉంటే కొత్త నటీనటులైనా సరే సినిమా సూపర్ సక్సెస్ అవుతోంది. సరిగ్గా అదే ఫార్ములాతో మా 'జిన్' చిత్రం రూపొందింది. సస్పెన్స్, హారర్, థ్రిల్లర్ జానర్‌లో సరికొత్తగా, అన్ని వర్గాల ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేలా తెరకెక్కించారు చిన్మయ్ రామ్. మా చిత్రం నుంచి విడుదలైన పోస్టర్స్, వీడియోస్ ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకోవడమే గాక అంచనాలు నెలకొల్పాయి'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: అలెక్స్, కెమెరా: సునీల్ హొన్నాళి.

అలా ఆగకూడదని మళ్లీ మొదలుపెట్టాను

– సింగర్ స్మిత

సింగర్ స్మిత, నోయల్ నటించిన 'ఓజీ–మసక మసక' సాంగ్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ పాటకు విజయ్ బిన్నీ దర్శకత్వం వహించగా, జార్జ్ సి. విలియమ్స్ విజువల్స్ అందించారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో స్మిత మాట్లాడుతూ– ''మా నాన్న ఒక థాట్‌ని మొదలుపెట్టారు. అమ్మ నన్ను ప్రోత్సహించి, తన ఫస్ట్ ఇన్వెస్ట్‌మెంట్‌ని నాపై పెట్టారు. 'హాయ్ రబ్బా' ఆల్బమ్ అమ్మ ఇన్వెస్ట్‌మెంట్‌తోనే వచ్చింది. దేశవ్యాప్తంగా పాపులర్ అయింది. అదే ఇంటి పేరుగా మారింది. ఇప్పుడు ఇంటిపేరు మార్చుకుని 'ఓజీ' చేద్దామని అనుకున్నాం. 'ఓజీ–మసక మసక' సాంగ్‌ని నాగార్జునగారు బిగ్ బాస్ స్టేజ్ మీద లాంచ్ చేశారు. నా జర్నీలో ఆయన అన్ని రకాలుగా భాగమై ఉన్నారు. ఆయన ప్రోత్సాహం నాకు ఎంతో బలాన్ని ఇస్తుంది. ఇక నార్త్‌లో ఇండిపెండెంట్ మ్యూజిక్ చాలా పాపులర్ అవుతోంది. సౌత్‌లో మాత్రం నేను ఆపిన చోటే ఆగిపోయింది. అలా ఆగకూడదని, మళ్లీ మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నాను. ఈ సంక్రాంతికి మరో పాట వస్తుంది. ఈ పాట ఒక ఫెస్టివల్‌గా ఉంటుంది. ఇకపై వరుసగా పాటలు రాబోతున్నాయి. మార్చి చివరి నుంచి లైవ్ షోస్ కూడా ఉంటాయి. హైదరాబాద్, ఆంధ్రాలో రెండు లొకేషన్స్, యూఎస్, దుబాయ్, ఆస్ట్రేలియా, సింగపూర్‌లో కూడా ఈవెంట్స్ ఉంటాయి. 2026లో నా లైఫ్‌లో మ్యూజిక్కే ఉంటుంది'' అన్నారు. ఈ వేడుకలో అతిథిగా పాల్గొన్న దర్శకుడు దేవా కట్టా మాట్లాడుతూ– ''ఫస్ట్ తెలుగు పాప్ మ్యూజిక్ స్టార్‌గా స్మిత ఓ ట్రెండ్ సెట్టర్. అందరికీ స్ఫూర్తి. ఈ సాంగ్‌ను చాలా ఎంజాయ్ చేశాను'' అని చెప్పారు. ''స్మితగారే నాకు డ్యాన్సర్‌గా కొరియోగ్రఫీ కార్డు ఇప్పించారు. ఆ తర్వాత నాగార్జునగారితో పరిచయం ఏర్పడి, ఆయన హీరోగా నటించిన 'నా సామిరంగ' సినిమాతో డైరెక్టర్ అయ్యాను. స్మితగారు మ్యూజిక్ వీడియో గురించి చెప్పగా, చేస్తానన్నాను'' అని తెలిపారు విజయ్ బన్నీ. ''నేను ఇండిపెండెంట్ మ్యూజిక్ చేయడానికి స్మితగారే స్ఫూర్తి. మేం చేయబోతున్న పాటలు ఆడియన్స్‌ని అలరిస్తాయి'' అని తెలిపారు నోయల్.

● నోయల్, దేవా కట్టా, స్మిత

కొనసాగిన
పండగ సీజన్ జోష్..

- నవంబర్‌లో రికార్డు స్థాయిలో వాహనాల హోల్‌సేల్ విక్రయాలు
- రెండంకెల స్థాయి వృద్ధి
- 2026పై సానుకూల అంచనాలు

న్యూఢిల్లీ: పండుగలు అయిపోయినప్పటికీ వాహనాలకు సంబంధించి నవంబర్‌లోనూ ఆ జోష్ కొనసాగింది. కార్లు, ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలకు భారీగా డిమాండ్ నెలకొంది. జీఎస్‌టీ 2.0 సంస్కరణలు కూడా తోడు కావడంతో హోల్‌సేల్ అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఆటోమొబైల్ డీలర్ల సమాఖ్య ఎఫ్ఏడీఏ గణాంకాల ప్రకారం హోల్‌సేల్ డేటాకి తగ్గట్లే ప్యాసింజర్ వాహనాలు, త్రీ–వీలర్ల అమ్మకాలు ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్‌లో ఏర్పడే డిమాండ్‌ని దృష్టిలో ఉంచుకుని వాహన తయారీ సంస్థలు.. డీలర్‌షిప్‌ల దగ్గర స్టాక్స్ గణనీయంగా పెంచినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు, ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్లు మాత్రం వార్షికంగా 3 శాతం మేర నెమ్మదించాయి. 2024 నవంబర్‌లో 26,27,617 యూనిట్లు రిజిస్టర్ కాగా ఈసారి నవంబర్‌లో 25,46,184 యూనిట్లు రిజిస్టర్ అయ్యాయి. పండగల నెల కావడంతో అక్టోబర్‌లోనే భారీగా టూ –వీలర్ల కొనుగోళ్లు జరగడం, పంట సంబంధ చెల్లింపుల్లో జాప్యం, కస్టమర్లకు నచ్చిన మోడల్స్ అందుబాటులో లేకపోవడం తదితర అంశాలు ఇందుకు కారణమని ఎఫ్ఏడీఏ పేర్కొంది.

బులిష్‌గా పరిశ్రమ..

పంటల దిగుబడులు పటిష్టంగా ఉండటం, పెళ్లిళ్ల సీజన్‌లాంటి అంశాల దన్నుతో టూ–వీలర్లతో పాటు మిగతా వాహనాల అమ్మకాలు కూడా భారీగా పెరుగుతాయని ఎఫ్ఏడీఏ ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున పాలసీపరమైన సంస్కరణలు, మార్కెట్ సెంటిమెంట్లు మెరుగుపడటం లాంటి అంశాల మద్దతుతో వచ్చే ఏడాది కూడా ఇదే సానుకూల ధోరణి కొనసాగుతుందని పరిశ్రమ ఆశిస్తున్నట్లు సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ చెప్పారు. అమ్మకాలపరంగా ఈసారి నవంబర్ తమకు అత్యుత్తమ నెలగా గడిచిందని ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ తెలిపింది. ''గత 40 ఏళ్లలో (కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుంచి) నవంబర్ నెలకు సంబంధించి ఈ ఏడాది అత్యుత్తమంగా గడిచింది. గత నెలలో అత్యధికంగా వాహన విక్రయాలు నమోదయ్యాయి'' అని మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. తమ రిటైల్ అమ్మకాలు 31% పెరిగినట్లు వివరించారు. అలాగే ఎనిమిది మోడల్స్ విషయంలో ఫ్యాక్టరీ స్థాయిలో కూడా నిల్వలు లేకుండా పూర్తిగా అమ్ముడైపోయినట్లు పేర్కొన్నారు. ఇక చిన్న కార్ల (4 మీటర్ల లోపు పొడవు, 18 శాతం ట్యాక్స్ రేటు వర్తించేవి) సంగతి తీసుకుంటే అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన 38 శాతం పెరిగాయని బెనర్జీ చెప్పారు. అలాగే పెద్ద కార్ల (40 శాతం పన్ను రేటు వర్తించేవి) విక్రయాలు 17 శాతం పెరిగాయని వివరించారు.

పెండింగ్‌లో లక్షన్నర బుకింగ్స్ ..

మారుతీ సుజుకీ దగ్గర 1,50,000 వాహనాలకు బుకింగ్స్ పెండింగ్‌లో ఉన్నాయి. డిస్ట్రిబ్యూటర్లు, డీలర్ల దగ్గర మరో 1,20,000 యూనిట్లు ఉన్నాయి. వెయిటింగ్ పీరియడ్‌లను తగ్గించేందుకు, సకాలంలో వాహనాలను డెలివరీ చేసేందుకు సెలవు రోజుల్లో కూడా సిబ్బంది పని చేస్తున్నట్లు బెనర్జీ వివరించారు. డిసెంబర్‌లో కూడా ఇదే జోరు కొనసాగే అవకాశం ఉందని కంపెనీ భావిస్తోంది. అటు టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా తదితర దిగ్గజాలు కూడా నవంబర్‌లో భారీ అమ్మకాలు నమోదు చేశాయి. టాటా మోటర్స్ అమ్మకాలు 22 శాతం పెరిగి 57,436 యూనిట్లకు చేరాయి.

ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో 19% వృద్ధి

వాహన తయారీదారుల సంఘం సియామ్ వెల్లడి

ముంబై: పండగ సీజన్ తర్వాత కూడా ప్యాసింజర్ వాహనాలకు (కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) డిమాండ్ కొనసాగింది. ఈ నవంబర్‌లో కంపెనీల నుంచి డీలర్లకు మొత్తం 4,12,405 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు సరఫరా అయ్యాయి. గతేడాది ఇదే నవంబర్‌లో సరఫరా 3,47,522తో పోలిస్తే ఇది 19% అధికంగా ఉందని భారత వాహన తయారీదారుల సంఘం సియామ్ తెలిపింది. కార్ల తయారీ అగ్రగామి మారుతీ సుజుకీ సరఫరా 1,41,312 నుంచి 21 % పెరిగి 1,70,971 యూనిట్లకు చేరింది. మహీంద్రా అండ్ మహీంద్రా 56,336 యూనిట్లను సరఫరా చేసింది. ఇదే నవంబర్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా డీలర్లకు 50,340 యూనిట్లను పంపిణీ చేసింది.



- ద్విచక్రవాహనాల పంపిణీలో 21% వృద్ధి నమోదైంది. ఈ నవంబర్‌లో మొత్తం సరఫరా 16,04,749 యూనిట్ల నుంచి 19,44,475 చేరింది. మోటార్‌సైకిల్ విభాగంలో 11,63,751 యూనిట్లు, స్కూటర్ల విభాగంలో 7,35,753 యూనిట్ల సరఫరా జరిగింది. అయితే మోపెడ్ సిగ్మెంట్‌లో 2% క్షీణత నమోదైంది. మొత్తం 45,923 యూనిట్ల నుంచి 44,971 యూనిట్లకు పరిమితమయ్యాయి. త్రీ వీలర్స్ అమ్మకాలు 21% వృద్ధితో 71,999 యూనిట్లుగా నమోదయ్యాయి. ''పండుగ డిమాండ్ కొనసాగింపు, కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 సంస్కరణ దన్ను భారతీయ ఆటో పరిశ్రమ నవంబర్‌లోనూ అమ్మకాల జోరును కనబరించింది. ప్యాసింజర్, టూ వీలర్స్, త్రీ వీలర్స్ విభాగాలకు సంబంధించి ఈ ఏడాదిలో నవంబర్ అత్యధికంగా అమ్ముడైన నెలగా రికార్డు సృష్టించింది. ప్రజారంజకనమైన ప్రభుత్వ సంస్కరణలు, మెరుగుపడుతున్న మార్కెట్ సెంటిమెంట్‌తో వచ్చే ఏడాది (2026)లోనూ ఇదే వృద్ధి నమోదవుతుందని పరిశ్రమ ఆశాభావంతో ఉంది'' అని సియామ్ డైరెక్టర్ రాజేశ్ మీనన్ తెలిపారు.

బిజినెస్ రీల్

హైదరాబాద్‌లో డబ్ల్యూజీఎస్‌స్క్వేర్‌డీ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమెరికన్ టెక్నాలజీ సర్వీసుల సంస్థ డబ్ల్యూజీఎస్‌స్క్వేర్‌డీ కన్సల్టింగ్ తాజాగా హైదరాబాద్‌లో తమ కార్యాలయం ప్రారంభించింది. తద్వారా ఆసియా మార్కెట్లోకి కంపెనీ అడుగుపెట్టినట్లయింది. అంతర్జాతీయంగా తమ వృద్ధి ప్రస్థానంలో ఇదొక కీలక మైలురాయని కంపెనీ సీఈవో స్టీవ్ అలెసీ తెలిపారు. హైదరాబాద్‌లో ప్రతిభావంతుల లభ్యత, టెక్నాలజీ మౌలిక సదుపాయాలు, వ్యాపార నిర్వహణకు అనువైన పరిస్థితులు మొదలైన సానుకూలాంశాలు ఉన్నాయని కంపెనీ భారత విభాగం సీఈవో నిఖిల్ చౌహాన్ చెప్పారు.

ఏడాదిన్నరలో 10 హోటల్స్: ఆలివ్ ఎంబసీ

హైదరాబాద్: వచ్చే 12–18 నెలల్లో హైదరాబాద్‌లో 10 హోటల్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆలివ్ బై ఎంబసీ సీఈవో కహ్రమన్ ఇజిత్ తెలిపారు. ప్రధానంగా అత్యధిక డిమాండ్ ఉండే మైక్రో–మార్కెట్స్‌పై దృష్టి పెడుతున్నట్లు హైదరాబాద్‌లో తమ తొలి ప్రాపర్టీని ప్రారంభించిన సందర్భంగా వివరించారు. ఇందులో 73 గదులు, 45 సీటర్ రెస్టారెంట్ ఉంటాయి. తమ మెట్రో మార్కెట్ పోర్ట్‌ఫోలియోలో నగరం కీలకంగా మారనుందని ఇజిత్ వివరించారు. 2026లో దేశవ్యాప్తంగా 100 ప్రాంతాల్లో హోటల్స్ ఏర్పాటు దిశగా ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.

ఈవీ ప్లాంటుపై గ్రావ్టన్ దృష్టి

ముంబై: తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) పవర్‌ట్రైన్లు, ద్విచక్ర వాహనాల ఉత్పత్తి కోసం అధునాతన ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు గ్రావ్టన్ మోటర్స్ తెలిపింది. అలాగే స్వయంచాలిత గ్రౌండ్ వెహికల్ (ఏజీవీ)ని అభివృద్ధి చేయనున్నట్లు వివరించింది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ పేర్కొంది. పరిశోధనల ఆధారిత తయారీ, నైపుణ్యాల్లో శిక్షణ మొదలైన వాటికి ఇది దోహదపడుతుందని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-12-2025

విశాఖ	670–00
చిత్తూరు	683–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	670–00
విజయవాడ	695–00
రిటైల్ ధర (డజను)	96.00
హైదరాబాద్	661–00
వరంగల్	663–00
రిటైల్ ధర	7.21

నిధుల సమీకరణలో పర్సెప్టైన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏఐ రోబోటిక్స్ అంకుర సంస్థ పర్సెప్టైన్ వచ్చే ఏడాది మరింతగా నిధులను సమీకరించడంపై దృష్టి పెడుతోంది. ఇప్పటికే దేశీ, అంతర్జాతీయ ఇన్వెస్టర్ల నుంచి రూ. 30 కోట్లు సేకరించినట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు జగ్గరాజు నడింపల్లి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా చెప్పారు. ఇంటెల్ సీఈవో తదితరులు తమ సంస్థలో ఇన్వెస్ట్ చేసినట్లు చెప్పారు. గణనీయంగా పెరుగుతున్న క్లయింట్లకు తగ్గట్లుగా ఉత్పత్తులను అందించే సామర్థ్యాలను పెంచుకునేందుకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు వివరించారు. ఆమ్ని, యునో, డ్యుయో అనే మూడు రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు వివరించారు. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ తదితర విభాగాల్లో తమకు క్లయింట్లు ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఏటా తొమ్మిది వేల పైచిలుకు రోబోలు దిగుమతవుతున్నాయని చెప్పారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఏ ఒక్క దేశంపైనో ఆధారపడితే సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున దేశీయ పరిజ్ఞానంతో ఇంటెలిజెంట్ హ్యూమనాయిడ్ రోబోల తయారీకి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం పైలట్ దశలో వందల స్థాయిలో ఉన్న ఉత్పత్తిని త్వరలో వార్షికంగా వెయ్యి రోబోల స్థాయికి పెంచుకోనున్నట్లు నడింపల్లి వివరించారు. ప్రస్తుతం సంస్థలో నలభై మంది వరకు సిబ్బంది ఉన్నారని చెప్పారు. రోబోటిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్, టెక్నీషియన్స్ మొదలైన విభాగాలవ్యాప్తంగా మరింత మందిని తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

డేటా భద్రతపై మరింత ఫోకస్

2026పై మేనేజ్‌ఇంజిన్ అంచనాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యక్తిగత వివరాల దుర్వినియోగం, డీప్‌ఫేక్స్ ఉదంతాలు పెరుగుతున్న నేపథ్యంలో 2026లో డేటా భద్రతపై మరింతగా ఫోకస్ పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు మేనేజ్‌ఇంజిన్ టెక్నాలజీ డైరెక్టర్ రోమనస్ ప్రభు తెలిపారు. ఈ క్రమంలో కృత్రిమ మేథ (ఏఐ) రెండు రకాల పాత్రలను పోషించే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరస్తులు వేగంగా, విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించేందుకు దీన్ని ఉపయోగించుకోనున్నారని, అదే సమయంలో దాడులకు గురయ్యేవారు ముప్పులను గుర్తించేందుకు, వాటిని ఎదుర్కొనేందుకు ఏఐని మరింతగా వినియోగించుకోనున్నారని వివరించారు. తమ సంస్థ బీఎఫ్ఎస్ఐ, ప్రభుత్వాలు, హెల్త్‌కేర్, విద్య, తయారీ తదితర రంగాల సంస్థలకు అవసరమైన నిర్వహణ, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్‌ని అందిస్తున్నట్లు ప్రభు చెప్పారు. వ్యూహాత్మక డిజిటల్ హబ్‌గా ఎదుగుతున్న హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో ప్రస్తుతం సుమారు 250 మంది సిబ్బంది ఉన్నారని ఆయన చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 1,250 మంది ఉద్యోగులు ఉండగా రాబోయే రోజుల్లో ఈ సంఖ్యను రెండు వేలకు పెంచుకోనున్నట్లు వివరించారు.

భారత మార్కెట్లోకి ఒజెంపిక్

మధుమేహం, స్థూలకాయ చికిత్సకు ఇంజెక్షన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డేనిష్ ఫార్మా దిగ్గజం నోవో నార్డిస్క్ తాజాగా టైప్–2 మధుమేహ చికిత్సలో ఉపయోగించే ఇంజెక్షన్ ఒజెంపిక్‌ని భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. స్థూలకాయాన్ని తగ్గించే ఔషధంగా కూడా ఇది అంతర్జాతీయంగా పేరొందింది. ఇది 0.25 మి.గ్రా. నుంచి 1 మి.గ్రా. వరకు డోసేజీల్లో, ఫ్లెక్స్‌టచ్ పెన్‌గా లభిస్తుంది. నాలుగు వారాల డోసేజికి ఖర్చుకు రూ. 8,800 నుంచి ప్రారంభమవుతుంది. ఇటు టైప్2 మధుమేహానికి చికిత్సతో పాటు అటు స్థూలకాయ నియంత్రణ ఔషధంగాను దీన్ని ప్రవేశపెట్టినట్లు నోవో నార్డిస్క్ ఇండియా ఎండీ విక్రాంత్ శ్రోత్రియ తెలిపారు.

మైక్రోసాఫ్ట్‌తో విప్రో ఏఐ భాగస్వామ్యం

బెంగళూరులో ఇన్నోవేషన్ కేంద్రం

న్యూఢిల్లీ: దేశీ ఐటీ దిగ్గజం విప్రో తాజాగా గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో చేతులు కలిపింది. ఎంటర్‌ప్రైజ్‌లకు ఏఐ సొల్యూషన్లు అందించేందుకు వీలుగా వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెరతీసింది. తద్వారా బెంగళూరులోని పార్ట్‌నర్ ల్యాబ్స్‌లో మైక్రోసాఫ్ట్ ఇన్నోవేషన్ కేంద్రం(హబ్)ను ఏర్పాటు చేయనుంది. మూడేళ్లపాటు అమల్లోఉండే సహకారం ద్వారా ఎంటర్‌ప్రైజెస్‌కు కీలక కార్యకలాపాలలో ఏఐ అమలుకు వీలు కల్పించనుంది. ఒప్పందం ద్వారా విప్రోకున్న కన్సల్టింగ్, ఇంజినీరింగ్ ఆధారిత సామర్థ్యాలకు మైక్రోసాఫ్ట్ క్లౌడ్, ఏఐ స్టాక్‌ను జత కలుపుకోనుంది. ఏఐ స్టాక్‌లో భాగంగా అజ్యూర్, మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్‌హబ్ కోపైలట్, అజ్యూర్ ఏఐ ఫౌండ్రీ తదితరాలను భాగం చేసుకోనుంది. వెరసి ఎంటర్‌ప్రైజ్‌లకు కార్యకలాపాలలో టెక్నాలజీ వినియోగానికి వీలుగా విభిన్న ఏఐ సొల్యూషన్లు సమకూర్చనుంది.

జీసీసీ లీజింగ్‌లో హైదరాబాద్ హవా

- దేశీయంగా 17 శాతం వాటా
- శావిల్స్ ఇండియా నివేదిక

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) లీజింగ్‌కి సంబంధించి హైదరాబాద్ అత్యంత వేగంగా ఎదుగుతోంది. 2020–24 మధ్య కాలంలో 18.6 మిలియన్ చ.అ. ఆఫీస్ స్పేస్‌తో దేశం మొత్తం మీద 17 శాతం వాటా దక్కించుకుంది. బెంగళూరు తర్వాత రెండో స్థానంలో నిల్చింది. జీసీసీలపై శావిల్స్ ఇండియా రూపొందించిన తాజా నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

దీని ప్రకారం దేశవ్యాప్తంగా 112 మిలియన్ చ.అ. జీసీసీల లీజింగ్‌లో టెక్ సిటీల త్రయం (బెంగళూరు, హైదరాబాద్, పుణె) 70 శాతం వాటా దక్కించుకుంది. ప్రతిభావంతుల లభ్యత, నాణ్యమైన మౌలిక సదుపాయాలు, అట్రిషన్ రేటు (ఉద్యోగుల వలస) తక్కువగా ఉండటం మొదలైనవి హైదరాబాద్‌కి సానుకూలాంశాలుగా ఉంటున్నాయి. నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- 2020–24 మధ్య కాలంలో మొత్తం కమర్షియల్ ఆఫీస్ స్పేస్ లీజింగ్ 262 మిలియన్ చ.అ.లుగా ఉండగా, అందులో జీసీసీ లీజింగ్ వాటా 112 మిలియన్ చ.అ.తో 43 శాతంగా నమోదైంది.
- హెల్త్‌కేర్, ఫార్మా జీసీసీల విషయంలో బెంగళూరు, పుణెలతో పాటు హైదరాబాద్ అగ్రగామిగా ఉంది. జీనోమ్ వేలీలాంటి వ్యవస్థలు ఇందుకు దన్నుగా నిలుస్తున్నాయి. బీఎఫ్ఎస్ఐ, ఇంజినీరింగ్ రంగాల జీసీసీలకు కూడా నగరం కేంద్రంగా నిలుస్తోంది.
- దేశీయంగా ప్రస్తుతం 1,800 జీసీసీలు ఉండగా, 19 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 2030 నాటికి ఈ సంఖ్య 2,200 జీసీసీలు, 28 లక్షల మంది ఉద్యోగులకు చేరనుంది.
- సాఫ్ట్‌వేర్, ఐటీ సర్వీసులు, బీఎఫ్ఎస్ఐ, ఇంజినీరింగ్–తయారీ, ఫార్మా, రిటైల్, కన్జూమర్ సర్వీసుల ఆధిపత్యం కొనసాగనుంది.
- సంప్రదాయ ఐటీ సర్వీసుల ఉద్యోగాలతో పోలిస్తే జీసీసీల్లో జీతభత్యాలు 12–20 శాతం అధికంగా ఉంటున్నాయి. ఏఐ/ఎంఎల్, డేటా ఇంజినీరింగ్, సైబర్‌సెక్యూరిటీ, ఇంటెలిజెంట్ ఆటోమేషన్, క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్‌లాంటి అధునాతన అంశాలకు ప్రాధాన్యత ఉంటోంది.
- రాబోయే రోజుల్లో 2030 నాటికి జీసీసీల లీజింగ్ ఏటా 30 మిలియన్ చ.అ. మేర పెరగనుంది.
- 2025–30 మధ్య కాలంలో భవిష్యత్తులో దేశీయంగా ఏర్పాటయ్యే జీసీసీల్లో ఆటోమోటివ్, లైఫ్ సైన్సెస్, సెమీకండక్టర్ కేంద్రాల వాటా 30 శాతంగా ఉంటుంది.
- అంతర్జాతీయంగా 100 మిలియన్ డాలర్ల నుంచి 1 బిలియన్ డాలర్ల వరకు ఆదాయాలు ఉండే జీసీసీ సెగ్మెంట్ కంపెనీలకు వృద్ధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.
- నిపుణుల లభ్యత, తక్కువ నిర్వహణ వ్యయాలు, పాలసీ సంస్కరణలు, కొత్త ఆవిష్కరణలు మొదలైనవి భారత్‌ను అగ్రగామి జీసీసీ హబ్‌గా నిలుపుతాయి.

ఐపీఓ స్ట్రీట్..

షిప్‌రాకెట్ రూ.2,342 కోట్ల ఐపీఓ

సెబీకి పత్రాలు సమర్పణ

ముంబై: ఈ–కామర్స్ సేవల ప్లాట్‌ఫామ్ అయిన షిప్‌రాకెట్ సంస్థ సవరించిన ముసాయిదా పత్రాలను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.2,342 కోట్ల నిధులు సమీకరించనుంది. ఇష్యూలో భాగంగా రూ.1,110 కోట్ల విలువైన తాజా ఈక్విటీలు జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) ద్వారా షేర్‌హోల్డర్లు రూ.1,242 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు సవరించిన డ్రాఫ్ట్ పేపర్లలో కంపెనీ పేర్కొంది. షిప్‌రాకెట్ సంస్థ మే నెలలో ప్రి–ఫిల్లింగ్ పద్ధతిలో పబ్లిక్ ఇష్యూకు అనుమతులు కోరుతూ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. నవంబర్‌లో ఐపీఓకు అనుమతులు లభించాయి. కొనసాగింపుగా కంపెనీ సవరించిన ముసాయిదా పత్రాలను సెబీకి తాజాగా సమర్పించింది. ఐపీఓ కంటే ముందుగానే రూ.220 కోట్ల విలువైన షేర్లను 'ప్రీ–ప్లేస్‌మెంట్ ఐపీఓ' ద్వారా కొన్ని సంస్థలకు కేటాయించనుంది. ఈ ప్రక్రియ అమలైతే., ఇష్యూ పరిమాణాన్ని అందుకు తగ్గట్లు సర్దుబాటు చేస్తారు. యాక్సిస్ క్యాపిటల్, బ్యాంక్‌ఆఫ్‌అమెరికా సెక్యూరిటీస్ ఇండియా, జేఎమ్ ఫైనాన్సియల్, కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీలు ఈ పబ్లిక్ ఇష్యూకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

సెబీకి పత్రాలు సమర్పించిన అస్ప్రి స్పిరిట్స్

న్యూఢిల్లీ: బేవరేజ్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ అస్ప్రి స్పిరిట్స్ నిధుల సమీకరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా పబ్లిక్ ఇష్యూకు అనుమతి కోరుతూ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ.140 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. అలాగే ప్రమోటర్లు, షేర్‌హోల్డర్లైన ఎమరాల్డ్ ఎలక్ట్రానిక్స్, వైట్‌లైన్ ఇంపాక్స్ తదితర సంస్థలు ఆఫర్ ఫర్ సేల్ లో భాగంగా 50 లక్షల ఈక్విటీలను విక్రయించేందుకు సిద్ధమయ్యాయి. షేర్ల జారీతో లభించిన నిధులను కంపెనీ, దాని అనుబంధ సంస్థల రుణాల చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోనుంది. ఆర్థిక సంవత్సరం 2025లో కంపెనీ నిర్వహణ ద్వారా ఆదాయం రూ.378 కోట్ల నుంచి రూ.460.6 కోట్లకు పెరిగింది.

రూ. 400 కోట్ల పబ్లిక్ ఇష్యూకు శివగంగ డ్రిల్లర్స్

ముంబై: ఆయిల్‌ఫీల్డ్ సర్వీసెస్ ప్రొవైడర్ శివగంగ డ్రిల్లర్స్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.400 కోట్ల నిధుల సమీకరణకు సిద్ధమైంది. ఇందుకు అవసరమైన ముసాయిదా పత్రాలు సెబీకి సమర్పించింది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తిగా 'తాజా షేర్ల జారీ' మాత్రమే జరుగుతుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిలో షేర్లు జారీ చేయదు. సమీకరించిన నిధుల ద్వారా ప్లాంట్–మిషనరీ కొనుగోలు, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. ప్రీ–ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.80 కోట్ల సమీకరణ పూర్తయితే.., ఇష్యూ పరిమాణం అందుకు తగ్గట్లు సవరిస్తారు. ఆర్యమెన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఈ పబ్లిక్ ఇష్యూకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తోంది. శివగంగ డ్రిల్లర్స్ ఆన్‌షోర్ డ్రిల్లింగ్, ఆఫ్‌షోర్ ఆపరేటింగ్, మెయింటెనెన్స్ నిర్వహణతో పాటు డ్రిల్లింగ్‌కు అవసరమైన భారీ యంత్రాలు, పరికరాలను ఇతర కంపెనీలకు అద్దెకు ఇస్తుంది.

ఐపీవో బాటలో ఈస్ట్‌మన్ ఆటో అండ్ పవర్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

న్యూఢిల్లీ: ఇంధన పరివర్తన, పవర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఈస్ట్‌మన్ ఆటో అండ్ పవర్ ఐపీవో బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి గోప్యతా మార్గంలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 1,800–2,000 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ఇష్యూలో భాగంగా ఈక్విటీ జారీసహా ప్రస్తుత వాటాదారులు షేర్లను ఆఫర్ చేయనున్నట్లు తెలుస్తోంది. 2,000లో ఏర్పాటైన జేఆర్ఎస్ ఈస్ట్‌మన్ గ్రూప్ కంపెనీ డైవర్సిఫైడ్ ఎనర్జీ సొల్యూషన్స్ అందిస్తోంది. బ్యాటరీ స్టోరేజీ, పవర్ ఎలక్ట్రానిక్స్, సోలార్ టెక్నాలజీస్‌లో కార్యకలాపాలు విస్తరించింది. ప్రధానంగా లాస్ట్‌మైల్ ఈమొబిలిటీ సొల్యూషన్స్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్, సమీకృత స్టోరేజీతో సోలార్ సిస్టమ్స్ విభాగాలతో పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. 2023–25 కాలంలో వార్షిక ప్రాతిపదికన 28 శాతం పురోగతి సాధించడంతో గతేడాది(2024–25) ఆదాయం రూ. 4,228 కోట్లకు చేరింది.

ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ ఐపీవో వెనక్కి..

న్యూఢిల్లీ: ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ తాత్కాలికంగా తమ ఐపీవో ముసాయిదా పత్రాలను వెనక్కి తీసుకుంది. త్వరలో తాజా వివరాలతో సవరించిన పబ్లిక్ ఇష్యూ పేపర్లను దాఖలు చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రీ–ఐపీవోలో భాగంగా భారీగా రూ. 5,000 కోట్లు సమీకరించినప్పటికీ సంస్థ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పత్రాలు దాఖలు చేసిన తర్వాత ఇతర సంస్థలను కొనుగోలు చేయడం తదితర పరిణామాలు చోటు చేసుకున్నాయి. మరికొన్ని సంస్థల కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ పరిణామాలన్నీ ప్రతిఫలించేలా ముసాయిదా పత్రాలను సవరించి, తిరిగి దాఖలు చేయాలని కంపెనీ భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

సూర్యకుమార్

ధర్మశాలలో దుమ్మురేపేనా!

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ మూడో టి20

ఒత్తిడిలో టీమిండియా • గిల్, సూర్యకుమార్‌లపై అందరి దృష్టి

• రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


గిల్

ధర్మశాల: సొంతగడ్డపై భారత క్రికెట్ జట్టు మరో పోరుకు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం దక్షిణాఫ్రికాతో టీమిండియా మూడో టి20 ఆడనుంది. గత రెండు మ్యాచ్‌ల్లో ఇరు జట్లు చెరొకటి గెలవడంతో సిరీస్ 1–1తో సమం కాగా... ఇప్పుడు పైచేయి సాధించేందుకు సూర్యకుమార్ బృందం రెడీ అవుతోంది. తొలి మ్యాచ్‌లో ఓ మాదిరి లక్ష్యాన్ని కాపాడుకున్న టీమిండియా... రెండో టి20లో భారీ లక్ష్యఛేదనలో కనీస ప్రతిఘటన చూపకుండానే పరాజయం పాలైంది. వచ్చే ఏడాది ఆరంభంలో ఐసీసీ టి20 ప్రపంచకప్ జరగనుండగా... దానికి ముందు భారత జట్టు మరో 8 మ్యాచ్‌లు మాత్రమే ఆడనుంది. వీటిలో ప్రదర్శన ఆధారంగా వరల్డ్‌కప్‌నకు జట్టును ఎంపిక చేయాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో జట్టు కూర్పు, బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పుచేర్పులను పరిశీలించుకునేందుకు ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది. ముఖ్యంగా టి20 ఫార్మాట్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న శుబ్‌మన్ గిల్‌పై అందరి దృష్టి నిలవనుంది. ఇక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం లేదు. వీరిద్దరు రాణించాల్సిన అవసరముంది. మరోవైపు గత మ్యాచ్‌లో విజయం సాధించిన దక్షిణాఫ్రికా రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ధర్మశాలలో అడుగుపెట్టనుంది. ఇక్కటి చల్లటి వాతావరణం, పేస్, బౌన్స్‌కు అనుకూలించే పిచ్ సఫారీలకు మరింత సహాయపడనుంది.

గిల్ రాణించేనా..!

టెస్టు, వన్డే ఫార్మాట్‌లలో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న శుబ్‌మన్ గిల్... టి20ల్లో మాత్రం అదే జోరు కనబర్చలేకపోతున్నాడు. తొలి బంతి నుంచే దూకుడు కనబర్చాల్సిన ఈ ఫార్మాట్‌లో గిల్ ఆ స్థాయిలో రాణించలేకపోతున్నాడు. ప్రస్తుతం టి20ల్లో వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న గిల్ మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఇదే తరహా ఆటతీరు కనబరిస్తే... టీమ్ మేనేజ్‌మెంట్‌కు వ్యూహం మార్చాల్సి రావచ్చు. గతేడాది జరిగిన టి20 ప్రపంచకప్‌లో రోహిత్, కోహ్లి ఓపెనర్లుగా బరిలోకి దిగగా... ఈ ఇద్దరి రిటైర్మెంట్ అనంతరం అభిషేక్ శర్మ, సంజూ సామ్సన్ ఎక్కువ మ్యాచ్‌ల్లో ఇన్నింగ్స్‌ను ఆరంభించారు. అయితే దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా సామ్సన్‌ను బెంచ్‌కు పరిమితం చేసిన మేనేజ్‌మెంట్... గిల్‌కు విరివిగా అవకాశాలు ఇస్తోంది. కానీ వాటిని వినియోగించుకోవడంలో మాత్రం అతడు విఫలమవుతున్నాడు. గత రెండు మ్యాచ్‌ల్లోనూ గిల్ పేలవంగా వికెట్ పారేసుకున్నాడు. ఇక మూడో స్థానంలో అక్షర్ పటేల్ బ్యాటింగ్‌కు దిగడంపై కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అత్యుత్తమ ఆటగాళ్లను డగౌట్‌లో కూర్చోబెట్టి అక్షర్‌కు బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ ఇవ్వాల్సిన అవసరం ఏంటో కోచ్ గంభీర్‌కే తెలియాలి. అడపాదడపా షాట్‌లు ఆడటం తప్ప నిలకడగా ఇన్నింగ్స్‌ను నిర్మించలేకపోతున్న అక్షర్ వల్ల ఇతర ఆటగాళ్లు కూడా ఇబ్బంది పడుతున్నారు. సారథి సూర్యకుమార్ యాదవ్ ఈ ఏడాది ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. అభిషేక్ మెరుపుల మధ్య సూర్య వైఫల్యం బయటకు కనిపించడం లేదు కానీ... అతడు చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడి చాన్నాళ్లైంది. తిలక్ వర్మ నిలకడగా రాణిస్తున్నా... అతడికి సహకారం కరువైంది. హార్దిక్ పాండ్యా, జితేశ్ శర్మ, శివమ్ దూబే ఇలా స్టార్‌లకు కొదవ లేకపోయినా... వీరంతా సమష్టిగా రాణించాల్సిన అవసరముంది. గత మ్యాచ్‌లో దూబేను ఎనిమిదో స్థానంలో బరిలోకి దింపడంపై కూడా అనేక విమర్శలు వ్యక్తమయ్యాయి. మరి ఈ నేపథ్యంలో బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేస్తారా లేక గంభీర్ తన మొండి పట్టుదలను కొనసాగిస్తాడా చూడాలి. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ప్రభావం చూపలేకపోవడం బౌలింగ్‌లో ప్రధాన సమస్యగా మారింది. గత మ్యాచ్‌లో అనామక బ్యాటర్ సైతం బుమ్రా బౌలింగ్‌లో భారీ సిక్స్‌లు కొట్టడం అభిమానులకు ఇబ్బంది కలిగించింది. మరోవైపు అర్ష్‌దీప్ నియంత్రణ కోల్పోతుండటం జట్టుకు మరింత భారం అవుతోంది. వరుణ్ చక్రవర్తి ఫర్వాలేదనిపిస్తుండగా... కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు దక్కుతుందా చూడాలి.

పటిష్టంగా దక్షిణాఫ్రికా...

సుదీర్ఘ పర్యాటనలో భాగంగా టెస్టు సిరీస్ 'క్లీన్ స్వీప్' చేసిన దక్షిణాఫ్రికా... ఆ తర్వాత వన్డే సిరీస్‌లో పరాజయం పాలైంది. ఇప్పుడిక చివరగా జరుగుతున్న టి20 సిరీస్‌లో 1–1తో సమంగా ఉంది. ఈ టూర్‌లో తమ ప్రదర్శనతో ఆకట్టుకున్న సఫారీలు ఈ మ్యాచ్‌లో నెగ్గి సిరీస్‌లో పైచేయి సాధించాలని కృతనిశ్చయంతో ఉన్నారు. గత మ్యాచ్‌లో చక్కటి ఇన్నింగ్స్‌తో డికాక్ తన దమ్మేంటో చూపగా... కెప్టెన్ మార్క్‌రమ్, హెండ్రిక్స్, బ్రేవిస్, మిల్లర్, ఫెరీరా, లిండే, యాన్సెన్‌తో ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా కనిపిస్తోంది. మెరుగైన ఆరంభం లభిస్తే చాలు... క్రీజులోకి వచ్చిన ప్రతి ఒక్కరూ భారీ షాట్‌లు ఆడగల సమర్థులే కావడం దక్షిణాఫ్రికా జట్టుకు కలిసి రానుంది. ఇక బౌలింగ్‌లో యాన్సెన్ భారత జట్టుకు సింహస్వప్నంలా మారగా... ఎన్‌గిడి, సిపామ్లా, బార్ట్‌మన్ సమష్టిగా కదంతొక్కుతున్నారు. పిచ్ పేసర్లకు సహకరించే అవకాశం ఉన్న నేపథ్యంలో... సఫారీ బౌలర్లను ఎదుర్కోవడం భారత జట్టుకు కష్టసాధ్యమైన పనే. అభిషేక్ శర్మ ఆరంభంలోనే చెలరేగి వారిలయను దెబ్బతీయకపోతే... ఆ తర్వాత వచ్చే బ్యాటర్లపై దక్షిణాఫ్రికా బౌలర్లు సులువుగా ఒత్తిడి పెంచగలరు.

పిచ్, వాతావరణం

హిమాలయ పర్వత సానువుల్లో జరగనున్న ఈ మ్యాచ్‌లో చలి తీవ్రత అధికంగా ఉండనుంది. ఇక్కడ జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో నాలుగింట చేజింగ్ జట్లు గెలుపొందాయి. మంచు ప్రభావంతో రెండో ఇన్నింగ్స్‌లో బంతిపై బౌలర్లకు పట్టుచిక్కడం కష్టం. పిచ్ పేసర్లకు సహకరించనుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, గిల్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), డికాక్, స్టబ్స్/హెండ్రిక్స్, బ్రేవిస్, మిల్లర్, డొనొవాన్ ఫెరీరా, యాన్సెన్, లిండె, ఎన్‌గిడి, బార్ట్‌మన్, నోర్జే/సిపామ్లా.

ఏ స్థానంలోనైనా బ్యాటింగ్‌కు రెడీ: తిలక్ వర్మ

ధర్మశాల: భారత జట్టులో ఎక్కువ మంది ప్లేయర్లు ఏ స్థానంలో అయినా బ్యాటింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని... హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ అన్నాడు. దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌లో భాగంగా ఆదివారం మూడో మ్యాచ్ జరగనుండగా... దానికి ముందు శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో తిలక్ ఈ వ్యాఖ్యలు చేశాడు. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపడంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో తిలక్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'జట్టులో ఓపెనర్లు తప్ప మిగిలిన వాళ్లు ఎవరైనా ఏ స్థానంలో అయినా బ్యాటింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలి. పరిస్థితులకు తగ్గట్లు ఇమిడిపోయే విధంగా ఉండాలి. ఏ నిర్ణయమైనా జట్టు కోసమే. ఈ అంశంపై టీమ్ మేనేజ్‌మెంట్ స్పష్టంగా ఉంది. నా వరకైతే మూడో స్థానం నుంచి మొదలు ఎక్కడ బ్యాటింగ్ చేయడానికైనా నా సిద్ధమే. అందరూ అలాగే ఉన్నారు. వన్‌డౌన్‌లో అక్షర్ ఎన్నోసార్లు ఆకట్టుకున్నాడు. అది పరిస్థితులను బట్టి తీసుకునే నిర్ణయమే'అని తిలక్ అన్నాడు. ధర్మశాలలో చలి తీవ్రత అధికంగా ఉంటుందని... అందుకు తగ్గట్లే జట్టు సన్నద్ధత ఉంటుందని తిలక్ అన్నాడు. 'నేను అండర్–19 స్థాయిలో ఇక్కడ మ్యాచ్‌లు ఆడాను. పిచ్‌ను పరిశీలిస్తే భారీ స్కోర్లు నమోదయ్యేలా కనిపిస్తోంది. చలితీవ్రత అధికంగా ఉండే ధర్మశాలలో పిచ్ పేసర్లకు అనుకూలించనుంది. టాస్ మన చేతిలో ఉండదు. అందుకే దేనికైనా సిద్ధంగా ఉండాలి. బంతిపై పట్టు చిక్కించుకునేందుకు తడిచిన బంతితో సైతం ప్రాక్టీస్ చేస్తున్నాం.

భారత్ X పాకిస్తాన్

• అండర్-19 ఆసియా కప్ వన్డే టోర్నమెంట్

• ఉదయం గం. 10:30 నుంచి సోనీ స్పోర్ట్స్, సోనీ లివ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

దుబాయ్: అండర్–19 ఆసియాకప్‌లో ఘనవిజయంతో బోణీ కొట్టిన యువ భారత జట్టు ఆదివారం దాయాది పాకిస్తాన్‌తో అమీతుమీకి సిద్ధమైంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరగనున్న ఈ పోరులో గెలిచి సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకోవాలని యంగ్ ఇండియా భావిస్తోంది. అయితే సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్ ప్లేయర్లతో భారత ఆటగాళ్లు 'హ్యాండ్ షేక్' చేస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో... ఇటీవల జరిగిన పురుషుల సీనియర్ ఆసియాకప్, మహిళల వన్డే ప్రపంచకప్, రైజింగ్ స్టార్స్ ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో భారత ప్లేయర్లు పాకిస్తాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయలేదు. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో భారత జట్టు 234 పరుగుల తేడాతో యూఏఈపై గెలిచి మంచి జోష్‌లో ఉంది. ఐపీఎల్ సహా సీనియర్ స్థాయిలో ఆడిన పలు టోర్నమెంట్‌లలో సెంచరీలతో విజృంభించిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై అందరి దృష్టి నిలవనుంది. యూఏఈతో పోరులో అతడు 95 బంతుల్లోనే 9 ఫోర్లు, 14 సిక్స్‌లతో 171 పరుగులు చేసి అదరగొట్టాడు. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై కూడా అతడు అదే జోరు కొనసాగించాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. కెప్టెన్ ఆయుశ్ మాత్రే, వైస్‌కెప్టెన్ విహాన్ మల్హోత్రాతో పాటు హైదరాబాద్ ఆటగాడు ఆరోన్ జార్జి మంచి టచ్‌లో ఉన్నారు. వీరంతా సమష్టిగా సత్తాచాటితే పాకిస్తాన్‌కు కష్టాలు తప్పకపోవచ్చు. ఇక మరోవైపు తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 297 పరుగుల తేడాతో మలేసియాపై గెలిచింది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య హోరీహోరీ ఖాయమే!

నేటి నుంచి గ్లోబల్ చెస్ లీగ్

మొత్తం 34 మ్యాచ్‌లు • బరిలో ఆరు జట్లు

సాక్షి, సిటీబ్యూరో: టెక్ మహీంద్రా, 'ఫిడే' సంయుక్త భాగస్వామ్యంలో గ్లోబల్ చెస్ లీగ్ మూడో సీజన్‌కు రంగం సిద్ధమైంది. ముంబైలోని రాయల్ ఒపెరా హౌస్‌లో నేటి నుంచి ఈ లీగ్ జరుగుతుంది. ఆరు జట్ల మధ్య 34 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సందర్భంగా సీజన్–3 విన్నర్స్ ట్రోఫీని ఆవిష్కరించారు. త్రివేణి కాంటినెంటల్ కింగ్స్, ఆల్పైన్ ఎస్‌జీ పైపర్స్ మధ్య మ్యాచ్‌తో ఈ సీజన్ అధికారికంగా ఆదివారం ప్రారంభమవుతుంది. మహీంద్రా గ్రూప్ చైర్‌పర్సన్ ఆనంద్ మహీంద్రా, చెస్ దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, ద్రోణవల్లి హారిక, అలీరెజా ఫిరూజా ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సీజన్ జీసీఎల్ లక్ష్యాలను ప్రపంచ స్థాయి ఆటగాళ్ల ఎంపిక ద్వారా సాధిస్తుందని చైర్‌పర్సన్ పీయూష్ దూబే తెలిపారు. ఈ సీజన్‌లో ప్రపంచంలోని అత్యుత్తమ గ్రాండ్‌మాస్టర్లు ఆడనున్నారు. ప్రధాన ఆటగాళ్లలో అలీరెజా ఫిరూజా, ఫాబియానో కరువానా, హికారు నకమురు, హు ఇఫాన్ వంటి ప్రముఖులు ఉన్నారు. వీరితో పాటు విశ్వనాథన్ ఆనంద్ సహా భారత మేటి ఆటగాళ్లు పోటీపడతారు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతీ భారత **చెస్ శక్తిని** చాటుతున్నారు. రెండుసార్లు విజేతలైన త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ హ్యాట్రిక్ సాధించాలని చూస్తోంది. పీబీజీ అలాస్కాన్ నైట్స్ జట్టు యజమాని పునిత్ బాలన్, గుకేశ్ అర్జున్ వంటి ప్రతిభావంతులతో తాము బలమైన స్థితిలో ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. జేసీఎల్ మూడో సీజన్ డబుల్ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో 10 రోజుల పాటు జరుగుతుంది. ప్రతి జట్టు 10 గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు ఆడుతుంది. తర్వాత డిసెంబర్ 23న ఫైనల్ జరుగుతుంది. ప్రతి మ్యాచ్ ఆరు బోర్డులపై పురుషులు, మహిళలు, యువ క్రీడాకారులు కలిసి పోటీపడతారు. భారత్‌లోని అభిమానులు జియో హాట్‌స్టార్ నెట్‌వర్క్‌లో లీగ్‌ను చూడవచ్చు. టిక్కెట్లు డిస్ట్రిక్ట్ యాప్ ద్వారా అందుబాటులో ఉన్నాయి.



ఫైనల్లో ఉన్నతి

కటక్: టాప్ సీడ్ హోదాకు తగ్గట్టు రాణించిన భారత బ్యాడ్మింటన్ రైజింగ్ స్టార్ ఉన్నతి హుడా మరో టైటిల్‌కు విజయం దూరంలో నిలిచింది. ఒడిశా మాస్టర్స్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీలో ఉన్నతి ఫైనల్లోకి దూసుకెళ్లింది. హరియాణాకు చెందిన 18 ఏళ్ల ఉన్నతి సెమీఫైనల్లో 18–21, 21–16, 21–16తో ప్రపంచ మాజీ జూనియర్ నంబర్‌వన్, భారత్‌కే చెందిన తస్నిమ్ మీర్‌పై విజయం సాధించింది. ఫైనల్లో భారత్‌కే చెందిన ఇషారాణి బారువాతో ఉన్నతి తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో అస్సాం ప్లేయర్ ఇషారాణి 18–21, 21–7, 21–7తో భారత్‌కే చెందిన తాన్యా హేమంత్‌ను ఓడించింది.

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ కిరణ్ జార్జి ఫైనల్లోకి అడుగు పెట్టాడు. సెమీఫైనల్లో కిరణ్ జార్జి 21–19, 8–21, 21–18తో సహచరుడు రౌనక్ చౌహాన్‌పై విజయం సాధించాడు. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో అశ్విని భట్–శిఖా గౌతమ్ (భారత్) జోడీ 13–21, 16–21తో ఓంగ్ జిన్ యీ–కార్మెన్ టింగ్ (మలేసియా) జంట చేతిలో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో కణపురం సాత్విక్ రెడ్డి–రేషిక (భారత్) ద్వయం 16–21, 19–21తో దెజాన్–బెర్నాదినె వర్దన (ఇండోనేసియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జలౌన్ జిల్లా పచ్నాడాలో శనివారం ఉదయం దట్టమైన పొగమంచులో సైకిల్ వాలా

దేశ రాజధాని ఢిల్లీలోని ఇండియా గేట్ సమీప కర్తవ్య పథ్‌లో పొగమంచులోనే జన సంచారం

శనివారం ఉదయం ప్రయాగ్‌రాజ్‌లోని గంగా నదిలో చలి, పొగమంచు మధ్యనే పూజలు చేస్తున్న జనం

నా వేతనాన్ని పేదల సంక్షేమానికి వినియోగించండి

ఒడిశా సీఎంకు ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్ లేఖ

భువనేశ్వర్: తన వేతనం, అలవెన్సులను పేదల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని ఒడిశా మాజీ సీఎం, ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన సీఎం సీఎం మోహన్ చరణ్ మాఝీకి రాసిన లేఖలో తెలిపారు. ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన బిల్లు ప్రకారం..ప్రతిపక్ష నేత నెలవారీ వేతనం, అలవెన్సులు కలిపి రూ.3.62 లక్షలకు చేరాయి. ఈ మొత్తాన్ని రాష్ట్రంలోని పేదల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని నవీన్ పట్నాయక్ సీఎంను కోరారు. ఒడిశా ప్రజల ప్రేమ, అభిమానాలు తనకు చాలునన్నారు. కటక్‌లోని తమ పూర్వీకుల నివాసం ఆనంద్ భవన్‌ను కూడా 2015లోనే ప్రజల కోసం దానం చేసినట్లు చెప్పారు. తన తండ్రి బిజూ పట్నాయక్ సీఎంగా ఉన్న 1990–1995 కాలంలో నెల వేతనంగా రూ.1 మాత్రమే తీసుకున్నారని గుర్తు చేశారు.

18 ఏళ్ల వేట

చిన్నారిపై హత్యాచారం..

ఎట్టకేలకు నిందితుడి ఆటకట్టు

మహారాష్ట్ర పోలీసుల విజయగాథ

కాలం మారినా.. చట్టం మాత్రం నిద్రపోలేదు. తన వేటను ఆపలేదు. సరిగ్గా పద్దెనిమిదేళ్ల క్రితం.. అంటే 2007లో మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఐదేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి, అత్యంత కిరాతకంగా హత్య చేసి పరారైన నిందితుడి కోసం పోలీసులు సాగించిన సుదీర్ఘ వేట ఎట్టకేలకు ముగిసింది. చిన్నారిపై 'హత్యాచారం' తరువాత, నిందితుడు సరిహద్దులు దాటి అదృశ్యమయ్యాడు. పద్దెనిమిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ.. నేపాల్ అడవుల్లోని అజ్ఞాతం.. యూపీలోని ఇటుక బట్టీలో దాక్కున్న రహస్యం.. ఇవేవీ చట్టం కళ్లు గప్పలేకపోయాయి. ఎట్టకేలకు మీరా భయందర్–వసాయ్ విరార్ (ఎంబీవీవీ) పోలీసులకు కీచకుడు పట్టుబడ్డాడు. క్రైమ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మదన్ బల్లాల్ తెలిపిన వివరాలివి.

అది కాళరాత్రి

మాణిక్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది ఈ అమానుష ఘటన. 2007 మార్చి 31 రాత్రి, 22 ఏళ్ల నందలాల్ అలియాస్ నందు రాందాస్ విశ్వకర్మ అనే యువకుడు ఒక చిన్నారికి చాక్లెట్ ఆశ చూపించి లోబరుచుకున్నాడు. మర్నాడు తెల్లవారుజామున బాలిక ఉసురు తీశాడు. అత్యాచారం, హింసతో పాటు, చివరకు ఉరితాడు బిగించి ఆమెను హత్య చేశాడు.

నేపాల్‌కు పరారైన హంతకుడు

నేరం చేసిన వెంటనే, నందు విశ్వకర్మ అంతర్జాతీయ సరిహద్దులు దాటి నేపాల్ పారిపోయాడు. అతను చాలా ఏళ్లు అక్కడే అజ్ఞాతంలో గడిపాడు. ఆ కేసు ఫైల్ మాణిక్‌పూర్ పోలీసుల దగ్గర దుమ్ము పట్టి ఉన్నా, దర్యాప్తు అధికారులు మాత్రం వదిలేయలేదు.

అతి ముఖ్యమైన క్లూ.. వేట మొదలు

అయితే.. ఇటీవల కేసును మళ్లీ తిరగదోడిన క్రైమ్ డిటెక్షన్ సెల్–2, వసాయ్ బృందానికి ఊహించని క్లూ దొరికింది. నిందితుడు పాత జీవితాన్ని వదిలి, యూపీకి తిరిగి వచ్చి, సిద్ధార్థ్ నగర్ జిల్లాలోని స్వగ్రామం ఖర్దౌరీలో ఇటుక బట్టీలో కూలీగా దాక్కుని ఉన్నాడని తెలిసింది. దీంతో ఏసీపీ మదన్ బల్లాల్ నాయకత్వంలో, సీనియర్ ఇన్‌స్పెక్టర్ అవిరాజ్ కుర్హాడే బృందం తక్షణమే కదిలింది.

పట్టుబడిన క్షణం

నిందితుడి ఆచూకీ పక్కాగా ధ్రువీకరించుకున్నాక.. డిసెంబర్ 10న యూపీలోని ఖర్దౌరీకి చేరుకున్న పోలీసు బృందం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. 18 ఏళ్లుగా స్వేచ్ఛా జీవితం గడిపిన విశ్వకర్మ, తన చుట్టూ ఉచ్చు బిగుస్తోందని ఊహించలేకపోయాడు. చివరకు నందలాల్ అలియాస్ నందు రాందాస్ విశ్వకర్మను డిసెంబర్ 10న అతని స్వగ్రామం ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థ్ నగర్ జిల్లాలోని ఖర్దౌరీలో అరెస్టు చేసి మహారాష్ట్రకు తరలించారు.

నిజం నిప్పులాంటిది

ఎంతకాలం దాచినా, పాపం పండక తప్పదు. న్యాయం ఆలస్యమై ఉండవచ్చు.. కానీ జరిగి తీరుతుంది. చాక్లెట్ ఆశ చూపించి చిన్నారిని చిదిమేసిన హంతకుడికి పద్దెనిమిదేళ్ల సుదీర్ఘ అజ్ఞాతం తరువాత సంకెళ్లు పడటమే దీనికి నిదర్శనం. చట్టంపై విశ్వాసాన్ని నిలబెడుతూ పోలీసులు సాగించిన వేట నేటితో ముగిసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పార్లమెంట్‌లో వచ్చేవారం హెచ్‌ఈసీఐ బిల్లు

న్యూఢిల్లీ: ఉన్నత విద్య నియంత్రణను ఒకే ఒక్క వ్యవస్థ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(హెచ్‌ఈసీఐ)బిల్లును పార్లమెంట్‌లో వచ్చే వారం ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో దీనికి హెచ్‌ఈసీఐగా పేరు పెట్టారు. తాజాగా ప్రభుత్వం దీనికి వికసిత్ భారత్ శిక్షా అధీక్షన్ బిల్లుగా నామకరణం చేసింది. ఈ ముసాయిదా బిల్లుకు శుక్రవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం తెల్సిందే. ఇది చట్టంగా మారితే యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈల స్థానంలో ఒకే నియంత్రణ వ్యవస్థ ఉంటుంది. దీనిఫలితంగా యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలు మరింత స్వతంత్రంగా వ్యవహరించడంతోపాటు, స్వయం నిర్ణయాధికారం కలిగి ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో నౌరోజీ ద్విశత జయంతి వేడుకలు

లండన్: వలస పాలన కాలంలో బ్రిటిష్ పార్లమెంట్‌కు ఎన్నికైన ప్రప్రథమ భారతీయుడు, జాతీయవాది దాదాభాయ్ నౌరోజీ ద్విశత జయంతి వేడుక జరిగింది. ఈ సందర్భంగా ఆయన గౌరవార్థం లండన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమానికి పార్సీ పార్లమెంటేరియన్ కరణ్ బిల్లి మోరియా అధ్యక్షత వహించారు. ముంబైలోని పార్సీల కుటుంబంలో 1825లో జన్మించిన దాదాభాయ్ నౌరోజీ వ్యాపార పని నిమిత్తం మొదటిసారిగా 1855లో ఇంగ్లండ్‌కు వెళ్లారు. జాతీయోద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారు. గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు గాంచారు. 'విద్యావేత్త కూడా అయిన నౌరోజీ లండన్‌లోని ఎల్ఫిన్‌స్టోన్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. పార్లమెంట్‌కు ఎన్నికైన మొదటి భారతీయుడు, మొదటి మైనారిటీ రాజకీయ నేత నౌరోజీ'అని బిల్లి మోరియా చెప్పారు.

ఓట్ చోరీపై నేడు ఢిల్లీలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై ఓట్ల చోరీకి పాల్పడుతోందంటూ పదేపదే తీవ్ర విమర్శలు ఎక్కుపెడుతున్న కాంగ్రెస్ పార్టీ.. ఇదే అంశంపై ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో భారీ ర్యాలీ చేపట్టనుంది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సభలో ప్రసంగించనున్నారు. పార్టీ నేతలు ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సచిన్ పైలట్ తదితరులు కూడా హాజరుకానున్నారు. పార్టీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్ నుంచి వీరంతా ప్రత్యేక బస్సులో మైదానానికి చేరుకుంటారు.

పాక్ వర్సిటీల్లో సంస్కృతం కోర్సులు

లాహోర్: దేశ విభజన తర్వాత మొట్టమొదటిసారిగా పాకిస్తాన్‌లోని రెండు యూనివర్సిటీలు సంస్కృతం షార్ట్ టర్మ్ కోర్సులను ప్రారంభించాయి. ఉమ్మడి వారసత్వ సంపదలో భాగంగా వీటిని ప్రారంభించామని, భవిష్యత్తులో భగవద్గీత, మహాభారతం కూడా బోధనను కూడా ప్రారంభిచనున్నామని తెలిపాయి. ఇందులో ఒకటి ప్రభుత్వ యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్ లాహోర్ కాగా, మరోటి ప్రైవేట్ రంగంలోని ది లాహోర్ యూనివర్సిటీ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్. ఈ కోర్సు వ్యవధి మూడు నెలలు. ముమ్ముందు పరిశోధనలకు అవసరమైన ప్రాచీన సంస్కృత గ్రంథాలను సేకరించేందుకు పంజాబ్ యూనివర్సిటీ ప్రయత్నాలు సైతం ప్రారంభించింది.

హిమాచల్ స్కూళ్లలోకి సెల్‌ఫోన్లు నిషిద్ధం

సిమ్లా: ఇటీవల ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు బాలలు సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధిస్తూ ఆదేశాలు చేయడం తెల్సిందే. అదే దారిలో హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం నడవనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు స్కూళ్లలో సెల్‌ఫోన్‌ను నిషేధిస్తామని సీఎం సుఖ్‌వీందర్ సింగ్ సుఖు తెలిపారు. స్కూళ్లలో టీచర్లు సైతం తమ సెల్‌ఫోన్లను స్టాఫ్ రూంలో లేదా బ్యాగుల్లో ఉంచుకోవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.

ఇరాన్‌లో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అరెస్ట్

దుబాయ్: ఇరాన్‌కు చెందిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నర్గీస్ మొహమ్మదీ (53)ని అధికారులు అరెస్ట్ చేశారు. ఇటీవల అనుమానాస్పద పరిస్థితుల్లో చనిపోయిన హక్కుల లాయర్ ఖొస్రో అలికొర్డి సంస్మరణ కార్యక్రమానికి మషాద్ పట్టణానికి వెళ్లగా అదుపులోకి తీసుకున్నట్లు ఆమె మద్దతుదారులు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న నర్గీస్‌ను ఇరాన్ ప్రభుత్వం డిసెంబర్ 2024లో తాత్కాలికంగా జైలు నుంచి విడుదల చేసింది. తాజాగా అరెస్ట్ చేసిన అధికారులు తిరిగి జైలుకు తరలించిందీ లేనిదీ స్పష్టం కాలేదు. నర్గీస్ అరెస్ట్ తీవ్ర ఆందోళనకరమైన అంశమని నోబెల్ కమిటీ పేర్కొంది.

మావోయిస్టులకు చెందిన రూ.92 కోట్ల సొత్తు స్వాధీనం: కేంద్రం

న్యూఢిల్లీ: మావోయిస్టుల ఆర్థిక జీవనాడులను తీవ్రంగా దెబ్బతీసినట్లు కేంద్రం తెలిపింది. బహుళ విభాగాల ఉమ్మడి కార్యాచరణతో నక్సల్స్‌కు చెందిన రూ.92 కోట్ల ఆస్తులను సీజ్ చేశామని తెలిపింది. 2026 మార్చికల్లా నక్సల్ విముక్త దేశంగా మార్చాలన్న లక్ష్యంలో భాగంగా మావోయిస్టులకు చెందిన రూ.40 కోట్ల ఆస్తులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ), మరో రూ.40 కోట్లను రాష్ట్రాల యంత్రాంగాలు స్వాధీనం చేసుకున్నాయని తెలిపింది. రూ.12 కోట్ల వరకు ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసిందని వివరించింది. అదే సమయంలో, అర్బన్ నక్సల్స్ సమాచార నెట్‌వర్క్‌ను పూర్తిగా నియంత్రించడం ద్వారా సమాచార యుద్ధతంత్రం నెట్‌వర్క్‌కు నష్టం కల్గించి, వారిని మానసికంగా దెబ్బతీశామని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

డిజిటల్ అరెస్ట్ కేసు.. వృద్ధురాలి నుంచి రూ.1.16 కోట్లు కొట్టేసిన ముఠా అరెస్ట్

న్యూఢిల్లీ: డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టి, ఓ వృద్ధురాలి నుంచి రూ.1.16 కోట్లను బలవంతంగా తమ బ్యాంకు అక్కౌంట్లలో వేయించుకున్న సైబర్ నేరగాళ్లను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. దక్షిణ ఢిల్లీకి చెందిన బాధితురాలి(82) భర్త చనిపోగా, కుమార్తె విదేశాల్లో ఉంటోంది. ఏప్రిల్ 25వ తేదీన వృద్ధురాలికి వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాళ్ల ముఠా..ఆమెకు నకిలీ అరెస్ట్ వారెంట్ చూపి భయపెట్టారు. తమ బ్యాంకు ఖాతాల్లోకి రూ.1.16 కోట్లను బదిలీ చేయించుకున్నారు. అనంతరం బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ సిండికేట్‌లోని కీలకమైన ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోగొట్టుకున్న సొమ్ములో బాధితురాలికి ఇప్పటి వరకు రూ.17 లక్షలను అందజేశామని పోలీసులు తెలిపారు.

ఢీ కొట్టింది నేనే!

ప్రమాదానికి బాధ్యత వహిస్తూ..

నిజాయితీగా వివరాలిచ్చిన ఆస్ట్రేలియన్

ఎక్కడికి వెళ్లినా.. ఏం చేసినా.. ప్రవర్తనే మన విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని బయటపెడుతుంది. ఆస్ట్రేలియాలోని ఒక పార్కింగ్ స్థలంలో జరిగిన సంఘటన, అక్కడి పౌరుల నైతికతకు అద్దం పట్టింది. ఎవరో ఒక వ్యక్తి, అనుకోకుండా పార్క్ చేసిన కారును ఢీకొట్టాడు. మన ఊహ ప్రకారం.. భయపడిపోవాలి.. పలాయనం చిత్తగించాలి. మౌనంగా ఉండాలి.. కానీ అక్కడ జరిగింది వేరు. ఆ వ్యక్తి పరారైపోలేదు. జరిగిన నష్టానికి నైతిక బాధ్యత స్వీకరించాడు. తన పేరు, చిరునామా, బీమా వివరాలను ఒక కాగితంపై రాసి పెట్టాడు. విదేశాల్లోని పౌర స్పృహ, నిజాయితీ ఏ స్థాయిలో ఉంటుందో చెప్పడానికి నిదర్శనంగా నిలిచిన ఈ సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ అద్భుతాన్ని కళ్లారా చూసిన దేవాంగ్ సేథి అనే భారతీయుడు ఈ సంఘటన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు.

కారును ఢీకొట్టిన వ్యక్తి లేఖను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన దేవాంగ్ సేథి

కాగితంపై ఏముంది?

వీడియోలో సేథి మాట్లాడుతూ, తాను ఒక పార్క్‌లో ఉన్నప్పుడు ఈ నోట్‌ను గమనించానన్నారు. ఎవరో ఒక వ్యక్తి అనుకోకుండా మరో కారును ఢీకొట్టాడని తెలిపారు. కానీ ఆయన పారిపోకుండా, కారు యజమాని నష్టపరిహారం క్లెయిమ్ చేసుకోవడానికి వీలుగా, ఒక కాగితంపై తన పేరు, వాహనం రిజిస్ట్రేషన్ నంబర్, ఇన్సూరెన్స్ వివరాలను స్పష్టంగా రాసిపెట్టారని వివరించారు. బీమా సంస్థను ఎలా సంప్రదించాలో కూడా అందులో సూచించారని ప్రశంసించారు. ఆ నోట్‌ను సేథి కెమెరాకు చూపిస్తూ, ఇది బాధ్యతాయుత ప్రవర్తనకు స్పష్టమైన ఉదాహరణని కొనియాడారు.

భారత్‌లో ఊహించగలమా?..

ఈ దృశ్యాన్ని చూసిన సేథి, తాను తరచూ స్వదేశంలో (భారత్‌లో) చూసిన పరిస్థితులతో ఈ సంఘటనను పోల్చారు. 'భారత్‌లో ఎవరైనా ఇంకొకరి కారును గుద్దితే, వాళ్లు సాధారణంగా అక్కడి నుంచి పారిపోతారు'.. అని ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి చర్యలే.. కొన్ని సమాజాలు ఇతరుల కంటే మెరుగ్గా పనిచేయడానికి కారణమని ఆయన వ్యాఖ్యానించారు. 'ఒక దేశం గొప్పగా మారుతుందంటే, దానికి కారణం అక్కడి మంచి మనుషులు మాత్రమే'.. అని సేథి తన వీడియోను ముగించారు.

పౌర ధర్మంలోనే దేశ వైభవం

నిజాయితీ అనేది అసాధారణ చర్య కాకూడదు, అది సమాజపు ఊపిరి కావాలి. ఈ చిన్న నోట్, కేవలం ఇన్సూరెన్స్ క్లెయిమ్ గురించి మాత్రమే కాదు. ఇది బాధ్యత, నైతికత, సామాజిక విలువలపై ప్రపంచ వ్యాప్తంగా ఒక ఉద్విగ్న చర్చకు తెరలేపింది. కొందరు దీనికి విద్యా వ్యవస్థను, నాయకత్వాన్ని ఆపాదించవచ్చు. కానీ అంతిమ సత్యం ఒక్కటే: ఒక దేశ వైభవం దాని భవంతులలో కాదు, దాని ప్రజల చిన్న చిన్న పౌర ధర్మంలో దాగి ఉంది. చేసిన తప్పును అంగీకరించే ఆ క్షణంలోనే, ఒక దేశపు అంతరాత్మ ప్రతిబింబిస్తుంది. చిన్న నోట్‌తో.. ప్రపంచానికి పాఠం చెప్పిన ఆస్ట్రేలియన్ స్ఫూర్తి ఇది..

- సాక్షి, నేషనల్ డెస్క్

శనివారం స్కై డ్రాగ్ లిఫ్ట్‌తో పాటు ప్రపంచంలోనే ఎత్తయిన రివాల్వింగ్ మల్టీపర్పస్ హాల్‌ను ప్రారంభించిన సీఎం ఒమర్ అబ్దుల్లా

ఆసియాలోనే పొడవైన స్కై డ్రాగ్ లిఫ్ట్

గుల్మార్గ్‌లో ప్రారంభించిన సీఎం ఒమర్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం గుల్మార్గ్‌లో ఆసియాలోనే అత్యంత పొడవైన స్కై డ్రాగ్ లిఫ్ట్ ఏర్పాటైంది. దీనిని శనివారం సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రారంభించారు. స్కైయింగ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా పేరున్న గుల్మార్గ్‌లో దీనివల్ల స్కైయింగ్ మౌలికవసతులు మరింతగా మెరుగయ్యాయని సీఎం చెప్పారు. అంతర్జాతీయ వింటర్ స్పోర్ట్స్ మ్యాప్‌లో గుల్మార్గ్ కూడా చేరినట్లయిందని చెప్పారు. బారాముల్లా జిల్లా కొంగ్‌డొరి వద్ద రూ.3.65 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేసిన ఈ స్కై డ్రాగ్ లిఫ్టు పొడవు 726 మీటర్లు. పైన వేలాడుతున్న కదిలే బార్‌ను పట్టుకుని బోర్డుపై నిలబడిన వ్యక్తిని ఇది ఎత్తయిన ప్రదేశంపైకి లాక్కెళుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఒమర్ అబ్దుల్లా గుల్మార్గ్‌లోని అఫ్ఫర్వాత్‌లో ఏర్పాటైన ప్రపంచంలోనే ఎత్తయిన రివాల్వింగ్ మల్టీపర్పస్ హాల్‌ను కూడా ప్రారంభించారు. గుల్మార్గ్, చుట్టుపక్కల ప్రాంతాల్లో రూ.17 కోట్లతో నెలకొల్పిన పలు పర్యాటక ప్రాజెక్టులను ప్రారంభించారు. అదేవిధంగా, వింటర్ ట్రెయినింగ్ వసతులను మెరుగుపరిచే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ స్కైయింగ్ ట్రెయినింగ్ అడ్వెంచర్ టూరిజమ్ సెంటర్‌ను, ఇంటిగ్రేటెడ్ స్కై ట్రెయినింగ్ కోర్సులను కూడా ఆయన ప్రారంభించారు. జమ్మూకశ్మీర్ పర్యాటక రంగంలో గుల్మార్గ్‌కు ప్రముఖ స్థానం ఉందని సీఎం ఒమర్ చెప్పారు. పూర్తిస్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అత్యాధునిక, అత్యంత నాణ్యమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం పెట్టుబడుల అవసరముందని తెలిపారు. దీనివల్ల ఏడాదంతా పర్యాటక రంగ అవకాశాలుండటంతోపాటు స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు.

పథకాల పేర్ల మార్పులో కేంద్రం మాస్టర్

- ఎంజీఎన్ఆర్ఈజీఏ పేరు మార్పు ప్రతిపాదనపై కాంగ్రెస్ ధ్వజం
- పండిట్ నెహ్రూయే కాదు..మహాత్ముడన్నా మోదీ సర్కారుకు నచ్చడం లేదు
- గతంలో పలు స్కీముల పేర్లను ఇలా మార్చిందని ఆరోపణ
- ఉపాధి హామీ పథకం తమ ఘనతేనన్న ప్రధాన ప్రతిపక్షం

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంజీఎన్ఆర్ఈజీఏ) బిల్లు పేరును మారుస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. పథకాల పేర్లను మార్చడంలో మోదీ ప్రభుత్వం దిట్ట అంటూ ఎద్దేవా చేసింది. మహాత్మాగాంధీ అనే పేరుంటే వచ్చిన ఇబ్బందేమిటని నిలదీసింది. శనివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మీడియాతో మాట్లాడారు. పథకాలు, చట్టాల పేర్లను మార్చడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దిట్ట. గతంలో నిర్మల్ భారత్ అభియాన్‌ను స్వచ్ఛ భారత్ అభియాన్‌గా, గ్రామీణ ఎల్పీజీ పంపిణీ కార్యక్రమాన్ని ఉజ్వల యోజనగా మార్చారు. ఇలా రీ ప్యాకేజింగ్, బ్రాండింగ్‌లో బీజేపీ వాళ్లు సిద్ధహస్తులు. ఇప్పటిదాకా వాళ్లు పండిట్ నెహ్రూను మాత్రమే ద్వేషించారు. ఇప్పుడు మహాత్మాగాంధీ పేరు కూడా వారికి నచ్చడం లేదు. అందుకే, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును పూజ్య బాపు ఉపాధి హామీ పథకంగా మార్చారు' అని జైరాం రమేశ్ ఆరోపించారు. పేరు మార్చినంత మాత్రాన మన్మోహన్ సింగ్, సోనియా గాంధీలే గ్రామాల రూపురేఖల్ని మార్చిన ఈ పథకానికి ఆద్యులన్న విషయం ప్రజలు మర్చిపోరని ఆయన పేర్కొన్నారు. ఒకప్పుడు ఇదే పథకాన్ని వైఫల్యానికి చిరునామాగా పేర్కొన్న ప్రధాని మోదీ, విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చిన ఈ పథకం ఘనత తమదేనని చెప్పుకునేందుకే పేరు మార్చారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ శనివారం ఎక్స్‌లో ఆరోపించారు. భారతావనికి గ్రామాలే పట్టుగొమ్మలు అని ప్రవచించిన మహాత్ముడి పేరును లేకుండా చేసేందుకే మోదీ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. పథకానికి నిధుల కేటాయింపుల్లో ఏడాదికేడాది కోత విధించడంతోపాటు చెల్లింపులు సైతం లేకపోవడంతో బకాయిలు కొండల్లా పేరుకుపోతున్నాయన్నారు. మొత్తంగా ఈ పథకాన్ని ఎత్తి వేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ఈ పథకాన్ని ఉద్దేశపూర్వకంగా చేస్తున్న నిర్లక్ష్యాన్ని దాచి పెట్టడానికి కేంద్రం తీసుకున్న కంటి తుడుపు చర్య మాత్రమేనని పేర్కొన్నారు. వాస్తవానికి, ఈ ప్రభుత్వానికి సంక్షేమ పథకాలపై సదుద్దేశం లేదు. ఏం చేయాలో తెలియనప్పుడు, ఇలాంటి చర్యలతో ఏదో చేసినట్లుగా ప్రజల ముందు నటిస్తోందని దుయ్యబట్టారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ పేరును మార్చుతూ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్ర కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలపడం తెల్సిందే. ఇకపై ఈ పథకాన్ని పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజనగా పిలుస్తారు. అదేవిధంగా, పనిదినాల సంఖ్యను ప్రస్తుత మున్న 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచనున్నారు.

బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలు

- ఇంక్విలాబ్ మంచ్ నేతపై కాల్పులు..
- అప్రమత్తంగా ఉండాలంటూ బలగాలకు ఆదేశాలు

ఢాకా: సాంస్కృతిక సంస్థ ఇంక్విలాబ్ మంచ్ నేత షరీఫ్ ఒస్మాన్ హాదీపై కాల్పుల ఘటన బంగ్లాదేశ్‌లో అలజడి సృష్టించింది. తీవ్రంగా గాయపడిన హాదీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా దేశవ్యాప్తంగా మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆపద్ధర్మ ప్రభుత్వాధిపతి మహ్మద్ యూనస్ భద్రతాధికారులకు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇంక్విలాబ్ మంచ్ నేత హాదీ వచ్చే ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. సెంట్రల్ ఢాకాలోని బిజొయ్‌నగర్ ప్రాంతంలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయనపై గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. దగ్గర్నుంచి కాల్చడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేందుకు, అక్రమ ఆయుధాల బెడదను తొలగించేందుకు రెండో దశ ఆపరేషన్ డేవిల్ హంట్‌ను త్వరలో మొదలు పెడతామని హోం శాఖను పర్యవేక్షిస్తున్న రిటైర్డు లెఫ్టినెంట్ జనరల్ జహంగీర్ ఆలం చౌదరి మీడియాకు తెలిపారు. మాజీ మంత్రి నివాసంపై ఫిబ్రవరిలో దాడి జరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఆపరేషన్ డేవిల్ హంట్ మొదటి దశను చేపట్టింది. పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా మద్దతుదారులే ఈ ఆపరేషన్ లక్ష్యమని ఆరోపణలున్నాయి. హాదీపై కాల్పులు జరిపిన దుండగుల్లో ఒకడైన ఫైజల్ కరీం మసూద్ గురించిన సమాచారం ఇచ్చిన వారికి రూ.37 లక్షల వరకు బహుమానం అందజేస్తామని చౌదరి ప్రకటించారు. హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ ప్రభుత్వం పడిపోవడంలో ప్రధాన పాత్ర పోషించిన విద్యార్థి ఉద్యమంలో హాదీ కీలకంగా ఉన్నారు. అప్పటి ఉద్యమ నేతలకు ప్రత్యేక భద్రత కల్పిస్తామని చౌదరి తెలిపారు. హాదీపై జరిగిన హత్యాయత్నాన్ని ఇంక్విలాబ్ మంచ్ తీవ్రంగా ఖండించింది. నిషేధిత అవామీ లీగ్ నేతలందరినీ ఉగ్రవాదులుగా పేర్కొన్న ఇంక్విలాబ్ మంచ్.. వారందరినీ అరెస్ట్ చేయాలంటూ శనివారం దేశవ్యాప్తంగా ఆందోళనలతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఆ పార్టీని భూస్థాపితం చేయాలని మంచ్ డిమాండ్ చేస్తోంది.

‘ఆర్థిక ప్రజాస్వామ్యం’ దేని ద్వారా సాధ్యమవుతుంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

ప్రాథమిక హక్కులు, ఆదేశిక నియమాలు

1. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల విరోధానికి కారణం?
   ఎ) రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి న్యాయశాఖ ఆరాటం
   బి) లిఖిత రాజ్యాంగం
   సి) సాంఘిక, ఆర్థిక అసమానతలు
   డి) ముందుచూపు ఉన్న నాయకులు లేకపోవడం
2. ఆదేశిక సూత్రాలకు సంబంధించి ఆర్టికల్ 41లో లేని హక్కు ఏది?
   ఎ) పని హక్కు
   బి) ఆశ్రయ హక్కు
   సి) విద్యాహక్కు
   డి) ప్రభుత్వ సహాయ హక్కు
3. ‘ఆదేశిక సూత్రాల అమలును ఏ ప్రభుత్వమైనా విస్మరిస్తే, వారు ఎన్నికల కాలంలో ప్రజల ముందు తప్పనిసరిగా జవాబుదారీయై నిలవాల్సి ఉంటుంది’ అని వ్యాఖ్యానించిందెవరు?
   ఎ) జవహర్‌లాల్ నెహ్రూ
   బి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
   సి) ఐవర్ జెన్నింగ్స్
   డి) వల్లభ్ భాయ్ పటేల్
4. మహాత్మాగాంధీ తత్వాన్ని ప్రతిబింబించే ఆదేశిక నియమాలు ఏవి?
   ఎ) సమాన పనికి సమాన వేతనం
   బి) ఉచిత న్యాయ సలహా
   సి) గోవధ నిషేధం
   డి) చారిత్రక కట్టడాల పరిరక్షణ
5. ప్రాథమిక విధుల కోసం రాజ్యాంగంలో ప్రత్యేక అధ్యాయం ఉండాలని సూచించిన సంఘం?
   ఎ) సర్కారియా బి) రాజ్‌మన్నార్
   సి) ఏఆర్‌సీ డి) స్వరణ్ సింగ్
6. ఆదేశిక నియమాలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) వీటికి న్యాయ సంరక్షణ లేదు
   బి) ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలు
   సి) వీటికి మరో పేరు న్యాయ సంరక్షణ లేని హక్కులు
   డి) పైవన్నీ
7. ఆదేశిక సూత్రాల అమల్లో ప్రస్తుతం ఉన్న ప్రతిబంధకాలు ఏవి?
   ఎ) ప్రపంచీకరణ
   బి) ఆర్థిక సరళీకరణ
   సి) ప్రైవేటీకరణ
   డి) పైవన్నీ
8. కింది వాటిలో కొత్తగా చేర్చిన ఆదేశికాలు ఏవి?
   ఎ) ఉచిత న్యాయ సలహా
   బి) పర్యావరణ పరిరక్షణ
   సి) పరిశ్రమ నిర్వహణలో కార్మికులకు భాగస్వామ్యం
   డి) పైవన్నీ
9. ‘ప్రకరణ 39(బి, సి) నిర్దేశిక నియమాల అమలు కోసం చేసే చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధమైనప్పటికీ చెల్లుబాటు అవుతాయి’ అని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా మార్పు చేశారు?
   ఎ) 24 బి) 23
   సి) 42 డి) 44
10. విద్యాసంస్థల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించేందుకు ఏ అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు?
    ఎ) కులం బి) పేదరికం
    సి) గ్రామీణ వాతావరణం
    డి) మతం
11. ప్రకరణ 19(1) ప్రకారం నిర్వహించే హిక్లిన్ టెస్ట్ (Hicklin Test) దేనికి సంబంధించింది?
    ఎ) సభ్యత, నైతికత బి) ప్రాణ నష్టం
    సి) భారత సమైక్యత డి) ఏదీకాదు
12. ప్రభుత్వ పాలనకు పాటించాల్సిన ముఖ్యమైన అంశాలేవి?
    ఎ) ప్రాథమిక హక్కులు
    బి) మానవ హక్కులు
    సి) శాసన సూత్రాలు
    డి) ఆదేశిక సూత్రాలు
13. ఆదేశిక సూత్రాల ముఖ్యోద్దేశం ఏమిటి?
    ఎ) నిరుద్యోగ నిర్మూలన
    బి) సంక్షేమ రాజ్యస్థాపన
    సి) పారిశ్రామికీకరణ
    డి) ఆర్థిక పురోభివృద్ధి
14. గ్రామ పంచాయతీల ఏర్పాటును ఎన్నో ఆర్టికల్ సూచిస్తోంది?
    ఎ) 40 బి) 41
    సి) 42 డి) 43
15. ‘ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులను పరిమితం చేయరాదు’ అని ఏ కేసులో తీర్పు ఇచ్చారు?
    ఎ) గోలక్‌నాథ్ కేసు
    బి) కేశవానంద భారతీ కేసు
    సి) మినర్వా మిల్స్ కేసు
    డి) ఏదీకాదు
16. కింది వాటిలో ఉమ్మడి పౌరస్మృతిని తెలిపే నిబంధన ఏది?
    ఎ) 44 బి) 45 సి) 46 డి) 47
17. జతపరచండి.
    1. ఆర్టికల్ 40
    2. ఆర్టికల్ 41
    3. ఆర్టికల్ 42
    4. ఆర్టికల్ 43
    i. కార్మికులకు కనీస వేతనాలు
    ii. పని హక్కు
    iii. గ్రామ పంచాయతీల నిర్వహణ
    iv. పని చేయడానికి తగిన పరిస్థితులు, స్త్రీలకు ప్రసూతి సౌకర్యాల కల్పన
    ఎ) 1–iii, 2–ii, 3–iv, 4–i
    బి) 1–i, 2–ii, 3–iv, 4–iii
    సి) 1–ii, 2–i, 3–iv, 4–iii
    డి) 1–ii, 2–iii, 3–iv, 4–i
18. ఆదేశిక సూత్రాలు అంటే ఏమిటి?
    ఎ) ప్రభుత్వాలకు రాజ్యాంగం ఇచ్చిన ఆదేశాలు
    బి) రాష్ట్రాలకు కేంద్రం జారీ చేసే ఆదేశాలు
    సి) కేంద్ర, రాష్ట్ర సంబంధాలను నిర్వహించే సూత్రాలు
    డి) న్యాయ సాధనలను నిర్వహించే సూత్రాలు
19. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య తేడా ఏమిటి?
    ఎ) ప్రాథమిక హక్కులు న్యాయ సాధ్యమైనవి, ఆదేశిక సూత్రాలు కావు
    బి) ఆదేశిక సూత్రాలు న్యాయ సాధ్యమైనవి, ప్రాథమిక హక్కులు కావు
    సి) ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రెండూ న్యాయ సాధ్యమైనవి.
    డి) పైవేవీ కావు
20. ‘ఆదేశ సూత్రాలు ఒక వాస్తవమైన మానసిక ప్రవృత్తుల చెత్తకుండి’ అని వ్యాఖ్యానించినవారెవరు?
    ఎ) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
    బి) టి.టి. కృష్ణమాచారి
    సి) కె.ఎం. మున్షీ
    డి) ఎన్. గోపాలస్వామి అయ్యంగార్
21. ‘శాసన వ్యవస్థకు నిర్దేశిక నియమాలు కరదీపం లాంటివి’ అని అభిప్రాయపడినవారెవరు?
    ఎ) ఎం.సి. చాగ్లా
    బి) ఎం.సి. సెతల్వాడ్
    సి) కె.టి. షా
    డి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
22. కింది వాటిలో భారత రాజ్యాంగంలోని లక్ష్యాల సాధనకు తోడ్పడినవి ఏవి?
    ఎ) ప్రాథమిక హక్కులు
    బి) నిర్దేశిక నియమాలు
    సి) ప్రాథమిక విధులు
    డి) పైవేవీకాదు
23. కింది వాటిలో సరైంది.
    1. పురుషులకు, మహిళలకు సమాన పని, సమాన వేతనాన్ని ప్రోత్సహించేందుకు రాజ్యాంగంలో ఎలాంటి నిబంధన లేదు
    2. వెనుకబడిన తరగతులను రాజ్యాంగం నిర్వచించలేదు
    ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
    సి) 1, 2 సరైనవే డి) ఏదీకాదు
24. రాజ్యాంగాన్ని అనుసరించి సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛను ఏ విషయంలో నియంత్రించవచ్చు?
    ఎ) ప్రజా భద్రత
    బి) విదేశాల్లో స్నేహ సంబంధాల నిర్వహణ దృష్ట్యా
    సి) కోర్టు ధిక్కరణ విషయంలో
    డి) పైవన్నీ
25. ‘ఆర్థిక ప్రజాస్వామ్యం’ దేని ద్వారా సాధ్యమవుతుంది?
    ఎ) ప్రాథమిక హక్కులు
    బి) ప్రవేశిక
    సి) రాష్ట్ర విధానానికి సంబంధించిన ఆదేశిక సూత్రాలు
    డి) కేంద్ర జాబితా
26. ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కులపై ఆధిక్యతను కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ?
    ఎ) 25 బి) 42
    సి) 44 డి) ఎ, బి
27. ప్రపంచీకరణ ఆర్థిక సరళీకరణ నేపథ్యంలో ప్రభావితమవుతున్న ఆదేశిక సూత్రాల స్వభావం ఏది?
    ఎ) సంక్షేమ స్వభావం
    బి) గాంధేయ స్వభావం
    సి) ఉదార స్వభావం
    డి) పైవన్నీ
28. కింది వాటిలో ఆదేశికాలకు సంబంధించిన వ్యాఖ్యల్లో సరైన జత ఏది?
    ఎ) ఆదేశికాలు నూతన పోకడలు – డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
    బి) శుష్క వాగ్దానాలు – ఐవర్ జెన్నింగ్స్
    సి) రాజ్యాంగ లక్ష్యాల మేనిఫెస్టో – కె.సి. వేర్
    డి) పైవన్నీ
29. ఆదేశిక నియమాలు...
    ఎ) పౌరుల బాధ్యతలను తెలుపుతాయి
    బి) పౌరుల హక్కులను పరిరక్షిస్తాయి
    సి) న్యాయ పాలనలో ప్రాతిపదికలు
    డి) పరిపాలనలో మార్గదర్శకాలు
30. ‘సంక్షేమ రాజ్య స్వభావం’ అనే భావనను ఏ భాగంలో స్పష్టీకరించారు?
    ఎ) ప్రవేశిక
    బి) ప్రాథమిక హక్కులు
    సి) ఆదేశిక నియమాలు
    డి) ప్రాథమిక విధులు
31. కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కులకు సంబంధం లేదు
    బి) ఆదేశిక సూత్రాలు ప్రాథమిక హక్కుల కంటే గొప్పవి
    సి) ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాల కంటే గొప్పవి
    డి) పరస్పర పోషకాలు
32. ఆదేశిక నియమాలకు కింద పేర్కొన్న ఏ లక్షణాన్ని ఆపాదించలేము?
    ఎ) న్యాయ సంరక్షణ
    బి) వ్యక్తి శ్రేయస్సు
    సి) సామ్యవాద తరహా లక్షణం
    డి) పైవన్నీ
33. ఆదేశిక నియమాలకు న్యాయ సంరక్షణ కల్పించలేదు. కారణమేంటి?
    ఎ) అమలు చేయడం సాధ్యం కాకపోవడం
    బి) అంత ప్రాముఖ్యమైనవి కాకపోవడం
    సి) ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ ఉండటం
    డి) పైవన్నీ
34. కింది వాటిలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కొత్త ఆదేశికాలు చేర్చలేదు?
    ఎ) 24వ సవరణ బి) 42వ సవరణ
    సి) 97వ సవరణ డి) పైవేవీ కాదు
35. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక నియమాలకు మధ్య వివాదాన్ని ఎలా పేర్కొంటారు?
    ఎ) శాసనశాఖ –న్యాయశాఖ మధ్య వివాదం
    బి) కార్యనిర్వాహక శాఖ – న్యాయశాఖ మధ్య వివాదం
    సి) న్యాయశాఖ – ప్రజల మధ్య వివాదం
    డి) పైవన్నీ
36. కింది వాటిలో సరికాని జత ఏది?
    ఎ) ప్రాథమిక హక్కులు – ప్రభుత్వంపై పరిమితులు
    బి) ఆదేశిక నియమాలు – ప్రభుత్వ బాధ్యతలు
    సి) ప్రాథమిక విధులు – పౌరుల బాధ్యతలు
    డి) పైవేవీ కాదు
37. కింది వాటిలో సరైనవి ఏవి?
    1. ఆదేశిక నియమాల అమలు కోసం న్యాయస్థానాల జోక్యాన్ని కోరలేము
    2. వీటికి న్యాయ సంరక్షణ లేదు
    3. ఇవి సవరణలకు అతీతం
    4. ఇప్పటి వరకు ఒక్క ఆదేశిక నియమాన్ని కూడా రాజ్యాంగం నుంచి తొలగించలేదు
    ఎ) 1, 2, 3, 4 బి) 1, 2, 3
    సి) 1, 2, 4 డి) 2, 3, 4
38. కింద పేర్కొన్న ఏ ఆదేశిక సూత్రాలను సామ్యవాదేతర అంశాలుగా పరిగణించవచ్చు?
    ఎ) స్త్రీ, పురుషులకు సమాన జీవన అవసరాలు
    బి) మానవీయ పని ప్రదేశాలు
    సి) ఉచిత న్యాయ సలహా
    డి) యువతను దోపిడీ నుంచి రక్షించడం
39. ప్రాథమిక హక్కులు, ఆదేశిక నియమాల మధ్య ప్రస్తుతం ఎలాంటి సంబంధం ఉంది?
    ఎ) ప్రాథమిక హక్కులను ప్రభావితం చేసేలా ఏ ఆదేశిక నియమం అమలు చేసినప్పటికీ అవి చెల్లుబాటు కావు
    బి) సమానత్వ హక్కును ఉల్లంఘించేలా ఆదేశిక నియమాలు అమలు చేయరాదు
    సి) ఆదేశిక నియమాల్లోప్రకరణ 39 (ఎ, బి) అమలు చేస్తూ చేసిన చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధమైనప్పటికీ చెల్లుబాటు అవుతాయి
    డి) అన్ని విషయాల్లో ప్రాథమిక హక్కులదే పైచేయి అవుతుంది.
40. ఇంతవరకు అమలు కాని ఏకైక ఆదేశిక నియమం?
    ఎ) ప్రకరణ 44 బి) ప్రకరణ 49
    సి) ప్రకరణ 43 డి) పైవేవీకాదు

సమాధానాలు

1) సి; 2) బి; 3) బి; 4) సి; 5) డి; 6) డి; 7) డి; 8) డి; 9) ఎ; 10) ఎ; 11) ఎ; 12) డి; 13) బి; 14) ఎ; 15) ఎ; 16) ఎ; 17) ఎ; 18) ఎ; 19) ఎ; 20) బి; 21) బి; 22) బి; 23) డి; 24) డి; 25) సి; 26) బి; 27) ఎ; 28) సి; 29) డి; 30) సి; 31) డి; 32) ఎ; 33) ఎ; 34) డి; 35) ఎ; 36) డి; 37) సి; 38) సి; 39) సి; 40) ఎ.

లేజర్ కిరణాలను ఉపయోగించే పద్ధతిని ఏమంటారు?

ఇంద్రధనస్సు ఎల్లప్పుడూ సూర్యుడికి అభిముఖంగా ఏర్పడుతుంది. ఇందులో ఏడు వర్ణాలు ఉంటాయి. వీటిలో ఒకటైన ఇండిగో రంగును మనం చూడలేం. ఎగురుతున్న విమానంలోని పైలట్‌కు సంపూర్ణంగా గోళాకారంలో ఉన్న ఇంద్రధనస్సు కనిపిస్తుంది. ఒక వ్యక్తి వెనుక భాగం నుంచి వస్తున్న సూర్యకిరణాలు ఎదురుగా ఉన్న నీటి తుంపరలపై 42° కోణంతో పతనమైనప్పుడు కాంతి విశ్లేషణం చెందుతుంది. కాంతి విశ్లేషణం, సంపూర్ణాంతర పరావర్తనం, వక్రీభవన ధర్మాల ఆధారంగా అర్ధగోళాకారంలో ఇంద్రధనస్సు ఏర్పడుతుంది.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
భౌతిక శాస్త్రం

లేజర్ కిరణాలు

లేజర్ కిరణాలను ఉత్పత్తి చేయడానికి కావాల్సిన సూత్రాన్ని 1954లో సీహెచ్ టౌన్స్ అనే శాస్త్రవేత్త ప్రతిపాదించారు. దీని ఆధారంగా 1960లో టైడర్ మెమిన్ అనే శాస్త్రవేత్త తొలిసారిగా లేజర్ కిరణాలను ఉత్పత్తి చేశారు. వీటిని ఘన, ద్రవ, వాయు పదార్థాల నుంచి ఉత్పత్తి చేయవచ్చు. రూబీ స్ఫటికాన్ని ఉపయోగించి లేజర్ కిరణాలను ఉత్పత్తి చేశారు.

జడవాయువులైన హీలియం, నియాన్‌లను ఉపయోగించి హవిజవాన్ అనే అమెరికా శాస్త్రవేత్త లేజర్ కిరణాలను ఉత్పత్తి చేశారు. ఘన పదార్థాలను ఉపయోగించి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల కంటే జడవాయువును ఉపయోగించి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల శక్తి ఎక్కువ.

లక్షణాలు:

సంబద్ధత: ఒక పదార్థం నుంచి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల కంపన పరిమితి, తరంగదైర్ఘ్యం సమానంగా ఉంటాయి. ఈ లక్షణాలను సంబద్ధత అంటారు.

దిశానియత: ఒక పదార్థం నుంచి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణం అత్యధిక దూరం ఒకే దిశలో ప్రయాణిస్తుంది. ఈ లక్షణాన్నే దిశానియత అంటారు.

ఏకవర్ణీయత: ఒక పదార్థం నుంచి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల తరంగదైర్ఘ్యం ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండటం వల్ల ఒకే వర్ణాన్ని కలిగి ఉంటాయి. దీన్ని ఏకవర్ణీయత అంటారు.

తీవ్రత: లేజర్ కిరణాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

అనువర్తనాలు: లేజర్ కిరణాల శక్తిని పెంచుతూ, తగ్గిస్తూ అనేక అవసరాలకు ఉపయోగిస్తారు. ముఖ్య అనువర్తనాలు..

- భూమి నుంచి గ్రహాలు, ఉపగ్రహాల దూరాన్ని కచ్చితంగా లెక్కించడానికి లేజర్ కిరణాలను ఉపయోగిస్తారు.
- భూమి ఆత్మభ్రమణ వేగాన్ని లెక్కించడానికి ఉపయోగిస్తారు.
- ఈ కిరణాల సహాయంతో భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాల కక్ష్య, ఎత్తును తెలుసుకోవచ్చు.
- ఘన పదార్థంలోని అణువుల సంఖ్యను లెక్కించడానికి వినియోగిస్తారు.
- అత్యంత దృఢమైన వజ్రం, ఉక్కు తదితర పదార్థాలను కోయడానికి, వాటికి రంధ్రాలు చేయడానికి లేజర్‌ను వినియోగిస్తారు.
- హైడ్రోజన్ బాంబులను విస్ఫోటం చెందించడానికి ఈ కిరణాలు ఉపయోగిస్తారు.
- లేజర్ కిరణాలను ఉపయోగించి పుప్పొడి రేణువుల కదలికలను పరిశీలించవచ్చు.
- సాంస్కృతిక కార్యక్రమాల్లో వాడతారు.
- స్పష్టమైన ప్రింటింగ్, జిరాక్స్ కోసం లేజర్ వినియోగిస్తారు.
- లక్ష్యాలను కచ్చితంగా గురిపెట్టడానికి, యుద్ధ రంగంలో శత్రువులను సంహరించడానికి వీటిని వాడతారు.
- వాహనాల వేగాన్ని లెక్కించే స్పీడ్ గన్‌లో లేజర్‌ను ఉపయోగిస్తారు.
- హాలోగ్రఫీ విధానంలో వాడతారు.
- ఆప్టికల్ ఫైబర్ ద్వారా సమాచార ప్రసారం కోసం వినియోగిస్తారు.
- వైద్యరంగంలో ఎండోస్కోపి, లాప్రోస్కోపి విధానంలో వాడతారు.
- లేజర్ కిరణాలను ఉపయోగించి రెటీనాపై ఏర్పడిన పొరను తొలగించవచ్చు.
- దంతాల చికిత్సలో ఉపయోగిస్తారు.
- మెదడులో ఏర్పడిన కణితులను తొలగించడానికి ఉపయోగిస్తారు.
- గుండె, ఊపిరితిత్తులు, పేగులకు సంబంధించిన వ్యాధులను నయం చేయడానికి వినియోగిస్తారు.
- సీడీ, డీవీడీల్లో సమాచారాన్ని నిల్వ చేసేందుకు లేజర్‌ను ఉపయోగిస్తారు.
- క్షిపణుల్లో మార్గనిర్దేశిత కిరణాలుగా, బార్ కోడ్‌ను ముద్రించడానికి, చదవడానికి లేజర్‌ను ఉపయోగిస్తారు.
- లేజర్ సాయంతో పురాతన కట్టడాలు, విగ్రహాలను శుభ్రపరుస్తారు.
- వాతావరణంలోని వివిధ పొరల మధ్య ఉన్న కాలుష్య గాఢతను లెక్కిస్తారు.
- లేజర్ కిరణాలను ఉపయోగించే పద్ధతిని Lidar (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) అంటారు.

గమనిక: లేజర్ కిరణాల ధర్మాలను అధ్యయనం చేసి, వాటిని ఉత్పత్తి చేయడానికి భారత అణుశక్తి సంఘం రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏర్పాటు చేసింది. ఇది మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఉంది.

వర్ణపటం

- దృశ్య వర్ణపటంలోని వివిధ వర్ణాల తరంగ దైర్ఘ్యాన్ని కొలవడానికి వర్ణపట మాపకం (స్పెక్ట్రోమీటర్) ఉపయోగిస్తారు.
- దృశ్య వర్ణపటంలోని ఇండిగో రంగును మానవ కన్ను గుర్తించలేదు. ఊదారంగు వల్ల కంటిలోని రెటీనా దెబ్బతింటుంది. ఈ రెండు రంగులను మినహాయిస్తే మిగతా అయిదు రంగుల్లో (BGYOR) ని పసుపు వర్ణాన్ని ‘మాధ్యమిక రంగు’ అంటారు.
- వక్రీభవన గుణకం కాంతి తరంగదైర్ఘ్యానికి విలోమానుపాతంలో ఉంటుంది.

$$\mu \propto \frac{1}{\lambda}$$

కాబట్టి దృశ్య వర్ణపటంలో తక్కువ తరంగదైర్ఘ్యం ఉండే ఊదారంగు వక్రీభవన గుణకం ఎక్కువ. తరంగదైర్ఘ్యం ఎక్కువగా ఉన్న ఎరుపు రంగు వక్రీభవనం తక్కువ.

- గాజు పలక ద్వారా చొచ్చుకెళుతున్న కాంతి కిరణాల వేగం వాటి తరంగదైర్ఘ్యానికి అనులోమానుపాతంలో ఉంటుంది. కాంతి గాజు ద్వారా ప్రయాణిస్తున్నప్పుడు VIBGYORలోని ఊదారంగు వేగం తక్కువగా, ఎరుపు రంగు వేగం ఎక్కువగా ఉంటుంది. కానీ శూన్యంలో లేదా గాలిలో ఈ ఏడు రంగుల వేగం కాంతి వేగానికి సమానం.
- కాంతి విశ్లేషణంలో ఏర్పడిన వివిధ వర్ణాల విచలనం తరంగదైర్ఘ్యానికి విలోమానుపాతంలో ఉంటుంది. కాబట్టి తరంగదైర్ఘ్యం తక్కువగా ఉన్న ఊదారంగు ఎక్కువగా విచలనం చెందుతుంది. రుజుమార్గాన్ని వదిలి వంగి ప్రయాణించడమే విచలనం.
- ఎరుపు రంగుకు తరంగదైర్ఘ్యం ఎక్కువగా, విచలనం తక్కువగా ఉండటం వల్ల ఇది దాదాపు రుజుమార్గంలో ప్రయాణిస్తుంది.కాబట్టి ఎరుపు రంగును ఎక్కువ దూరం నుంచి కూడా స్పష్టంగా చూడవచ్చు. అందువల్ల ప్రమాదాల నివారణ కోసం ఉపయోగించే సంకేతాలను సూచించడానికి ఎరుపు రంగును ఉపయోగిస్తారు.
- క్వాంటం సిద్ధాంతం ప్రకారం $\left(E = \frac{hc}{\lambda}\right)$ తరంగదైర్ఘ్యం తక్కువగా ఉన్న ఊదా రంగు శక్తి ఎక్కువగా, తరంగదైర్ఘ్యం ఎక్కువగా ఉన్న ఎరుపు రంగు శక్తి తక్కువగా ఉంటుంది.
- చీకటి గదిలో ఫొటోగ్రాఫిక్ ఫిల్మ్ డెవలప్ చేసే సమయంలో కనీస కాంతి కోసం ఎరుపు రంగు బల్బును ఉపయోగిస్తారు.

గమనిక: ఫొటోగ్రాఫిక్ ఫిల్మ్‌లను డెవలప్ చేయడానికి హైపో ద్రావణం (సోడియం థియోసల్ఫేట్) ఉపయోగిస్తారు.

- ఆకుపచ్చ రంగు తరంగదైర్ఘ్యం 5500 ¯. ఈ తరంగదైర్ఘ్యం వల్ల ఆకుపచ్చ రంగుకు కొంత శక్తి లభిస్తుంది. అందువల్ల ఈ వర్ణం మన కంటిని చేరినప్పుడు ఒక రకమైన మానసిక ఉల్లాసాన్ని పొందుతాం.

వర్ణాలు – రకాలు:

రంగులు మూడు రకాలు. అవి:
1) ప్రాథమిక రంగులు
2) గౌణ రంగులు
3) సంపూరక రంగులు

ప్రాథమిక రంగులు: కాంతి విశ్లేషణంలో ఏర్పడిన ఏడు రంగుల్లో నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగులను ప్రాథమిక వర్ణాలు అంటారు.

గౌణ రంగులు: ప్రాథమిక రంగులు ఒక దానితో మరొకటి సమపాళ్లలో కలిస్తే ఏర్పడిన ఫలిత రంగును గౌణ వర్ణం అంటారు.

- ప్రతి ప్రాథమిక రంగు తన ద్వారా చొచ్చుకొని వెళుతున్న ఇతర ప్రాథమిక రంగులు లేదా గౌణ రంగులను పూర్తిగా శోషణం చేసుకుంటుంది. కాబట్టి మన కంటికి ఎలాంటి కాంతి చేరదు. ఫలితంగా వచ్చే రంగు నల్లగా ఉన్నట్లు కనిపిస్తుంది.

ఉదాహరణలు:

i) తెల్లటి సూర్యకిరణాల సమక్షంలో గులాబీ పుష్పం ఎరుపు రంగులో కనిపిస్తుంది. అదే పుష్పాన్ని ఆకుపచ్చ రంగు గాజు పలక ద్వారా పరిశీలిస్తే నలుపు రంగులో కనిపిస్తుంది.
ii) ఉదయించే, అస్తమించే సూర్యబింబం ఎరుపు రంగులో ఉంటుంది. దీన్ని ఆకుపచ్చ రంగు గాజు పలక ద్వారా చూస్తే నలుపు రంగులో కనిపిస్తుంది.
iii) ఆకుపచ్చ రంగు కళ్లద్దాలు ధరించిన వ్యక్తి ట్రాఫిక్ సిగ్నళ్లను పరిశీలిస్తే.. అవి ఆకుపచ్చ, నలుపు రంగుల్లో ఏకాంతరంగా మారుతున్నట్లు కనిపిస్తాయి.
iv) ఎరుపు రంగు గాజుపలక ద్వారా ఎర్రని లేదా తెల్లని వస్తువులను చూసినప్పుడు అవి ఎరుపు రంగులో కనిపిస్తాయి.

సంపూరక రంగులు: రెండు లేదా అంతకంటే ఎక్కువ రంగులు ఒకదానితో మరొకటి కలవడం వల్ల తెలుపు రంగు ఏర్పడితే వాటిని సంపూరక వర్ణాలు అంటారు.

ప్రాథమిక రంగులు ఒకదానితో మరొకటి సమపాళ్లలో కలిసినప్పుడు తెలుపు రంగు ఏర్పడటం దీనికి ఉదాహరణ.

ఎరుపు + నీలం + ఆకుపచ్చ = తెలుపు

- ప్రతి ప్రాథమిక రంగు దాని వ్యతిరేక గౌణ రంగుతో కలిసినప్పుడు తెలుపు రంగు ఏర్పడుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. పోలరాయిడ్ కళ్లద్దాలు పనిచేయడంలో ఇమిడి ఉన్న ధర్మం?
   1) ధ్రువణం 2) వివర్తనం
   3) వక్రీభవనం 4) పరిక్షేపణం
2. కిందివాటిలో ఏ ఖగోళ వస్తువుపై కాంతి పరిక్షేపణం జరగదు?
   1) అంగారకుడు 2) శని
   3) టైటాన్ 4) చంద్రుడు
3. స్పష్టదృష్టి కనిష్ట దూరం విలువ?
   1) 25 మీ. 2) 25 సెం.మీ.
   3) 23 మి.మీ. 4) 1 మీ.
4. అసమ దృష్టి నివారణకు ఉపయోగించే కటకం ఏది?
   1) కుంభాకార 2) పుటాకార
   3) స్థూపాకార 4) ఏదీకాదు
5. రేచీకటి నివారణకు ఉపయోగించే కటకం?
   1) కుంభాకార 2) స్థూపాకార
   3) పుటాకార 4) ఏదీకాదు
6. దర్పణాలు ఏ ధర్మం ఆధారంగా పని చేస్తాయి?
   1) రుజువర్తనం 2) పరావర్తనం
   3) వక్రీభవనం 4) వివర్తనం

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2; 4) 3; 5) 4; 6) 2.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆప్టికల్ ఫైబర్ ఏ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది? *(గ్రూప్–2, 2012)*
   1) సంపూర్ణ కాంతి శోషణ
   2) కాంతి సంపూర్ణాంతర పరావర్తనం
   3) వివర్తనం 4) పరావర్తనం
2. ఎరుపు అద్దంలో ఒక పుస్తకం అట్టను చూసినప్పుడు అది ఎర్రగా కనిపిస్తే వాస్తవానికి ఆ పుస్తకం అట్ట రంగు ఏది? *(గ్రూప్–2, 2011)*
   1) ఎరుపు 2) తెలుపు
   3) ఆకుపచ్చ 4) ఎరుపు లేదా తెలుపు

సమాధానాలు: 1) 2; 2) 4.

అధికార భాషా సంఘం ఏర్పాటైన సంవత్సరం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. కట్టె మనది.. కలప మనది.. అడవి మనది... భూమి మనది! అనే నినాదంతో గోండులు, కోయలు, చెంచులను సంఘటితం చేసి పోరుబాటలో నడిపించింది ఎవరు?
   1) గాంగంటం దొర
   2) అల్లూరి సీతారామరాజు
   3) కొమరం భీమ్
   4) అగ్గిరాజు
2. వితంతు పునర్వివాహ సంఘాన్ని మద్రాసులో ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1871 2) 1872
   3) 1873 4) 1874
3. మహారాష్ట్రులు, నిజాం మధ్య 1738లో జరిగిన యుద్ధం ఏది?
   1) బొబ్బిలి యుద్ధం
   2) ఔరంగాబాద్ యుద్ధం
   3) భోపాల్ యుద్ధం
   4) రెండో కర్ణాటక యుద్ధం
4. 1948 ఏప్రిల్‌లో ఏర్పాటైన లాయర్ల నిరసన సమితి అధ్యక్షుడు?
   1) వినాయకరావు విద్యాలంకార్
   2) జమలాపురం కేశవరావు
   3) వి.పి.మీనన్
   4) బొమ్మకంటి సత్యనారాయణ
5. స్వామి రామానందతీర్థ వ్యక్తిగత సత్యాగ్రహాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1941 2) 1940
   3) 1939 4) 1938
6. వందేమాతర ఉద్యమ కాలంలో జి.సుబ్రమణ్య అయ్యర్ సంపాదకత్వంలో వెలువడిన పత్రిక?
   1) దేశమాత
   2) స్వదేశీ మిత్రన్
   3) ఆంధ్రపత్రిక
   4) స్వరాజ్య
7. గోల్కొండ రాజ్యాన్ని మొగలు సామ్రాజ్యంలో ఔరంగజేబు ఎప్పుడు విలీనం చేశాడు?
   1) 1687 2) 1677
   3) 1697 4) 1667
8. 'యథాపూర్వస్థితి ఒడంబడిక' మీద నిజాం సంతకం చేసిన తర్వాత ఏ ప్రాంతం నుంచి భారత సైన్యాలు ఉపసంహరించుకున్నాయి?
   1) సికింద్రాబాద్
   2) బొల్లారం
   3) తిరుమలగిరి
   4) పైవన్నీ
9. పోలీసు చర్య తర్వాత 1948లో నిజాం పాలన ముగిసింది. 'అఖిలాంధ్ర మహాసభ'ను 1949లో ఎవరు నెలకొల్పారు?
   1) అయ్యదేవర కాళేశ్వరరావు
   2) కట్టమంచి రామలింగారెడ్డి
   3) దేవులపల్లి రామానుజరావు
   4) బూర్గుల రామకృష్ణారావు
10. 'ముల్కీ' ఉద్యమం అంటే?
   1) ఆంగ్లేయులకు వ్యతిరేకత
   2) ఉర్దూ అభివృద్ధి
   3) ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యత
   4) రెవెన్యూ సంస్కరణలు
11. 'ఇండియన్ ముసల్మాన్స్' గ్రంథాన్ని రచించిన ఆంగ్లేయుడెవరు?
   1) హంటర్
   2) కర్జన్
   3) లిట్టన్
   4) రిప్పన్
12. 1911లో ఏర్పాటు చేసిన 'మన సంఘం' లక్ష్యం?
   1) దళితుల పిల్లల్లో విద్యావ్యాప్తి
   2) బాల్య వివాహాలను వ్యతిరేకించడం
   3) జోగిని, మురళి, బసివి వ్యవస్థల నిర్మూలన
   4) పైవన్నీ
13. అధికార భాషా సంఘం ఏర్పాటైన సంవత్సరం?
   1) 1965 జనవరి 27
   2) 1966 ఫిబ్రవరి 13
   3) 1966 మార్చి 27
   4) 1967 ఏప్రిల్ 25
14. 1958లో జాతీయ అభివృద్ధి మండలి ఎవరి నివేదికను ఆమోదించింది?
   1) అశోక్ మెహతా కమిటీ
   2) రాకేష్ మోహన్ కమిటీ
   3) బల్వంత్‌రాయ్ మోహతా కమిటీ
   4) స్వరణ్‌సింగ్ కమిటీ
15. శాతవాహనుల కాలంలో బుద్ధుడి జన్మకు సంకేతం?
   1) పద్మం
   2) ధర్మచక్రం
   3) స్తూపం
   4) బోధివృక్షం
16. ఏ ప్రాంతీయ సంఘాల ఆవిర్భావంతో 1885లో జాతీయ కాంగ్రెస్ ఏర్పాటైంది?
   1) మద్రాసు మహాజనసభ
   2) ఇండియన్ అసోసియేషన్
   3) బాంబే అసోసియేషన్
   4) పైవన్నీ
17. విద్వాన్ విశ్వం, తరిమెళ్ల నాగిరెడ్డి రాసిన ఏ గ్రంథం సామ్యవాద ప్రచారానికి తోడ్పడింది?
   1) నవ్య సాహిత్యమాల
   2) సాహిత్య దర్శనం
   3) ఆంధ్ర సాహిత్య విమర్శ
   4) సాహిత్యంలో దృక్పథాలు
18. 'కుమార సంభవం' రచయిత?
   1) కొక్కిలి
   2) పావులూరి మల్లన్న
   3) అయ్యన మహాదేవి
   4) నన్నెచోడుడు
19. కాకతీయుల కాలంలో తీర్థులంటే?
   1) సేనానులు
   2) మంత్రులు
   3) సైనికులు
   4) దూతలు
20. భారతదేశంలో మొదటిగా భూమిని దానం చేసిన రాజవంశం ఏది?
   1) కళింగులు
   2) పల్లవులు
   3) శాతవాహనులు
   4) శకులు
21. 1950 ఫిబ్రవరిలో విశాలాంధ్ర మహాసభ ప్రథమ సమావేశం ఎక్కడ జరిగింది?
   1) కడప
   2) వరంగల్
   3) హైదరాబాద్
   4) గుంటూరు
22. మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆస్థానంలోని హిందూ దివాన్ పేరు?
   1) సర్ కిషన్ ప్రసాద్
   2) పింగళి వెంకట్రామిరెడ్డి
   3) సర్ భగవంత్ ప్రసాద్
   4) పండిత్ రామదాస్
23. 1938లో ఉస్మానియా యూనివర్సిటీలో హిందూ విద్యార్థులు ప్రారంభించిన రాజకీయ ఉద్యమం ఏ పేరుతో ప్రసిద్ధి చెందింది?
   1) జాయిన్ ఇండియా మూవ్‌మెంట్
   2) స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం
   3) వందేమాతర ఉద్యమం
   4) ముల్కీ ఉద్యమం
24. తెలంగాణ పరిరక్షణ దినాన్ని ఎప్పుడు పాటించారు?
   1) 1968 జూలై 10
   2) 1969 జూన్ 10
   3) 1966 ఆగస్టు 20
   4) 1969 సెప్టెంబర్ 13
25. అస్పృశ్యుల గురించి రాసిన మొదటి నవల 'మాలపల్లి....' 1921 వెలువడింది. దీని రచయిత ఎవరు?
   1) ఉన్నవ లక్ష్మీనారాయణ
   2) దాశరథి
   3) ఆదిరాజు వీరభద్రరావు
   4) సురవరం ప్రతాపరెడ్డి
26. గ్రంథాలయ ఉద్యమ నాయకుడు?
   1) కొమర్రాజు లక్ష్మణరావు
   2) అయ్యంకి వెంకట రమణయ్య
   3) నారాయణరావు
   4) సురవరం ప్రతాపరెడ్డి
27. కింది వాటిలో సరైంది?
   1) బాదామి చాళుక్యులు మహారాష్ట్ర ప్రాంతాన్ని పాలించారు
   2) వేములవాడ చాళుక్యులు కరీంనగర్ ప్రాంతాన్ని పాలించారు
   3) ముదిగొండ చాళుక్యులు మధిర, మానుకోట, వరంగల్ ప్రాంతాల్ని పాలించారు
   4) పైవన్నీ
28. మీర్ ఖమ్రుద్దీన్ ఖాన్‌కు 'అసఫ్ జా' బిరుదును ప్రదానం చేసిన మొగల్ చక్రవర్తి?
   1) బహదూర్ షా
   2) ఔరంగజేబు
   3) మహమ్మద్ షా
   4) షాజహాన్
29. ఆనందభైరవి రాగాన్ని తొలుత ఉపయోగించిన వాగ్గేయకారుడెవరు?
   1) త్యాగరాజు
   2) క్షేత్రయ్య
   3) సారంగపాణి
   4) రామదాసు
30. తూర్పు దేశాల్లో వర్తకం చేసేందుకు ఆంగ్లేయ వర్తకులకు అనుమతి ఇచ్చిన ఇంగ్లండ్ రాణి?
   1) ఎలిజబెత్–2
   2) ఎలిజబెత్–1
   3) విక్టోరియా–1
   4) విక్టోరియా–2
31. హరిజనుల సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను ప్రజల, ప్రభుత్వ దృష్టికి తేవడానికి భాగ్యరెడ్డి వర్మ నడిపిన వారపత్రిక?
   1) మిర్రర్
   2) హైదరాబాద్
   3) విశాఖ
   4) కృష్ణ పత్రిక
32. నాగార్జునుడు ఎవరి సమకాలీనుడు?
   1) యజ్ఞశ్రీ శాతకర్ణి
   2) గౌతమీపుత్ర శాతకర్ణి
   3) రెండో శాతకర్ణి
   4) హాలుడు
33. శాతవాహనుల కాలంలో 'కోలిక'లనే వారు?
   1) వ్యవసాయదారులు
   2) నూనె తీసేవారు
   3) నేతపనివారు
   4) ధాన్య వర్తకులు
34. 'ఘటిక' అనేది?
   1) దేవాలయం
   2) బౌద్ధారామం
   3) విద్యాకేంద్రం
   4) నాట్య కళాశాల
35. దంధోళి అంటే?
   1) ఒక రకమైన కత్తి
   2) ఒక రకమైన బాణం
   3) శత్రువులపై రాళ్లు రువ్వే ఫిరంగి
   4) అశ్విక దళం
36. లుంబినీ వనంలో శిలాశాసనాన్ని ప్రతిష్ఠించినవారు?
   1) ఆచార్య నాగార్జునుడు
   2) అశోకుడు
   3) ఆమ్రపాలి
   4) ఆర్యదేవుడు
37. 'లెంకలు' అంటే?
   1) శత్రురాజులు
   2) అంగరక్షకులు
   3) నేతపనివారు
   4) విదేశీయులు
38. 1857 తిరుగుబాటులో బ్రిటీష్ వారికి సహాయం చేసి 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదు పొందిన నిజాం నవాబు?
   1) నిజాం ఉల్‌ముల్క్
   2) నసీరుద్దౌలా
   3) మహబూబ్ అలీఖాన్
   4) అఫ్జలుద్దౌలా
39. బోలు శబ్దం వచ్చే ద్వారబంధం ఎక్కడ ఉంది?
   1) వేయి స్తంభాల గుడి
   2) రామప్ప దేవాలయం
   3) లేపాక్షి దేవాలయం
   4) భీమేశ్వరాలయం
40. 'అనల్ మాలిక్' అంటే?
   1) నేనే దేవుణ్ని
   2) నేనే రాజును
   3) అల్లాయే ప్రభువు
   4) ప్రభువే అల్లా
41. నన్నయ భట్టుకు ఆంధ్ర మహాభారత రచనల్లో తోడ్పడ్డ కవి?
   1) పాల్కురికి సోమనాథుడు
   2) నారాయణ భట్టు
   3) పండితారాధ్యుల మల్లికార్జునుడు
   4) రావిపాటి త్రిపురాంతక కవి
42. అశోకుని శాసన భాగం బయల్పడిన ప్రాంతం?
   1) శాలిహుండం
   2) ధరణికోట
   3) కొట్టాం
   4) రాజుల మందగిరి
43. తెలంగాణలో ముల్కీ నిబంధనలు ఎప్పుడు ప్రవేశపెట్టారు?
   1) 1888 2) 1890
   3) 1895 4) 1885
44. జాగిర్దారీ విధానంలో భూములు ఎవరి స్వాధీనంలో ఉండేవి?
   1) ముక్తేదారులు
   2) ఇనాందారులు
   3) ఇజారీదారులు
   4) పైవారందరూ
45. మిలిటరీ సామాగ్రిని నిజాం ప్రభుత్వం ఏ సంస్థ నుంచి కొనుగోలు చేసింది?
   1) టాటా కంపెనీ
   2) అట్లాస్ ట్రేడింగ్ సంస్థ
   3) మహీంద్ర అండ్ మొహమ్మద్
   4) 2, 3
46. 1958లో ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రాంతీయ కమిటీని రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు ఎప్పుడు రద్దు చేశారు?
   1) 1974 జనవరి 1
   2) 1975 ఫిబ్రవరి 2
   3) 1974 డిసెంబర్ 4
   4) 1973 నవంబర్ 1
47. శాతవాహనుల కాలం నాటి సాంఘిక జీవనాన్ని తెలియజేసే గ్రంథం?
   1) గాథాసప్తశతి
   2) కథా సరిత్సాగరం
   3) సుహృల్లేఖ
   4) శూన్య సప్తశతి

సమాధానాలు

1) 3; 2) 4; 3) 3; 4) 4; 5) 2; 6) 2; 7) 1; 8) 3; 9) 1; 10) 3; 11) 1; 12) 4; 13) 3; 14) 3; 15) 1; 16) 4; 17) 1; 18) 4; 19) 2; 20) 3; 21) 2; 22) 1; 23) 3; 24) 1; 25) 1; 26) 1; 27) 4; 28) 2; 29) 4; 30) 3; 31) 2; 32) 1; 33) 3; 34) 3; 35) 3; 36) 2; 37) 2; 38) 4; 39) 2; 40) 1; 41) 2; 42) 4; 43) 1; 44) 4; 45) 4; 46) 1; 47) 1.

Teenagers without guidance can be easily..

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1 - 5): Which of the phrases (1), (2), (3), (4) and (5) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct?

1. The footprints might be <u>done</u> by burglars.
   1) Doing 2) made 3) worked
   4) put 5) post
2. This problem can be solved by <u>control</u> pollution.
   1) controlled 2) controlling
   3) continuous 4) continuing
   5) controls
3. Manohar woke up late. <u>Consequent</u> he missed the train.
   1) Subsequent 2) Concurrent
   3) In addition 4) Consequently
   5) In spite of
4. They <u>thanked to</u> the family for helping them.
   1) thanks 2) thank 3) thank you
   4) thanked 5) thanking
5. Teenagers without guidance can be easily <u>influence</u>.
   1) influences
   2) were influenced
   3) was influence
   4) influenced 5) influencing

Directions (Q. 6-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

6. In all (1)/ that excitement. (2)/ I had forgotten (3)/ to take my present for him. (4)/ No error (5)
7. The magic show last night (1)/ was a great success. (2)/ The news was published on the newspaper this morning. (3)/ It was well-written. (4)/ No error (5)
8. The teacher let us paint with our pencils. (1)/ But she did not allow us (2)/ to do exercises in the same way. (3)/ Instead, she wanted us to write with ink. (4)/ No error (5)
9. Last week, an unemployed man killed self (1)/ by jumping down from the roof of a flat. (2)/ He was stupid. (3)/ He must face up to realities. (4)/ No error (5)
10. Feeling bored after a day's work, (1)/ I and my friend decided (2)/ to go for a film (3)/ show at the INOX that night. (4) / No error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The court _____ all the three accused setting _____ the earlier order sentencing them to four years in prison.
    1) convicted, ahead
    2) acquitted, aside
    3) charged, above
    4) demanded, forth
    5) ruled, forward
12. Chandrayaan II the _____ project would be another _____ in the history of the country's space ventures.
    1) ambivalent, historical
    2) ambiguous, milestone
    3) ambitious, landmark
    4) ambition, rarity
    5) ambidextrous, feather
13. The bank _____ agricultural growth to be lower due to _____ an uneven rains.
    1) experience, lower
    2) predicts, heavy
    3) expects, deficit
    4) foretell, scarce
    5) outlooks, surplus
14. Foreign _____ look at India as one among _____ markets.
    1) business, many
    2) employees, growing
    3) employers, subsidiary
    4) tourists, sample
    5) investors, emerging
15. Excavations had ____ the _____ significance of the cannons.
    1) exposed, mastery
    2) rejoiced, importance
    3) told, prominent
    4) reformed, pointed
    5) revealed, historical

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. CO and H_2 are the most common molecules in interstellar gas clouds.
B. Stars from inside relatively dense concentrations of interstellar gas and dust known as molecular clouds.
C. When the density reaches a certain point, stars form.
D. The deep cold also causes the gas to clump to high densities.
E. At these temperatures, gases become molecular meaning that atoms bind together.
F. These regions are extremely cold temperature about 10 to 20K, just above absolute zero.

16. What is the LAST sentence after rearrangement?
    1) C 2) B 3) D 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) E 4) F 5) C
18. What is the FIRST sentence after rearrangement?
    1) A 2) C 3) B 4) E 5) D
19. What is the FIFTH sentence after rearrangement?
    1) B 2) C 3) D 4) E 5) F
20. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 21-25): Read the following passage carefully and answer the questions given below it.

For many people the first primitive testimonies of magnetite started from Peter Peregrinus in 1269 and it might be true but let me know about the person who has first found that stone that we now call a magnet, the story goes round a shepherd named Magnet and he first of all discovered the magnet when an iron tip of his crook was pulled towards the stone which we now call as a magnet. The magnetic field around our planet earth was measured to be 4.0 Gauss about 4,000 years and it is same even today so it can be said that it is one of the first natural force which man had discovered years ago. Cleopatra who is still remembered as the beautiful women of the world has been reported to wear a magnet on her forehead to avoid the signs of aging. And at that time the magnet was called as Lodestone. Scientists believe that birds are the only creatures that can see the magnetic field of earth and this force helps them in finding their home in the long distance flights. Usually the magnets are made up of iron or steel but we can also make very powerful magnets through special alloys of nickel, copper, cobalt and aluminum. Hammering a magnet results in demagnetization because the molecules inside the magnet gets scattered and thus lose their North and South Pole's alignment. The same phenomenon occurs when a magnet is heated on a flame. The modern medical science has also observed magnets to be quite affective in curing different diseases and thus for the treatment of many major diseases like cancer the affect of magnetism are utilized. Some veterinarians use magnets to retrieve a wire or any other metal body from the stomach of an animal. The earth magnet is also like a long bar of magnet that is located at the center of earth. The study of ocean floor core samples was carried out by some scientists and it was found that the giant vertebrates of our earth like dinosaurs died due to the decline of earth's magnetic field. So these were some interesting facts about magnets that have been found by many scientists after series of researches. The more the researches were carried on magnets and magnetic field the more fields of life started getting benefits from the magnets, till now all the industries including medical to latest technologies are getting benefits from magnets.

21. In ancient times magnet was also called as:
    1) a healing stone
    2) a powerful stone
    3) a miracle stone
    4) a lodestone
    5) mystery stone
22. Demagnetization occurs through
    1) hammering and heating
    2) lose of south pole
    3) loss of north pole
    4) repulsion between the molecules
    5) attraction between the molecules
23. Veterinarian is
    1) using his powers to remove wire
    2) cleans animals
    3) who treats animals
    4) recognize diseases
    5) cures cancer
24. The extinction of dinosaurs happened because
    1) man used his intelligence
    2) survival of the fittest
    3) struggle for existence
    4) decline of earth's magnetic field
    5) series of researches were carried
25. The natural force which man had discovered years ago
    1) was powerful in curing many diseases
    2) was not realized for a longer period of time
    3) still research is needed in this area
    4) enhanced its value over the years
    5) remains the same even after so many years

ANSWERS

1) 2	2) 2	3) 4	4) 4	5) 4
6) 4	7) 3	8) 4	9) 1	10) 2
11) 2	12) 3	13) 3	14) 5	15) 5
16) 1	17) 3	18) 3	19) 3	20) 5
21) 4	22) 1	23) 3	24) 4	25) 5